

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 8.00

సంపుటి: 17
సంచిక: 182

SUNDAY Special

ఆదివారం 16-3-2025

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



పెద్దలకూ.. ఇమ్యూని'టీకాలు'

మామూలుగా వ్యాక్సిన్లు అంటే పిల్లలకే అని చాలా మంది అనుకుంటారు. కానీ అవి పెద్ద వాళ్లకూ అవసరమవుతాయి. 50 ఏళ్ల వయసు దాటిన దగ్గర్నుంచి తీసుకోవాల్సిన వ్యాక్సిన్లపై కథనం. - 11లో



చాంపియన్.. ముంబై

మహిళల ప్రీమియర్ లీగ్-3లో ముంబై ఇండియన్స్ మరోసారి చాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్‌లో ముంబై 8 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. నాట్ సివర్ బ్రంట్, కెప్టెన్ హర్మన్ ఆఖరి పోరులో కీలక పాత్ర పోషించారు. - 12లో



214 మందిని చంపేశాం

తాము హైజాక్ చేసిన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లోని 214 మందిని చంపేశామని బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ మిలిటెంట్లు ప్రకటించారు.

వివరాలు 6లో ▸



అశాంతికి కాంగ్రెసే కారణం

అస్సాంలో అశాంతికి కాంగ్రెసే కారణమని.. ఇక్కడ అభివృద్ధి చేసింది ప్రధాని మోదీయేనని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.

వివరాలు 6లో ▸



వచ్చే వారమే సునీత రాక!

అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, విల్మోర్ ఎట్టకేలకు భూమికి తిరిగి రానున్నారు.

వివరాలు 6లో ▸



టెండర్లలో ముస్లింలకు కోటా

ప్రభుత్వ టెండర్లలో ముస్లిం కాంట్రాక్టర్లకు 4 శాతం కోటా కల్పించాలని కర్ణాటక మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది.

వివరాలు 6లో ▸

సీమ హక్కులు 'కృష్ణా'ర్పణం

రాయలసీమ ఎత్తిపోతల పథకంపై నీలి నీడలు

పది నెలలుగా పట్టించుకోని చంద్రబాబు సర్కారు

- మనకు హక్కుగా కేటాయించిన 44 వేల క్యూసెక్కుల నీటిని వాడుకుంటున్నామని ఈపీసీ ఎదుట వాదించలేని బేలతనం
- ఫలితంగా పనులు యథాస్థితికి తేవాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఆదేశం
- ఇది రాయలసీమవాసులకు కూటమి ప్రభుత్వం చేసిన ద్రోహం
- శ్రీశైలంలో 798 అడుగుల్లోనే విద్యుత్ ఉత్పత్తి పేరుతో నీటిని తోడేస్తున్న తెలంగాణ
- 800 అడుగుల నుంచే సాగుకు నీరు.. ఆ మేరకు అక్రమంగా కొత్త ప్రాజెక్టుల నిర్మాణం
- ప్రాజెక్టులో 854 అడుగుల మేర నీరొస్తేనే మనకు 7 వేల క్యూసెక్కులు
- ఈ లెక్కన 880 అడుగుల మేర నీరెప్పుడు రావాలి? 44 వేల క్యూసెక్కులు ఎప్పుడు తరలించాలి?



- దీన్ని దృష్టిలో పెట్టుకునే వైఎస్ జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన
- 800 అడుగుల నుంచే నీళ్లు తీసుకుని 'సీమ' దాహార్తి తీర్చే ప్రాజెక్టు ఇది
- దీనిపైనా బాబుకు అక్కసు.. జగన్‌కు మంచి పేరొస్తుందని ఈర్ష్య

2లో

- తెలంగాణ రైతులతో అప్పట్లో ఎన్జీటీలో కేసులు వేయించిన వైనం
- తెలంగాణలో అనుమతి లేకుండానే పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల
- ఆపేయాలని ఎన్జీటీ ఆదేశం.. రూ.920.85 కోట్ల జరిమానా.. అయినా పనులు కొనసాగిస్తున్న వైనం.. నోరెత్తని బాబు ప్రభుత్వం
- బనకచర్ల ప్రాజెక్టు పైనా డ్రామాలు



ఆస్తుల జప్తు

లీజు గడువు ముగిసినా ఖాళీ చేయని ఈనాడు

- విజయవాడలో స్థల యజమానికి రూ.5.2 కోట్లను 6 శాతం వడ్డీతో చెల్లించాలని గతంలో ఆదేశించిన కోర్టు
- పట్టించుకోని ఈనాడు యాజమాన్యం
- దాంతో ఈనాడు ఆస్తుల జప్తు కోరిన బాధితుడు
- గూడవల్లి వద్ద ఉన్న ఆస్తులను జప్తు చేయాల్సిందిగా కోర్టు ఆదేశం
- ఆ ఆస్తులను ఎవరికీ బదలాయించరాదని, తాకట్టుపెట్టడం, విక్రయించడం, బహుమతిగా ఇవ్వడం కుదరదని ఆదేశాలు

14లో

- గతంలో విశాఖ స్థల యజమానికీ ముప్పుతిప్పలు..
- కొనసాగుతున్న ఈనాడు దౌర్జన్యం.. కోర్టులు ఆదేశించినా లెక్కలేనితనం
- ఎవరైనా లీజుకు ఇస్తే అంతే.. ఇక కబ్జానే..
- అందరికీ చెప్పేవి సూక్తులు.. చేసేవి కబ్జాలు..
- విజయవాడ కేసులో ఈనాడు సీఎండీ కిరణ్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలు..
- తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా

న్యూస్‌రీల్


రేపు విజయవాడలో వలంటీర్ల ధర్నా



కూటమి ప్రభుత్వం తమకు చేసిన మోసాన్ని ఎండగట్టేందుకు వలంటీర్లు సోమవారం విజయవాడలో భారీ ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు సిద్ధమయ్యారు.

వివరాలు 3లో ▸

సీనియర్ ఇంటర్ కెమిస్ట్రీ పేపర్‌లో తప్పిదం



సీనియర్ ఇంటర్ కెమిస్ట్రీ పరీక్షలో ఒక ప్రశ్నలో తప్పిదం చోటుచేసుకుంది. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవ్వగా.. గంటన్నర తర్వాత ఇంటర్ బోర్డు నుంచి అందిన సమాచారం మేరకు ఆ ప్రశ్నను సవరించారు.

వివరాలు 14లో ▸


మీ దేశానికో నమస్కారం!



పాలస్తీనాకు మద్దతిచ్చిందంటూ రంజనీ శ్రీనివాసన్ అనే భారత విద్యార్థినిపై అమెరికా ప్రభుత్వం ఉగ్రవాద సానుభూతిపరురాలు అనే ముద్ర వేసి.. ఎఫ్–1 స్టూడెంట్ వీసాను రద్దు చేసింది. దాంతో ఆమె అమెరికా వీసాను 'ఆప్షాల్' అంటూ వదులుకుని స్వీయ బహిష్కరణ విధించుకొని.. భారత్‌కు తిరిగొచ్చారు.

వివరాలు 6లో ▸

మీ ఊరు కాదంటున్నారు!



ప్రకాశం జిల్లా నరములతండా.. ఆ ఊరికి 150 ఏళ్ల చరిత్ర ఉంది. నాలుగు తరాలుగా గిరిజనులు నివాసం ఉంటున్నారు. అయినా, సరే ఇప్పుడిది మీ ఊరు కాదంటున్నారు అటవీ శాఖ అధికారులు. ప్రాణం పోయినా సరే నరములతండా నుంచి కదిలేదని సుగాలీలు తెగేసి చెబుతున్నారు.

వివరాలు 10లో ▸

శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



ఉపాధి కూలీలకు డబ్బులివ్వని సర్కారు

- 70 రోజులుగా వేతనాలందక ఇక్కట్లు
- రూ.664 కోట్ల మేర బకాయి
- రాష్ట్రంలో 74 లక్షల మందికి ఈ పథకమే జీవనోపాధి

2లో

70 రోజులుగా వేతనాలు లేవు



15 రోజులకు ఒకసారి మా బ్యాంక్ ఖాతాలకు కూలి డబ్బులు జమ చేస్తామన్నారు. ఇప్పటికే 70 రోజులవుతున్నా కూలీ చెల్లించడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే అధికారులు స్పందించి వేతనాలు జమ చేయాలి. – గోపాల్, ఉపాధి కూలీ, హాలహర్వి గ్రామం, కర్నూలు జిల్లా

రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిరసనగా..

గుంటూరు మేయర్ కావటి రాజీనామా



- అడుగడుగునా అవమానాలు
- నగర కమిషనర్ అనుచిత వైఖరి
- ఈ పరిస్థితుల్లో బాధ్యతల్లో కొనసాగలేనంటూ ఆవేదన
- కలెక్టర్‌కు రాజీనామా లేఖ

3లో

అక్టోబర్ 2 నుంచి ఆకస్మిక తనిఖీలు

- స్వచ్ఛత లోపిస్తే చర్యలు తీసుకుంటా
- తణుకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో సీఎం చంద్రబాబు
- సమస్యలు చెప్పుకునేందుకు సామాన్యులకు దక్కని అవకాశం
- సీఎం పర్యటనతో పశువధను వ్యతిరేకిస్తున్న స్థానికుల గృహ నిర్బంధం



సాక్షి, భీమవరం: ఈ ఏడాది అక్టోబరు రెండో తేదీ తర్వాత నుంచి రాష్ట్రమంతటా ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. ఎక్కడికి వచ్చేదీ రెండు, మూడు గంటల ముందే తెలియజేస్తామని, ఎమ్మెల్యేలు పరుగెత్తాల్సి వస్తుందని చెప్పారు. స్వచ్ఛత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి హాజరైన చంద్రబాబు జెడ్పీ బాలుర హైస్కూల్ వద్ద జరిగిన ప్రజావేదికలో ప్రసంగించారు. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇళ్లతో పాటు పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గత పాలకులు చెత్తపైనా పన్నువేస్తే తాము ఎత్తివేశామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కనీసం డ్రెయిన్లలో మట్టి కూడా తీయలేదని, 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చారని.. ఇందులో 51 లక్షల టన్నుల చెత్త తొలగింపు పూర్తయ్యిందని, అక్టోబరు రెండో తేదీ నాటికి ఎక్కడా చెత్తలేకుండా చేస్తామని చెప్పారు. 2027 నాటికి 100 శాతం

మిగతా 2వ పేజీలో ▶



మన పార్టీ వాళ్లను ఏ పార్టీ వాళ్లు చేర్చుకోరు... అది మన పార్టీ అదృష్టం!!

ఆర్బీకేల ఆక్రమణ

రైతన్నకు అన్యాయం.. కూటమి సర్కార్ నిర్వాకం

రైతు భరోసా కేంద్రాలను పోలీస్‌స్టేషన్లుగా మార్చుతున్న వైనం

- విత్తు నుంచి విక్రయం వరకు అండగా నిలిచిన ఆర్బీకేలు ఇక కనుమరుగు
- ఉండి, కాళ్లలో ఆర్బీకేల స్థానంలో పోలీస్ స్టేషన్ల ఏర్పాటు
- ఆకివీడు సీఐ కార్యాలయంగా ఆర్బీకే నూతన భవనం
- డిప్యూటీ స్పీకర్ ఒత్తిడితో ఇచ్చామంటున్న అధికార యంత్రాంగం
- ఇతర జిల్లాల్లోనూ ఆర్బీకేలపై కూటమి ప్రజాప్రతినిధుల కన్ను
- ఇప్పటికే ఆర్బీకే వ్యవస్థ నిర్వీర్యమై అన్నదాతల అగచాట్లు



రైతు భరోసా కేంద్రం స్థానంలో ఏర్పాటు చేసిన కాళ్ల పోలీస్ స్టేషన్

సాక్షి, అమరావతి: గ్రామ స్థాయిలో పౌరులకు సేవలందించిన సచివాలయాలను నీరుగార్చడంతోపాటు వలంటీర్ల వ్యవస్థకు ఉద్వాసన పలికిన టీడీపీ కూటమి సర్కారు... డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల భవనాలను (రైతు సేవా కేంద్రాలు) సైతం ఆక్రమిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో విత్తు నుంచి విక్రయం వరకు అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలిచి పల్లె దాటాల్సిన అవసరం లేకుండా భరోసా కల్పించిన ఆర్బీకేలను దర్జాగా కబ్జా చేస్తోంది. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఒత్తిడితో పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలోని ఉండి, కాళ్ల, ఆకివీడు ఆర్బీకేలను ఇప్పటికే పోలీస్‌స్టేషన్లుగా మార్చేశారు. ఇదే రీతిలో మిగిలిన జిల్లాల్లోనూ కూటమి నేతల నుంచి ఒత్తిళ్లు వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఆర్బీకే వ్యవస్థను

మిగతా 2వ పేజీలో ▶

చంద్రబాబును మించిన అవకాశవాది పవన్

జనసేన ఆవిర్భావ సభలో ఎన్నికల హామీల గురించి ఎందుకు మాట్లాడలేదు?



- నిజాయితీపరుడినని చెప్పుకునే పవన్‌కు జనసేన ఎమ్మెల్యేల దోపిడీ కనిపించదా?
- టీడీపీ పడిపోతుంటే నిలబెట్టామని మాత్రం పవన్ నిజం చెప్పారు
- ఇదే విషయాన్ని మేం మొదట్నుంచి చెబుతూనే ఉన్నాం
- టీడీపీ బీ టీమ్‌గా ఏర్పడ్డ పార్టీ జనసేన
- గెలిచిన ఎమ్మెల్యేల్లో జనసేన నాయకులు ఎంతమంది?
- పిఠాపురంలో టీడీపీ నేత వర్మను వాడుకుని.. ఇప్పుడు ఎగతాళి చేస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

3లో

సీమ హక్కులు 'కృష్ణా'ర్పణం

రాయలసీమ ఎత్తిపోతల పథకంపై నీలి నీడలు ■ పది నెలలుగా పట్టించుకోని చంద్రబాబు సర్కారు

రాయలసీమకు హక్కుగా కేటాయించిన కృష్ణా జలాలను వాడుకునే విషయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేతకానితనంతో చోద్యం చూస్తోంది. పొరుగు రాష్ట్రం తెలంగాణ యథేచ్ఛగా అనుమతి లేకుండా నీటిని తరలించుకుపోతున్నా, ఇంకా అదనంగా దండుకోవడానికి ప్రాజెక్టులు నిర్మిస్తున్నా... ఏమాత్రం అడ్డు చెప్పక పోవడం విస్తుగొలుపుతోంది. మాకు కేటాయించిన నీటిని మేము తీసుకెళ్లే ప్రయత్నం చేయడం ఎలా తప్పవుతుందని ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ ఎదుట గట్టిగా నోరు విప్పి వాదించలేదు. ఎవరి మేలు కోసం.. ఎందుకీ ఈ బేలతనం? సీమపై కోపమా? లేక వైఎస్ జగన్‌కు పేరొస్తుందని కుళ్లా..?



సాక్షి, అమరావతి: రాయలసీమ, నెల్లూరు జిల్లాల సాగు, తాగునీరు.. చెన్నై తాగు నీటి అవసరాలు తీర్చే లక్ష్యంతో చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకం భవితవ్యం కూటమి సర్కారు తీరుతో ప్రశ్నార్థకంగా మారింది. పది నెలలుగా ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మన రాష్ట్రానికి కేటాయించిన నీటిని మాత్రమే వాడుకుంటున్నామని వాదించలేకపోయింది. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి మట్టం 798 అడుగులు ఉన్నప్పటి నుంచే పొరుగు రాష్ట్రం తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని తరలిస్తున్నా, 800 అడుగుల నుంచే ప్రాజెక్టులకు నీటిని తీసుకుంటున్నా.. కొత్తగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగిస్తున్నా అడ్డుచెప్పలేక పోతోంది. 880 అడుగులకు నీళ్లొచ్చినప్పుడు మాత్రమే మనం పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా గరిష్ఠంగా హక్కుగా దక్కిన 44 వేల క్యూసెక్కులు తరలించాలంటే ఎన్ని రోజులు ఆగాలని, ఆ మేరకు వరద ఎన్ని రోజులు ఉంటుందని.. ఇలాగైతే ఆ మేరకు నీటిని తరలించడం ఎలా సాధ్యమని గట్టిగా వాదించలేదు. కోటా మేరకు నీటిని వాడుకునేలా గత వైఎస్ జగన్ ప్రభుత్వం రూపొందించిన రాయలసీమ ఎత్తిపోతల పథకంలో ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని నోరు విప్పి చెప్పలేదు. పర్యావరణ అనుమతులు వచ్చేలోగా తాగునీటి పనులు కొనసాగించడంలో ఏమాత్రం తప్పులేదని కూడా వాదించలేదు. ఫలితంగా ఈ ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీ కోసం.. చేసిన పనులను తొలగించి, యథాస్థితికి తేవాలని గత నెల 27న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఈఏసీ (ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ) ఆదేశించింది. ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న దరఖాస్తుపై ఆ రోజు ఈఏసీ 25వ సమావేశంలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ చర్చించింది. ఆ సమావేశంలో చంద్రబాబు ప్రభుత్వం పైన పేర్కొన్న విధంగా సమర్థవంతంగా వాదనలు వినిపించక పోవడం వల్లే రాయలసీమ ఎత్తిపోతలకు శరాఘాతంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆదేశాలను తుంగలో తొక్కి తెలంగాణ సర్కార్ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పనులను కొనసాగిస్తూ.. కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను హరిస్తున్నా చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో 2014–19 మధ్య నాటి చంద్రబాబు సర్కార్ రెండు కళ్ల సిద్ధాంతంతో రాజకీయ, ఓటుకు నోటు కేసుతో వ్యక్తిగత ప్రయోజనాలు పొందేందుకు కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులను తెలంగాణకు తాకట్టు పెట్టిన తరహాలోనే ఇప్పుడూ వ్యవహరిస్తోందంటూ రైతులు మండిపడుతున్నారు.

తాగునీటి పనులకూ బ్రేక్

చెన్నైకి 15 టీఎంసీలు, రాయలసీమలో దుర్భిక్ష ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే పనులను తొలి దశలో చేపట్టాలని 2023 ఆగస్టు 11న నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. చెన్నైకి నీటిని సరఫరా చేయాలంటే.. తెలుగుగంగ ప్రధాన కాలువపై ఉన్న వెలిగోడు రిజర్వాయర్ (9.5 టీఎంసీలు), సోమశిల (17.33 టీఎంసీలు), కండలేరు (8.4 టీఎంసీలు) రిజర్వాయర్‌లలో మొత్తంగా కనీసం 35.23 టీఎంసీలు నిల్వ ఉండాలి. అప్పుడే చెన్నైకి 15 టీఎంసీలను సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. దీనికి తోడు రాయలసీమలోని దుర్భిక్ష ప్రాంతాలకు తాగునీటి కోసం 8.6 టీఎంసీలు వెరసి 58.83 టీఎంసీలు (35.23+15+8.6) శ్రీశైలం నుంచి తరలించాలని ప్రభుత్వానికి జల వనరుల శాఖ అధికారులు ప్రతిపాదన పంపారు. రాయలసీమ ఎత్తిపోతలలో తాగు నీటి కోసం తరలించడానికి అవసరమైన పనులను చేపట్టడానికి అనుమతి ఇవ్వాలన్న అధికారుల ప్రతిపాదనపై ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ఆ మేరకు అధికారులు పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పనులను ఏమాత్రం పట్టించుకోలేదు. పది నెలలుగా తీవ్ర నిర్లక్ష్యం చేయడం ద్వారా రాయలసీమకు తీరని ద్రోహం చేసింది. ఇదే సమయంలో ఫిబ్రవరి 27న కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నిర్వహించిన ఈఏసీ సమావేశంలో చంద్రబాబు ప్రభుత్వం సమర్థవంతంగా వాదనలు విన్పించలేదు. దీంతో రాయలసీమ ఎత్తిపోతల తొలి దశ పనులకు బ్రేక్ పడినట్లయింది.

'బనకచర్ల' ప్రాజెక్టుపైనా డ్రామాలు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బనకచర్ల ప్రాజెక్టుపైనా నాటకాలాడుతున్నారని స్పష్టమవుతోంది. పోలవరం నీళ్లు బనకచర్లకు తీసుకెళ్తామని, సముద్రంలోకి పోయే వృథా నీటిని సీమకు తీసుకెళ్తామంటే అభ్యంతరం చెప్పొద్దని ఓవైపు చెబుతూనే.. మరోవైపు తన శిష్యుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ద్వారా అభ్యంతరాలు లేవనెత్తేలా కుట్ర చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మాటలే ఇందుకు నిదర్శనం. కేవలం ప్రచారం కోసం మాత్రమే చంద్రబాబు ఈ ప్రాజెక్టును ఉపయోగించుకుంటున్నారని ఇట్టే అర్థమవుతోంది.

నిర్విఘ్నంగా పాలమూరు- రంగారెడ్డి పనులు

శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజుకు 1.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 90 టీఎంసీలు తరలించేలా రూ.35,200 కోట్ల వ్యయంతో పాలమూరు–రంగారెడ్డి, రోజుకు 0.5 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీలు తరలించేలా డిండి ఎత్తిపోతలను రూ.6,190 కోట్ల వ్యయంతో 2015 జూన్10న తెలంగాణ సర్కార్ చేపట్టింది. మన రాష్ట్ర హక్కులకు విఘాతం కలిగించే ఈ ప్రాజెక్టులపై అప్పటి చంద్రబాబు సర్కార్ అభ్యంతరం చెప్పలేదు. ఈ రెండు ఎత్తిపోతల పథకాల వల్ల ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన జలాలు దక్కవని.. ఏపీకి చెందిన రైతులు 2021లో ఎన్జీటీ (చెన్నై బెంచ్)ని ఆశ్రయించారు. ఈ కేసులో రైతులతో నాటి వైఎస్సార్‌సీపీ సర్కార్ జత కలిసింది. ఆ రెండు ఎత్తిపోతలకు నీటి కేటాయింపులే లేవని.. వాటి వల్ల శ్రీశైలం, సాగర్‌పై ఆధారపడ్డ ఆయకట్టుతోపాటు కృష్ణా డెల్టా కూడా నీటి కొరతతో తీవ్రంగా ఇబ్బంది పడుతుందని వాదించింది. దీంతో ఏకీభవించిన ఎన్జీటీ తక్షణమే పనులు నిలుపుదల చేయాలని తెలంగాణ సర్కార్‌ను ఆదేశిస్తూ 2021 అక్టోబర్ 29న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ పనులు చేస్తుండటంతో 2022 డిసెంబర్ 22న తెలంగాణ సర్కార్‌కు రూ.920.85 కోట్ల జరిమానా సైతం విధించింది. అయినప్పటికీ వాటిని తుంగలో తొక్కి తెలంగాణ సర్కార్ యథేచ్ఛగా పనులు చేస్తున్నా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం.

హక్కులను కాపాడుకోవడానికే రాయలసీమ ఎత్తిపోతల

- ఉమ్మడి ప్రాజెక్టు శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను 841 అడుగుల ఎత్తులో అమర్చారు. శ్రీశైలంలో 880 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో నీరు నిల్వ ఉన్నప్పుడే.. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు 44 వేల క్యూసెక్కులు తరలించే అవకాశం ఉంటుంది. 854 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 7 వేలు, 841 అడుగుల్లో నీటి మట్టం ఉంటే 2 వేల క్యూసెక్కులు మాత్రమే తరలించే అవకాశం ఉంటుంది. శ్రీశైలంలో 841 అడుగుల కంటే దిగువన నీటి మట్టం ఉంటే చుక్క నీటిని కూడా తీసుకోలేం. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా చెన్నైకి 15 టీఎంసీలు, ఎస్సార్బీసీకి 19, తెలుగు గంగకు 29, గాలేరు–నగరికి 38.. మొత్తంగా 101 టీఎంసీలు సరఫరా చేయాలి.
- రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణా బోర్డు పరిధిని నిర్దేశించే వరకు శ్రీశైలం ప్రాజెక్టును ఏపీ, నాగార్జునసాగర్‌ను తెలంగాణ నిర్వహించాలని కేంద్రం ఆదేశించింది. కానీ.. శ్రీశైలం ఎడమ గట్టు కేంద్రం తమ భూభాగంలో ఉందని తెలంగాణ సర్కార్ దాన్ని తన అధీనంలోకి తీసుకున్నా.. ఆ రాష్ట్రంలో రాజకీయ ప్రయోజనాల కోసం నాటి చంద్రబాబు సర్కార్ నోరు మెదపలేదు. ఫలితంగా కృష్ణా బోర్డు కేటాయింపులు చేయకున్నా, దిగువన నీటి అవసరాలు లేకున్నా తెలంగాణ సర్కార్ ఏకపక్షంగా శ్రీశైలం జలాశయంలో 798 అడుగుల నుంచే ఎడమ గట్టు కేంద్రం నుంచి విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు నీటిని తరలిస్తూ ప్రాజెక్టును ఖాళీ చేస్తూ వస్తోంది. 800 అడుగుల నుంచే నీటిని తరలించేలా అక్రమంగా ప్రాజెక్టులు నిర్మిస్తోంది.
- తెలంగాణ సర్కార్ ఎలాంటి అనుమతి తీసుకోకుండా 2015లో కల్వకుర్తి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు శ్రీశైలం నుంచి రోజుకు 2 టీఎంసీలు తరలించేలా పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలను చేపట్టినా నాటి చంద్రబాబు సర్కార్ అడ్డుకోలేదు. ఇలా తెలంగాణ సర్కార్ శ్రీశైలాన్ని ఖాళీ చేస్తుండటం వల్ల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కింద ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు ఉన్నా సరే వాడుకోలేని దుస్థితి నెలకొంది. వర్షాభావ పరిస్థితుల్లో రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో సాగు నీటి మాట దేవుడెరుగు గుక్కెడు తాగు నీటికి సైతం తల్లడిల్లాల్సిన దయనీయ పరిస్థితి.
- తడారిన గొంతులను తడిపేందుకు.. హక్కుగా దక్కిన నీటిని వాడుకోవడానికే తెలంగాణ తరహాలోనే శ్రీశైలంలో 800 అడుగుల నుంచి రోజుకు 3 టీఎంసీల చొప్పున పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన కుడి ప్రధాన కాలువలోకి ఎత్తిపోసేలా రూ.3,825 కోట్ల వ్యయంతో 2020 మే 5న రాయలసీమ ఎత్తిపోతలను చేపట్టడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. తద్వారా చెన్నైకి 15 టీఎంసీలు సరఫరా చేయడం, ప్రాజెక్టుల కింద 9.6 లక్షల ఎకరాలకు నీళ్లందించాలన్నది లక్ష్యం.
- ఈ నేపథ్యంలో రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ మంచి పేరొస్తుందోననే ఈర్షతో.. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి విఘాతం కలుగుతుందంటూ ఎన్జీటీ (చెన్నై) బెంచ్‌లో తెలంగాణ ప్రాంతంలోని రైతులతో టీడీపీ నేతలు అప్పట్లో రిట్ పిటిషన్ దాఖలు చేయించారు. దీనిపై విచారించిన ఎన్జీటీ పర్యావరణ అనుమతి తీసుకుని, ఆ పనులు చేపట్టాలంటూ 2020 అక్టోబర్ 29న ఆదేశించింది.

క్లుప్తంగా...

రాష్ట్రంలో 8 వాటర్ ఎయిరోడ్రమ్స్!

- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం కోసం కన్సల్టెన్సీ నియామకానికి టెండర్ల ఆహ్వానం

సాక్షి, అమరావతి: కేంద్రం తీసుకొచ్చిన ఉడాన్–ఆర్‌సీఎస్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్–రీజనల్ కనెక్టివిటీ స్కీం) కింద రాష్ట్రంలోని ఎనిమిది ప్రాంతాల్లో వాటర్ ఎయిరోడ్రమ్స్ నిర్మించి సీప్లేన్ సదుపాయం అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. భూమి మీద రన్‌వే నిర్మాణం అవసరం లేకుండా నేరుగా నీటిపై విమానాలు దిగే విధంగా వాటర్ ఎయిరోడ్రమ్స్‌ను ఏర్పాటుచేస్తారు. విజయవాడ ప్రకాశం బ్యారేజ్, అరకు, లంబసింగి, రుషికొండ, కాకినాడ, కోనసీమలో గోదావరి బ్యాక్ వాటర్, తిరుపతి, శ్రీశైలంలలో వాటర్ ఎయిరోడ్రమ్స్ నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ఎనిమిది చోట్ల 365 రోజులు తగినంత నీటి నిల్వ ఉండే రిజర్వాయర్లు, భారీ జలాశయాలు, బ్యాక్ వాటర్, సముద్రం వంటి ప్రాంతాలను ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీసీఎల్) ఎంపిక చేసింది. ఈ ఎనిమిది చోట్ల వాటర్ ఎయిరోడ్రమ్స్ నిర్మాణంపై సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల అధ్యయనం చేసే బాధ్యతను ఏపీఏడీసీఎల్ ఒక కన్సల్టెన్సీకి అప్పగించనుంది. ఈ మేరకు కన్సల్టెన్సీ నియామకం కోసం ఆసక్తిగల సంస్థల నుంచి ఏపీఏడీసీఎల్ టెండర్లను ఆహ్వానించింది. ఆసక్తిగల సంస్థలు ఈ నెల 24వ తేదీలోగా బిడ్లు దాఖలు చేయాలని సూచించింది.

మెప్మాలోకి 402 మంది వార్డు కార్యదర్శులు

సాక్షి, అమరావతి: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో విధులు నిర్వహించేందుకు 402మంది వార్డు సచివాలయ కార్యదర్శులను నియమించనున్నారు. మెప్మాలో 279 కమ్యూనిటీ ఆర్గనైజర్ పోస్టులను, 123 సుయోగ్ సెంటర్లలోని ఖాళీలను వార్డు కార్యదర్శులతో భర్తీ చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశించారు. ఈ మేరకు జీవీఎంసీ, వీఎంసీతో సహా అన్ని యూఎల్బీల్లోని ప్రాజెక్టు డైరెక్టర్లు సిబ్బందిని కేటాయించాల్సిందిగా మెప్మా ఎండీ తేజ్ భరత్ ఆదేశించారు.

లిఫ్ట్ నిర్మాణానికి 21 రోజుల్లోగా అనుమతి

సాక్షి, అమరావతి: ఏపీ పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ చట్టంలో సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు స్పీడ్ ఆఫ్ బిజినెస్‌లో భాగంగా లిఫ్టులు, ఎస్కలేటర్ల నిర్మాణాలకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులకు నిర్దిష్టమైన కాల పరిమితిని విధించింది. దీని ప్రకారం లిఫ్టులు ఎస్కలేటర్లకు సంబంధించిన వివిధ అనుమతులను 15 నుంచి 21 రోజుల్లోగా ఇవ్వాలని.. లేని పక్షంలో రోజుకు రూ.250 చొప్పున గరిష్ఠంగా రూ.5,000 పెనాల్టీ విధించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు డబ్బులివ్వని సర్కారు

70 రోజులుగా వేతనాలందక ఇక్కట్లు



టెక్కలి సమీపాన ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సాక్షి, అమరావతి: గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేసిన కూలీలకు 70 రోజులుగా వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ ఏడాది జనవరి 9 తర్వాత పనులు చేసిన కూలీలకు ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదు. 65 రోజులపాటు చేసిన పనులకు సంబంధించి దాదాపు రూ.664 కోట్లను కూలీలకు చెల్లించాల్సి ఉన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని రోజుల్లో పేదలు ఉపాధి హామీ పనులపైనే ఆధారపడుతుంటారు. వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల నుంచి 6 లక్షల మంది పేదలు ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నారు.

74 లక్షల మందికి ఈ పనులే ఆధారం

ప్రభుత్వ లెక్కల ప్రకారం.. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 57.87 లక్షల కుటుంబాలకు చెందిన 97.35 లక్షల మంది ఉపాధి హామీ పథకంలో పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో ఏటా 46 నుంచి 47 లక్షల కుటుంబాలు వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పథకం పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 46.51 లక్షల కుటుంబాలకు చెందిన 74 లక్షల మంది ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. వీరిలో 60 శాతానికి పైగా మహిళలే. దీనిని బట్టి గ్రామీణ ప్రాంతాల్లో సగం కుటుంబాలు ఉపాధి హామీ పథకంపైనే ఆధారపడుతున్నాయి. ఎందరికో జీవనోపాధి కల్పిస్తున్న ఈ పథకం అమలులో కూటమి ప్రభుత్వం ఎంత చిత్త శుద్ధితో వ్యవహరిస్తోందో అర్థమవుతోందని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

ఉద్యోగులకూ వేతనాలు కరువే..?

15వ తేదీ ముగిసినా 5వేల మందికి అందని జీతాలు

సాక్షి, అమరావతి: నెలలో సగం రోజులు గడిచిపోయినా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదు. ఉపాధి హామీ పథకం నిర్వహణ కోసం మండల స్థాయిలో కంప్యూటర్ సెంటర్లు(ఎంసీసీ) నుంచి మొదలై జిల్లా స్థాయిలో డ్వామా కార్యాలయాలు, రాష్ట్ర స్థాయిలోని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో ఫిక్సిడ్ టెన్యూర్ ఎంప్లాయిస్(ఎఫ్‌టీఈ) కేటగిరీలో కలిపి ఐదు వేల మందికి పైగా ఉద్యోగులు పని చేస్తుంటారు. ఎంసీసీల్లో పని చేసే ఎఫ్‌టీఈ కేటగిరీ ఉద్యోగుల్లో టెక్నికల్ అసిస్టెంట్ల(టీఏ) నుంచి రాష్ట్ర స్థాయి కార్యాలయంలో పనిచేసే వివిధ స్థాయి ఎఫ్‌టీఈ ఉద్యోగుల వరకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన వేతనాలను మార్చి 15వ తేదీ సాయంత్రం వరకు చెల్లించలేదు. ఆయా ఉద్యోగులకు చాలా తక్కువ మొత్తంలో వేతనాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా చెల్లించకపోతే ఎలా జీవించాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి..



నాలుగు వారాలు పని చేశాం. రోజూ ఆటోలో బాడిగ రూ.20 ఇచ్చి వెళ్లాం. మేం చేసిన పనికి రావాల్సిన కూలి కోసం రోజూ మేట్‌లను అడుగుతున్నాం. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి.

– పసుపులేటి బ్రహ్మయ్య, ఉపాధి కూలీ, చాగంటివారిపాలెం, పల్నాడు జిల్లా

రూపాయి కూడా ఇవ్వడం లేదు



రోజూ ఉపాధి పనికి వస్తున్నాం. ఐదారు వారాల నుంచి ఒక్క రూపాయి కూడా అందడం లేదు. పనిచేస్తున్న దగ్గర కనీసం నీడ సదుపాయం కూడా లేదు. సకాలంలో వేతనాలు అందజేసి, పని దగ్గర మౌలిక వసతులు కల్పించాలి.

– జి.విజయలక్ష్మి, ఉపాధి కూలీ, శ్యామసుందరపురం, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా

పైసా ఇవ్వలేదు



ఉపాధి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. గతంలో వారానికి ఓసారి డబ్బు పడేది. ఇప్పుడు రెండు నెలలుగా కూలీ డబ్బులు ఇవ్వలేదు. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. పిల్లల్ని ఎలా పోషించాలో తెలియడం లేదు.

– కుమార్, ఉపాధి కూలీ, చిట్టమూరు, తిరుపతి జిల్లా

అక్టోబరు 2 నుంచి ఆకస్మిక తనిఖీలు

▶ మొదటి పేజీ తరువాయి

మురుగునీటిని శుద్ధిచేసి వ్యవసాయానికి వాడతామని తెలిపారు.



ప్రజావేదికలో సీఎంకు సమస్యలు చెప్పేందుకు ప్రయత్నిస్తున్న యువకుడిని అడ్డుకుని కూర్చోబెడుతున్న పోలీసులు

విభాగాల వారీగా స్వచ్ఛాంధ్ర ర్యాంకింగ్‌లు..

ఇక స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి విభాగానికి పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ ర్యాంకింగ్స్ తయారు చేశామని చంద్రబాబు వెల్లడించారు. మున్సిపల్ శాఖకు 20 పాయింట్లు, పంచాయతీరాజ్‌కు 28, విద్యాశాఖకు 14, టూరిజంకు 11, పరిశ్రమలకు 13, హాస్టళ్లకు 11, ఎండోమెంట్‌కు 11, ఆస్పత్రులకు 9, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్‌కు 5, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లకు 7, మార్కెట్లకు 9, హైవేలకు 3, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు 7 పాయింట్లు చొప్పున ఇచ్చినట్లు తెలిపారు. అలాగే, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో కూడా జిల్లాల వారీగా పాయింట్లు ఇచ్చామన్నారు. అంతకుముందు.. తణుకు కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను చంద్రబాబు పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఎన్టీఆర్ పార్కులో చెత్తను ఊడ్చారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. ఇదిలా ఉంటే.. చంద్రబాబుకు తమ గోడు చెప్పుకోవాలనుకున్న సామాన్యులకు మైక్ ఇవ్వకపోవడంతో వారు నిరాశ చెందారు. ఓ దశలో చంద్రబాబే స్వయంగా ఓ యువకుడిని కూర్చోమని గట్టిగా చెప్పారు. మరోవైపు.. ఎండలో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి భోజనాలు లేకపోవడంతో వారు ఉసూరుమంటూ వెనుదిరిగారు. ఇక నరసాపురం నియోజకవర్గంలో గీత కార్మికులకు కేటాయించిన మూడు మద్యం దుకాణాలను శెట్టిబలిజ సామాజికవర్గం వారికి దక్కకుండా బినామీ పేర్లతో కొట్టేశారని మొగల్తూరు మండలానికి చెందిన కొందరు చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు.

పోలీసు ఆంక్షలతో ప్రజల ఇక్కట్లు..

ఇదిలా ఉంటే.. చంద్రబాబు పర్యటన సందర్భంగా పోలీస్ ఆంక్షలతో తణుకు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే ఇక్కడ నిత్యం జరుగుతున్న పశువధను నిరసిస్తూ కొద్దిరోజులుగా ఆందోళన నిర్వహిస్తున్న స్థానిక కొండాలమ్మ పుంత, మహాలక్ష్మీనగర్ ప్రాంతాల ప్రజలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. వారెవరూ బయటకు రాకుండా పోలీసులను కాపలా పెట్టారు.

ఆర్బీకేల ఆక్రమణ

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వీర్యం చేసిన సీఎం చంద్రబాబు.. వాటి ఉనికే లేకుండా చేయాలనే కుట్రతో ఆ భవనాలను వివిధ శాఖలకు కేటాయిస్తుండటంపై రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

జగన్ ముద్ర చెరిపేయడమే లక్ష్యం..!

సచివాలయాలు.. వలంటీర్లు... ఆర్బీకేల పేరు చెబితే చాలు రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుకొస్తారు! ప్రజల ముంగిటే పౌరసేవలు అందించాలన్న సంకల్పంతో ప్రతి రెండువేల జనాభాకు ఓ సచివాలయం.. వాటికి అనుబంధంగా రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో ఒకేసారి 10,778 ఆర్బీకేలను నెలకొల్పి వాటి ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు సేవలందించేందుకు పట్టభద్రులైన 15,667 మంది వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మత్స్య, వెటర్నరీ సహాయకులను నియమించారు. రైతులకు ఎనలేని సేవలందిస్తున్న వీటిని నిర్వీర్యం చేయడం ద్వారా వైఎస్ జగన్ ముద్రను చెరిపేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరతీసింది.



ఆకివీడు రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆకివీడు పోలీస్ సర్కిల్ కార్యాలయం



ఉండి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్

రైతన్న ఇక ఎటు వెళ్లాలి..?

గతంలో రైతన్నలు గ్రామ చావిడి, కూడలి లేదా కాలువ గట్లపై కూర్చొని కష్టసుఖాలు చెప్పుకునే వారు. ఆర్బీకేల ఏర్పాటుతో అన్నదాతలు వాటిని తమ సొంత ఇంటి మాదిరిగా భావించారు. తమ కోసం ప్రవేశపెట్టిన విప్లవాత్మక వ్యవస్థను ఎంతో ఆదరించారు. రైతన్నలు ఉదయం పొలానికి వెళ్లే ముందు.. సాయంత్రం తిరిగి వచ్చేటప్పుడు ఆర్బీకేలో అడుగు పెట్టడం ఆనవాయితీగా మారింది. విత్తనాలు, ఎరువులు, ఈ–క్రాప్, రైతు భరోసా, పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీ.. ఇలా ప్రతి ఒక్క సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నిశ్చింతగా పొలం పనుల్లో నిమగ్నమయ్యేవారు. వివిధ రకాల వ్యవసాయ సంబంధిత మేగజైన్స్‌తోపాటు స్మార్ట్ టీవీ ద్వారా పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు అందేవి. డిజిటల్ కియోస్క్‌ల ద్వారా తమకు కావాల్సిన ఉత్పాదకాలను బుక్ చేసుకుని వాతావరణ, మార్కెట్ ధరల సమాచారాన్ని తెలుసుకునేవారు. అన్నదాతలకు గ్రామాల్లో సేవలందించేందుకు రూ.2,260 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో 10,252 ఆర్బీకేల నూతన భవన నిర్మాణాలను కూడా గత ప్రభుత్వం చేపట్టింది. ఇప్పటికే రూ.1,165 కోట్ల వ్యయంతో 4,865 భవనాలు పూర్తయి కొన్ని చోట్ల ఆర్బీకేల కార్యకలాపాలు కొనసాగుతుండగా, మరికొన్ని భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మరో 5,387 భవనాల్లో నిర్మాణాలు దాదాపు 80 – 90 శాతం పూర్తి అయ్యాయి. కొద్దిపాటి నిధులిస్తే చాలు పూర్తయ్యే దశలో ఉండగా కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి.

ఖాళీ చేయించి ఆక్రమణ..

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఇప్పటికే పూర్తయిన సొంత భవనాల్లో ఆర్బీకేలు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా మరికొన్ని చోట్ల ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిని స్వాధీనం చేసుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉండి, కాళ్ల ప్రాంతాల్లో ఆర్బీకేల సిబ్బందిని సచివాలయాల్లోకి తరలించి అక్కడ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఆకివీడులో నూతనంగా నిర్మించిన ఆర్బీకే భవనాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంగా మార్చేశారు. ఇదే రీతిలో మిగిలిన జిల్లాల్లో ప్రధానంగా మండల కేంద్రాల్లో ఉన్న ఆర్బీకే భవనాలను పంచాయతీరాజ్, ఇరిగేషన్ తదితర శాఖలకు కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన భవనాలను ఇతర అవసరాలకు వినియోగించుకునేలా ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. మరోవైపు నిర్మాణం పూర్తయిన భవనాల్లో మండల వ్యవసాయ అధికారులు (ఎంఏవో) కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు వ్యవసాయ శాఖ శక్తిమేర ప్రయత్నిస్తోంది. ఇతర డిపార్టుమెంట్లు స్వాధీనం చేసుకున్న చోట ఆర్బీకేల సిబ్బందికి సచివాలయాల్లో ఓ మూలన సీటు కేటాయించడంతో రైతులకు సకాలంలో సేవలందక పడరాని పాట్లు పడుతున్నారు.



తక్కువ స్థాయి భూకంపాలే ఎక్కువ

దేశంలో తక్కువ స్థాయి తీవ్రత ఉండే భూకంపాల గత దశాబ్ద కాలంలో ఎక్కువగా వచ్చాయి. రిక్టర్ స్కేలుపై 3 నుంచి 5 లోపు తీవ్రత ఉండే భూ కంపాల సంఖ్య 2010-14తో పోలిస్తే 2020-24 మధ్య రెండు రెట్లకుపైగా పెరిగింది. భూకంపాల సంఖ్య పెరిగినా భూకంప మండలాల సంఖ్య మాత్రం పెరగలేదు. 6కుపైన తీవ్రత ఉండే భూకంపాలు బాగా తగ్గాయి.

భూకంప తీవ్రత	2010 2014	2015 2019	2020 2024
3 కంటే తక్కువ	424	244	1,344
3 నుంచి 3.9	1,119	1,224	3,205
4 నుంచి 4.9	1,663	2,203	2,408
5 నుంచి 5.9	471	354	263
6 కంటే తక్కువ	26	24	19

ఆధారం: లోక్‌సభలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ

క్లుప్తంగా...

రేపు విజయవాడలో వలంటీర్ల ధర్నా



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం తమకు చేసిన మోసాన్ని మరోసారి ఎండగట్టేందుకు వలంటీర్లు సోమవారం విజయవాడలో భారీ ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, అధికారంలోకి వచ్చాక వారు దగా చేసిన తీరును తూర్పారబట్టేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి వలంటీర్లు ఈ ధర్నాకు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో 'ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. వారికి ఇప్పటికి దాక చెల్లించాల్సిన బకాయిలు పూర్తిగా అందజేయాలి. ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు వలంటీర్ల గౌరవ వేతనం రూ.10 వేల పెంచాలి.' అని డిమాండ్ చేస్తూ సోమవారం మరో విడత వలంటీర్లు విజయవాడలో భారీ ధర్నాకు సిద్ధమయ్యారు. మరోవైపు వలంటీర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి శనివారం సీఎం చంద్రబాబు లేఖ రాశారు.

'గోదావరి' జిల్లాల అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సీఎం, డిప్యూటీ సీఎంలకు చేగొండి లేఖ



పాలకొల్లు సెంట్రల్: ఎన్నికల సమయంలో ఉభయ గోదావరి జిల్లాలను తాను దత్తత తీసుకుంటున్నట్లు పవన్‌కళ్యాణ్ ప్రకటించారని, ఆ మేరకు ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఏవిధమైన చర్యలు చేపట్టిందో తెలపాలని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం, డిప్యూటీ సీఎంలకు తాను రాసిన లేఖను శనివారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మీడియాకు విడుదల చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఏయే మౌలిక వసతులకు, అభివృద్ధికి ఎంత ఖర్చు చేయదలిచారో, ఏయే పరిశ్రమలు స్థాపించాలని అనుకుంటున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో కూటమి ద్వంద్వ వైఖరి

సీపీఎం నేత బీవీ రాఘవులు

దాబా గార్డెన్స్ (విశాఖ): విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఎద్దేవా చేశారు. విశాఖలో సీపీఎం విస్తృతస్థాయి సమావేశానికి విచ్చేసిన ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ మిట్టల్‌పై ఉన్న ప్రేమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకు లేదని ప్రశ్నించారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీతో ప్లాంట్‌కు ఒరిగిందేమీ లేదని, బ్యాంకుల అప్పులు తీర్చడానికి తప్ప ప్లాంట్ రక్షణకు ఏమాత్రం చర్యలు చేపట్టలేదన్నారు. గతంలో కేంద్ర కేబినెట్ చేసిన 100 శాతం స్ట్రాటజిక్ సేల్ ప్రకటన రద్దు చేస్తూ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయాలన్నారు.

పవన్ వ్యాఖ్యలు విడ్డూరం

జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని రాఘవులు అన్నారు. చేగువేరా డాక్టర్ కాబట్టి అభిమానించానని, కమ్యూనిస్టుగా అభిమానించలేదని పవన్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. చేగువేరా డాక్టర్‌గా ఎక్కడ వైద్యం చేశాడో పవన్ చెప్పాలన్నారు.

'ఘోస్ట్ ఫిషింగ్'పై యుద్ధం!

పాడైపోయిన వలలను సముద్రంలోకి విసిరేస్తున్న మత్స్యకారులు

- వీటిలో చిక్కుకొని మృత్యువాత పడుతున్న చేపలు, తాబేళ్లు
- 4 ఏళ్లలో 5.5 టన్నుల వలలు సేకరించిన ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా
- ఏపీ, ఒడిశా తీరంలో 15 ఘోస్ట్ ఫిషింగ్ హాట్ స్పాట్‌ల గుర్తింపు
- జెట్టీలు, హార్బర్లలో రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు సన్నాహాలు



వలల వ్యర్థాల్లో చిక్కుకుని మృతిచెందిన తాబేళ్లు, చేపలు

ప్లాస్టిక్ వ్యర్థాల్ని సేకరించిన ఎఫ్ఎస్ఐ బృందాలు

సాక్షి, విశాఖపట్నం: ఘోస్ట్ ఫిషింగ్... ఇది మత్స్య సంపదను హరిస్తోంది. సముద్ర వాతావరణానికి విఘాతం కలిగిస్తోంది. పర్యావరణ సమతుల్యతని దెబ్బతీస్తోంది. ఇంతలా హాని చేస్తున్న ఈ ఘోస్ట్ ఫిషింగ్ అంటే ఏమిటి..? దీనికి కారణమెవరు అని ఆలోచిస్తే.. గంగమ్మ ఒడిలో జీవనం సాగిస్తున్న మత్స్యకారులవైపే వేళ్లన్నీ చూపిస్తున్నాయి. అందుకే.. వారిలో చైతన్యం తీసుకొచ్చి మత్స్య సంపదకు ముప్పు వాటిల్లకుండా చర్యలు తీసుకునేందుకు ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐ) నడుం బిగించింది.

ఘోస్ట్ ఫిషింగ్ అంటే..?

వేటకు వెళ్లిన మత్స్యకారులు పాడైపోయిన వలలను ఒడ్డుకు తీసుకురాకుండా సముద్రంలోనే పడేస్తుంటారు. వలలను ప్లాస్టిక్, నైలాన్‌తో తయారు చేయడం వల్ల వందల సంవత్సరాల వరకు మట్టిలో కలిసిపోవు. ఆ వలల్లో చేపలు, తాబేళ్లు, సముద్ర జీవులు చిక్కుకుంటాయి. అవి బయటికి రాలేక చివరికి మృత్యువాత పడుతున్నాయి. దీన్నే ఘోస్ట్ ఫిషింగ్ అని అంటారు.

ఎఫ్ఎస్ఐ ఏం చేసింది.?

విశాఖ కేంద్రంగా ఎఫ్ఎస్ఐ సముద్రంలో మత్స్య సంపదపై నిరంతరం పరిశోధనలు చేస్తుంది. తమ సర్వే వెసల్స్ మత్స్యషికారిపై పరిశోధనలకు వెళ్లినప్పుడు వలల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు... ముఖ్యంగా ఫిషింగ్ నెట్స్ పెద్ద ఎత్తున లభ్యమయ్యాయి. ఈ విషమ పరిస్థితిపై పరిశోధనలు ప్రారంభించింది. ఏపీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరప్రాంతాల్లో వ్యర్థాల గుర్తింపు, వెలికితీత, మత్స్యరాశులపై వాటి ప్రభావం తదితర అంశాలపై 2021 ఏప్రిల్ నుంచి సర్వే ప్రారంభించింది. 2024 చివరి వరకు కొనసాగిన ఈ సర్వేలో ఏకంగా 5,562 కేజీల వ్యర్థాలు దొరికాయి. ఇది చాలా ప్రమాదకరమని గ్రహించి.. అవి దొరికిన ప్రాంతాల్ని హాట్‌స్పాట్‌లుగా గుర్తించింది. అప్పటి నుంచి గ్లోబల్ లిట్టర్ పార్టనర్‌షిప్(జీఎల్‌పీ) కార్యక్రమానికి ఎఫ్ఎస్ఐ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సర్వే నౌకలు మెరైన్ ప్లాస్టిక్ లిట్టర్/అబాండన్డ్ లాస్ట్ లేదా డిస్కార్డెడ్ ఫిషింగ్ గేర్లు (ఏఎల్‌డీఎఫ్‌జీ) పేరుతో అధ్యయనం నిర్వహించాయి. మరో మూడేళ్లపాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది.

మత్స్యకారులకు అవగాహన

సర్వేలో వెల్లడైన అంశాలను మత్స్యకారులు, బోటు ఆపరేటర్లకు తెలియజేసి వ్యర్థాలను సముద్ర జలాల్లో పడేయవద్దంటూ ఎఫ్ఎస్ఐ విశాఖ జోన్ డైరెక్టర్ భామిరెడ్డి, శాస్త్రవేత్త జీవీఏ ప్రసాద్ కలిసి హాట్‌స్పాట్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 400 నాటికల్ మైళ్ల దూరంలో నౌకలు సర్వే చేసినప్పుడు దొరికిన వలల వ్యర్థాలు చేస్తున్న కీడుకు సంబంధించిన వీడియోలను మత్స్యకారులకు చూపిస్తూ వారిని చైతన్యపరుస్తున్నారు.

రీసైక్లింగ్ యూనిట్లకు ప్రణాళికలు

ఎఫ్ఎస్ఐ చేపట్టిన జీఎల్‌పీ ప్రాజెక్టుకు దేశవ్యాప్తంగా అనూహ్య స్పందన లభించింది. సముద్ర అధ్యయనం, పర్యావరణ మంత్రిత్వ శాఖల నుంచి ప్రశంసలు లభించడమేకాకుండా.. ఈ ప్రాజెక్టుని సీరియస్‌గా అమలు చేసేందుకు సిద్ధమయ్యాయి. సముద్రంలో వేటకు వెళ్లే సమయంలో వలలో పడిన ప్లాస్టిక్ వ్యర్థాల్ని మత్స్యకారులు బయటకు తీసుకొచ్చేందుకు అవగాహన కల్పించడమే కాకుండా.. ప్రోత్సాహకాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సేకరించిన వ్యర్థాలను పునర్వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న ఫిషింగ్ హార్బర్‌లు, ఫిష్ ల్యాండింగ్ జెట్టీల వద్ద రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఇందుకు నిధులు కేటాయించే అవకాశం ఉంది.

ఘోస్ట్ ఫిషింగ్ హాట్ స్పాట్స్ ఇలా..

రాష్ట్రం	ఘోస్ట్‌ఫిషింగ్ హాట్‌స్పాట్	దొరికిన వలల వ్యర్థాలు(కిలోల్లో)
ఏపీ	కాకినాడ	15
ఏపీ	పెంటకోట	250
ఏపీ	పూడిమడక	872
ఏపీ	విశాఖపట్నం	368
ఏపీ	భీమిలి	1,072
ఏపీ	చింతపల్లి	300
ఏపీ	కళింగపట్నం	280
ఏపీ	కవిటి	50
ఏపీ	కుప్పిలి	80
ఏపీ	బారువా	10
ఒడిశా	గంజాం	100
ఒడిశా	చిలకా	90
ఒడిశా	గోపాల్‌పూర్	25
ఒడిశా	పూరీ	50
ఒడిశా	సౌత్ ఈస్ట్ ఆఫ్ పారాదీప్	2,000
మొత్తం	15	5,562

ఘోస్ట్ ఫిషింగ్ తగ్గితేనే మత్స్య సంపదకు మనుగడ



చేపల వేట సమయంలో తెగిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర సామగ్రిని సముద్రంలో మత్స్యకారులు పడేస్తున్నారు. వాటిల్లో చిక్కుకుని చిరు చేపలు, పీతలు, రొయ్యలు, తాబేళ్ల వంటివి చనిపోతున్నాయి. మా అంచనా ప్రకారం సముద్ర జలాల్లో వ్యర్థాల కారణంగా 3 నుంచి 5 శాతం మేర మత్స్య దిగుబడులు తగ్గే ప్రమాదముంది. ఉపరితలంపై తేలియాడే పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ సీసాలు, తెగిపోయిన వలల ముక్కలు తదితర అధిక సాంద్రత కలిగిన వ్యర్థాలు సముద్ర కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్నాయి. అందుకే జీఎల్‌పీ ప్రాజెక్టుకి శ్రీకారం చుట్టాం. మేం చేపట్టిన అవగాహన సదస్సులతో మత్స్యకారుల్లో క్రమంగా చైతన్యం వస్తోంది. వారు తీసుకొస్తున్న వ్యర్థాలతో రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటుచేసి మత్స్యకార మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. **- భామిరెడ్డి, ఎఫ్ఎస్ఐ విశాఖ జోన్ డైరెక్టర్**

గుంటూరు మేయర్ కావటి రాజీనామా

రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిరసన

- అడుగడుగునా అవమానాలు
- నగర కమిషనర్ అనుచిత వైఖరి
- ఈ పరిస్థితుల్లో బాధ్యతల్లో కొనసాగలేనంటూ ఆవేదన
- కలెక్టర్‌కు రాజీనామా లేఖ



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ''కూటమి ప్రభుత్వ అండదండలతో గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న మేయర్‌ను అడుగడుగునా అవమానించారు. నగర కమిషనర్ వేధింపులకు గురిచేశారు. ఇది నన్ను ఎంతగానో బాధించింది. నా ప్రమేయం లేకుండా స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరిపించారు. మేయర్ ఛాంబర్‌కు తాళాలు వేసి వెయిట్ చేయించారు. ఇన్ని అవమానాలు అనుభవిస్తూ మేయర్‌గా కొనసాగలేను'' అని తీవ్ర భావోద్వేగంతో పేర్కొంటూ.. శనివారం గుంటూరు మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు ఏడాదికి ముందే తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వాట్సాప్ ద్వారా పంపించి ఆమోదించాలని కోరారు.

ఎన్ని ఇబ్బందులు పెట్టినా సరే.. జగనన్నను వీడే ప్రసక్తే లేదు..

అంతకుముందు మనోహర్‌నాయుడు విలేకరుల తో మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలపై బలవంతపు కేసులు నమోదుచేయిస్తున్నారని పేర్కొన్నారు. తన ప్రమేయం లేకుండా ఈ నెల 17వ తేదీన స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్ ఏజెండా సిద్ధం చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. సమావేశం ఏర్పాటుకు సంబంధించిన కాపీని ఒక రోజు ముందు పంపి సమావేశానికి రావాలని పిలవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వాలు మారినప్పటికీ మేయర్ గౌరవ మర్యాదలకు ఎటువంటి ఢోకా ఉండేది కాదన్నారు. కాని ఇప్పుడు తన వద్ద కారును, డ్రైవర్‌ను, అటెండర్‌ను, ఆఫీస్ స్టాఫ్‌ను, చివరకు బిళ్ల బంట్రోతును కూడా తీసేశారన్నారు. ఇక్కడ నన్ను అవమానపరిస్తే 10 లక్షల జనాభాను అవమానపరిచినట్లేనన్నారు. సంఖ్య పరంగా కూటమి కార్పొరేటర్లు బలంగా లేకపోయినప్పటికి దాదాపు నెల క్రితం జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బజారులో కూరగాయాలు కొన్నట్లుగా ముగ్గురు ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రి కార్పొరేటర్ల ఇంటింటికి వెళ్లి కొనుగోలు చేసి, మాట వినని వారిని భయాభ్రాంతులకు గురి చేసి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గెలుపొందారని విమర్శించారు. మేయర్ అభ్యర్థిగా టీడీపీకి చెందిన కార్పొరేటర్‌ను నిలబెట్టాలని కేంద్రమంత్రి పెమ్మసాని ఫిక్స్ అయ్యారని పేర్కొన్నారు. కూటమి నేతలు తనపై ఎన్ని కేసులు, ఇబ్బందులూ పెట్టినా వైఎస్సార్‌సీపీని, జగనన్నను వీడే ప్రసక్తే లేదన్నారు. పీవీకేనాయుడు మార్కెట్ పేరును, భవన నిర్మాణ ప్లాన్‌ను మార్చాలని కేంద్ర మంత్రి పెమ్మసాని కుట్ర పన్నుతున్నారని, దీనికి ఒప్పుకునేది లేదని కావటి స్పష్టం చేశారు.

పోసాని పట్ల ప్రభుత్వ తీరు దారుణం

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : సినీ నటుడు, రచయిత పోసాని కృష్ణమురళిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లసాని మనోహర్ రెడ్డి మండిపడ్డారు. గుంటూరు జిల్లా కారాగారంలో ఉన్న పోసానిని పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు శనివారం ములాఖత్‌లో పరామర్శించారు. అనంతరం మనోహర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పోసాని ఆరోగ్యం బాగోలేదని, ఆయన పట్ల ప్రభుత్వం చాలా దారుణంగా వ్యహరిస్తోందని చెప్పారు. ఇప్పటివరకు ఆయనపై రాష్ట్రవ్యాప్తంగా 18 కేసులు పెట్టారని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న ఆయన్ని ప్రతి రోజూ 800 కి.మీ నుంచి 1,200 కి.మీ మేర తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్ బుక్ టీడీపీకే కాదని, తమ బుక్‌లకు కూడా పేర్లు పెడతామని చెప్పారు.

నిధులు నిల్.. పనులు ఫుల్

- రెవెన్యూ ఆఫీసుల్లో రోజువారీ ఖర్చులకు సైతం నిధులు ఇవ్వని ప్రభుత్వం
- ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగుల పరిస్థితి 'నిధులు నిల్.. పనులు ఫుల్..' అన్నట్లుగా ఉందని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కంటిన్జెన్సీ, కోర్టు, ప్రొటోకాల్ పనుల కోసం పైసా విడుదల చేయలేదని చెప్పారు. ప్రతి రెవెన్యూ కార్యాలయంలో స్టేషనరీ ఖర్చులు వేల రూపాయల్లో ఉంటున్నాయని, వాటిని కూడా సమకూర్చడం లేదని తెలిపారు. కార్యాలయాల్లో రోజువారీ స్టేషనరీ, ఇతర ఖర్చుల కోసం ఉద్యోగులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఆయన శనివారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ ఒకవైపు రెవెన్యూ కార్యాలయాల్లో రోజువారీ అవసరాల కోసం నిధులు విడుదల చేయని ప్రభుత్వం... మరోవైపు 20 రోజుల్లో చేయాల్సిన పనులను వారంలోనే పూర్తి చేయాలని టార్గెట్లు విధిస్తోందని, క్షేత్ర స్థాయిలో సమస్యల గురించి పట్టించుకోవడం లేదని చెప్పారు. కింది స్థాయి సిబ్బందికి వసతులు సమకూర్చకుండా సమీక్షల పేరుతో మానసిక క్షోభకు గురి చేస్తున్నారన్నారు. క్రమశిక్షణ చర్యల పేరిట ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. దీంతో రెవెన్యూ ఉద్యోగులపై పని భారం, ఒత్తిడి పెరిగి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాలని కోరారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త కలెక్టరేట్లలో పని చేసేందుకు ఉద్యోగుల పోస్టులు మంజూరు చేయలేదని, ఇందుకు సంబంధించిన ఫైల్ ఆర్థిక శాఖలో మూలుగుతోందని బొప్పరాజు చెప్పారు. రాష్ట్రంలో సుమారు 200 తహశీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, కోర్టును సాకుగా చూపించి వాటిని భర్తీ చేయడంలేదన్నారు.

పవన్ మాటలపై టీడీపీలో మంటలు

- పవన్, నాగబాబు వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో ఆగ్రహం
- కౌంటర్లు, సెటైర్లతో విరుచుకుపడుతున్న టీడీపీ కార్యకర్తలు
- తిప్పికొడుతున్న జనసేన శ్రేణులు

సాక్షి, అమరావతి: పిఠాపురం 'జయకేతనం' సభలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఆయన సోదరుడు నాగబాబు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ శ్రేణులు రగిలిపోతున్నాయి. వారిద్దరిపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర స్థాయిలో కౌంటర్లు, సెటైర్లు పేలుతున్నాయి. 'ఏరుదాటాక తెప్ప తగలేసిన' సామెత పవన్‌కు సరిగ్గా సరిపోతుందని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. గత ఎన్నికల్లో 40 ఏళ్ల చరిత్ర ఉన్న టీడీపీని నిలబెట్టడంతోపాటు తాము కూడా నిలబడ్డామని పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యల్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఏపీలో కూటమి అధికారంలోకి రావడానికి తానే కారణమని, తనవల్లే చంద్రబాబు సీఎం అయ్యారని, పూర్తిగా దెబ్బతిన్న టీడీపీని తానే పునర్జీవింపచేశాననే రీతిలో చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రెండు పార్టీలు పోటీ చేసిన సీట్లు, వచ్చిన ఓట్లు, ఓట్ల శాతాల లెక్కలతోపాటు రకరకాల లాజిక్కులు, లెక్కలు, వివరణలతో టీడీపీ గ్యాంగ్ సోషల్ మీడియాను హోరెత్తిస్తోంది. పవన్‌పై విరుచుకుపడి తిడుతుండటంతోపాటు చంద్రబాబు, లోకేశ్‌పైనా విమర్శలు సంధిస్తున్నారు. వారు సరిగ్గా లేకపోవడం వల్లే అవమానాల పాలవుతున్నామని వాపోతున్నారు.

నాగబాబు వ్యాఖ్యలపైనా..

ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన పవన్ సోదరుడు నాగబాబు పిఠాపురం సభలోనే అక్కడి టీడీపీ ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ఎన్ వర్మను అవమానిస్తూ మాట్లాడటంపైనా టీడీపీ శ్రేణుల్లో తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 'పిఠాపురంలో పవన్ గెలవడానికి తామే కారణమని ఎవరైనా అనుకుంటే అది వారి ఖర్మ' అని నాగబాబు వ్యాఖ్యానించడాన్ని తప్పుపడుతున్నాయి. ఎన్నికల సమయంలో వర్మను ప్రాధేయపడి, తనవెంటే తిప్పుకుని, ఎలాగైనా గెలిపించాలని వేడుకుని నానారకాలుగా ప్రయత్నించిన జనసేన నేతలు.. ఇప్పుడు గెలిచాక ఆయన పాత్ర ఏమీ లేదని పవన్ తన అన్న నాగబాబుతో తిట్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్మ తనకు ఎమ్మెల్సీ పదవి రాలేదని అసంతృప్తితో రగిలిపోతున్నారు. టీడీపీ కార్యకర్తలు కూడా ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వకపోవడాన్ని తప్పు పడుతున్నారు. పవన్ వద్దని చెప్పడం వల్లే ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వలేదనే చర్చ కూడా నడుస్తోంది. ఆయనకు పదవులు ఇస్తే తనకు ప్రొటోకాల్ ఇబ్బందులు వస్తాయని చంద్రబాబుకు పవన్ చెప్పడంతో మొండిచేయి చూపించారనే ప్రచారం నడుస్తోంది. ఇది నిజమన్నట్టు జయకేతనం సభలో నాగబాబు వ్యాఖ్యలు చేయడం విశేషం. ఎన్నికల సమయంలో వర్మను పక్కన పెట్టుకుని పవన్ మాట్లాడిన మాటలు, గెలిచాక తన గెలుపునకు ఆయనే కారణమని కృతజ్ఞతలు చెబుతున్న వీడియోలు, ఇప్పుడు నాగబాబు మాట్లాడిన వీడియోను పెట్టి ట్రోల్ చేస్తున్నాయి. మరోవైపు జనసేన కార్యకర్తలు టీడీపీ 'సోషల్' దాడిని తిప్పికొడుతూ తమ అధ్యక్షుణ్ణి, నాగబాబును వెనకేసుకుని వస్తున్నాయి. సోషల్ మీడియాలో ఇంత రాద్ధాంతం జరుగుతున్నా చంద్రబాబు కానీ.. టీడీపీ నేతలు కానీ స్పందించకపోవడం గమనార్హం.

చంద్రబాబును మించిన అవకాశవాది పవన్

వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుని మించిన అవకాశవాది అని వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సూపర్ సిక్స్, 143 హామీల అమలుపై జయకేతనం సభలో పవన్ ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. మెడికల్ కాలేజీలు, పోర్టులను చంద్రబాబు ప్రైవేటుకు ధారాదత్తం చేస్తుంటే ఎందుకు నోరెత్తడంలేదని అన్నారు. అంబటి రాంబాబు శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పైకి నిజాయితీపరుడినని చెప్పుకొనే పవన్‌కు జనసేన ఎమ్మెల్యేల దోపిడీ, అవినీతి, బెదిరింపులు కనిపించడం లేదని దుయ్యబట్టారు. పవన్‌కి ప్రియాతి ప్రియమైన మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ దోపిడీకి అడ్డే ఉండటంలేదని అన్నారు. నాయకులు ప్రజల నుంచే పుట్టాలని, వారసత్వ రాజకీయాలేమిటంటూ మాటలు చెప్పే పవన్.. వచ్చిన ఒక్క ఎమ్మెల్సీ పదవినీ అన్న నాగబాబుకే ఇచ్చుకున్నాడన్నారు. ఎన్నికల్లో గెలిపించే బాధ్యత నీదేనంటూ సీటు త్యాగం చేసిన వర్మతో పనిచేయించుకుని, ఆయన వల్ల గెలిచామంటే నీ ఖర్మ అంటూ ఆయన్ని ఎగతాళి చేశారని అన్నారు. అక్కర గడుపుకొని మోసం చేయడంలో, అవకాశవాదంలో చంద్రబాబునే మించిపోయారని చెప్పారు.

కాపులకి ఇప్పుడిప్పుడే తెలుస్తోంది

40 ఏళ్ల టీడీపీ పడిపోతుంటే నిలబెట్టామని మాత్రం పవన్ నిజం చెప్పారని తెలిపారు. ఇదే విషయాన్ని తాము మొదట్నుంచి చెబుతూనే ఉన్నామని తెలిపారు. పవన్ ప్రజల కోసం పోరాడే వ్యక్తి కాదని, చంద్రబాబుకు ఊడిగం చేయడానికి, టీడీపీకి బి టీమ్‌గా జనసేనను స్థాపించారని చెప్పారు. కాపు సమాజం మీద అనేక దుశ్చర్యలకు పాల్పడిన చంద్రబాబు, ఆ సామాజికవర్గం ఓట్ల కోసం జనసేనను ఏర్పాటు చేయించారని తెలిపారు. ఈ విషయాన్ని కాపులు ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నారని చెప్పారు. చంద్రబాబుకి ఏ కష్టం వచ్చినా పవన్ కాపు కాస్తారని, అందువల్లే జనసేన పార్టీ మెయింటెనెన్స్ మొత్తం చంద్రబాబే చూస్తారని తెలిపారు. ఒకసారి టీడీపీకి సపోర్టు చేయడం, ఇంకోసారి వ్యతిరేక ఓట్లు చీల్చేలా ఇతర పార్టీలతో కలవడం.. ఇదంతా చంద్రబాబు చేయిస్తున్నదే తప్ప.. పవన్‌కంటూ సొంత విధానాల్లేవని అన్నారు. పిఠాపురం సభలో కూర్చున్న 21 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీల్లో చంద్రబాబు పంపిన వాళ్లు, వైఎస్సార్‌సీపీ తిరస్కరించిన వాళ్లు కాకుండా నిజమైన జనసేన నాయకులు ఎంతమందో చెప్పాక 100 శాతం స్ట్రైక్ రేట్ గురించి మాట్లాడితే బాగుండేదని అన్నారు. గాలికి కొట్టుకొచ్చిన వాళ్లని పెట్టుకుని, ప్రజల దురదృష్టం వల్ల గెలిచారని వ్యాఖ్యానించారు.

తండ్రినీ కించపరుస్తారా..?

మొన్నటిదాకా వారి తండ్రి హేతువాది, దేవుడి దగ్గరి దీపంతో సిగిరెట్ వెలిగించుకునేవాడని చెప్పిన ఈ పవన్.. నిన్నటి సభలో మాత్రం వారి ఇంట్లో నిత్యం రామనామ స్మరణ వినిపిస్తుందంటూ జనం చెవుల్లో క్యాబేజీ పూలు పెడుతున్నాడని చెప్పారు. ఆయన్ని గొప్పగా ప్రాజెక్టు చేసుకునేందుకు తండ్రినీ కించపరిచేలా దిగజారానని అన్నారు. ఉత్తరాది వారి పెత్తనం, అహంకారం అంటూ నిన్నటిదాకా గగ్గోలు పెట్టిన పవన్.. హఠాత్తుగా కాషాయం ధరించి యూటర్న్ తీసుకున్నాడన్నారు. ఇలా ఎటు గాలి కొడితే అటు కొట్టుకుపోవడం తప్ప, పవన్‌కు ఒక స్థిర నిర్ణయం మీద నిలబడే సత్తా లేదని చెప్పారు.

పార్టీ మారినంత మాత్రాన నోరు జారితే ఎలా?

అధికారంలో ఉండగా పెత్తనం చలాయించిన విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి ఇప్పుడు అన్యాయం జరిగిందనడం సిగ్గుచేటని అంబటి ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబం దయలేకపోతే బాలినేనికి పదవులు వచ్చేవా! అని ప్రశ్నించారు. బాలినేని ఆస్తులు ఎక్కడో పోగొట్టుకుని వచ్చి, రాజకీయాల్లో పోగొట్టుకున్నట్లు చెప్పడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్, జగన్ దయాదాక్షిణ్యాలతో ఎంపీ అయిన బాలశౌరి జీవితం మొత్తం ప్రజలకు తెలుసన్నారు. కొత్తగా ఎమ్మెల్సీ అయిన నాగబాబు కూడా జగన్ గురించి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడని, ఎవరివో దయాదాక్షిణ్యాలుంటే తప్ప గెలవలేని అన్నదమ్ములకు.. ఢిల్లీ కోటను ఢీకొట్టిన ధీరుడు, పదేళ్లలో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తెచ్చిన జగన్ గురించి మాట్లాడే స్థాయి లేదని స్పష్టం చేశారు. పవన్ మొదటిసారిగా గెలిచారనే సంగతి మరిచిపోకూడదని, జగన్‌లా వరుసగా గెలిచిన చరిత్ర ఆయనకు లేదని తెలిపారు. ఇలాగే నోరుజారి మాట్లాడితే ఖర్మ అనుభవించేది వారేనని చెప్పారు. నాలుగేళ్ల తర్వాత పరిస్థితులు మారతాయని, దుర్మార్గమైన రాజకీయాలు చేస్తే నూకలు కూడా మిగలవని గుర్తుంచుకోవాలని అన్నారు.

నేనెప్పుడూ హిందీ భాషను వ్యతిరేకించలేదు

- తప్పనిసరి చేయడమే తప్పన్నా..
- 'ఎక్స్'లో పవన్‌కళ్యాణ్ ట్వీట్
- పార్టీ ఆవిర్భావ సభలో ప్రసంగంపై విమర్శల నేపథ్యం



సాక్షి, అమరావతి: తానెప్పుడూ హిందీని ఒక భాషగా వ్యతిరేకించలేదని, దానిని తప్పనిసరి చేయడాన్ని మాత్రమే వ్యతిరేకించానని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వివరణ ఇచ్చారు. ఈ మేరకు శనివారం సోషల్ మీడియా 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పవన్ కళ్యాణ్ తన పార్టీ జనసేన ఆవిర్భావ సభలో హిందీ-తమిళ్ వివాదంలో వేలుపెట్టారు. 'హిందీ రాకూడదు.. అంటుంటే నాకు మనసులో ఒకటి అనిపించింది. అప్పుడు తమిళ సినిమాలను హిందీలోకి డబ్ చేయకండి. డబ్బులేమో హిందీ నుంచి కావాలి. ఉత్తరప్రదేశ్, బీహార్, చత్తీస్‌గఢ్ నుంచి కావాలి. కానీ మాకు హిందీ వద్దంటే అదేం న్యాయం. పనిచేసే వారందరూ మనకు బీహార్ నుంచి రావాలి. కానీ మనకు హిందీ వద్దంటే ఎట్లా' అని పేర్కొన్నారు. ఈ మాటలను ఇప్పుడు తమిళనాడు రాజకీయ పార్టీలుసహా పలువురు తప్పుపడుతున్నారు. 2017 ఏప్రిల్ 23వ తేదీన రాష్ట్రంలోని ఓ తెలుగు పత్రిక ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమైన 'హిందీ గో బ్యాక్' కథనాన్ని పవన్‌కళ్యాణ్ అదే రోజున సోషల్ మీడియా ట్విట్టర్ (ప్రస్తుత 'ఎక్స్'లో) ట్యాగ్ చేశారు. రాజకీయంగా బీజేపీతో పొత్తు లేని అప్పట్లో పవన్‌కళ్యాణ్ చేసిన ఆ ట్వీట్‌లోనే 'ఉత్తర భారత రాజకీయ నాయకత్వం మన దేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని అర్థంచేసుకొని గౌరవించాలి' అంటూ పేర్కొన్నారు.

విమర్శల జడివాన ఇలా...

- డీఎంకే ఎంపీ కనిమొళి 2017లో పవన్ ట్వీట్‌ను ట్యాగ్ చేస్తూ, 'బిఫోర్ బీజేపీ'... 'ఆఫ్టర్ బీజేపీ' అంటూ ఆయన వైఖరిని తప్పుబట్టారు.
- తమిళనాడులో ద్విభాషా విధానం 1968లో అసెంబ్లీ వేదికగా చట్టబద్ధత పొందిందని, అప్పుడు పవన్ పుట్టి ఉండరేమో అని డీఎంకే అధికార ప్రతినిధి సయ్యద్ హఫీజుల్లా సెటైర్లు వేశారు. కేంద్రం తమ మీద బలవంతంగా హిందీని రుద్దుతోందన్న విషయాన్ని ఆయన గుర్తెరగాలని హితవు పలికారు.
- డీఎంకే సీనియర్ నేత టీకేఎస్ ఇళంగోవన్ ఓ మీడియాతో మాట్లాడుతూ, 1938 నుంచి హిందీని తమిళనాడు వ్యతిరేకిస్తున్నట్టు గుర్తుచేశారు. ఆయన (పవన్) బీజేపీకి ఏదో విధంగా మద్దతు ఇవ్వాలనుకుంటున్నట్లుందని విమర్శించారు.
- 'హిందీని మాపై బలవంతంగా రుద్దవద్దని చెప్పడం, ఇతర భాషలను ద్వేషించడమే కాదు. అది తమ తల్లి భాషను, తమ సంస్కృతి గుర్తింపును స్వీయ మర్యాదతో పరిరక్షించే ప్రయత్నం'.. అని సినీ నటుడు ప్రకాష్ రాజ్ వ్యాఖ్యానించారు. 'ఈ విషయాన్ని ఎవరైనా పవన్ కళ్యాణ్‌కు చెప్పండి' అంటూ హితవు పలికారు.

లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని
లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంప లేదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.విదియ ప.2.50 వరకు తదుపరి తదియ, **నక్షత్రం:** హస్త ఉ.10.06 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** సా.6.56 నుండి 8.42 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.31 నుండి 5.19 వరకు, **అమృత ఘడియలు:** తె.5.32 నుండి 7.20 వరకు (తెల్లవారితే సోమవారం).

సూర్యోదయం : 6.13
సూర్యాస్తమయం : 6.06
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

సునీతా విలియమ్స్ (నాసా వ్యోమగామి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మై హ్యాపీ ప్లేస్! అంతరిక్షం!!

తొమ్మిది నెలలుగా ఇక్కడ రోజుకు పదహారు సూర్యోదయాలు, పదహారు సూర్యాస్తమయాలు!


"ఇంతెంత... కొన్ని గంటలే... " అని నవ్వారు బుచ్ విల్మోర్. ఆయన నవ్వు నక్షత్రంలా ప్రకాశిస్తోంది.

"గంటల్ని మీరు ఏ ఖగోళ కొలమానంతో లెక్కిస్తున్నారు మిస్టర్ విల్మోర్?" అన్నాను నేను నవ్వుతూ.

"ఖగోళం కాదు మిస్ విలియమ్స్, భూగోళంలో నా కూతుళ్ల ఎదురు చూపులతో కాలాన్ని కొలుస్తున్నాను... " అన్నారు విల్మోర్!

విల్మోర్ కూతుళ్లిద్దరూ కింద ఆయన కోసం నిరీక్షిస్తూ ఉన్నారు. పెద్ద కూతురు డ్యారిన్ సోషల్ మీడియాలో పెట్టిన ఎమోషనల్ పోస్టు అంతరిక్షం వరకు వచ్చేసింది.

"నాన్నా! మీరిక్కడ చాలా మిస్ అయ్యారు. క్రిస్మస్‌ని మిస్ అయ్యారు. మీ థర్టీయత్ వెడ్డింగ్ యానివర్సరీని మిస్ అయ్యారు. చెల్లి స్కూల్ ఫైనల్ దాటేసింది. మీరది చూడలేదు. కాలేజ్ ప్లే లో నేను యాక్ట్ చేశాను. అదీ మీరు చూడలేదు. మీరు కిందికి రాగానే, మీ మెడ చుట్టూ చేతులు వేసి మిమ్మల్ని గట్టిగా హగ్ చేసుకోవాలని ఉంది నాన్నా..." అని డ్యారిన్ అంటోన్న ఆ వీడియోను మళ్లీ మళ్లీ



చూసుకుంటూ... "మిస్ విలియమ్స్! భూమి పైన మీకు ప్రియమైన వారు ఎవరు?!" అని నన్ను అడిగారు విల్మోర్!

"ఇండియా" అని చెప్పాను. "ఇంకా?" అన్నారు. "భగవద్గీత" అని చెప్పాను. "ఇంకా?" అన్నారు. "ఉపనిషత్తులు" అన్నాను. "ఇంకా?" అన్నారు! "సబర్మతి ఆశ్రమం" అన్నాను.

నేను నా హజ్బెండ్ పేరు చెప్పేవరకు ఆయన ఇంకా... ఇంకా... ఇంకా... అని అంటూనే ఉంటారని నాకర్థమైంది. కానీ నేను మైఖేల్ పేరు చెప్పలేదు. గోర్బీ, గన్నర్, బైలీ, రోటర్‌ల పేర్లు చెప్పాను. అవి మా పెట్స్.

"ఐయామ్ సారీ..." అన్నారు విల్మోర్.

పెట్స్ పేర్లు చెప్పగానే మాకు పిల్లలు లేరన్న సంగతి ఆయనకు గుర్తొచ్చి ఉండొచ్చు.

"ఇట్స్ ఓకే..." అన్నాను నవ్వుతూ.

విల్మోర్ నా పట్ల గమనింపుతో ఉంటారు. "మనమేమీ ఇక్కడ ఒంటరిగా లేము..." అంటారు. "మనల్నెవరూ ఇక్కడ వదిలేసి వెళ్లలేదు" అంటారు. నేనెప్పుడైనా దీర్ఘాలోచనలో ఉంటే, "అంతరిక్షంలో నివసించటం గొప్ప అనుభూతి కదా..." అని నవ్వించే ప్రయత్నం చేస్తారు.

"మిస్టర్ విల్మోర్! మీరేమీ నాకు ధైర్యం చెప్పక్కర్లేదు. కావాలంటే నా ధైర్యంలోంచి మీక్కొంచెం ఇస్తాను..." అన్నానొకసారి.

ఈదురుగాలొచ్చి ఒక్క తోపు తోసినట్లుగా నవ్వారాయన! ఆ నవ్వుకు మేమున్న అంతరిక్ష కేంద్రం గతి తప్పుతుందా అనిపించింది!

'స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్' మా కోసం బయల్దేరి వస్తోందని తెలియగానే... "మిస్ విలియమ్స్! అంతరిక్షంలో మీతో పాటుగా నేనూ ఉన్నానన్న సంగతిని భూమ్మీద అందరూ మర్చిపోయినట్లున్నారు..." అన్నారు విల్మోర్ నవ్వుతూ.

ఆ మాటకు నవ్వాన్నేను.

"చిక్కి నగమైన సునీతా విలియమ్స్', 'సునీతా విలియమ్స్ రాక మరింత ఆలస్యం', 'నేడో రేపో భూమి పైకి సునీతా విలియమ్స్'... భూగోళం మొత్తం మీ గురించే రాస్తోంది. మీ కోసమే ఎదురు చూస్తోంది మిస్ విలియమ్స్..." అన్నారు విల్మోర్.

నన్ను ఆహ్లాదపరచటం అది.

"ఆశ్చర్యం ఏముంది మిస్టర్ విల్మోర్! భూగోళం ఒక వైపుకు మొగ్గి ఉంటుందని తెలియకుండానే డ్యారిన్ వాళ్ల నాన్న గారు ఆస్ట్రోనాట్ అయ్యారా?" అని నవ్వాను.

దూరాన్నుంచి, చుక్క ఒకటి మా వైపుకు మెల్లిగా కదిలి వస్తూ ఉండటం కనిపించింది!

ఆ చుక్క... తన బిడ్డల్ని గుండెల్లోకి పొదువుకోవటానికి వస్తున్న తల్లిలా ఉంది. భుజాలపైకి ఎక్కించుకొని తిప్పటానికి వస్తున్న తండ్రిలానూ ఉంది.

"స్పేస్‌ఎక్స్ క్యాప్సూల్ వస్తున్నట్లుంది..." అన్నారు విల్మోర్, ఆ చుక్క వైపు చూస్తూ!

వీరమల్లు సైద్ధాంతిక విన్యాసం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



సినీనటుడు పవన్ కల్యాణ్ జనసేన పార్టీని స్థాపించి పుష్కర కాలం పూర్తయింది. పిఠాపురంలో నిన్న ఆ వేడుక వైభవంగానే జరిగింది. తాను అసెంబ్లీ గేటు తాకడానికి అవకాశం కల్పించిన పిఠాపురాన్ని ఈ రకంగా పవన్ గౌరవించారు. అసెంబ్లీ గేటును తాకే క్రమంలో పనిలో పనిగా కొన్ని తొడలు విరగ్గొట్టినట్టుగా కూడా ఆయన చెప్పారు. వీరమల్లు కదా, ఆ మాత్రం ఎలివేషన్ అవసరమే! పుష్కర సభ అంగరంగ వైభవంగా జరిగిందనీ, లక్షలాది జనసందోహంతో పొంగిపొరలిందనీ యెల్లో మీడియా వేనోళ్ల పొగిడింది.

యెల్లో మీడియా సాధారణంగా చంద్రబాబుకూ, ఆయన పార్టీకీ మాత్రమే పరిమితం చేసే ప్రచార గౌరవాన్ని పవన్ సభకు కూడా కల్పించి ఔదార్యాన్ని చాటుకున్నది. అందులో ఒక పత్రిక సభలో జనగణన కూడా చేసింది. సభలో జనం కూర్చోవడానికి 14 ఎకరాలు కేటాయించారనీ, ఆ స్థలంలో లక్షలాదిమంది కిక్కిరిసిపోయారని రాసింది. జనం కిక్కిరిసి కూర్చుంటే ఎకరాకు ఐదు వేల మందిని లెక్కవేయడం ఆనవాయితీ. అంతకంటే ఐదు రెట్లు లేదా పది రెట్లు ఎక్కువగా కిక్కిరిశారని యెల్లో మీడియా చెబుతున్నది. ఏమో గుర్రం ఎగరావచ్చు! ఎవరికీ అభ్యంతరం లేదు. జనం కూర్చోవడానికి కేటాయించిన స్థలం 14 ఎకరాలు కాదని, తొమ్మిదెకరాలు మాత్రమేనని స్థానికుల సమాచారం. ఆ స్థానికులు గిట్టనివారు కావచ్చు. యెల్లో మీడియా రాసిందే అక్షర సత్యం కావచ్చు. సభ విజయవంతమైనందుకు పవన్ కల్యాణ్‌కు సనాతనాభివందనాలు!

ఇప్పుడు పవన్ కల్యాణ్ అధికారంలో భాగస్వామి. ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. కనుక ఎన్నికల హామీల అమలు గురించో, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాల గురించో మాట్లాడుతారని జనం ఆశించడం సహజం. కానీ, అటువంటి ఆశలకు ఆయన అవకాశం ఇవ్వలేదు. కాలువల కింద కూడా ఎండిపోతున్న పంటల గురించి ఆయన మాట్లాడలేదు. చెమటోడ్చి తెచ్చిన పంటలకు పడిపోతున్న ధరల గురించీ ఆయన మాట్లాడలేదు. అవసరమైన ఔషధాలతో, అందుబాటులో వైద్యులతో తొమ్మిది నెలల కిందటి దాకా ధైర్యం నింపిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పుడు వెలవెలబోతున్న వైనం కూడా ఆయన ప్రసంగంలో చోటు చేసుకోలేదు.

అధోముఖయానం చేస్తున్న జీఎస్టీ వసూళ్ల సాక్షిగా ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం గురించిన ప్రస్తావనే రాలేదు. పేద, మధ్యతరగతి వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపిన విద్యా విప్లవానికి ఎందుకు కళ్లెం వేశారన్నదానిపై వివరణే వినిపించ లేదు. డొక్కా సీతమ్మ పేరు పెట్టి ఇంటర్ విద్యార్థుల కోసం ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకం నెల తిరక్కుండానే పరమ నాసిరకంగా ఎందుకు దిగజారిందో ఆయన చెప్పలేదు. ఆర్‌బీకే సెంటర్లలో అందుబాటులో లేకుండా ఎరువులూ, విత్తనాలూ ఎందుకు అదృశ్యమయ్యాయో, ఇల్లిల్లూ తిరిగి సేవలందించిన వలంటీర్లు ఏమయ్యారో అనే విషయాల గురించి పవన్ మాట్లాడలేదు.

ఎమ్మెల్యేలూ, నాయకులూ జనం మీద పడి దోచుకుతింటున్నారని యెల్లో మీడియానే కోడై కూస్తున్నది. పంపకాల్లో తేడాలతో కూటమి నాయకులు కొట్లాడుకుంటున్నారని కూడా పచ్చకోడి గూడెక్కి కూస్తున్నది. అధికారులు కలెక్షన్ కౌంటర్లు తెరిచి అక్కడ వారి సతీమణుల్ని కూర్చోబెడుతున్నారని కూడా ఆరోపణలు చేస్తున్నది. ఇటువంటి కీలక విషయాల జోలికి ఆయన వెళ్లలేదు. లౌకిక విషయాల గురించి ఆయన మాట్లాడ దలుచుకోలేదు. ఆయన ప్రసంగమంతా అలౌకిక పారవశ్యమే!

ఈ సభ ద్వారా ఆయన మూడు అంశాలను చెప్పదలుచుకున్నట్టు మనం అర్థం చేసుకోవాలి. మొదటి నుంచీ ఆయన రాజకీయ ప్రయాణమంతా సిద్ధాంతబద్ధంగానే సాగిందని జనం నమ్మాలనేది ఆయన మొదటి పాయింట్. బాల్యం నుంచే తాను సనాతన ధర్మం కోసం పోరాడుతున్నానని చెప్పుకోవడం, తద్వారా ఆ శ్రేణుల్లో అగ్రభాగాన నిలబడాలని కోరుకోవడం రెండో పాయింటు. కొందరు విశ్లేషకులు, మరికొందరు మీడియా వ్యక్తులు ఊహిస్తున్నట్టు కూటమిలో విభేదాలేమీ ఉండబోవనీ, అక్కడ మోదీకీ – ఇక్కడ బాబుకూ విధేయుడనే అనే సందేశాన్ని శ్రేణులకు పంపించడం మూడో పాయింటు.

> పవన్ తన ప్రసంగంలో ఒకపక్క చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తుతూనే మోదీ తరఫున వకాల్తా పుచ్చుకొని తమిళనాడులోని డీఎమ్‌కే పార్టీ మీద దాడి చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేయబోతున్న దనీ, దీనిపై ఐక్యంగా పోరాడదామనీ ఆ పార్టీ వాళ్లు వాళ్ల ప్రయత్నమేదో చేస్తున్నారు. బీజేపీ దీర్ఘకాల లక్ష్యాలకు ఇటువంటి చిన్నచిన్న ప్రయత్నాలు కూడా విఘాతం కలిగిస్తాయని బీజేపీ పెద్దలకు బాగా తెలుసు. వారి మనసెరిగి పవన్ ప్రసంగించారు. అప్పుడెప్పుడో చిన్నతనంలో ఆయన మద్రాస్‌లో ఉన్నప్పుడు తమిళుడెవరో 'గోల్టీ' అని గిచ్చాడట! దాన్నిప్పుడు గుర్తుచేసుకున్నారు.
>
> పవన్ సభ ప్రారంభానికి ముందే చంద్రబాబు, లోకేశ్‌బాబు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. యెల్లో మీడియా ఆ సభకు పూర్ణకుంభ స్వాగతం పలికింది. ఈ మూడు పార్టీల కూటమిలో లుకలుకలున్నాయనీ, విడిపోతాయనీ, బీజేపీ – జనసేన కలిసి ఒక కూటమిగా ఏర్పడుతాయనీ ఊహిస్తున్న విశ్లేషకులు ఇప్పటికైనా తమ ఆలోచనల్ని సరిదిద్దుకోవాలి. విభేదాలేమీ లేవు. ముగ్గురూ కలిసి పనిచేస్తారు. బీజేపీ-సంఘ్ పరివార్‌ల దీర్ఘకాలిక లక్ష్యానికి సహకరిస్తూనే మిగిలిన ఇద్దరు ఎవరి ఇంటిని వాళ్లు చక్కదిద్దుకుంటారు.

లెఫ్ట్ నుంచీ సెంటర్‌కూ, అక్కడి నుంచి రైట్‌కూ తన సిద్ధాంత విధేయత మారిందని మీడియాలో వస్తున్న విమర్శలపై పవన్ కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. చేగువేరాను తాను అభిమానించడానికి కారణం అతను కమ్యూనిస్టు కావడం కాదట! వైద్యవృత్తిని వదిలేసి విప్లవకారుడుగా మారినందువల్లనే అభిమానించానని చెప్పుకొచ్చిన పవన్ కల్యాణ్ భాషణపై సీపీఎం అగ్రనాయకుడు బీవీ రాఘవులు వ్యంగ్యంగా స్పందించారు. చేగువేరా మెడిసిన్ చదివిన మాట నిజమే కానీ, ఆయన వైద్యవృత్తిలో ఎప్పుడున్నారో నాకైతే తెలియదన్నారు. నిజంగానే వైద్యుడిగా చే ప్రాక్టీస్ చేసిందేమీ లేదు. అంతర్జాతీయ విప్లవకారుడుగానే ఆయన ప్రసిద్ధుడు. చేగువేరా మీద అభిమానానికి పవన్ చెప్పిన కారణమే నిజమైతే, విప్లవాలు – యుద్ధాల వీధి గుమ్మాల్లో నిలబడి వైద్యసేవలందించిన డాక్టర్ నార్మన్ బెథూన్, డాక్టర్ ద్వారకానాథ్ కోట్నీస్‌ల అభిమానిగా ఆయన మారి ఉండాలి. అసలు ప్రాక్టీసే చేయని చేగువేరాను విప్లవకర వైద్యుని కోటాలో అభిమానించడం అనే కథ సరిగ్గా అతకలేదు.

తాను బాల్యం నుంచే సనాతనవాదినని పవన్ ఈ సభలో చెప్పుకున్నారు. సనాతన ధర్మం తన రక్తంలోనే వుందని చెప్పారు. పద్నాలుగేళ్ల వయసు నుంచే దీక్షలు చేస్తున్నట్టు కూడా చెప్పారు. తనపై సినిమాల ప్రభావం బాగా ఎక్కువని కూడా పవన్ అంగీకరించారు. సినిమాలు, కథలు, నవలలతో బాగా ప్రభావితమయ్యే వ్యక్తులు కొందరు వాటిలోని పాత్రలతో తమను పోల్చుకోవడం అనే ఫ్యాంటసీలో మునిగి తేలుతుంటారు. చేగువేరా ప్రభావం బాగా ఉన్న రోజుల్లో తమ తండ్రిగారు కమ్యూనిస్టని పవన్ చెప్పేవారు. అంతటితో ఆగకుండా, నానమ్మ దీపారాధన చేస్తుంటే ఆ దీపంతో నాన్నగారు సిగరెట్ కాల్చుకునేవారని కూడా ఒక సందర్భంలో ఆయన చెప్పారు. ఇంతకన్నా అవగాహనా రాహిత్యం ఇంకొకటి ఉండదు. కమ్యూనిస్టులంటే దైవదూషకులనే అర్థం ఇందులో స్ఫురిస్తున్నది. కమ్యూనిస్టు అయినంత మాత్రాన నాస్తికుడై ఉండాలనేదేమీ లేదు. నాస్తికుడైనంత మాత్రాన దైవదూషణ చేస్తారనీ, అవమానిస్తారనీ అర్థం కాదు. వారి వారి విశ్వాసాలకు, నమ్మకాలకు కట్టుబడి ఉంటారంతే! దైవదూషణ వంటి పనులకు విశ్వాసాలతో సంబంధం లేదు. అది వ్యక్తిగతం. పూజా పునస్కారాలు చేసే సంప్రదాయ కుటుంబాల్లో పుట్టిన నిగమశర్మ వంటి వారి కథలు కూడా మనం విన్నాము.

ఇప్పుడాయన సనాతన ధర్మ ప్రభావానికి లోనైన తర్వాత కుటుంబ కథలో కొంత మార్పు చేశారు. కేవలం ఇరవయ్యేళ్ల వయసులోనే నాన్నగారు కమ్యూనిస్టు భావజాలంతో ఉండేవారని, ఆ తర్వాత రామభక్తుడిగా మారారని పిఠాపురం సభలో పవన్ చెప్పారు. తన చిన్నతనం నుంచే ఇంట్లో రామనామ జపం వినిపించేదని ఆయన అన్నారు. తన సనాతనధర్మ నిబద్ధతపై ఎవరూ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన అవసరం లేదనీ, ఈ దేశం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమేనని మరోసారి ఆవేశం ప్రదర్శించారు. ఇదంతా ఎందుకంటే, తాను చిన్నతనం నుంచీ సిద్ధాంత నిబద్ధతతోనే ఉన్నాననీ, ఆ సిద్ధాంతం సనాతన ధర్మమేననీ ఇప్పుడాయన సవరణ చేయదలుచుకున్నారు.

చేగువేరా కమ్యూనిస్టని కాదు... మంచి వైద్యుడూ, విప్లవకారుడైనందువల్ల అభిమానించారు. మరి శ్రీశ్రీ, దాశరథి, శేషేంద్ర వంటి వారి సంగతేంది? అవకాశం దొరికిన ప్రతిసారీ వారి కవితా పంక్తుల్ని వల్లెవేయడం పవన్‌కు అలవాటు. వారు సనాతనవాదులా? సామ్యవాదులా? పిఠాపురం సభలో కూడా దాశరథినీ, శ్రీశ్రీని ఆయన తలచుకున్నారు. "ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో, ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో..." అనే దాశరథి గేయం సామ్యవాద గీతమా? సనాతనవాద గీతమా?. ప్రసంగాన్ని ముగిస్తూ శ్రీశ్రీ మహాప్రస్థానంలోని 'అవతారం' కవితను ఆసాంతం చదివి వినిపించారు. "యముని మహిషపు లోహ ఘంటలు మబ్బుచాటున ఖణేల్‌మన్నాయి / నరకలోకపు జాగిలమ్ములు / గొలుసు త్రెంచుకు ఉరికి పడ్డాయి / ఉదయ సూర్యుని సప్త హయములు / నురుగులెత్తే పరుగు పెట్టేయి / కనకదుర్గా చండసింహం జూలు దులిపీ, ఆవులించింది..." ... ఇలా పురాణ ప్రతీకలతో సాగిపోతుందా కవిత.

> ఇప్పుడు పవన్ కల్యాణ్ అధికారంలో భాగస్వామి. ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు. కనుక ఎన్నికల హామీల అమలు గురించో, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార మార్గాల గురించో మాట్లాడుతారని జనం ఆశించడం సహజం. కానీ, అటువంటి ఆశలకు ఆయన అవకాశం ఇవ్వలేదు. కాలువల కింద కూడా ఎండిపోతున్న పంటల గురించి ఆయన మాట్లాడలేదు. చెమటోడ్చి తెచ్చిన పంటలకు పడిపోతున్న ధరల గురించీ ఆయన మాట్లాడలేదు. అవసరమైన ఔషధాలతో, అందుబాటులో వైద్యులతో తొమ్మిది నెలల కిందటి దాకా ధైర్యం నింపిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇప్పుడు వెలవెలబోతున్న వైనం కూడా ఆయన ప్రసంగంలో చోటు చేసుకోలేదు.
>
> అధోముఖయానం చేస్తున్న జీఎస్టీ వసూళ్ల సాక్షిగా ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం గురించిన ప్రస్తావనే రాలేదు. పేద, మధ్యతరగతి వర్గాల్లో ఆత్మవిశ్వాసం నింపిన విద్యా విప్లవానికి ఎందుకు కళ్లెం వేశారన్న దానిపై వివరణే వినిపించ లేదు. డొక్కా సీతమ్మ పేరు పెట్టి ఇంటర్ విద్యార్థుల కోసం ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకం నెల తిరక్కుండానే పరమ నాసిరకంగా ఎందుకు దిగజారిందో ఆయన చెప్పలేదు.

ఇంతకాలం ఈ ప్రతీకలన్నీ ప్రభవించబోయే విప్లవానికి సూచికలుగా భావించారంతా! మరి సనాతన ధర్మ పరిరక్షణా యాత్రికునికి ఈ కమ్యూనిస్టు విప్లవ ప్రతీకలెందుకో! ఆయన విడమరిచి చెబితే తప్ప సామాన్యులకు అర్థం కాదు. ఆయన ప్రసంగంలో ఒకపక్క చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తుతూనే మోదీ తరఫున వకాల్తా పుచ్చుకొని తమిళనాడులోని డీఎమ్‌కే పార్టీ మీద దాడి చేశారు. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేయబోతున్నదనీ, దీనిపై ఐక్యంగా పోరాడదామనీ ఆ పార్టీ వాళ్లు వాళ్ల ప్రయత్నమేదో చేస్తున్నారు. బీజేపీ దీర్ఘకాల లక్ష్యాలకు ఇటువంటి చిన్నచిన్న ప్రయత్నాలు కూడా విఘాతం కలిగిస్తాయని బీజేపీ పెద్దలకు బాగా తెలుసు. వారి మనసెరిగి పవన్ ప్రసంగించారు. అప్పుడెప్పుడో చిన్నతనంలో ఆయన మద్రాస్‌లో ఉన్నప్పుడు తమిళుడెవరో 'గోల్టీ' అని గిచ్చాడట! దాన్నిప్పుడు గుర్తుచేసుకున్నారు.

పవన్ సభ ప్రారంభానికి ముందే చంద్రబాబు, లోకేశ్‌బాబు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. యెల్లో మీడియా ఆ సభకు పూర్ణకుంభ స్వాగతం పలికింది. ఈ మూడు పార్టీల కూటమిలో లుకలుకలున్నాయనీ, విడిపోతాయనీ, బీజేపీ – జనసేన కలిసి ఒక కూటమిగా ఏర్పడుతాయనీ ఊహిస్తున్న విశ్లేషకులు ఇప్పటికైనా తమ ఆలోచనల్ని సరిదిద్దుకోవాలి. విభేదాలేమీ లేవు. ముగ్గురూ కలిసి పనిచేస్తారు. బీజేపీ-సంఘ్ పరివార్‌ల దీర్ఘకాలిక లక్ష్యానికి సహకరిస్తూనే మిగిలిన ఇద్దరు ఎవరి ఇంటిని వాళ్లు చక్కదిద్దుకుంటారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం లోకేశ్‌ను సీఎం కుర్చీలో త్వరగా కూర్చోబెట్టాలనే ఒత్తిడి బాబు మీద పెరుగుతున్నది. ఆ పరిస్థితుల్లో డిప్యూటీగా ఉండటం పవన్‌కు ఇబ్బంది కనుక ఆయన కేంద్రానికి వెళతారనీ, వచ్చే ఎన్నికల నాటికి దక్షిణాదిన బీజేపీ తరఫున సనాతన ప్రచారానికి ఆయనను నియోగిస్తారని తెలుస్తున్నది. పవన్ స్థానంలో నాగబాబు రాష్ట్ర కేబినెట్‌లోకి రావచ్చు. జనసేన కార్యకర్తలు ఇంతకంటే పెద్ద దృశ్యాన్ని ఆశిస్తే నిరాశ తప్పకపోవచ్చు.

vardhelli1959@gmail.com

ప్రభుత్వం చేయాల్సింది కొండంత!

అభిప్రాయం



దినేశ్ సి. శర్మ

ప్రధాని మోదీ ఆ మధ్య తన 'మన్ కీ బాత్' ప్రసారంలో ఒక ప్రధానమైన ప్రజారోగ్య సవాలు గురించి నొక్కి చెప్పారు. అదేమిటంటే... అధిక బరువు లేదా ఊబకాయం సమస్య. ఒక వ్యక్తి నుండి మరొకరికి నేరుగా సంక్రమించని మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వ్యాధులు (ఎన్‌సీడీలు) పెరగడానికి దారితీసే కారకాల్లో ఊబకాయం ఒకటి. వంట నూనె వినియోగాన్ని తగ్గించడం వంటి చిన్న ప్రయత్నాలతో దేశం ఊబకాయం సవాలును పరిష్కరించగలదని ప్రధాని అన్నారు. 'ప్రతి నెలా 10 శాతం తక్కువ నూనె వాడితే సరి. అది ఊబకాయాన్ని తగ్గించే ముందడుగు అవుతుంది' అన్నారాయన.

ఆహారంలో తక్కువ నూనె వాడటం, ఊబకాయాన్ని ఎదుర్కోవడం కుటుంబం పట్ల బాధ్యత కూడా అని ప్రధాని అన్నారు. ప్రధాని ఇచ్చిన ప్రజారోగ్య సందేశం ముఖ్యమైనదే. కానీ అది మొత్తం కథలో ఒక భాగం మాత్రమే. కొవ్వుల అధిక వినియోగం, ప్రధానంగా ఆహారంలో ఉండే ఒక రకమైన ట్రాన్స్ ఫ్యాట్స్ లేదా అసంతృప్త కొవ్వు (ట్రాన్స్ ఫ్యాటీ యాసిడ్) లేదా అనేది ఎన్‌సీడీ వ్యాధులకు కారణమయ్యే వాటిల్లో ఒకటి మాత్రమే. అసంతృప్త కొవ్వు మూలాలలో పాల ఉత్పత్తులు, నెయ్యి, మాంసం, వనస్పతి ఉన్నాయి. ఇతర కొవ్వులను ఎక్కువగా తీసుకోవడం కూడా హానికరం. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ జారీ చేసిన ఆహార మార్గ దర్శకాల ప్రకారం... కొబ్బరి నూనె, నెయ్యి, పామోలిన్ నూనెలో సంతృప్త కొవ్వుల నిష్పత్తి అత్యధికంగా ఉంటుంది. ప్రధాని సూచించినట్లుగా, వంట చేసేటప్పుడు లేదా డ్రెస్సింగ్ చేసేటప్పుడు ఆహారానికి జోడించే కొవ్వుల వినియోగాన్ని తగ్గించడం అనేది మనం వేసే ముందడుగులో సగం మాత్రమే. ప్రాసెస్ చేసిన ఆహారం, ఫాస్ట్ ఫుడ్, వేయించిన స్నాక్స్, కుకీలు వంటి వాటిద్వారా మనం అసంతృప్త కొవ్వులను తీసుకుంటాం. సంతృప్త, అసంతృప్త కొవ్వుల వనరులు కూడా మారుతూ ఉంటాయి. అలాగే వంట నూనెలూ ఉంటాయి. ప్రజారోగ్యంపై ఆరోగ్యకర ప్రభావం కోసం... నూనెలు మాత్రమే కాక నెయ్యి, వనస్పతి అలాగే అల్ట్రా-ప్రాసెస్డ్ ప్యాకేజ్డ్ ఫుడ్, పాల ఉత్పత్తులు తీసుకోవడాన్ని తగ్గించడం అవసరం. అనారోగ్యకరమైన ఆహారం, కూర్చుని పనిచేసే జీవనశైలికి వ్యతిరేకంగా కూడా ఊబకాయంపై జాతీయ ప్రచారాన్ని విస్తరించాలి.

వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించుకోవాలని కోరడం ద్వారా ఊబకాయ మహమ్మారిని ఎదుర్కోవాల్సిన బాధ్యతను వ్యక్తులపై పెట్టారు ప్రధాని. ఆరోగ్యకర ఆహారపుటలవాట్లను అవలంబించడం అనేది వ్యక్తుల బాధ్యతతోపాటు, సామాజిక బాధ్యత కూడా అంటూ దశాబ్దాలుగా సాగించిన ప్రచారానికి ఇది విరుద్ధం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలు తినడానికి వీలు కల్పించే, ప్రోత్సహించే వాతావరణపరికల్పనకు తగిన విధానాలను రూపొందించడం ప్రభుత్వ విధి.



ఊబకాయాన్ని పరిష్కరించడానికి వ్యక్తిగతమైన చర్యలతో పాటు ఇతర చర్యలూ అవసరం. ఉదాహరణకు, భారతదేశం వంటనూనె దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉంది. పైగా ప్రభుత్వ విధానాలు పామాయిల్ దిగుమతిని ప్రోత్సహిస్తాయి. దిగుమతి చేసుకున్న అన్ని నూనెలలో ఇది దాదాపు 60 శాతం ఉంటుంది. ప్రాసెస్డ్ ఫుడ్ పరిశ్రమకు పామాయిల్ చాలా ఇష్టమైనది. అయినా అనేక అధ్యయనాలు పామాయిల్ వినియోగంతో హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపాయి. వంట నూనెల ఉత్పత్తినీ, దిగుమతినీ నియంత్రించే ప్రభుత్వ విధానాలను ప్రజలకు తక్కువ హానికరమైన వంట నూనెలను అందించే విధంగా రూపొందించాలి.

గత కొన్ని దశాబ్దాలుగా... పెరుగుతున్న ఆదాయాలు, పట్టణీకరణ, ఆహార ఉత్పత్తుల ప్రపంచీకరణ పెరగడంతో దేశంలో ఆహారపుటలవాట్లు మారాయి. ఫలితంగా ఉప్పు, చక్కెర, కొవ్వులు అధికంగా ఉండే అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాలు ప్రజాదరణ పొందాయి. ఈ ఉత్పత్తులు ఆహార పర్యావరణాన్ని మార్చాయి. ప్రతి చోటా జంక్ ఫుడ్ అందుబాటులో ఉంది. ఈ మార్పుకు ప్రభుత్వ విధానాలు పెద్ద ఎత్తున దోహదపడ్డాయి. ప్రభుత్వాలు చిప్స్, కోలాస్, కుకీలు, నమ్‌కీన్ వంటి వాటిని తయారు చేసే, ప్రాసెస్ చేసే ఫుడ్ కంపెనీలకు సబ్సిడీలను అందిస్తాయి.

ఆరోగ్యకరమైన ఎంపిక కాబట్టి తాజా పండ్లు, కూరగాయలు అందుబాటులో ఉండేలా ప్రోత్సహించాలి. కానీ మన విధానాలు పండ్లు, కూరగాయలను ప్రాసెస్ చేసే కంపెనీలను ప్రోత్సహిస్తాయి. మరోవైపు, జంక్ ఫుడ్‌ను నియంత్రించే ఏ చర్యనైనా ఆహార నియంత్రణ సంస్థలు, పరిశ్రమ ఆదేశం మేరకు నిలిపివేస్తున్నాయి. హాస్యాస్పదం ఏమిటంటే, ఆహార భద్రతా రెగ్యులేటర్, సుప్రసిద్ధ జంక్ ఫుడ్ కంపెనీల భాగస్వామ్యంతో కొన్ని సంవత్సరాలుగా 'ఈట్ రైట్' ప్రచారాన్ని నిర్వహిస్తోంది. జంక్ ఫుడ్‌పై కఠిన నియంత్రణకు మద్దతు పొందే బదులుగా, ఆహార భద్రతా నియంత్రణ సంస్థ అది నియంత్రించాల్సిన వాటితో భాగస్వామ్యం కుదుర్చుకుంది. 2022 నాటికి ఆహార గొలుసు నుండి పారిశ్రామికంగా ఉత్పత్తి చేయబడిన అసంతృప్త కొవ్వులను తొలగించడానికి 'ఇండియా@75: ఫ్రీడమ్ ఫ్రమ్ ట్రాన్స్ ఫ్యాట్స్' కార్యక్రమాన్ని ఆహార నియంత్రణ సంస్థ 2019లో ప్రారంభించింది. కానీ జంక్ ఫుడ్ పరిశ్రమ నుండి తీవ్ర వ్యతిరేకత వల్ల ఈ లక్ష్యసాధన సాధ్యం కాలేదు.

'కూర్చుని పనిచేసే' జీవనశైలి, అసలు వ్యాయామం చేసే అవకాశం లేనిస్థితులు కూడా గమనార్హం. శారీరకంగా చురుకుగా ఉండటం, వ్యాయామం చేయడం వ్యక్తిగత ఎంపికే అయినా, సమాజ స్థాయిలో శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించే చురుకైన వాతావరణాన్ని సృష్టించడంలో ప్రభుత్వ విధానాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఉదాహరణకు, నడక, వ్యాయామానికి అనుకూలమైన బహిరంగ ప్రదేశాలను అందించడం; ప్రజా రవాణా, పాదచారులకు ప్రత్యేక కాలిబాటలు, సైక్లింగ్ మార్గాలు ఏర్పాటు ప్రజారోగ్యాన్ని కాపాడడంలో కీలకం. వంటనూనె వినియోగాన్ని తగ్గించడం వంటి వ్యక్తిగత చర్యలు ఊబకాయపు చక్రంలో ఒక చిన్న భాగం మాత్రమే. ప్రభుత్వాలు చేయాల్సింది చాలా ఉంది.

వ్యాసకర్త సైన్స్ వ్యవహారాల వ్యాఖ్యాత

శిక్ష తప్పదు!

జ్యోతిర్మయం

ఇది రామాయణ ఇతిహాసానికి చెందిన సంఘటన. ఒక రోజు శ్రీరామచంద్రుడు సభలో కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో ఓ శునకం సభకు వచ్చింది. దాని తలకు గాయమై రక్తం కారుతోంది. సభలో ఉన్నవారందరూ దాని వంక ఆశ్చర్యంగా చూస్తున్నారు. రాముడు కూడా దానిని చూశాడు. 'నువ్విక్కడికి ఏ పని మీద వచ్చావు... ఏం జరిగింది. జరిగిందేదైనా సరే ధైర్యంగా చెప్పుకో. భయపడకు' అన్నాడు రాముడు.

అప్పుడా శునకం... 'అయ్యా, నేను వీధిలో వెళ్తున్నాను. మార్గ మధ్యంలో వేదశాస్త్రాలు చదువుకున్న ఒక పెద్దాయన ఎదురొచ్చాడు. ఆయన ఏ కారణమూ లేకుండా తన దగ్గరున్న కర్రతో నా తల మీద దెబ్బ వేశాడు. అందువల్ల రక్తం కారుతోంది. ఈ వ్యవహారంలో తగిన తీర్పు ఇవ్వండి' అంది శునకం. రాముడు వెంటనే తన భటులను పంపించి నిందితుణ్ణి రప్పించాడు. అతడు 'నేను వీధిలో వస్తుండగా ఈ కుక్క నాకు అడ్డొచ్చింది. అందువల్ల దానిని కొట్టాను. శాస్త్రాలు చదవుకున్నా... నేను హద్దు మీరాను. నాకు మీరు ఏ శిక్ష వేసినా సరే' అన్నాడు. రాముడు శునకాన్నే అడిగాడు ఏ శిక్ష విధించాలని. అందుకు ఆ శునకం 'ఆయనను ఏదైనా గుడికి ధర్మకర్తగా నియమించండి. అదే ఆయనకు సరైన శిక్ష' అన్నది. అది విన్న రాముడు చిరునవ్వు నవ్వాడు. కానీ అక్కడున్న వారికి ఆశ్చర్యమేసింది. 'అదెలాగూ... తప్పు చేసిన వారికి శిక్ష విధించడమే సముచితం. కానీ అది మానేసి అతనికి ధర్మకర్త హోదా కల్పించమని కోరడమేమిటీ' అని వారు ఆ శునకాన్నే అడిగారు. దానికి శునకం... 'నేను క్రితం జన్మలో ఓ ఆలయానికి ధర్మకర్తగా ఉండేదానిని. ఎంతో అప్రమత్తంగానే నా విధులను నిర్వహిస్తూ వచ్చాను. అయినా మానవ సహజమైన కక్కుర్తితో ఆలయ సంపదను తప్పుగా అనుభవించాను. ఫలితంగా మరుజన్మలో కుక్కగా జన్మించి అవస్థలు పడుతున్నాను. ఇవే అవస్థలు ఈ పెద్దమనిషి కూడా పడాలి' అని పలికింది. హిందువుల్లో తప్పు చేసినవారు ఈ జన్మలో కాకపోయినా మరో జన్మలోనైనా శిక్ష అనుభవించాల్సిందే అనే నమ్మకం ఉంది. ప్రజల్లో నైతికత, ధర్మం వర్ధిల్లడానికి ఇటువంటి నమ్మకాలు దోహదం చేస్తాయి. సమాజానికి ఈ తరహా నీతి బోధనలు చేయడమే పురాణ కథల లక్ష్యం. – యామిజాల జగదీశ్



కుంభమేళాకు రైళ్లలో 4.24 కోట్ల మంది

పండుగలు, వేసవి కాలం లాంటి సందర్భాల్లో మనదేశంలో ప్రయాణాలు ఎక్కువగా జరుగుతాయి. రైల్వే స్టేషన్లు జనాలతో కిక్కిరిసిపోతాయి. ఆ రద్దీని తట్టుకునేందుకు ప్రత్యేక రైళ్లు నడుపుతుంది రైల్వే శాఖ. కొత్త రైళ్ల కోసం 2024–25 ఫిబ్రవరి నాటికి 6,485 కొత్త కోచ్‌లను తయారుచేసింది.

13,523 2024లో వేసవి, హోలీ రద్దీని తట్టుకునేందుకు ప్రత్యేక రైళ్లు తిరిగిన ట్రిప్పులు

7,990 2024 అక్టోబరు 1 నుంచి నవంబర్ 30 వరకు దసరా, దీపావళి వంటి పండుగల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక ట్రిప్పులు

1.8 కోట్ల మంది దసరా, దీపావళి సమయంలో రైళ్లలో ప్రయాణించినవారు

17,300 ఇటీవల ముగిసిన మహా కుంభమేళాకు రైల్వే శాఖ నడిపిన ప్రత్యేక రైళ్లు

4.24 కోట్ల మంది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 28 వరకు జరిగిన కుంభమేళా సందర్భంగా ప్రయాణించినవారు

ఆధారం: లోక్‌సభలో రైల్వే శాఖ

పుట్టెడు దుఃఖంలో ఉన్న పేదలపై భారం

- ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి మృతదేహాల తరలింపునకు వాహనాలు కరువు
- సగం మృతదేహాలను మాత్రమే ఇళ్లకు చేరుస్తున్న మహాప్రస్థానం వాహనాలు
- మిగిలినవాటికి ప్రైవేటు అంబులెన్స్‌లే దిక్కు.. రూ.వేలల్లో డ్రైవర్ల డిమాండ్
- 53 వాహనాలు సమకూరుస్తున్నామని ప్రకటనలతో కూటమి ప్రభుత్వం కాలక్షేపం



సాక్షి, అమరావతి: ఓవైపు అయినవారిని కోల్పోయి పుట్టెడు దుఃఖం.. మరోవైపు వారి మృతదేహాల తరలింపు భారం.. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకుల దోపిడీ..! ప్రమాదాలకు గురై, అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మరణించినవారి మృతదేహాలను స్వస్థలాలకు చేర్చేందుకు బంధువులు ఎదుర్కొంటున్న కష్టం ఇది. ప్రైవేట్ ఆసుపత్రులలో సొంత డబ్బుతో చికిత్స చేయించుకునే స్థోమత లేకనే ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న పేద, మధ్య తరగతికి ఇబ్బందులు పరిపాటిగా మారాయి. మందులు, వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు మృతదేహాలను తరలించే వాహనాల కొరత కూడా అధికంగా ఉంటోంది. ప్రైవేటు అంబులెన్స్ వారు చెప్పిందే ధర..! వారు అడిగినంత ఇవ్వకపోయినా, మరో వాహనంలో తరలింపునకు ప్రయత్నించినా అడ్డుకుని గొడవకు సైతం దిగుతున్నారు. వీరితో ఆసుపత్రుల్లోని కొందరు సిబ్బంది సైతం చేతులు కలిపి.. వార్డుల్లో ఎవరైనా మృతి చెందితే సమాచారం చేరవేస్తున్నారు. అంబులెన్స్ నిర్వాహకులు నేరుగా వార్డుల్లోకి వెళ్లి మరీ బాధిత కుటుంబ సభ్యులతో బేరాలకు దిగుతున్నారు.

- జిల్లాల పరిధిలో అయితే 50 కిలోమీటర్ల వరకు అంబులెన్స్ అద్దె, డ్రైవర్ బేటా/బత్తా, డీజిల్‌కు రూ.5 వేల నుంచి రూ.7 వేల మేర వసూలు చేస్తున్నారు. 50 నుంచి 100 కి.మీ.కు రూ.10 వేలపైన, వంద కి.మీ. పైగా ఉన్న దూరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు అంతకంటే ఎక్కువ కూడా ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు.

సగం మంది సొంత ఖర్చుతోనే..

పెద్ద ఆసుపత్రుల్లో నమోదైన మరణాల్లో మృతదేహాలను ఉచితంగా స్వస్థలాలకు చేరవేసే మహాప్రస్థానం వాహనాలకు తీవ్ర కొరత ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 17 చోట్ల 54 వాహనాలు ఉండగా సగం మృతదేహాలను మాత్రమే ప్రభుత్వం ఉచితంగా తరలిస్తోంది. మిగిలిన సగంవాటికి ప్రైవేట్ అంబులెన్స్‌లను ఆశ్రయించక తప్పడం లేదు. గత ఏడాది ఏప్రిల్–ఆగస్టు మధ్య 17 చోట్ల 25,094 మరణాలు నమోదవగా, 13 వేల కేసుల్లోనే మహాప్రస్థానం వాహనాల్లో మృతదేహాలను తరలించారు. నంద్యాల, విజయనగరం, మచిలీపట్నంలో కేవలం ఒక్కటి చొప్పునే వాహనాలు ఉన్నాయి. వైఎస్సార్, ఏలూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, నెల్లూరుల్లో రెండేసి వాహనాలే ఉన్నాయి. అప్పటికే ఇవి మృతదేహాల తరలింపునకు వెళ్తే తిరిగి వచ్చేదాక ఎదురుచూడాల్సి ఉంటోంది.

- గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, కర్నూలు, కాకినాడ వంటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో రోజువారీ మరణాలకు, అందుబాటులో ఉన్న వాహనాలకు పొంతన లేదు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్యే మృతదేహాలను తరలించాలనే నిబంధనలున్నాయి. రాత్రివేళ చనిపోతే.. మృతదేహాలను మార్చురీల్లో భద్రపరిచి, మరుసటి ఉదయం తరలించాల్సి వస్తోంది. అప్పటికి మృతుల సంఖ్య పెరిగి వాహనాలకు తీవ్ర డిమాండ్ నెలకొంటోంది.

ప్రకటనలతో కాలక్షేపం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ప్రభుత్వ ఆసుపత్రులకు మహాప్రస్థానం వాహనాలు సమకూరుస్తున్నామంటూ పలుసార్లు మంత్రి సత్యకుమార్ ప్రకటనలు చేశారు. డిసెంబరులో 53 వాహనాలకు సీఎం ఆమోదం తెలిపారని వెల్లడించారు. కానీ, అంబులెన్స్‌లు అందుబాటులోకి వచ్చిన దాఖలాలు లేవు. కాగా, ప్రభుత్వం సమకూరుస్తామని చెబుతున్న వాహనాలు ప్రస్తుత అవసరాలకు సరిపోవని, ఇంకా పెంచాలని ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు కోరుతున్నారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మహాప్రస్థానం వాహనాలు

ప్రాంతం	ప్రస్తుతం	వైద్య శాఖ సిఫార్సు చేసినవి
విజయవాడ	5	2
గుంటూరు	7	7
ఏలూరు	2	3
ఒంగోలు	2	2
మచిలీపట్నం	1	2
కాకినాడ	7	3
రాజమండ్రి	2	1
విశాఖ	6	7
విజయనగరం	1	0
శ్రీకాకుళం	2	2
అనంతపురం	3	3
కర్నూలు	6	10
కడప	2	3
నంద్యాల	1	1
కుప్పం	1	0
తిరుపతి	4	6
నెల్లూరు	2	2

జీజీహెచ్‌ల వద్ద ప్రైవేట్ అంబులెన్స్‌లు ఇలా

నగరం	వాహనాలు
విశాఖ (కేజీహెచ్)	65
గుంటూరు	60
కర్నూలు	60
నెల్లూరు	45
ఏలూరు	40
అనంతపురం	40

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



జాతీయ రాహదారి వెంబడి చెత్తను ఎత్తుతున్న పెమ్మసాని

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): పర్యావరణానికి పెను ప్రమాదంగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించడంలో ప్రభుత్వానికి సహకరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రజలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం జరిగే స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కాకాని రోడ్ వై జంక్షన్ వద్ద జరిగిన జాతీయ రహదారి పరిశుభ్రత కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రజారోగ్యానికి కేన్సర్ వంటి వ్యాధుల కారకంగా మారిందని, ప్రజలు, ప్రభుత్వం సంయుక్త కార్యాచరణ ద్వారానే దీనిని అడ్డుకోగలమని చెప్పారు. విద్యార్థులు, అధికారులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి, జాతీయ రహదారి వెంబడి వ్యర్థాలను వారితో కలిసి శుభ్రం చేశారు.

'వివేకా హత్య కేసు'లో సపోర్టు ఇస్తామని ప్రభుత్వం చెప్పింది

సీబీఐ దర్యాప్తులో చాలా లోపాలు: నర్రెడ్డి సునీత

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు విషయంలో సపోర్టు ఇస్తామని ప్రభుత్వం చెప్పినట్లు ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత వెల్లడించారు. నిందితులను, సాక్షులను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. వివేకా వర్ధంతి సందర్భంగా శనివారం వైఎస్సార్ జిల్లా పులివెందులలోని వివేకా సమాధి వద్ద సునీత, రాజశేఖరరెడ్డి దంపతులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీత మీడియాతో మాట్లాడుతూ.. వైఎస్ వివేకా హత్య జరిగి ఆరేళ్లు అవుతోందన్నారు. ఈరోజు నిందితుల్లో ఒకరు తప్ప.. మిగిలిన వాళ్లంతా బయట తిరుగుతున్నారని చెప్పారు. సీబీఐ దర్యాప్తు ఆగిపోయిందని.. ట్రయల్ ఇంకా మొదలు కాలేదన్నారు. నిందితుల కంటే తమ కుటుంబానికి ఎక్కువ శిక్ష పడుతున్నట్లుగా ఉందన్నారు. సీబీఐ మళ్లీ దర్యాప్తు మొదలుపెడుతుందనే నమ్మకంతో ఉన్నామని చెప్పారు. దర్యాప్తులో చాలా లోపాలు జరిగాయన్నారు.

ఈ నెల 19న అగ్రిగోల్డ్ బాధితుల కన్నీటి పాదయాత్ర

అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు

సాక్షి, అమరావతి: ఈ నెల 19న అగ్రిగోల్డ్ బాధితుల కన్నీటి పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విజయవాడలోని రైల్వేస్టేషన్ నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం మీదుగా ధర్నాచౌక్ వరకు పాదయాత్ర నిర్వహించి సభ నిర్వహిస్తామని తెలిపారు. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన 32 లక్షల మంది రూ.6,380కోట్లు డిపాజిట్లు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలైనా అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేలా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ఇప్పటికైనా బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సత్వర న్యాయ పరిష్కారం కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బాలినేనీ.. నీ జల్సాలకేగా ఆస్తులు పోయింది

వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



ఒంగోలు టౌన్: మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జల్సాలు, పేకాటకే ఆస్తులు పోగొట్టుకొన్నారని, రాజకీయాల్లోకి వచ్చి నాన్న సంపాదించిన ఆస్తులను అమ్ముకున్నానంటూ అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు చెప్పారు. రవిబాబు శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అధికారాన్ని అడ్డుపెట్టుకొని బాలినేని వేల కోట్ల రూపాయలు పోగేసుకున్నారని చెప్పారు. ఆయన వియ్యంకుడికి ఆస్తులు ఎక్కడ నుంచి వచ్చాయో చెప్పాలన్నారు. ఆయన బాలినేని బినామీ కాదా అని ప్రశ్నించారు. బాలినేని చేసిన రాజకీయాలు, జల్సాలకు ఎన్నిసార్లు వారి నాన్న ఆస్తులను అమ్ముకోవాలో చెప్పాలన్నారు. విలాసాల కోసం ప్రత్యేక విమానంలో రష్యా వెళ్లి పేకాట ఆడే శక్తి ఆయన నాన్న ఆస్తితోనే వచ్చిందా అని నిలదీశారు. శ్రీలంక, గోవా క్లబ్బుల్లో ఆడిన కోట్ల రూపాయల పేకాటలకు ఆయన నాన్న ఆస్తి ఒక్క రోజుకు సరిపోతుందా అని ప్రశ్నించారు. సౌమ్యుడినని పైకి చెప్పుకొనే ఆయన.. ఎవరి జోలికీ రాని బ్రాహ్మణులు, వైశ్యుల మాన ప్రాణాలను, ఆస్తులను దెబ్బతీశారని, ఆ శాపం వల్లే ఇవాళ ఆయనకీ దుస్థితి వచ్చిందని చెప్పారు. ఆయన హయాంలో జరిగిన భూ కబ్జాల మీద అప్పటి ప్రభుత్వం విచారణ కోసం సిట్ వేస్తే అడ్డుకోవడానికి ప్రయత్నించారని, ఆయన అవినీతి మీద ఎమ్మెల్యే విచారణ కోరుతున్నారన్న భయంతోనే పార్టీ మారారని తెలిపారు. 2014 నుంచి 2019 వరకు బాలినేని టీడీపీకి కోవర్టుగా పనిచేసి, జిల్లాలో ఎంతమంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను ఆ పార్టీలోకి పంపించారో ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. జగనన్న కోసం మంత్రి పదవిని త్యాగం చేశారనడం అబద్ధమేనన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించిన తరువాత అప్పటి మంత్రులు కొండా సురేఖ, పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాత్రమే రాజీనామా చేశారని తెలిపారు. రోశయ్య సీఎంగా ఉన్నంత కాలం బాలినేని మంత్రి పదవిని అంటిపెట్టుకొని ఉన్నారని, ఆయన సమర్థత మీద నమ్మకం లేక కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్లోకి తీసుకోలేదని వివరించారు. అప్పటికీ 2 నెలలు మంత్రి పదవి కోసం పడిగాపులు కాసి, రాదని తెలిసిన తరువాతే రాజీనామా చేశారని చెప్పారు. వైఎస్ జగన్ పాదయాత్రలో కూడా ముఖం చాటేసి, ఇవ్వాళ త్యాగం చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జగన్ గెలుపోటములను నిర్ణయించే శక్తి, స్థాయి ఆయనకు లేవని చెప్పారు. వైవీ సుబ్బారెడ్డి లేకుండా బాలినేని వైఎస్సార్‌కు బంధువు ఎలా అవుతారో చెప్పాలన్నారు. ఓడిపోయిన ప్రతిసారీ పారిపోయే బాలినేని లీడరే కాదని తేల్చి చెప్పారు.

మహిళామణి.. పోషకలేమి



- సమతుల ఆహారం తీసుకోని మహిళలు
- పోషకాహారమే వండుతున్నా తినడంలో మాత్రం వెనుకబాటు
- వేధిస్తున్న ఆరోగ్య సమస్యలు
- 'ఎన్ఎస్ఐ' పరిశీలనలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఇంటిల్లిపాదికీ మంచి ఆహారం వండిపెట్టే ఇల్లాలు.. తను మాత్రం పోషకాహారం తీసుకోవడంలో వెనుకబడిపోతోంది. భర్త, పిల్లలకు రుచికరమైన, బలమైన ఆహారం వండిపెట్టే ఆమె..తాను తినడంలో కాస్త వెనక్కు తగ్గినట్టు తెలుస్తోంది. ఎన్ఎస్ఐ (న్యూట్రిషన్ సొసైటీ ఆఫ్ ఇండియా) ప్రతినిధులు జిల్లాలో తాజాగా చేసిన పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. కేవలం 26 శాతం మహిళలే సరిపడా పౌష్టికాహారం తీసుకుంటున్నట్టు తేలింది. ఏరోజు ఏ వంట చేయాలో అంతా తన చేతిలోనే ఉన్నా తినేటప్పటికి రకరకాల కారణాలతో శరీరానికి చేరాల్సిన సమతుల ఆహారం చేరడం లేదు. అందుకే ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారిలో పురుషుల కంటే ఎక్కువమంది మహిళలే ఉన్నారని తేలింది. ఉమ్మడి జిల్లాలో పౌష్టికాహారం తీసుకోక చాలామంది మహిళలు రక్తహీనత బారిన పడుతున్నారు.

కూరగాయలు మాత్రం..

రోజూ కూరగాయలు తీసుకునే వాళ్లలో మహిళల సంఖ్య పురుషుల కంటే కాస్త ఎక్కువగా ఉంది. బీన్స్, చిక్కుళ్లు, క్యాబేజీ, క్యారెట్ వంటి కూరగాయలు రోజూ తీసుకునే మహిళలు 24.6 శాతం మంది ఉన్నారు. పురుషుల విషయానికి వస్తే 19.6 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అదే చికెన్ లేదా మటన్ రోజూ తినేవారిలో పురుషులు 1.4 శాతం ఉండగా, మహిళల పరంగా కేవలం 0.5 శాతం ఉంది. వారానికోసారి మాంసం తినే వారి పరంగా మహిళలు 64.2 శాతం ఉండగా, పురుషులు 71 శాతం ఉన్నట్టు తేలింది. కోడిగుడ్లు తినే విషయంలో మహిళలే కాస్త ముందంజలో ఉన్నారు. రోజూ గుడ్లు తినేవారిలో 5.4 శాతం మహిళలు, 3.5 శాతం పురుషులు ఉన్నారు. మొత్తం మీద రకరకాల పోషకాహారం తినేవారిలో పురుషులే ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

వేధిస్తున్న రక్తహీనత..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు 56 శాతం ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. అవగాహన లేక సమతుల ఆహారం తీసుకోలేక పోతున్నారు. రుతుక్రమం, గర్భం దాల్చడం వంటి కారణాల పరంగా ఎక్కువ పోషకాహారం తీసుకోవాల్సి ఉన్నా, గ్రామీణ ప్రాంత మహిళల్లో అంత అవగాహన లేదు. ఏ కూరగాయల్లో ఏముంటుంది, ఏ ఆకుకూరలు ఎప్పుడు తినాలి వంటి విషయం తెలీక రక్తహీనత బారిన పడుతున్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి



ప్రస్తుత రోజుల్లో గర్భం దాల్చిన వారు తక్కువ బరువుతో ఉంటున్నారు. గర్భ నిర్ధారణ అయ్యాక మొదటి మూడు నెలలు వాంతులతో తక్కువ ఆహారం తీసుకుంటుంటారు. ఇటువంటి సమయంలో తక్కువ మోతాదులోనే పౌష్టికాహారం తీసుకోవాలి. ఆకుకూరలు, బఠానీ, చిక్కి, పాలు, పెరుగు, తక్కువ మోతాదులో నాన్‌వెజ్ తినాలి. గర్భధారణ సమయంలో 10 కేజీల వరకు బరువు పెరిగేలా ప్రణాళిక చేసుకోవాలి.

– డాక్టర్ షంషాద్ బేగం, గైనకాలజిస్టు

వివిధ ఆహార పదార్థాలు తీసుకునే వారి శాతమిలా..

ఆహారం	మహిళలు (రోజువారీ)	మహిళలు (వారానికి)	పురుషులు (రోజువారీ)	పురుషులు (వారానికి)
కూరగాయలు	24.6	68.9	19.6	74.3
ఆకుకూరలు	11.9	64.3	12.9	75.7
పండ్లు	9.3	37.8	8.2	53.1
గుడ్లు	5.4	68.4	3.5	76.4
చేపలు	1.5	38.5	1.5	48.8
చికెన్/మటన్	0.5	64.2	1.4	71.0
చికెన్/మటన్/చేపలు	1.7	69.5	2.4	75.8
వేపుడు ఆహారం	3.9	29.4	2.5	36.1



ఓఎస్‌ఏ మిషన్ పెట్టుకుని నిద్రపోతున్న గురక సమస్య ఉన్న వ్యక్తి

నిద్ర కరువైతే అనారోగ్యం..!

- పెరుగుతున్న నిద్రలేమి సమస్య
- నిద్రలేమితో బీపీ, సుగర్, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ఆస్కారం
- మొబైల్, టీవీలు అతిగా చూడడం వల్ల సమస్య

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవనశైలిలో మార్పులు, అధికంగా మొబైల్ వాడడం, టీవీ ఎక్కువగా చూడడం వల్ల అధికశాతం మంది నిద్రలేమి బారిన పడుతున్నారు. ఎక్కువసేపు ఒకే చోట కూర్చుని పనిచేయడం, జంక్‌ఫుడ్స్ ఎక్కువగా తినడం, రాత్రివేళ ఆలస్యంగా నిద్రపోవడం, రాత్రి షిఫ్టుల్లో విధులు నిర్వహించడం వల్ల తగినంత నిద్ర ఉండదు. దీని వల్ల వారు బీపీ, సుగర్, ఊబకాయం, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, థైరాయిడ్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. చాలా మంది నిద్ర లేకపోతే ఏంజరుగుతుంది? అని తేలికగా తీసుకుంటారు. అర్ధరాత్రి వరకు చాలా మంది నిద్రపోరు. దీని వల్ల అనేక సమస్యల బారిన పడతారు. నిద్రలేమి వల్ల ఓఎస్‌ఏ (అబ్స్‌ట్రక్టివ్ స్లీప్ అప్నియా) అనే సమస్యకు గురవుతారు. ఈ సమస్య ఉన్న వ్యక్తి శ్వాస తీసుకోవడం పదేపదే ఆగిపోవడం, ఊపిరి లోతుగా తీసుకోవడం (అల్పశ్వాస) జరుగుతుంది. అదే విధంగా పెద్దగా గురక పెట్టడం, శ్వాస పునఃప్రారంభం అయినప్పుడు ఉక్కిరిబిక్కిరి అయి వింత శబ్దాలు రావడం, పగటి సమయంలో మధ్యమధ్య కునుకుపాట్లు పడుతూ ఉండడం, అలసటగాను, మత్తుగాను ఉంటుంది. మద్యం తాగడం, పొగతాగడం, స్థూలకాయం వల్ల ఓఎస్‌ఏ సమస్య తీవ్రతరం అవుతుంది. చిన్నపిల్లల్లో అయితే ఎదుగుదల ఉండదు. మానసిక సమస్యల బారిన పడతారు.నెలకు 1000 మంది వరకు నిద్ర లేమి సమస్య బారిన పడుతున్నారు.

6నుంచి 7 గంటల నిద్ర అవసరం

ప్రతి వ్యక్తి రోజులో 6 నుంచి 7 గంటలు నిద్రపోవాలి. ఇలా నిద్ర పోవడం వల్ల హార్మోన్స్ తయారవుతాయి. ఒత్తిడి తగ్గుతుంది. పనిచేయడానికి అవసరమైన శక్తి తయారవుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది.



నిద్రలేమి సమస్య ఉన్న వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యుడు

జాగ్రత్తలు

నిద్రలేమి సమస్య బారిన పడకుండా ఉండాలంటే ప్రతిరోజూ వ్యాయమం చేయాలి. కనీసం రోజులో 6 గంటలు నిద్ర పోవాలి. నిద్రలేమి సమస్య ఉన్నట్లయితే పలమనాలజిస్టునుగాని, ఈఎన్‌టీ వైద్యుడిని గాని సంప్రదించాలి. ఊబకాయం రాకుండా చూసుకోవాలి. పానీపూరీ, చాట్, పిజ్జా, బర్గర్లు వంటివి ఎక్కువగా తినకూడదు.

ఎక్కువమందికి నిద్రలేమి సమస్య



చాలామంది నిద్రలేమి సమస్య బారిన పడుతున్నారు. అయితే ఈసమస్యకు ఎవరిని సంప్రదించాలో చాలామందికి తెలియదు. పలమనాలజిస్టునుగాని, ఈఎన్‌టీ వైద్యుడిని గానీ సంప్రదించాలి. ఆరోగ్యంగా జీవించడం కోసం రోజులో 6 నుంచి 7 గంటల పాటు నిద్రపోవాలి. సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించకూడదు. అదేవిధంగా టీవీ కూడా గంటల తరబడి చూడకూడదు.

డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ఆస్తుల వేలంతో మనస్తాపం

పెట్రోల్ పోసుకుని కుటుంబ సభ్యుల ఆత్మహత్యాయత్నం వరంగల్ నగరంలో ఘటన

వరంగల్ చౌరస్తా: తమ కష్టార్జితాన్ని బ్యాంక్ అధికారులు అడ్డగోలుగా విక్రయిస్తున్నారంటూ కుటుంబ సభ్యులు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలుకాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేపీఎన్ రోడ్డులో శనివారం ఈ ఘటన జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చెల్లుపూరి హేమ్‌కుమార్, ఆనంద్‌కుమార్ సోదరులు వ్యాపార అవసరాల కోసం జేపీఎన్ రోడ్‌లోని తమ ఇంటిని తనఖా పెట్టి యూనియన్ బ్యాంక్ కాజీపేట బ్రాంచ్ నుంచి రూ.కోటికి పైగా రుణం తీసుకున్నారు. బ్యాంకు లావాదేవీలు నిలిచిపోవడం, రుణం గడువు ముగియడంతో బ్యాంక్ అధికారులు తనఖాలో ఉన్న ఇంటిని సంపత్‌కుమార్ అనే వ్యక్తికి వేలంలో విక్రయించారు. అమ్మకం జరిపిన ఆస్తిని సంపత్ కుమార్‌కు అప్పగించడం కోసం బ్యాంక్ అధికారులు శనివారం సంబంధిత భవనం వద్దకు చేరుకోగా, హేమ్‌కుమార్, ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యులు వారిని అడ్డుకున్నారు. తమ ఆస్తిని ఇతరులకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఆనంద్‌కుమార్ (60), తేజశ్రీ (35) హేమ్‌కుమార్ కోడలు ప్రశాంతి (32), ఆనంద్ కుమార్ అల్లుడికి తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. తమ కష్టార్జితాన్ని బ్యాంకువారు అడ్డగోలుగా అమ్మకానికి పెట్టడంతో మనోవేదనకు గురై ఆత్మహత్యకు యత్నించినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ విషయమై బ్యాంకు అధికారులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే వేలం వేశామని తెలిపారు.

మూతిపై మైకు

లేడీ రిపోర్టర్ అత్యుత్సాహం ● కోపంగా లుక్కిచ్చిన ట్రంప్





వాషింగ్టన్: ఓ లేడీ రిపోర్టర్ అత్యుత్సాహం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇబ్బందికర పరిస్థితి తెచ్చిపెట్టింది. శుక్రవారం వాషింగ్టన్ డీసీలో గాజాపై మీడియా ప్రశ్నలకు బదులిస్తుండగా ఒక రిపోర్టర్ తన మైక్‌ను ట్రంప్‌కు మరీ దగ్గరగా పెట్టేందుకు ప్రయత్నించింది. దాంతో అది కాస్తా అనుకోకుండా ఆయన మూతికి తాకింది. దాంతో అధ్యక్షుడు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఆమెకేసి ఆగ్రహంగా చూడటమే గాక ఇదేం పని అన్నట్టుగా కనుబొమ్మలు ఎగరేశారు. 'ఏం చేశావ్ నువ్వు!' అంటూ నిలదీశారు. తర్వాత మీడియా ప్రశ్నలకు బదులిస్తూ, 'ఈ రాత్రి ఆమె టీవీ షోగా, బిగ్ స్టోరీగా మారిపోయింది' అంటూ తనదైన శైలిలో స్పందించారు. ఈ ఉదంతంపై నెటిజన్లు విపరీతంగా స్పందిస్తున్నారు. వారి జోకులు, కామెంట్లతో ఇంటర్నెట్ హోరెత్తిపోతోంది. ''ఇందులోనూ కుట్రకోణముందేమో! మైక్‌కు ప్రాణాంతక ఆంత్రాక్స్ పౌడి, ఫెంటానిల్ డ్రగ్ వంటివేమైనా రుద్దారేమో. ఏమైనా దీన్నంత తేలిగ్గా తీసుకోరాదు'' అని ఒక ఎక్స్ యూజర్ చెణుకు విసిరాడు. 'ట్రంప్ గనుక మరికొన్ని గంటల్లో అనుమానాస్పదంగా మరణిస్తే అందుకు ఆ లేడీ రిపోర్టరే కారకురాలు' అని మరొకరు, ''మైక్‌పై విషం పూసి ఉండొచ్చు. కాస్త అతిగా అనిపించినా సరే, దీనిపై లోతైన విచారణ జరగాల్సిందే'' అని ఇంకొకరు రాసుకొచ్చారు. ఇది క్షమించరాని భద్రతా లోపమంటూ ట్రంప్ మద్దతుదారులు ఆగ్రహిస్తున్నారు. రిపోర్టరైనా సరే, మైక్‌తో అంత దగ్గరికి ఎలా రానిస్తారని ప్రశ్నిస్తున్నారు.

ఇష్టం లేకున్నా నవ్వాల్సిందే పాపం!

భార్య ఉషను ఉద్దేశించి వాన్స్ వ్యాఖ్యలు ● చౌకబారు హాస్యమంటూ నెటిజన్ల ధ్వజం

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషా చిలుకూరిని ఉద్దేశించి చేసిన సరదా వ్యాఖ్యలు కాస్తా గురి తప్పి బెడిసికొట్టాయి. మిషిగాన్‌లో ఒక కార్యక్రమానికి ఆయన భార్యాసమేతంగా హాజరయ్యారు. తన భార్య అమెరికా సెకండ్ లేడీగా గొప్పగా బాధ్యతలు నిర్వర్తిస్తోందంటూ పొగడ్తలు కురిపించారు. పనిలో పనిగా, ''అయితే ఒక్కటి మాత్రం నిజం . నేనెంత అర్థంపర్థం లేని మాటలు మాట్లాడినా ఆమె నవ్వాల్సిందే పాపం! ఎందుకంటే చుట్టూ కెమెరాలుంటాయి! నవ్వుతూ నాతో శ్రుతి కలపాలి. మరో దారి లేదు''అంటూ చెణుకులు విసిరారు. కానీ ఆ కామెంట్లు విమర్శలకు దారితీశాయి. తనకు సెన్సాఫ్ హ్యూమర్ అస్సలు లేదని వాన్స్ మరోసారి నిరూపించుకున్నారంటూ నెటిజన్లు తప్పుబడుతున్నారు. చౌకబారు వ్యాఖ్యలతో భార్యను చీర్‌లీడర్‌గా చిత్రించారంటూ తూర్పారబడుతున్నారు. హాస్యం అనుకుని వాన్స్ చేసే కామెంట్లు ఎప్పుడూ ఇలాగే గురి తప్పుతూ ఉంటాయంటూ ఎద్దేవా చేశారు. వాన్స్ ఈ వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు కూడా ఉష




భర్త వాన్స్ మాటలకు నవ్వుతున్న ఉష

ఎప్పట్లాగే ఆయన వెనకాల నుంచుని నవ్వుతూ చూస్తుండిపోవడం విశేషం! గత ఉపాధ్యక్షునిగా వాన్స్ ప్రమాణస్వీకారం సందర్భంగా ఆయనకేసి ఉష ఆప్యాయంగా, గర్వంగా, చిరునవ్వుతో చూస్తున్న ఫొటోలు, వీడియోలు వైరల్ కావడం తెలిసిందే. తెలుగు మూలాలున్న ఉష 2014లో వాన్స్‌ను పెళ్లాడారు. వారికి ముగ్గురు పిల్లలు. వాన్స్ దంపతులు ఈ నెలాఖర్లో భారత్ రానున్నారు. సెకండ్ లేడీ హోదాలో ఉషకు ఇది తొలి భారత పర్యటన.

సునీత వచ్చేస్తోంది!

ఎట్టకేలకు ఐఎస్ఎస్‌కు బయల్దేరిన స్పేస్ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్

కేప్ కెనావెరాల్: సుదీర్ఘ నిరీక్షణకు తెరపడే సమయం వచ్చేసింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో తొమ్మిది నెలలుగా చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ఎట్టకేలకు భూమికి తిరిగి రానున్నారు. వారిని వెనక్కు తీసుకురావడానికి స్పేస్ఎక్స్ సంస్థ 'నాసా' సహకారంతో క్రూ–10 మిషన్ ప్రారంభించింది. అమెరికాలోని కెనెడీ స్పేస్ సెంటర్ నుంచి స్థానిక కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున ఫాల్కన్‌–9 రాకెట్ ద్వారా డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను అంతరిక్షంలోకి పంపింది. ఇందులో నలుగురు వ్యోమగాములు అన్నె మెక్‌క్లెయిన్, నికోల్ అయేర్స్ (అమెరికా), తకుయా ఒనిషీ (జపాన్), కిరిల్ పెస్కోవ్ (రష్యా)లున్నారు. వారు ఆర్నెల్లపాటు ఐఎస్ఎస్‌లోనే ఉంటారు. గత సెప్టెంబర్‌లో స్పేస్ఎక్స్ వ్యోమనౌకలో ఐఎస్ఎస్‌కు వెళ్లిన ఇద్దరు వ్యోమగాములతో కలిసి సునీత, విల్మోర్ తిరిగొస్తారు. వాతావరణం అనుకూలిస్తే ఆ నలుగురూ వారం రోజుల్లో తిరిగొచ్చే అవకాశం ఉంది. వారు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో దిగుతారు.



నింగిలోకి దూసుకెళ్తున్న స్పేస్‌క్రాఫ్ట్ (ఇన్‌సెట్‌లో సునీత)

వారం అనుకుంటే...

బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ తొలి మానవసహిత అంతరిక్ష ప్రయోగంలో భాగంగా 2024 జూన్ 5న సునీత, విల్మోర్ ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఎనిమిది రోజుల్లో వెనక్కి రావాలి. కానీ స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అది వీలవలేదు. స్పేస్‌షిప్ థ్రస్టర్లు విఫలమవడంతో పాటు హీలియం గ్యాస్ లీకవుతున్నట్లు గుర్తించారు. మరమ్మత్తులకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. దాంట్లో వారిని వెనక్కు తీసుకురావడం ప్రాణాలకే ప్రమాదమని నిపుణులు హెచ్చరించడంతో స్టార్‌లైనర్ ఖాళీగానే తిరిగొచ్చింది. తర్వాత వారిని తీసుకొచ్చేందుకు పలుమార్లు ప్రయత్నించినా కుదర్లేదు. చివరికి ఇటీవలి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కూడా ఈ అంశం ప్రచారాస్త్రంగా మారింది. తాము అధికారంలోకి వస్తే సునీత, విల్మోర్‌ను సాధ్యమైనంత త్వరగా రప్పిస్తామని జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్ ఇద్దరూ ప్రకటించారు. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగానే దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. వారిని తీసుకొచ్చేందుకు స్పేస్ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సాయం కోరారు. మస్క్ చొరవతో క్రూ–10 మిషన్ ప్రారంభమైంది. అంతా అనుకున్నట్టు జరిగితే వారం రోజుల్లో సునీత, విల్మోర్ మళ్లీ భూమిపై అడుగుపెడతారు.



శుక్రవారం క్రూ-10 మిషన్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు బయలుదేరిన వ్యోమగాములు వీరే...

మీ దేశానికో నమస్కారం!

అమెరికాకు భారత విద్యార్థిని గుడ్‌బై

- పాలస్తీనాకు మద్దతిచ్చిందంటూ ట్రంప్ సర్కారు కన్నెర్ర
- ఉగ్రవాద సానుభూతిపరురాలంటూ స్టూడెంట్ వీసా రద్దు
- సెల్ఫ్ డిపోర్టేషన్ ద్వారా స్వచ్ఛందంగా తిరిగొచ్చిన రంజని



భారత్‌కు బయల్దేరే ముందు న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో రంజని

న్యూయార్క్/వాషింగ్టన్: డిపోర్టేషన్. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ అంతటా మారుమోగుతున్న పదం. అక్రమంగా చొరబడ్డారంటూ భారతీయులతో సహా ఎంతోమందిని ఎడాపెడా తిప్పి పంపిన వైనం రేపిన కలకలం అంతా ఇంతా కాదు. కరడుగట్టిన నేరస్తుల్లా కాళ్లూ చేతులకు సంకెళ్లు వేసి, సరుకు మూటల మాదిరిగా సైనిక విమానాల్లో కుక్కి మరీ రవాణా చేసిన అమానుషత్వంపై వెల్లువెత్తిన విమర్శలు అన్నీ ఇన్నీ కాదు. అలాంటి ట్రంప్ సర్కారుకు రంజనీ శ్రీనివాసన్ అనే భారత విద్యార్థిని మర్చిపోలేని షాకిచ్చారు. పాలస్తీనా ఆందోళనలకు మద్దతిచ్చిందంటూ అమెరికా ప్రభుత్వం ఆమెపై ఉగ్రవాద సానుభూతిపరురాలు అనే ముద్ర వేసింది. ఆ అభియోగాలకు రుజువులేమీ చూపకుండానే తన ఎఫ్‌–1 స్టూడెంట్ వీసాను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దాంతో చిర్రెత్తుకొచ్చిన రంజని, మితిమీరిన దురభిమానంతో మతిలేని దూకుడు ప్రదర్శిస్తున్న ట్రంప్ సర్కారుకు దిమ్మతిరిగే నిర్ణయం తీసుకున్నారు. 'నువ్వు నన్ను వెళ్లగొట్టేదేమిటి? నేనే నీ దేశంలో ఉండదలచుకోలేదు పో'మ్మంటూ తనను తానే డిపోర్ట్ చేసుకున్నారు! విద్యార్థులంతా అపురూపంగా భావించే అమెరికా స్టూడెంట్ వీసాను 'ఆఫ్ట్రాల్' అంటూ వదులుకుని స్వచ్ఛందంగా భారత్ తిరిగొచ్చారు. వలసదారులను తిప్పి పంపే ప్రక్రియను వేగవంతం చేసేందుకు ట్రంప్ సర్కారు ఇటీవల ఏరికోరి అందుబాటులోకి తెచ్చిన సెల్ఫ్ డిపోర్టేషన్ సదుపాయాన్నే రంజని ఇందుకు ఉపయోగించుకోవడం విశేషం! తద్వారా అమెరికా తీరును ప్రతీకాత్మకంగా ఎండగట్టారామె. కొలంబియా వర్సిటీ కొన్నాళ్లుగా గాజా అనుకూల నిరసన ఉద్యమానికి కేంద్రబిందువుగా తయారవడం తెలిసిందే. అక్కడి విద్యార్థులు హమాస్ ఉగ్ర సంస్థకు పరోక్షంగా మద్దతిస్తూ దాని సానుభూతిపరులుగా మారారని ట్రంప్ సర్కారు తీవ్ర ఆగ్రహంతో ఉంది. రంజని కూడా హమాస్‌కు మద్దతిచ్చే కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారని ఇటీవల అభియోగాలు మోపింది. ఆమె ఎఫ్‌–1 స్టూడెంట్ వీసాను రద్దు చేస్తూ హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం మార్చి 5న నిర్ణయం తీసుకుంది. దాంతో కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) హోం యాప్‌లోని సెల్ఫ్ డిపోర్టేషన్ సదుపాయం ద్వారా రంజని మార్చి 11న స్వచ్ఛందంగా అమెరికాను వీడారు. న్యూయార్క్ విమానాశ్రయంలో ఆమె హడావుడిగా బోర్డింగ్ కేసి వెళ్తున్న వీడియోను హోమ్‌లాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోయెమ్ ఎక్స్‌లో షేర్ చేశారు.

ఏమిటీ స్వీయ బహిష్కరణ యాప్?

కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) హోం యాప్‌ను ప్రయాణ, రవాణా సదుపాయాల నిమిత్తం బైడెన్ సర్కారు 2022లో అందుబాటులోకి తెచ్చింది. తర్వాత శరణార్థుల దరఖాస్తులను కూడా ప్రాసెస్ చేసేలా దాని పరిధిని పెంచారు. ట్రంప్ వచ్చాక 'దేశం వీడాలని భావిస్తున్నా' అంటూ సెల్ఫ్ డీపోర్ట్ ఆప్షన్ కొత్తగా చేర్చారు. ప్రభుత్వం తిప్పి పంపేయాల్సిన పని లేకుండా తమంత తాముగానే దేశం వీడటానికి వీలు కల్పించే ఈ ఆప్షన్‌ను మార్చి 10న అందుబాటులోకి తెచ్చారు. అదే రోజు రంజని దాన్ని వినియోగించుకున్నారు. ఆ మర్నాడే న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో విమానమెక్కి అమెరికాను వీడారు.

ఎవరీ రంజని?

భారత్‌కు చెందిన రంజని అహ్మదాబాద్‌లో సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ప్లానింగ్, టెక్నాలజీ యూనివర్సిటీలో డిగ్రీ చేశారు. తర్వాత ఫుల్‌బ్రైట్ నెహ్రూ, ఇన్‌ల్యాక్స్ స్కాలర్‌షిప్‌లపై అమెరికా వెళ్లి ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో డిజైన్ విభాగంలో మాస్టర్ డిగ్రీ చేశారు. తర్వాత న్యూయార్క్‌లోని ప్రఖ్యాత కొలంబియా వర్సిటీలో ఎం.ఫిల్ చేశారు. తర్వాత అక్కడే గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ప్లానింగ్, ప్రిజర్వేషన్ విభాగంలో డాక్టోరల్ విద్య అభ్యసిస్తున్నారు. వాతావరణ మార్పులకు తొలుత ప్రభావితమయ్యే వర్గాలకు కాపాడేందుకు వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే ఓ స్వచ్ఛంద సంస్థలోనూ రంజని పని చేశారు. ప్రఖ్యాత మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వెస్ట్ ఫిలడెల్ఫియా ల్యాండ్‌స్కేప్ ప్రాజెక్ట్‌లో పరిశోధకురాలిగా కూడా సేవలందించారు. 'బంగారం, సైనేడ్: కుటుంబం, కులం, కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్(కేజీఎఫ్)లో ఖనిజ తవ్వకాల తర్వాత అక్కడి కులరాజకీయాలు'' అంశంపై పరిశోధన చేశారు. 'భారత్‌లో పట్టణ సమీప ప్రాంతాల్లో భూములు–కూలీల మధ్య సంబంధాలు, నిరుద్యోగం' అంశంపై అమెరికాలో పరిశోధన చేస్తున్నారు.

తిండి పెట్టకుండా కొట్టారు

- తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నారు
- బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన రన్యారావు ఆరోపణలు
- డీఆర్ఐ డీజీకి లేఖ రాసిన నటి

బెంగళూరు: బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అక్రమంగా బంగారం తరలిస్తూ పట్టుబడిన కేసులో నిందితురాలు, కన్నడ నటి రన్యా రావు తాజాగా రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులపై ఆరోపణలు గుప్పించారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ)కు మార్చి ఆరో తేదీన హర్షవర్ధిని రన్యా పేరిట ఆమె రాసిన లేఖ తాజాగా బహిర్గతమైంది. పరప్పన అగ్రహార జైలు చీఫ్ సూపరింటెండెంట్ ద్వారా ఆమె ఈ లేఖను డీఆర్ఐకు పంపించారు. దుబాయ్ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నప్పుడు తాను బంగారాన్ని తీసుకురాలేదని ఆ లేఖలో పేర్కొన్నారు. కస్టడీలో ఉన్న సమయంలో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు పలుమార్లు చెంప దెబ్బ కొట్టారని, తెల్ల కాగితాలపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారని చెప్పారు. ''ఈ అంశంలో నేను నిరపరాధినని వివరించేందుకు ఎంత ప్రయత్నించినా అధికారులు నా మాటల్ని వినిపించుకోలేదు. ఎయిర్‌పోర్ట్ బయటకాకుండా విమానంలోనే నన్ను అరెస్ట్‌చేశారు. కోర్టులో హాజరుపరచడానికి ముందు వరకు అధికారులు మొత్తంగా 10, 15 సార్లు చెంపదెబ్బ కొట్టారు. కొట్టినా, చెంపదెబ్బ తిన్నాసరే వాళ్లు టైప్‌చేసిన పేజీలపై సంతకాలు చేయబోనని చెప్పా. దీంతో అన్యాయంగా మా తండ్రి పేరును ఈ కేసులోకి లాగి పరువు తీస్తామని బెదిరించారు. తీవ్రమైన ఒత్తిడి కారణంగా వాళ్లు చెప్పినపనిచేశా. దాదాపు 60 టైప్‌చేసిన పేజీలపై, 40 తెల్లకాగితాలపై సంతకాలు చేశా''అని అన్నారు. రన్యా రావు సవతి తండ్రి కె.రామచంద్రరావు ప్రస్తుతం కర్ణాటక రాష్ట్ర పోలీసుల గృహ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. ''మూడో తారీఖు సాయంత్రం అరెస్టయితే నాలుగో తేదీ రాత్రి కోర్టులో హాజరుపరిచేదాకా నన్ను నిద్రపోనివ్వలేదు, తిండి పెట్టలేదు. ఆరోజు ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల్లా నటించిన కొందరు వ్యక్తులు ఆ విమానంలోని కొందరు ప్రయాణికులను రక్షించేందుకు నన్ను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారు. జడ్జి ఎదుట హాజరుపరిచేందుకు కారులో తీసుకెళ్లేటప్పుడూ అధికారులు బెదిరించారు.



కొట్టిన విషయం చెప్తే నాన్న సంగతి, నా సంగతి చూస్తామని బెదిరించారు. రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారుల కస్టడీలో ఉన్నకాలంలో బలవంతంగా తీసుకున్న నా వాంగ్మూలాలకు విలువ ఇవ్వకండి''అని డీఆర్ఐకు లేఖలో విజ్ఞప్తి చేశారు. కస్టడీలో ఉన్న కాలంలో కళ్ల కింద నల్లని చారలతో, నిస్సత్తువగా ఉన్న రన్యా రావు ఫొటో ఒకటి వైరల్‌గా మారిన విషయం తెల్సిందే. మూడ్రోజులు రెవెన్యూ ఇంటెలిజెన్స్ కస్టడీలో ఉన్న ఆమెను ఆ తర్వాత జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. గతంలో రన్యా రావు భిన్న వాదనలు చేశారు. అరెస్టసమయంలో తన నుంచి పోలీసులు 17 బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారని ఏడోతేదీన వాంగ్మూలంలో ఒప్పుకున్నారు. అధికారులు ఇష్టమొచ్చినట్లు తిట్టారని పదో తేదీన కోర్టులో ఆమె చెప్పారు. అయితే కొట్టలేదని ఒప్పుకున్నారు. మరోవైపు, రన్యారావు సవతి తండ్రి రామచంద్రరావును కర్ణాటక ప్రభుత్వం తాజాగా సెలవుపై పంపించింది. ఈ మేరకు శనివారం నిర్ణయం తీసుకుంది.

ట్రంప్ ప్రతిపాదనతో ఆటలొద్దు

శాంతి ప్రయత్నాలకు విఘాతం కలిగించొద్దు

- పుతిన్‌కు యూకే ప్రధాని కియర్ స్టార్మర్ హెచ్చరిక

లండన్: ఉక్రెయిన్‌– రష్యా మధ్య శాంతి కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన ఒప్పందంతో ఆటలాడొద్దని రష్యా అధినేత పుతిన్‌ను యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధాన మంత్రి కియర్ స్టార్మర్ హెచ్చరించారు. పుతిన్ నిజంగా శాంతిని కోరుకుంటే అది చాలా సులభంగా సాధ్యమవుతుందని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాలని, ఉక్రెయిన్‌పై వెంటనే దాడులు నిలిపివేయాలని చెప్పారు. శాంతి ప్రయత్నాలకు విఘాతం కలిగించాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని తేల్చిచెప్పారు. 30 రోజులపాటు కాల్పుల విరమణ పాటించాలంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన చక్కటి ప్రతిపాదనకు రష్యా ప్రభుత్వం అడ్డుపుల్లలు వేస్తోందని మండిపడ్డారు. శాంతియుత పరిస్థితులు నెలకొనడం పుతిన్‌కు ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. ఇలాగే మొండిగా



వ్యవహరిస్తే రష్యాపై ఆర్థిక ఆంక్షలు తీవ్రతరం చేస్తామని, అప్పుడు మరో గత్యంతరం లేక ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించక తప్పదని వెల్లడించారు. ఉక్రెయిన్‌తో చర్చలకు పుతిన్ సిద్ధమైతే, రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా కొనసాగేలా తాము బాధ్యత తీసుకుంటామని స్టార్మర్ తెలిపారు. ఆయన శనివారం యూరప్‌తో పాటు మిత్రదేశాల అధినేతలతో వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఈ భేటీలో 25 దేశాల నేతలు పాల్గొన్నారు. ఉక్రెయిన్‌–రష్యా యుద్ధం, తాజా పరిణామాలపై, పుతిన్ వైఖరిపై చర్చించారు. రెండు దేశాల మధ్య శాశ్వతంగా శాంతి నెలకొనాలని ఈయూ, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్ తదితర దేశాలన్నీ కోరుకుంటున్నట్లు స్టార్మర్ తెలిపారు. రష్యా మెడలు వంచడానికి అవసరమైతే సైన్యాన్ని సైతం రంగంలోకి దించడానికైనా సిద్ధమేనని సంకేతాలిచ్చారు. ప్రాక్టికల్ ప్లానింగ్‌తో 'ఆచరణ దశ'ప్రారంభించేలా ముందుకు సాగుతున్నామని ఉద్ఘాటించారు. వర్చువల్ సమావేశంలో ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ పాల్గొన్నారు. ఉక్రెయిన్‌–రష్యా మధ్య కాల్పుల విరమణ ప్రక్రియ ఎప్పుడో ప్రారంభం కావాల్సి ఉండగా, రష్యా మొండి వైఖరితో ఆగిపోయిందని జెలెన్‌స్కీ విమర్శించారు. కాల్పుల విరమణను అడ్డుకోవడానికి రష్యా కుట్రలు సాగిస్తోందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, శాంతి కోసం మరింత చొరవ తీసుకోవాలని యూరప్ దేశాలు నిర్ణయానికొచ్చాయి. కాల్పుల విరమణకు అంగీకరించేలా పుతిన్‌పై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా ఏం చేయాలన్న దానిపై చర్చించడానికి యూరప్ దేశాల మిలిటరీ ప్లానింగ్ సమావేశం వచ్చేవారం జరగబోతోంది.

అమెరికాలో పెను తుపాను

17 మంది దుర్మరణం

ఓక్లహామా సిటీ (యూఎస్): అమెరికాలో ప్రకృతి ప్రకోపించి 17 మంది ప్రాణాలను బలితీసుకుంది. కొన్ని రాష్ట్రాలు పెను తుపాను బారినపడితే మరికొన్ని చోట్ల టోర్నడోలు విజృంభించాయి. మరికొన్ని చోట్ల కార్చిచ్చు ఘటనలు స్థానికులను కకావికలం చేస్తున్నాయి. మిస్సోరీ రాష్ట్రంలో టోర్నడో కారణంగా 11 మంది చనిపోయారు. పలువురు గాయపడ్డారు. శుక్రవారం రాత్రి అర్కాన్సాస్‌లో ముగ్గురు, టెక్సాస్‌లో సిటీలో దుమ్ము తుపాను కారణంగా జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు.

మయన్మార్‌లో సైన్యం దాడి..


30 మంది మృతి

బ్యాంకాక్: మయన్మార్‌లోని సైనిక ప్రభుత్వం ప్రజాస్వామ్య అనుకూల రెసిస్టెన్స్ గ్రూప్‌పై జరిపిన వైమానిక దాడిలో కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మంది వరకు గాయపడ్డారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. దేశంలోని రెండో అతి పెద్ద నగరం మాండలేకు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న సింగు టౌన్‌షిప్ సమీప లెట్ పన్ హ్లా గ్రామంపై శుక్రవారం సాయంత్రం ఈ వైమానిక దాడి జరిగిందని ప్రతిపక్షాలకు చెందిన ఆన్‌లైన్ మీడియా వెల్లడించింది. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నట్లు సమాచారం. మార్కెట్ వద్ద జరిగిన దాడిలో 10 నివాసాలు నేలమట్టమయ్యాయని తెలిసింది.

అస్సాంలో అశాంతికి కాంగ్రెసే కారణం

ప్రధాని మోదీ హయాంలో శాంతి, అభివృద్ధి ● హోం మంత్రి అమిత్ షా వెల్లడి

దెర్‌గావ్/ఐజ్వాల్: అస్సాంలో శాంతియుత వాతావరణం నెలకొల్పి, మౌలిక వనరులను అభివృద్ధి చేసింది ప్రధాని మోదీయేనని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించిందని తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రంలో శాంతి నెలకొనకుండా అడ్డుకున్నాయని ఆయన ఆరోపించారు. అప్పట్లో రాష్ట్రానికి ఎటువంటి గ్రాంట్లు అందకపోవడంతో ఆందోళనలు, హింసాత్మక కార్యక్రమాలకు, వెనుకబాటుకు మారుపేరుగా మారిందని విమర్శించారు. శనివారం మంత్రి అమిత్ షా గోలాఘాట్ జిల్లా దెర్‌గావ్‌లోని లచిత్ బార్‌ఫుకాన్ పోలీస్ అకాడెమీ పునరుద్ధరణ మొదటి దశ పనులను ప్రారంభించడంతోపాటు రెండో దశ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'అస్సాంలో 10 వేల మందికి పైగా యువకులు ఆయుధాలు వదిలేసి జనజీవన స్రవంతిలో కలిశారు. దీంతో గత పదేళ్లుగా రాష్ట్రంలో శాంతి నెలకొంది. ఆందోళనలు, హింస, వేర్పాటువాదానికి పేరున్న అస్సాంలో నేడు రూ.27 వేల కోట్లకు పైగా పెట్టుబడితో అత్యాధునిక సెమీ కండక్టర్ పరిశ్రమ నడుస్తోంది. ఇది అస్సాం భవిష్యత్తునే మార్చనుంది'అని అన్నారు. ఇటీవల ముగిసిన అడ్వాంటేజ్ అస్సాం 2.0లో మరో రూ.3 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ప్రతిపాదనలు అందాయి. ఇవి ఏర్పాటైతే యువతకు ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తాయి'అని మంత్రి చెప్పారు. మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్‌లతో ఉన్న సరిహద్దు వివాదాలను పరిష్కరించామన్నారు. విద్యార్థిగా ఉండగా అస్సాంకు వచ్చినప్పుడు జరిగిన పరిణామాలను ఆయన గుర్తు చేసుకుంటూ.. 'అప్పట్లో కాంగ్రెస్ నేత హితేశ్వర్ సైకియా సీఎంగా ఉండేవారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేశారు. అరెస్టయిన వారిలో నేనూ ఉన్నా. అస్సాం జైలులో వారం పాటు నన్ను ఉంచారు'అని తెలిపారు. అప్పటి కాంగ్రెస్ హయాంతో, ఇప్పటి బీజేపీ పాలనతో పోల్చుకుంటే అస్సాంలో గుర్తు పట్టలేనన్ని మార్పులు సంభవించాయన్నారు. వచ్చే ఐదేళ్లలో లచిత్ బార్‌ఫుకాన్ పోలీస్ అకాడెమీ దేశంలోనే అగ్రగామిగా మారనుందని చెప్పారు. అనంతరం అమిత్ షా మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో అస్సాం రైఫిల్స్ క్యాంప్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. మిజోరంలో అభివృద్ధి పనుల పురోగతిపై స్వయంగా ప్రధాని మోదీయే సమీక్ష చేస్తున్నారని ఆయన అన్నారు. అస్సాం రైఫిల్స్ క్యాంప్‌ను ఐజ్వాల్ వెలుపలికి మార్చడం కీలక పరిణామంగా పేర్కొన్నారు. మిజో ప్రజల అభీష్టానికి అనుగుణంగా కేంద్రం పనిచేస్తుందనడానికి ఇదే ఉదాహరణ అని ఆయన తెలిపారు. 2014కు పూర్వం ప్రధానమంత్రులంతా కలిసి ఈశాన్య రాష్ట్రాలకు వచ్చింది 21 సార్లు మాత్రమే రాగా, ప్రధాని మోదీ ఈ ప్రాంతంలో 78 పర్యాయాలు పర్యటించారని అమిత్ షా చెప్పారు.



ప్రభుత్వ టెండర్లలో ముస్లింలకు 4 శాతం కోటా

కేటీపీపీ చట్ట సవరణకు కర్ణాటక కేబినెట్ అంగీకారం

బెంగళూరు/న్యూఢిల్లీ: కర్ణాటక మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ టెండర్లలో ముస్లిం కాంట్రాక్టర్లకు 4 శాతం కోటా కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం కర్ణాటక ట్రాన్స్‌పరెన్సీ ఇన్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్(కేటీపీపీ) చట్టంలో సవరణ చేయడానికి అంగీకారం తెలియజేసింది. ఈ చట్ట సవరణతో ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 4 శాతం పనులు ముస్లింలకే లభిస్తాయని అధికార వర్గాలు వెల్లడించాయి. కర్ణాటక మంత్రివర్గం శుక్రవారం సమావేశమైంది. కర్ణాటక గ్రామ స్వరాజ్, పంచాయతీరాజ్ (సవరణ) బిల్లుకు ఆమోదం తెలిపింది. దీనిప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో అనధికారిక ఆస్తులకు 'బి'ఖాతాలు కేటాయిస్తారు. ఇలాంటి ఆస్తుల సంఖ్య 90 లక్షల వరకు ఉండొచ్చని అంచనా. రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్(కేపీఎస్సీ)లో చేపట్టాల్సిన సంస్కరణలపై కేబినెట్ భేటీలో చర్చించారు.

ముస్లింలకు కోటా రాజ్యాంగ విరుద్ధం: బీజేపీ

ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4 శాతం కోటా కేటాయిస్తూ కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ శనివారం ఆగ్రహం వ్యక్తంచేశారు. ముస్లింలకు కోటా ఇవ్వడం రాజ్యాంగవిరుద్ధమని తేల్చిచెప్పారు.

214 మందిని చంపేశాం

బలూచిస్తాన్ మిలిటెంట్ల ప్రకటన

ఇస్లామాబాద్: తాము హైజాక్ చేసిన జాఫర్ ఎక్స్‌ప్రెస్‌లోని 214 మందిని చంపేశామని బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) మిలిటెంట్లు ప్రకటించారు. మృతుల్లో పాకిస్తాన్ సైనికులతోపాటు సాధారణ ప్రయాణికులు ఉన్నట్లు వెల్లడించారు. పాక్ జైళ్లలో ఖైదీలుగా ఉన్న తమ సహచరులను విడుదల చేయాలంటూ ప్రభుత్వానికి ఇచ్చిన 48 గంటల గడువు శుక్రవారంతో ముగిసినట్లు పేర్కొన్నారు. వారి విడుదల విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తమ వద్ద బందీలుగా ఉన్న 214 మందిని అంతం చేసినట్లు తెలియజేశారు. అయితే, దీనికి వారు ఎలాంటి ఆధారాలు చూపలేదు. క్వెట్టా నుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును బీఎల్ఏ మిలిటెంట్లు మంగళవారం హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో రైలులో 440 మంది ప్రయాణికులు ఉన్నారు. మిలిటెంట్ల దాడిలో 21 మంది పౌరులు, నలుగురు సైనికులు మరణించినట్లు తొలుత వార్తలొచ్చాయి. రైలును హైజాక్ చేసిన మిలిటెంట్లందరినీ హతమార్చి ప్రయాణికులను విడుదల చేసినట్టు పాక్ సైన్యం వెల్లడించింది. అయితే, సైన్యం ప్రకటనను మిలిటెంట్లు కొట్టిపారేశారు. కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయని స్పష్టంచేశారు. మరోవైపు పాకిస్తాన్ సైనిక ప్రతినిధి అహ్మద్ షరీఫ్ చౌదరి స్పందిస్తూ... 33 మంది మిలిటెంట్లను అంతం చేశామని, 354 మంది ప్రయాణికులను రక్షించామని చెప్పారు. మిలిటెంట్ల దాడిలో 23 మంది సైనికులు, ముగ్గురు రైల్వే ఉద్యోగులు, ఐదుగురు ప్రయాణికులు.. మొత్తం 31 మంది మృతిచెందారని వివరించారు.

ఐఎస్ కీలక నేత హతం

ఇరాక్ ప్రధాని వెల్లడి

బాగ్దాద్: ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఇరాక్, సిరియా చీఫ్‌ను మట్టుబెట్టామని ఇరాక్ ప్రధాన మంత్రి మహ్మద్ షియా అల్‌–సుడానీ ప్రకటించారు. అమెరికా సారథ్యంలోని మిత్ర దేశాల బలగాల సాయంతో ఇరాక్ నేషనల్ ఇంటెలిజెన్స్ సభ్యులు జరిపిన ఆపరేషన్‌లో అబ్దుల్లా మకీ మొస్లెహ్ అల్‌–రిఫయ్ అలియాస్ అబూ ఖదీజా హతమయ్యాడని ఆయన శుక్రవారం 'ఎక్స్'లో తెలిపారు. ఇరాక్ మాత్రమే కాదు ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాదుల్లో ఇతడొకడని తెలిపారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాక్ ప్రభుత్వం, స్థానిక కుర్దిష్ ప్రభుత్వం సహకారంతో తమ బలగాలు అలుపెరగకుండా కొనసాగించిన వేటలో ఐఎస్ నేత హతమైనట్లు ఆయన పేర్కొన్నారు.కాగా, ఇరాక్ పశ్చిమ ప్రాంతంలోని అన్బార్ ప్రావిన్స్‌లో గురువారం రాత్రి జరిపిన వైమానిక దాడిలో అల్‌–రిఫయ్ హతమైనట్లు అధికారులు శుక్రవారం ధ్రువీకరించారు. ఐఎస్ అంతమే లక్ష్యంగా ఇరాక్, సిరాయా, జోర్డాన్, లెబనాన్, తుర్కియేలు కలిసి అమ్మాన్‌లో ఏర్పాటు చేసిన ఆపరేషన్స్ రూం త్వరలోనే పని ప్రారంభించనుందని ఇరాక్ ప్రకటించింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం । 16 । మార్చి । 2025


శనివారం చిక్కమగళూరు జిల్లా బాబా బుడన్‌గిరులపై ఉరుసు వేడుక


బెంగళూరు స్వతంత్ర పార్కులో సీఐటీయూ మహిళా దినోత్సవాలు

న్యూస్‌రీల్

కుక్కేలో ప్రభుదేవా పూజలు


దేవస్థానంలో ప్రభుదేవా కుటుంబం

యశవంతపుర: ప్రముఖ నటుడు, డ్యాన్స్‌మాస్టర్ ప్రభుదేవా కుటుంబసమేతంగా కుక్కే సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. స్వామివారికి మహాభిషేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు వారికి తగిన ఏర్పాట్లు చేశారు.

సైబర్ భద్రతకు ప్రత్యేక సంస్థ

- హోంమంత్రి వెల్లడి

బనశంకరి: సైబర్‌నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక సంస్థను స్థాపించడానికి ప్రయత్నిస్తామని హోం శాఖ మంత్రి డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు. శనివారం నగరంలోని ఓ హోటల్లో సీఐడీ డి కోడ్- 2025 పేరుతో సైబర్ సదస్సును ఆయన ప్రారంభించారు. టెక్నాలజీ పెరుగుతోంటే, భద్రతా సవాళ్లు కూడా ఉద్భవిస్తున్నాయని, వాటిని ఎదుర్కొనే వృత్తి నైపుణ్యాలను పోలీసులు అలవరచుకోవాలన్నారు. కర్ణాటక ఐటీ రంగంతో పాటు, సైబర్ నేరాల నియంత్రణలో ముందంజలో ఉందన్నారు. ఇందుకోసం పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 45 వేలమందికి సైబర్ నేరాల కట్టడి గురించి శిక్షణ ఇచ్చామని, న్యాయశాఖ సిబ్బందికి కూడా శిక్షణ ఇస్తామన్నారు. విద్యారంగంలో యూనివర్సిటీలలో సైబర్ సురక్షత పట్ల పాఠ్యాంశాలు బోధిస్తామని తెలిపారు. ప్రభుత్వం 54 సైబర్ పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసిందన్నారు. అహ్మదాబాద్ కేంద్రీయ సైబర్ యూనివర్సిటీని సందర్శించామని, ఇంతకంటే ఉన్నత సంస్థను స్థాపించి సైబర్ నేరాల అడ్డుకట్టకు జాగృతి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ఐటీ సంస్థల ముఖ్యులు పాల్గొని ప్రసంగించారు.

బెంగళూరుకు డిప్యూటీ స్పీకర్ తరలింపు


గాయాలపాలైన రుద్రప్ప లమాణి

శివాజీనగర: ప్రమాదానికి గురైన దావణగెర ఎస్ఎస్ హైటెక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు, కుటుంబ సభ్యులు ఏమీ చెప్పకపోవడంతో నియోజక వర్గ ప్రజలు, అభిమానులు ఆదుర్దాలో ఉన్నారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ సమావేశాలు చూసుకుని బెంగళూరు నుంచి హావేరికి వెళ్తున్నారు. చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకా జేజే హళ్లి వద్ద హైవే పక్కన కొబ్బరినీరు తాగేందుకు కారు దిగి రాగానే ఓ బైకిస్టు వేగంగా వచ్చి ఢీకొన్నాడు. కిందపడిన రుద్రప్ప లమాణికి తలకు, నోటి దగ్గర బలమైన గాయాలయ్యాయి. ఆయనకు హిరియూరులో చికిత్స చేసి అంబులెన్స్ ద్వారా దావణగెర ఎస్ఎస్ హైటెక్ ఆసుపత్రిలో చేర్చారు. శనివారం ఉదయం బెంగళూరుకు తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యసేవలు అందిస్తున్నారు.

బెంగళూరులో చెత్త పన్ను

దొడ్డబళ్లాపురం: బెంగళూరువాసులపై బీబీఎంపీ మరో భారం మోపనుంది. ఇకపై చెత్తపై సర్వీస్ చార్జ్ వసూలు చేయాలని పాలికె నిర్ణయించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ సర్వీస్ చార్జ్ వసూలు ఉంటుందని కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. ఇది పన్ను కాదని, సర్వీస్ చార్జ్ మాత్రమేనని అన్నారు. ఆస్తి పన్నుతో కలిసి ఏడాదిలో రెండుసార్లు చెత్త సుంకాన్ని చెల్లించవచ్చన్నారు. విద్యుత్ బిల్ మాదిరిగా ప్రతి నెలా వసూలు చేయడం వీలుకాదని, అందువల్ల ఇలా నిర్ణయించామని చెప్పారు.

- రాష్ట్రంలో మూత్రపిండాల రోగుల తీవ్ర అవస్థలు
- విరుచుకుపడుతున్న కిడ్నీ జబ్బులు
- అవయవ మార్పిడి జరగక జీవచ్ఛవాలుగా బాధితులు
- డయాలసిస్ మీదే జీవనం



కిడ్నీ దాతల కోసం అంతులేని నిరీక్షణ

బనశంకరి: నేటి ఆధునిక యుగంలో మారిన జీవనశైలి, అధికంగా జంక్ ఫుడ్ తినడంతో పెచ్చుమీరుతున్న ఆరోగ్య సమస్యల్లో కిడ్నీ సమస్య ఒకటి. కిడ్నీ సమస్య బారిన పడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో కిడ్నీ జబ్బులత బాధపడుతూ ఆ అవయవ మార్పిడి కోసం 4,892 మంది వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో రోగుల నుంచి డిమాండ్ అధికంగా ఉంది.

మూత్రవిసర్జన సమస్య, అధికంగా మూత్రవిసర్జనకు వెళ్లడం, కిడ్నీలో రాళ్లు, కిడ్నీ క్యాన్సర్, కిడ్నీల్లో నీటి బుడగలో పాటు అనేక కిడ్నీ జబ్బులు ప్రబలుతున్నాయి. గతంలో 60-70 ఏళ్లకు పైబడిన వారిలో కనబడేవి ఇలాంటి సమస్యలు. ప్రస్తుతం పిల్లలతో పాటు తక్కువ వయస్సు వారిలో కూడా రావడం ఆందోళన కలిగిస్తుంది. కానీ కారణాలు వేర్వేరు. ప్రారంభంలో సమస్య గుర్తించి చికిత్స తీసుకుంటే కిడ్నీ వైఫల్యం బారి నుంచి బయట పడవచ్చు. కానీ సరైన సమయంలో గుర్తించకపోతే నిత్యం డయాలసిస్, కిడ్నీ తొలగింపు అనివార్యం. మూత్రపిండాలు సక్రమంగా పని చేస్తున్నాయా? లేదా? ముందుగా కనిపెట్టాలి. మూత్రపిండాల ఆరోగ్యం కాపాడాలి అనే నినాదంతో ఈ ఏడాది ప్రపంచ కిడ్నీ దినోత్సవం నిర్వహిస్తున్నారు. మూత్రపిండాల రోగం బారిన పడిన వెంటనే చికిత్స తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ దృష్టిలో రోగులకు ఔషధాలు అందించే వైద్యులు సైతం జాగ్రత్త వహించాలి. కిడ్నీ ఆరోగ్యానికి సమస్యగా మారకుండా సరైన మోతాదులో ఔషధాలు అందించాలి. అదేవిధంగా రోగులు సైతం వైద్యుల సలహాలు తీసుకోకుండా నొప్పి నివారణతో పాటు ఎలాంటి ఔషధాలు, మాత్రలు సేవించరాదని జాగృతి కల్పించడం ప్రపంచ కిడ్నీ దినోత్సవం ఉద్దేశం.


కిడ్నీ జబ్బులపై బెంగళూరులో జాగృతి ర్యాలీ

రోగ లక్షణాలు...

ఆయాసం అధికంగా ఉండటం, కాళ్లలో వాపు, నడవడం సాధ్యం కాకపోవడం, వాంతులు, మూత్రవిసర్జన మార్పులు, నొప్పి, మంటతో కూడిన మూత్రం, జ్వరం వచ్చినప్పుడే నడుము నొప్పి, కళ్లు ఉబ్బడం, మూత్రం రంగు మారడం, నురగ, రక్తస్రావం, సమస్య తీవ్రంగా ఉంటే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, బరువు తగ్గడం, చేతులు, కాళ్లు, శరీరంపై దుందలు కిడ్నీ జబ్బుల్లో కనిపించే ప్రధాన లక్షణాలు.

మూత్రపిండాల నిర్వహణ ఎలా..?

ప్రతి మనిషికి రెండు మూత్రపిండాలు ఉంటాయి. ఆరోగ్యకరమైన ఒక మూత్రపిండం ఉన్నప్పటికీ ఉత్తమ జీవితం గడపవచ్చు. మూత్రపిండాలు శరీరంలో రక్తం శుభ్రం చేయడం, శరీరంలో పేరుకుపోయిన చెత్తను మూత్రం ద్వారా బయటకు పంపుతాయి. విటమిన్ డీ ఉత్పత్తి చేసి ఎముకలకు శక్తినిస్తుంది. ఎర్ర రక్తకణాలను అభివృద్ధి చేసి శరీరంలో రక్తప్రసరణను పెంచుతుంది. రెమిన్ అనే అంశం బీపీ, నీరు, లవణాలు, ఆమ్లం అంశాలను నియంత్రిస్తుంది.

రోగం తీవ్ర దశలోకి చేరుకునే వరకు ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తారు. అది మూత్రపిండాల సమస్యకు దారి తీస్తుంది. దీంతో కేసులు పెరుగుతున్నాయి. దీనిపై ప్రజల్లో జాగృతి అవసరం. కిడ్నీ ఆరోగ్య పరీక్షలు, రోగ లక్షణాల గురించి అవగాహన కల్పించాలని నెఫ్రో యూరాలజీ సంస్థ డైరెక్టర్ అధ్యాపకుడు డాక్టర్ శివలింగయ్య తెలిపారు.

తరచూ పరీక్షలు ముఖ్యం

మూత్రంలో ప్రొటీన్, ఆల్బుమిన్ అంశాలు ఎంత ప్రమాణంలో బయటికి వెళుతుంది అనేది పరీక్ష చేయించాలి. దీంతో పాటు మధుమేహం, బీపీ పరీక్షలు చేయాలి. పరిమితంగా వ్యాయామం, సమయానికి సరైన తాజా ఆహారం తినడం, నిద్ర, భోజనంలో అధికంగా ఉప్పు వాడరాదు, అధికంగా నీరు తాగడం, గర్భిణులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. మన మూత్రపిండాలు సక్రమంగా ఉన్నాయా? అనే నినాదంతో 2006లో ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ(ఐఎస్ఎన్) ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మొదటిసారిగా ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం నిర్వహించింది. కిడ్నీ ఆరోగ్యం, సంబంధిత సమస్యల గురించి ప్రజలకు సమాచారం అందించడానికి 66 దేశాల్లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం నిర్వహిస్తోంది. ప్రస్తుతం 80కి పైగా దేశాల్లో ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం నిర్వహించి కిడ్నీ ఆరోగ్యం గురించి జాగృతం చేస్తోంది.

బీజేపీ నేత, ఎస్ఐ బాహాబాహీ

- చిత్రదుర్గంలో సంఘటన
- ఎస్పీకి నాయకుల ఫిర్యాదు


గొడవపడుతున్న ఎస్ఐ, బీజేపీ నాయకుడు

తుమకూరు: తుమకూరు జిల్లాలోని మధుగిరి బీజేపీ అధ్యక్షుడు హనుమంతేగౌడ, ఎస్ఐ గాదిలింగప్ప ముష్టియుద్ధానికి దిగారు. నేనేం తక్కువ కాదని ఒకరికొకరు తోసుకుని కొట్టుకోవడంతో జనం ఆశ్చర్యపోయారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి చిత్రదుర్గం నగరంలోని ఐశ్వర్య హోటల్ ముందు జరిగింది. వివరాలు.. హనుమంతేగౌడ, మరికొందరితో కలిసి చిత్రదుర్గానికి వెళ్లాడు. భోజనం చేద్దామని హోటల్‌లోకి వెళ్తుండగా ఎస్ఐ గాదిలింగప్ప తనిఖీలకు వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో ఇక్కడ ఏం చేస్తున్నారని ఎస్ఐ ప్రశ్నించాడు. భోజనం చేయడానికి వచ్చామని హనుమంతేగౌడ అన్నారు. వెంటనే ఇంటికి వెళ్లిపోవాలని ఎస్ఐ కాస్త గట్టిగా సూచించారు. మాకే బెదిరిస్తావా అని మద్యం మత్తులో ఉన్న హనుమంతేగౌడ ప్రశ్నించాడు. దీంతో ఎస్ఐ ఆయనను కొట్టాడు. నన్నే కొడతావా అని అతనిని కొట్టాడు. ఇద్దరూ దూషించుకుంటూ రచ్చ చేశారు. ఎస్ఐ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు హనుమంతేగౌడ మీద కేసు నమోదు చేశారు. బీజేపీ నాయకులు కలిసి ఎస్ఐపైన జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. చిత్రదుర్గ జిల్లా బీజేపీ ఎంపీ గోవింద కారజోళ, ఎమ్మెల్సీ చిదానంద గౌడ, కే.ఎస్.నవీన్‌గౌడ, తిప్పారెడ్డిలు ఎస్పీని కలిశారు. కాగా గొడవ వీడియోలు వ్యాప్తి చెందాయి.

మరణంలోనూ జీవనదానం


రమేష్ (ఫైల్)

శివమొగ్గ: బ్రెయిన్‌డెడ్ అయిన ఓ వ్యక్తి అవయవాలను దానం చేయడం ద్వారా మృతుని కుటుంబం పుట్టెడు దుఃఖంలోనూ మానవత చాటిన ఘటన శివమొగ్గ నగరంలో జరిగింది. వివరాలు.. కృషినగర 1వ క్రాస్ నివాసి ఎస్‌సీ రమేష్ (57) అనే వ్యక్తి ఈనెల 10న సాయంత్రం ఆకస్మికంగా స్పృహ తప్పి పడిపోయారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా మెదడులో రక్తస్రావం జరిగి బ్రెయిన్ డెడ్ అని డాక్టర్లు నిర్ధారించారు. వైద్యుల అభ్యర్థన మేరకు ఆయన భార్య సవిత, కుమారుడు నిశ్చిత్, కుటుంబ సభ్యులు అవయవాల దానానికి అంగీకరించారు. ఆయన దేహం నుంచి గుండె, మూత్రపిండాలు సహా పలు ముఖ్య భాగాలను సేకరించి అవసరమైన రోగుల కోసం ఆగమేఘాల్లో తరలించారు. సోలార్ రమేష్‌గా శివమొగ్గలో పేరొందిన రమేష్ చనిపోతూ పలువురికి సాయం చేశారని బంధుమిత్రులు నివాళులు అర్పించారు.



ఉసురుతీసిన విద్యుత్ షాక్

శివమొగ్గ: ఇంట్లో నీటి ట్యాంక్ నింపాలని మోటార్ స్విచ్ ఆన్ చేయబోయిన యువతి కరెంటు షాక్ కొట్టి మరణించింది. ఈ దుర్ఘటన శుక్రవారం రాత్రి జిల్లాలోని హొళె హొన్నూరు సమీపంలోని ఎమ్మెహట్టి గ్రామంలో జరిగింది. మృతురాలు నిసర్గ (18). ఆమె హొళెహొన్నూరులోని ప్రభుత్వ కాలేజీలో పీయూసీ చదివేది. షాక్‌తో యువతి అక్కడికక్కడే మరణించినట్లు స్థానికులు తెలిపారు. అప్పటివరకూ కళ్లముందున్న కూతురు క్షణాల్లో విగతజీవి కావడంతో తల్లిదండ్రులు బోరుమన్నారు.

కారుపై పడిన కాంక్రీటు మిక్సర్


నుజ్జునుజ్జయిన కారు, చిత్రంలో మిక్సర్ లారీ

- కారు తుక్కు, ఇద్దరు సురక్షితం
- బెళగావి వద్ద అనూహ్య ఘటన

యశవంతపుర: భూమి మీద నూకలు మిగిలి ఉంటే ఎంత పెద్ద దుర్ఘటన జరిగినా ఇట్టే బయటపడవచ్చు. లేదంటే చిన్న సైకిల్ తగిలినా హరీమనాల్సిందేనని పెద్దలు చెబుతుంటారు. అదే మాదిరిగా జరిగిందీ సంఘటన. రోడ్డుపై నిలిచి కారుపై భారీ పరిమాణంలో ఉన్న కాంక్రీటు మిక్సర్ లారీ పడిపోయింది. కారు తుక్కు తుక్కయినా అందులోని ఇద్దరు బతికి బయటపడ్డారు. బెళగావి వద్ద పూణె- బెంగళూరు హైవేలో సర్వీసు రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది.


కారులో చిక్కుకున్న ప్రయాణికుడు

ఏమైందంటే..

వివరాలు.. ధార్వాడకు చెందిన పరప్ప బాళికాయి, నింగప్ప కొప్ప కారులో బెళగావికి వెళుతూ ఏదో కారణంతో కారును నిలిపారు. వెనుక వస్తున్న కాంక్రీటు మిక్సర్ లారీ అదుపుతప్పి కారుపై పడింది. కారు తుక్కుతుక్కయింది. బెళగావి ఎపిఎంసీ పోలీసులు క్రేన్ సాయంతో పోలీసులు, ఫైర్‌సిబ్బంది వచ్చి మొదట లారీని పక్కకు తీశారు. తరువాత కారులో ఇద్దరికి తీవ్ర గాయాలై ఉంటాయని, లేదా చనిపోయి ఉండవచ్చని భావించారు. కారు డోర్లను ఊడదీసి ఇద్దరినీ బయటకు తీయగా చిన్న చిన్న గాయాలు తప్ప ఏమీ కాకపోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. గాయపడిన వీరిని, లారీ డ్రైవర్‌ని బెళగావి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఏనుగులకు చెక్ పెట్టాలి: మంత్రి

శివాజీనగర: హాసన్ జిల్లాలో బేలూరు తాలూకాలోకి బిక్కోడు, అరెహళ్లి చుట్టుపక్కల అడవి ఏనుగులు దాడులు చేస్తున్నాయి. 3 రౌడీ ఏనుగులు ఆగమాగం చేస్తున్నాయని, వాటిని పట్టుకోవాలని అటవీ మంత్రి ఈశ్వర్ బీ.ఖండ్రె అటవీ అధికారులకు సూచించారు. అలాగే ఈ ప్రదేశంలో ప్రత్యేకంగా ఆఫీసును ఏర్పాటు చేసి అటవీ అధికారిని నియమించాలని తెలిపారు. బేలూరు తాలూకా కోగోడ తోటలో శుక్రవారం ఇద్దరు మహిళలను ఏనుగులు దాడి చేసి చంపడంతో అటవీ సిబ్బంది నిర్లక్ష్యం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి శనివారం వికాససౌధలో అటవీ శాఖాధికారులతో అత్యవసర భేటీ జరిపారు. 2 థర్మల్ కెమెరా డ్రోన్ల కొనుగోలు చేసి రాత్రి వేళ ఏనుగుల సంచారంపై నిఘా వహించాలన్నారు.

ఎల్ఎల్‌సీకి ఏప్రిల్ 10 వరకు నీరివ్వాలి

సాక్షి, బళ్లారి: ఏప్రిల్ 10వ తేదీ వరకు ఎల్ఎల్‌సీ కాలువకు నీటిని విడుదల చేయాలని తుంగభద్ర రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లాధికారిని సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. కంప్లి, కురుగోడు, సిరుగుప్ప, బళ్లారి, తాలూకా పరిధిలో తుంగభద్ర ఎల్ఎల్‌సీ కాలువ పరిధిలో 2 లక్షల ఎకరాల్లో వరి సాగులో ఉందని, ఏప్రిల్ 10వ తేదీ వరకు నీటి అవసరం ఉంటుందని తెలిపారు. ఐసీసీ తీర్మానం ప్రకారం ఈ నెలాఖరు వరకు నీరు విడుదల చేస్తారని, అయితే మరో 10 రోజులు కొనసాగిస్తే పంట చేతికి వస్తుందని అన్నారు.

పుట్టినరోజు ఊటీకి వెళ్లాలని..


ప్రమాద దృశ్యం

మండ్య: బైకిస్టు వేగంగా వెళ్తూ చెట్టును ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండ్య నగరంలోని మైషుగర్ స్కూల్ ముందు శనివారం ఉదయం జరిగింది. మృతుడు తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లాలోని దిన్నపల్లికి ఎం.అరుణ్ కుమార్ (27) కాగా, బైక్ వెనుక కూర్చున్న జయవేలు తీవ్రంగా గాయపడ్డాడు. అరుణ్‌కుమార్ పుట్టినరోజును జరుపుకోవాలని హోసూరు నుంచి ఊటీకి మిత్రునితో కలిసి బైక్‌లో బయల్దేరాడు. వేగంగా వెళ్తూ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొనడంతో అరుణ్ అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ధాటికి చెట్టు కూడా విరిగిపోవడం గమనార్హం. స్థానికులు చేరుకుని జయవేలును ఆస్పత్రికి తరలించారు. మండ్య ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు.

కుటుంబాలు బజారుపాలు

దొడ్డబళ్లాపురం: భవన యజమాని బ్యాంకులో తీసుకున్న అప్పు తీర్చకపోవడంతో బ్యాంకు సిబ్బంది ఆ భవనాన్ని సీజ్ చేశారు. దీంతో అందులో బాడుగకు ఉంటున్న 30 కుటుంబాలు వీధినపడ్డ సంఘటన దొడ్డ తాలూకా బాశెట్టిహళ్లిలో చోటుచేసుకుంది. జవుళి బిల్డింగ్ యజమాని బ్యాంకులో కుదువపెట్టి రూ.3 కోట్లు అప్పు తీసుకున్నాడు. అయితే సకాలంలో కంతులు కట్టకపోవడంతో శనివారంనాడు ఆ భవనానికి తాళాలు వేసి జప్తు చేశారు. అందులో 30 కుటుంబాలు నివసిస్తుండగా వారందరినీ బయటకు గెంటేశారు. వీరంతా అక్కడి గార్మెంట్స్‌లలో పనిచేసే కూలీ కార్మికులు. పిల్లాపాపలతో ఇబ్బందులు పడ్డారు.


రోడ్డు మీద చేరిన తల్లీబిడ్డలు

రంగు రంగులు.. ఉత్సాహం పొంగులు


కలబుర్గిలో ఉట్టి వేడుకలు

- రాష్ట్రమంతటా హోలీ సంబరాలు

బనశంకరి: సిలికాన్ సిటీతో పాటు రాష్ట్రం నలుమూలలా హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. శనివారం వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా పిల్లలు, యువతీ యువకులు, కుటుంబ సభ్యులు రంగు నీళ్లు చల్లుకుని, రంగులు అద్దుకుని చిందులు వేశారు. కొన్నిచోట్ల వీధుల్లో నృత్యాలు చేస్తూ, డీజే చప్పుళ్ల మధ్య ఆనందోత్సవాలలో మునిగిపోయారు. బెంగళూరు నగరవ్యాప్తంగా అపార్టుమెంట్లు, వసతి సముదాయాలు, ఇళ్లు, పాఠశాల కాలేజీ, హోటళ్లు, మైదానాల్లో హోలీని కేరింతలతో సంతోషంగా చేసుకున్నారు. వివిధ లేఔట్లలో కుల మత భేదాలతో సంబంధం లేకుండా ఆచరించారు. రోడ్లు రంగులతో కళకళలాడాయి. చిన్నపిల్లలు పిచికారితో పెద్దలపై రంగులు చల్లారు. నగరంలోని ఉత్తర కర్ణాటక ప్రజలు కామ దహనం చేసి రంగోళి ఆడారు. కొన్నిచోట్ల విదేశీ టూరిస్టులు రంగుల పండుగలో పాల్గొన్నారు. ప్రైవేటు కంపెనీల ఆఫీసుల్లో సంబరాలు జోరుగా జరిగాయి. యువకులు గుంపులుగా ద్విచక్ర వాహనాల్లో తిరుగుతూ రంగులు చల్లుకున్నారు. డీజే డ్యాన్సుల సంబరం మిన్నంటింది. మరోవైపు హుబ్లీ-ధార్వాడ, బెళగావి సహా ఉత్తర కర్ణాటక నగరాలలో స్థానిక సంఘాల ఆధ్వర్యంలో సామూహిక హోలీ వేడుకల వైభవం చెప్పనలవి కాదు. ధార్వాడలో వేలాది మంది ఒకచోట చేరి రంగుల వర్షంలో తడిసిపోయారు.


బెంగళూరులో మహిళల ఉత్సాహం


బెళగావిలో విచిత్రంగా రంగులు వేసుకుని తిరుగుతున్న బాలలు


ధార్వాడ నగరంలో సామూహిక హోలీ ఉత్సవం



కలబుర్గిలో రంగుల్లో తడిసి చిందులు


బెంగళూరులో విదేశీ వనితల కేరింతలు


కలబుర్గిలో రంగులు అద్దుకుని మహిళల నృత్యాలు

ఎత్తు పెంపునకు మహారాష్ట్ర మోకాలడ్డు?

- ఉత్తర కర్ణాటకలో ఆల్మట్టి ఆయకట్టు రైతులకు మరొక షాక్
- మూడు రాష్ట్రాల నుంచి కర్ణాటకకు ఎదురు దెబ్బ
- నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం హుళక్కేనా?
- కొలిక్కి రాని మూడు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల సమావేశం


ఆల్మట్టి డ్యాం(ఫైల్)

రాయచూరు రూరల్: తుంగభద్ర డ్యాంలో పూడిక అధికంగా పేరుకు పోవడంతో నవలి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటు, మహదాయి పథకం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇలా ఉండగా ఉత్తర కర్ణాటక రైతులకు మరొక షాక్ తగలనుంది. కృష్ణా నది ఆయకట్టులోని రైతులకు పెద్ద ఎదురు దెబ్బ తగలనుంది. ఆల్మట్టి డ్యాం నిర్మాణం విషయంలో రైతులకు పరిహారం అందించడంలో ముఖ్యమంత్రి నిధులు కేటాయించలేక పోయారు. మూడో విడత పనులు చేపట్టడానికి నిధుల కొరత ఏర్పడనుంది. విజయపుర జిల్లా బసవన బాగేవాడి వద్ద ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచాలని ప్రభుత్వానికి నివేదిక అందింది. బాగల్‌కోటె, విజయపుర జిల్లాల్లో ముంపునకు గురవుతున్న 20 గ్రామాల ప్రజల పునర్వసతికి లక్ష ఎకరాల భూమి కావాల్సి ఉంది. భూస్వాధీనం ఇతర పనులకు రూ.87,818 కోట్ల మేర ఖర్చు కానున్నట్లు కృష్ణా భాగ్య జల నిగమ మండలి సర్కార్‌కు ప్రతిపాదనలు సమర్పించింది.

15 ఏళ్లుగా కాలయాపన

2010 డిసెంబర్‌లో కృష్ణా ట్రిబ్యునల్–2 తీర్పు ఆధారంగా 524.256 మీటర్లకు ఎత్తును పెంచి నీటిని వాడుకోవడానికి అవకాశం కల్పించింది. 15 ఏళ్ల కావస్తున్నా నీటి వినియోగంలో కర్ణాటక ఇంకా వెనుకంజలో ఉంది. ఈ విషయంలో ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడానికి కర్ణాటక పావులు కదుపుతున్నట్లు గమనించిన మహారాష్ట్ర సర్కార్ అనవసరంగా వ్యతిరేకతను తెలుపుతోంది. ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచితే కర్ణాటకలోని అథణి తాలూకాలో పలు గ్రామాలు ముంపునకు గురవుతాయి తప్ప మహారాష్ట్రకు ఎలాంటి నష్టం లేకపోయినా కావాలనే నీటి పోరు పెట్టుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచితే మహారాష్ట్రలోని సాంగ్లీ, కొల్హాపూర్ జిల్లాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని వాదిస్తోంది.

ప్రారంభం కాని చర్చల ప్రక్రియ

ఈ విషయంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ నుంచి నివేదికలను కోరింది. నవలి వద్ద సమాంతర జలాశయం నిర్మాణ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మూడు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో చర్చల ప్రక్రియ నేటికీ ప్రారంభం కావడం లేదు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.15,000 కోట్లు, భూస్వాధీనం కోసం రూ.9 వేల కోట్ల నిధులు కేటాయించారు. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడానికి మహారాష్ట్ర అడ్డు తగులుతున్నట్లు సమాచారం. నవలి వద్ద సమాంతర జలాశయం నిర్మాణ విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సమన్వయం కదురడం లేదు. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కర్ణాటక రైతులకు లాభం కంటే నష్టాలే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమ మట్టి తవ్వకాలపై తనిఖీ


అక్రమ తవ్వకాలను పరిశీలిస్తున్న ఉప లోకాయుక్త వీరప్ప

హొసపేటె: విజయనగర జిల్లా హొసపేట లూకాలోని కల్లహళ్లి రాజాపుర వ్యవసాయ భూమిలో అక్రమంగా మట్టి రవాణా జరుగుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోని రెవెన్యూ, గనులు, భూగర్భ శాస్త్ర శాఖ అధికారులకు ఉప లోకాయుక్త బీ.వీరప్ప తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. శనివారం ఆయన సంక్లాపూర్ సమీపంలోని మున్సిపల్ ఘన వ్యర్థాల డంప్ యార్డును సందర్శించి, కల్లహళ్లి రాజాపూర్‌లోని పట్టా ల్యాండ్ సర్వే నెంబర్–144లోని వాలినాయక్‌కు చెందిన 4.81 సెంట్ల భూమిలో పది అడుగులకు పైగా లోతున మట్టిని తవ్వి తరలించారని, దీని వల్ల భవిష్యత్తులో సాగు చేయడం అసాధ్యంగా మారిందని ఏకరువు పెట్టారు. అక్రమంగా మట్టిని తొలగిస్తున్నారని తెలుసుకున్న తర్వాత, గనులు, భూగర్భ శాస్త్ర శాఖ డిప్యూటీ డైరెక్టర్ కీర్తికుమార్, భూవిజ్ఞాన శాస్త్ర కిరణ్ రెండు రోజులుగా ఆ స్థలంలో ఉన్న జేసీబీతో సహా ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదని తేలింది. గత 6 నెలలుగా మట్టి తవ్వకం గురించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్‌కు నివేదించామని గ్రామ నిర్వాహకుడు ప్రతాప్ సమాధానమివ్వగా, ఆ స్థలంలో ఉన్న తహసీల్దార్‌కు ఆ విషయం తెలియకపోవడంపై ఉపలోకాయుక్త ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

సబ్ జైలు ఆకస్మిక సందర్శన

హొసపేటెలోని సబ్ జైలును శనివారం ఉప లోకాయుక్త బీ.వీరప్ప ఆకస్మికంగా సందర్శించారు. సబ్ జైలు కమిషనర్ను జైలులో విచారణలో ఉన్న ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, వారి తరఫున వాదించడానికి నియమితులైన న్యాయవాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు విచారణలో ఉన్న ఖైదీలు తాము న్యాయవాదులను నియమించుకోలేదని చెప్పగా, ప్రభుత్వ న్యాయవాదులను నియమించాలని జైలు అధికారులను ఆదేశించారు.

బెంగళూరులో మురుగునీటి శుద్ధి భేష్

- జలమండలికి కేంద్రం రూ.103 కోట్లు మంజూరు


బెంగళూరులోని ఓ మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం (ఎస్‌టీపీ)

బనశంకరి: బెంగళూరు నగరంలో జలమండలి నీటి సరఫరా చర్యలను మెచ్చి కేంద్ర ప్రభుత్వం రూ.103 కోట్ల ప్రోత్సాహక ధనాన్ని మంజూరు చేసింది. జలమండలి ఆధ్వర్యంలో పనిచేస్తున్న 30 ఎస్‌టీపీల నాణ్యతను కేంద్ర జల్‌హి అమృత్ యోజన మెచ్చుకుంది. 23 ఎస్‌టీపీలకు క్లీన్‌వాటర్ క్రెడిట్ కింద 5 స్టార్ రేటింగ్ ఇచ్చింది. ప్రోత్సాహ ధనంగా ఈ నిధులను మంజూరుచేసింది. ఎస్‌టీపీలు సంస్కరణ చేసిన నీటిని బెంగళూరు నగరంలోని చెరువులు, చుట్టుపక్కల జిల్లాల్లో చెరువులను నింపుతుంది. దేశంలోని పలు నగరాల నుంచి దరఖాస్తులు చేశారు. బెంగళూరు జలమండలి పనితీరుకు మెచ్చుకున్నారు.

డీసీఎం సంతోషం

దేశంలోని గుజరాత్, మహారాష్ట్ర తో సహా అత్యధిక ప్రోత్సాహకధనం దక్కించుకున్న ఘనత బెంగళూరుజలమండళి కావడం విశేషం. డిప్యూటీసీఎం డీకే. శివకుమార్ సంతోషం వ్యక్తం చేశారు. నగరంలో ఉత్పత్తిఅయ్యే మురుగునీటిని అత్యుత్తమంగా సంస్కరణ చేయడం తమ ప్రాధాన్యత అన్నారు. బెంగళూరు జలమండలి అధ్యక్షుడు రామ్‌ప్రసాద్‌మనోహర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలు పాటించామని, సంస్కరణ చేపట్టిన నీటివినియోగంలో ఆసియా ఖండంలో మొదటి స్థానంలో ఉన్నామని చెప్పారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి


చిన్నారి ప్రార్థన

రొళ్ల: ఏపీలోని మడకశిర పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రొళ్ల మండలం కొడగార్లగుట్ట గ్రామానికి చెందిన సన్నలింగప్ప కుమార్తె ప్రార్థన శనివారం మృతి చెందింది. కుమార్తె ప్రార్థన, కుమారుడు గోకుల్‌కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో తండ్రి సన్నలింగప్ప వారిద్దరినీ మడకశిరలోని ఆసుపత్రికి బైక్‌లో ఎక్కించుకొని వెళ్తూ మడకశిర వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల సమీపాన జాతీయ రహదారి పక్కన ఉన్న చెరుకు రసం తాగడానికి ఆగారు. బైక్‌ను రోడ్డు పక్కన ఆపి పిల్లలను దాని పైనే కూర్చోబెట్టి చెరుకు రసం తేవడానికి రోడ్డు దాటి అటు వైపు వెళ్లాడు. మధుగిరి నుంచి మడకశిర మీదుగా పావగడ వైపు వెళుతున్న కేఎస్‌ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొని 50మీటర్ల వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో గాయపడిన చిన్నారులిద్దరినీ బెంగళూరు తరలించారు. చికిత్స ఫలించక ప్రార్థనమృతి చెందింది.

తల్లి వెంటే జైలుకు పసిబిడ్డ

బళ్లారిఅర్బన్: ప్రసవించిన 14 రోజులకే అనివార్య కారణాలతో రూ.60 వేలకు విక్రయమైన ఏడాది వయస్సు ఉన్న పసిబిడ్డ ప్రస్తుతం తల్లితో పాటు జైలు చేరిన విషాద ఘటన నగరంలో వెలుగు చూసింది. గౌతం నగర్ నివాసి యల్లమ్మ (27) గత ఏడాది ఫిబ్రవరిలో బీఎంసీఆర్‌సీలో పసిబిడ్డకు జన్మనిచ్చింది. ఈమె భర్త చనిపోయాడు. తనకు ఆ బిడ్డ వద్దని రూపనగుడి రోడ్డు నివాసి నవీన్‌కుమార్ (49)కు రూ.60 వేలకు పసిబిడ్డను విక్రయించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బాలల రక్షణ శాఖ సహాయవాణికి గత ఆగస్ట్ 5న సమాచారం రావడంతో వారు బళ్లారి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపి పసిబిడ్డను ఆంధ్రప్రదేశ్‌లోని ఆలూరు నుంచి తీసుకొచ్చారు. బిడ్డను కొనుగోలు చేసిన నవీన్‌కుమార్, విక్రయించిన బిడ్డ తల్లి యల్లమ్మను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ బిడ్డను బళ్లారి జైల్లో ఉన్న సొంత తల్లి వద్దకే చేర్చారు. ఈ కేసులో విక్రయించిన, కొనుగోలు చేసిన వారికి 10 ఏళ్ల శిక్ష ఉంటుంది. కోర్టులో నేరం రుజువైతే తల్లితో పాటు బిడ్డ కూడా శిక్ష అనుభవించాలా? లేక బాలల రక్షణ శాఖలోని అమ్మ ఒడి ఆశ్రమంలో ఉంటుందా? అనే సందేహం తలెత్తుతోంది. కాగా తల్లి వద్దు అనుకున్న బిడ్డను సంతానం లేని దంపతులు గత ఏడాది నుంచి పెంచి పోషించి తల్లి ప్రేమకు నోచుకొనేలా చేసిన ఆ తల్లిదండ్రులకే దత్తత ఇస్తే బాగుంటుందని సమాజ శ్రేయోభిలాషులు అభిప్రాయపడ్డారు.

వీధి శునకంపై అమానుషం

బనశంకరి: సిలికాన్ సిటీ బెంగళూరులో నీచమైన ఘటన చోటుచేసుకుంది. వీధి శునకంపై లైంగిక దాడి జరిగింది. దీంతో శునకానికి రక్తస్రావమై విలవిలలాడింది. నగరంలోని జయనగర పోలీస్ స్టేషన్ పరిధిలో గల శాలిని మైదానంలో ఈ దురాగతం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు... విద్యా అనే మహిళ వీధి శునకాలకు రోజూ ఆహారం అందిస్తుంది. 13వ తేదీ రాత్రి తిండి పెట్టడానికి వెళ్లగా, ఓ వ్యక్తి శునకంతో సంభోగం చేయడాన్ని మహిళ గమనించి కేకలు వేయడంతో దుండగుడు పరారయ్యాడు. 14వ తేదీ సాయంత్రం కొందరు స్థానికులు వెళ్లి గాలించగా ఆ కామాంధుడు కనబడ్డాడు. తక్షణం అతడిని పట్టుకుని చితకబాది జయనగర పోలీసులకు అప్పగించారు. శునకానికి రక్తస్రావం కావడంతో వైద్యమందించారు.

18న తెలుగు పాస్టర్ల సమావేశం

శివాజీనగర: నగరంలోని మత్తికెర హెచ్ఎంటీ లేఔట్‌లో ఉన్న రసెల్ మెమోరియల్ తెలుగు చర్చిలో ఈ నెల 18న కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తెలుగు పాస్టర్ల సమావేశం జరుగనుంది. ఈమేరకు కేటీసీఎంఎఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజిమన్, చైర్మన్ డాక్టర్ రెవరెండ్ ప్రేమానందం, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ వీ.సాలోమన్, కోశాధికారి రెవరెండ్ ఏ.జీ. జయానందం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర తదితర జిల్లాల్లో సేవలందిస్తున్న పాస్టర్లను ఆధ్యాత్మికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కేటీసీఎంఎఫ్ పని చేస్తున్నట్లు తెలిపారు. పాస్టర్ల సమావేశంలో ప్రసంగికులు డాక్టర్ జాన్‌పాల్, డాక్టర్ రెవరెండ్ జే.డీ.మోజస్ దైవ వర్తమానాన్ని వినిపిస్తారని తెలిపారు.

రన్య కారు డ్రైవర్ అరెస్టు

బనశంకరి: అక్రమ బంగారం తరలింపు కేసులో అరెస్టైన రన్య రావు కారుడ్రైవరు దీపక్‌ను డబ్బు డబ్లింగ్ కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. గతంలో రన్యరావ్‌కు కారుడ్రైవరుగా దీపక్ పనిచేశాడు. ఇతను చిక్కమగళూరులోని హొసమనె లేఔట్‌లో ఉంటున్నాడు. డబ్బును రెట్టింపు చేసి ఇస్తానని పలువురి నుంచి డబ్బు తీసుకుని మోసగించాడని ఫిర్యాదులు రావడంతో అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

బస్సు ఎక్కుతుండగా స్నాచింగ్

మైసూరు: బస్సు ఎక్కుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగుడు లాక్కొని పరారైన ఘటన మైసూరులోని గ్రామీణ బస్టాండ్‌లో జరిగింది. శ్రీరంగపట్టణలోని గిరికొప్పలు నివాసి దేవమ్మ బాధితురాలు. ఈమె బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని దుండగుడు ఆమె మెడలోని రూ.1.10 లక్షల విలువ చేసే 37 గ్రాముల బరువైన బంగారు గొలుసును తెంచుకెళ్లాడు. బాధితురాలు లష్కర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కోటగుడ్డ అధ్యక్షురాలిగా చైతన్య

పావగడ: తాలూకాలోని కోటగుడ్డ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా జేడీఎస్ మద్దతురాలు చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో.. ఎలాంటి పోటీ లేకుండా చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జానకీ రాం ప్రకటించారు.

పార్కుల అభివృద్ధికి పెద్దపీట


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్

పావగడ: స్థానిక మున్సిపల్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో శనివారం ఈ ఏడాది చివరి బడ్జెట్ సమావేశాల ముందస్తు సభ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పీహెచ్ రాజేశ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ పరిధిలో నిర్వహించే వివిధ అభివృద్ధి పనులకు సభ్యులందరి ఆమోదం మేరకు నిధులు కేటాయించారు. ముఖ్యంగా పట్టణంలోని పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్ మాట్లాడుతూ.. ఈనెల 26న మున్సిపల్ చివరి బడ్జెట్ సమావేశాలు జరుగుతాయన్నారు. పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా బడ్జెట్ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పలువురు కౌన్సిలర్ల సూచనల మేరకు పట్టణంలో పలు అభివృద్ధి పనుల నిర్మాణాలకు తగినన్ని నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులకు విశ్రాంతి గది, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థికసాయం, శ్మశాన వాటిక వద్ద నీటి తొట్టె, షెడ్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

ఎరువుల లారీ సీజ్

మాలూరు : ఎరువుల అక్రమ రవాణాపై వ్యవసాయ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. తాలూకాలోని చొక్కండహళ్లి గేట్ వద్ద కోలారు జిల్లా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం మురళీధర నేతృత్వంలోని అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. ఆ సమయంలో అటుగా వచ్చిన లారీని నిలిపి సోదా చేయగా ఇన్ వాయిస్ కంటె అధిక మొత్తంలో ఎరువుల బస్తాలను రవాణా చేస్తున్నట్లు తేలింది. దీంతో ఎరువులతోపాటు లారీని స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాలూరు : తాలూకాలోని నరసాపురం – దొడ్డ శివార మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో దొడ్డ శివార గ్రామానికి చెందిన మంజునాథ అనే వ్యక్తి మృతి చెందాడు. ఈయన రామసంద్ర వద్ద ఉన్న ఫ్లిప్ కార్టు కంపెనీలో పని ముగించుకుని బైక్‌లో ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంజునాథ్‌ను హొసకోట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మాలూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళలను గౌరవించాలి



మహిళలను సన్మానించిన దృశ్యం

కోలారు : పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, వారిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎస్ఎఫ్ఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జోసెఫ్ సూచించారు. కళాశాలలో అఖిల భారత సాహిత్య పరిషత్ , మానవ అభివృద్ధి యోగా ట్రస్టు, ఎస్ఎఫ్ఎస్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఆ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం, సాధక మహిళల సన్మాన కార్యక్రమంలో జోసెఫ్ పాల్గొని మాట్లాడారు. తన పిల్లల శ్రేయస్సు కోసం శ్రమించే ప్రతి మహిళ సాధకురాలేనన్నారు. పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ మహిళ వంటింటి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు సాధన చేయడానికి కారణకర్త అయిన సావిత్రిబాయి పూలే, అంబేద్కర్‌లను మహిళలు నిత్యం స్మరించుకోవాలన్నారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు. పోస్టు నారాయణస్వామి, నివృత్త ఎస్ఐ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మ రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాలూరు : తాలూకాలోని డీఎస్ దొడ్డి గ్రామంలో కొలువైన శ్రీ ప్రసన్న లక్ష్మీ వేంకటరమణస్వామి బ్రహ్మ రథోత్సవ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వారం రోజులుగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవం, గరుడోత్సవం, చిత్ర గోపురోత్సవం, అశ్వవాహనోత్సవం, వసంతోత్సవం, పుష్ప పల్లకీఉత్సవం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని విశేష పూలతో అలంకరించిన రథంలో ఉంచి రథోత్సవం నిర్వహించారు. ప్రముఖ వీధుల్లో రథం ముందుకు సాగింది. భక్తులకు పానకం, పెసరబేడలు, మజ్జిగ పంచడం జరిగింది. ఎమ్మెల్యే కేవై నంజేగౌడ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం విజయనరసింహ, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5, 6న ఉద్యోగులకు క్రీడా పోటీలు


మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ మంగళ

కోలారు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా స్థాయి వార్షిక క్రీడా పోటీలను ఏప్రిల్ నెల 5,6 తేదీలలో నగరంలోని సర్ఎం విశ్వేశ్వరయ్య క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ మంగళ తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సభాంగణంలో నిర్వహించిన పూర్వ సిద్ధతా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. క్రీడా పోటీలకు యువ సబలీకరణ, క్రీడాశాఖ అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అథ్లెటిక్స్, కుస్తీ, పవర్ లిఫ్టింగ్‌తో పాటు కేరం, చెస్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే ఉద్యోగులకు ఓఓడీ సౌలభ్యం ఉంటుందన్నారు. భోజనం, వసతి ఏర్పాట్లు, క్రీడా మైదానంలో ప్రథమ చికిత్స, అంబులెన్స్ తదితర వ్యవస్థలను చక్కగా చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా నిర్వహించడానికి అధికారులు, సిబ్బంది సహకారం అందించాలన్నారు.

అక్రమాలు తేలిన తర్వాతే దరఖాస్తుల స్వీకరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

కోలారు : బగర్ హుకుం భూములకు సంబంధించి గతంలో జరిగిన అక్రమాలు తేలేవరకు కొత్త దరఖాస్తులను స్వీకరించేది లేదని ముళబాగిలు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ స్పష్టం చేశారు. ముళబాగిలు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన బగర్ హుకుం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బగర్ హుకుం మొదటి సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. అయితే గతంలో అధికారులు , సభ్యులు పేదలకు కాకుండా భూములు ఉన్న వారికే మళ్లీ మళ్లీ భూములు ఇచ్చారన్నారు. దీనిపై తాను ఐదేళ్లు పోరాటం చేశానన్నారు. అనర్హులకు మంజూరు చేసిన, తిరస్కరించిన రెండు జబితాలను ఇవ్వాలని కలెక్టర్, తహసీల్దార్లను కోరానన్నారు. వివరాలు అందేవరకు కొత్తగా భూముల మంజూరుకు అనుమతించేది లేదన్నారు. బగర్ హుకుం పథకం కింద ఇంతవరకు 14 దరఖాస్తులు అందాయన్నారు. సమావేశంలో తహసీల్దార్ వీ గీతా, దరఖాస్తు సమితి సభ్యులు గుజ్జనహళ్లి మంజునాథ్, జమ్మనహళ్లి కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వచన సాహిత్యం అమూల్యం

గౌరిబిదనూరు: కన్నడ సాహిత్యానికి అమూల్యమైన కానుక అయిన వచన సాహిత్యాన్ని ఎందరో మహనీయులు అందించారని డాక్టర్ శైలజా సప్తగిరి అన్నారు. వైద్యురాలు డాక్టర్ గీత ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిరాం ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన కన్నడ సాహిత్య కార్యక్రమంలో హాజరై మాట్లాడారు. అక్కమహాదేవి ఆనాటి సామాజిక పరిస్థితులను తమ వచనాలలో ప్రస్తావించారన్నారు. అక్కమహాదేవి రచించిన వచనాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ ప్రకాశ్ ,డాక్టర్ గీతా, కళాకారుడు రామకృష్ణ, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ నాగరత్నమ్మ, సాహిత్య పరిషత్ అధ్యక్షుడు జనార్ధన మూర్తి, బలరాం, గిరిధర్, ఓబళేసు, డాక్టర్ సౌమ్య, సుధీర్, లక్ష్మి గౌరీశ్, రాజేశ్వరి, సరిత పాల్గొన్నారు.

అండర్‌పాస్ పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న కేంద్ర మంత్రి వీ సోమణ్ణ

తుమకూరు : తుమకూరు నగరం శెట్టిహళ్లిలో ఉన్న పాత రేల్వే గేట వద్ద పాదాచారుల సొరంగ మార్గం అభివృద్ధి పనులు, భీమసంద్రలో రైలే అండర్‌పాస్ పనులకు కేంద్ర జలశక్తి, రైల్వే సహాయ శాఖమంత్రి వి.సోమణ్ణ శనివారం భూమిపూజ చేశారు. ఆయా పనులకు రూ.2.49 కోట్లు వ్యయం చేయనున్నారు.

కాంగ్రెస్‌లో విభేదాలు లేవు

- మంత్రి ఎం.బి.పాటిల్

శివాజీనగర: రాష్ట్ర కాంగ్రెస్‌లో ఎలాంటి భిన్నాభిప్రాయలు లేవని మంత్రి ఎం.బి.పాటిల్ అన్నారు. కేపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ పార్టీ ఎమ్మెల్యేలకు ఇచ్చిన విందులో మంత్రి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పరమేశ్వర్ బంధువు మృతి చెందిన నేపథ్యంలో ఆయన విందులో పాల్గొనలేదని, మిగతా అందరు పాల్గొన్నారన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరిగినపుడు సాధారాణంగా మంత్రులు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి విందు ఏర్పాటు చేస్తారన్నారు. తాను కూడా పలు సార్లు విందు ఏర్పాటు చేశానన్నారు. కేపీసీసీ కాబోయే అధ్యక్షుడు ఎవరనేది హైకమాండ్ నిర్ధారిస్తుందని,. తమ స్థాయిలో ఎలాంటి చర్చలు జరగలేదన్నారు.

వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడిగా సయ్యద్ హుసేని

శివాజీనగర: రాష్ట్ర వక్ఫ్ బోర్డు నూతన అధ్యక్షుడిగా కల్బుర్గి హజ్రత్ ఖ్వాజా బందా నవాజు దర్గాకు చెందిన సజ్జాద నశీన్ సయ్యద్ మహమ్మద్ అలి హుసేని ఎంపికయ్యారు. ఈయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాజ్యసభ సభ్యుడు నాజీర్ హుసేన్‌కు ఆప్తుడు. శనివారం నగరంలోని కన్నింగ్‌హామ్ రోడ్డులో ఉన్న రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో సయ్యద్ మహమ్మద్ అలి హుసేనిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఘనంగా హోలీ

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లిలోని హెచ్ఎస్ఆర్ లేఔట్ సామసంద్రపాళ్యలో హోలీ సంబరాలు మిన్నంటాయి. అక్కడ నివాసం ఉంటున్న కుటుంబాల ప్రజలు రోడ్లపైకి వచ్చి హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రంగులు చల్లుకొని ఆనందంగా గడిపారు.


రంగులు చల్లుకున్న దృశ్యం

కాలేజీలో ఫర్నీచర్ చోరీ

మైసూరు: ప్రభుత్వ కాలేజీలో దొంగలు పడ్డారు. రూ.60 వేల విలువ చేసే వస్తువులను చోరీ చేసుకెళ్లిన ఘటన నగరంలోని రాజీవ్‌నగరలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో జరిగింది. ప్రిన్సిపాల్ అబూబకర్ కాలేజీ ముగిసిన తర్వాత తాళం వేసి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఉదయం ఎవరో ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి కాలేజీ తలుపులు తెరిచినట్లు ఉన్నాయని చెప్పారు. వెంటనే వచ్చి చూడగా, కంప్యూటర్, మైక్ స్పీకర్, ఆంప్లిఫైర్, దీప స్తంభంతో సహా పలు వస్తువులు చోరీకి గురైనట్లు తేలింది. ఉదయగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్యాంటర్ వాహనం బీభత్సం.. డ్రైవర్ మృతి

యశవంతపుర: వరుస ప్రమాదాలతో క్యాంటర్ డ్రైవర్‌మృతి చెందిన ఘటన బెంగళూరు నగర బ్యాటరాయనపుర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మైసూరు రోడ్డులోని శాటిలైట్ రోడ్డులో శనివారం వేకువజామున క్యాంటర్ వాహనం అతి వేగంతో ప్రయాణిస్తూ అదుపు తప్పి రోడ్డు పక్కలో నిలిపిన 4 ఆటోలు, రెండు కార్లు, 2 బైకులను ఢీకొంది. ప్రమాదంలో క్యాంటర్ డ్రైవర్ జగన్ తల, చేతులకు బలమైన గాయలయ్యాయి. అతన్ని విక్టోరియాకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బ్యాటరాయనపుర ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గో మాంసం రవాణా అడ్డగింత

యశవంతపుర: గోమాంసం తరలిస్తుండగా భజరంగదళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. బైక్‌పై గోమాంసం తరలిస్తున్నట్లు సమాచారంతో కార్యకర్తలు మంగళూరు కుశేఖర, కై కంబ వద్ద అడ్డుకున్నారు. దీంతో రవాణాదారుడు బైకును అక్కడే వదిలేసి ఉడాయించాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

మహిళ ఆత్మహత్య

మైసూరు: మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చామరాజనగర జిల్లా కొళ్లేగాలలో జరిగింది. మహదేశ్వర కాలేజీ విద్యార్థి నిలయం వంట మనిషి శాంతరాజు భార్య ఆశా(35) మంజునాథనగరలోని తమ నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కొళ్లేగాల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుడి ఆత్మహత్యయత్నం

యశవంతపుర: ఆక్రమణలు తొలగిస్తుండటంతో కాంగ్రెస్ నాయకుడు తహసీల్దార్, పోలీసుల ఎదుటే ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన చిక్కమగళూరు జిల్లా శృంగేరి పట్టణంలో జరిగింది. శృంగేరి కాంగ్రెస్ పార్టీ అల్పసంఖ్యాక విభాగం అధ్యక్షుడు రఫీక్ అహమద్ శృంగేరి పట్టణంలో కల్లుగండి కోసం ప్రభుత్వ జాగలో ఆక్రమంగా షెడ్ నిర్మించాడు. దానిని తొలగించేందుకు శనివారం తహసీల్దార్, పోలీసులు వెళ్లారు. దీంతో రఫీక్ అధికారుల ముందు విషం సేవించటానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

పోలీసు బడావణెలో చోరీ

మైసూరు: ప్రజలకు భద్రత కల్పించే పోలీసు కుటుంబాలకే భద్రత కొరవడింది. ఆలనహళ్లి బడావణె సమీపంలో పోలీసు బడావణె రెండో స్టేజీలో నివాసం ఉంటున్న గిరీష్ అనే వ్యక్తి ఇంట్లోకి దొంగలు చొరబడి మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. దొంగలు హెల్మెట్, మాస్కులు ధరించి మారణాయుధాలతో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

మేడపై నుంచి పడి బాలుడి మృతి

యశవంతపుర: మేడపై నుంచి జారీ పడి బాలుడు మృతి చెందిన ఘటన మంగళూరులో శనివారం జరిగింది. ఇరా కిన్నమజలు బీడుకు చెందిన సదేశ్ భండారి కుమారుడు సమర్జిత్(12) మంగళూరు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం స్నేహితులతో భవనంపైకి వెళ్లాడు. అకస్మికంగా జారి కిందకు పడటంతో తలకు బలమైన గాయలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

కాంగ్రెస్ ఆఫీసులో వేడుకలు

శివాజీనగర: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేపీసీసీ కార్యాలయంలో శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ప్రారంభించి మాట్లాడారు. అట్లాంటిక్ సాగరంలో ఒంటరిగా పడవలో 52 రోజుల్లో 4800 కి.మీ. ప్రయాణించిన అనన్యా ప్రసాద్‌ను సన్మానించారు. ఆ తరువాత మహిళా సాధికారిత గురించి నాటకాన్ని ప్రదర్శించడమైనది. నేతలు జీ.సీ.చంద్రశేఖర్, వినయ్‌కుమార్ సొరకె, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, సౌమ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులు ప్రారంభం



నది పునరుద్ధరణ పనుల అనంతరం ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడను సన్మానించిన దృశ్యం

గౌరిబిదనూరు : ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ వివిధ అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ, అదాని ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో ఉత్తర పినాకినీ నదీ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో ఆగిపోయిన కన్నడ భవన నిర్మాణం పనులకు భూమి పూజ నిర్వహించారు. అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరసభ సభ్యుడు చంద్రమోహన్, కాంతరాజు, వీరణ్ణ, గిరిధర్, జనార్ధన మూర్తి, సప్తగిరి, శైలజా సప్తగిరి, లక్ష్మి, నంజుండప్ప పాల్గొన్నారు.

గుట్కా వ్యాపారిపై దాడి

మైసూరు: డబ్బు విషయమై ఓ సంస్థ మేనేజర్‌ను ఇద్దరు వ్యక్తులు షెడ్‌లో నిర్బంధించి హింసించిన ఘటన నగరంలో జరిగింది. వివరాలు.. రాజీవ్‌నగర్ నివాసులు తాసీఫ్ ఆజం, అహ్మద్‌లు చైనీ గుట్కా అనే పొగాకు ఉత్పత్తుల వ్యాపారి మోహిత్ కుమార్‌ను నిర్బంధించి వేధించారు. సరుకు కావాలని నిందితులు రూ.2.40 లక్షలను ఇచ్చారు. కానీ సరుకు మాత్రం ఇవ్వలేదని ఇద్దరూ ఆగ్రహించారు. మాట్లాడాలని పిలిపించి రాఘవేంద్రనగర వద్ద ఉన్న షెడ్‌లోకి పిలుచుకెళ్లి నిర్బంధించి హింసించారు. మోహిత్ ఎలాగో కుటుంబ సభ్యులకు కాల్ చేసి చెప్పగా వారు కృష్ణరాజ పోలీసులకు తెలిపారు. పోలీసులు మొబైల్ లొకేషన్ ఆధారంగా అక్కడికి వెళ్లి మోహిత్‌ను రక్షించారు. నిందితులపై కేసు నమోదైంది.

రోడ్డు పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి నియోజకవర్గం హొంగసంద్ర వార్డు ఆదర్శ లేఔట్ 14వ క్రాస్ వద్ద డాంబర్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి శనివారం భూమిపూ చేశారు. అనంతరం మాట్లాడుతూ 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. నగరసభ మాజీ సభ్యుడు టి.రామచంద్ర పాల్గొన్నారు.

రైలులో గంజాయి సీజ్

మైసూరు: రైలులో తరలిస్తున్న 1.6 కేజీల గంజాయిని స్వాధీనపరచుకున్నారు. ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ పూజా రాము నేతృత్వంలో దర్భంగా నుంచి మైసూరుకు వచ్చిన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో సోదాలు చేశారు. ఏసీ జనరల్ కోచ్‌లో నీలం రంగు సూట్‌కేసులో 1 కేజీ 692 గ్రాముల గంజాయి లభించింది. సొంతదారు ఎవరనేది తెలియరాలేదు.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు



స్వామివారికి పూజలు నిర్వహించిన దృశ్యం

బొమ్మనహళ్లి : ఆనేకల్ పట్టణం వినాయకనగరలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సేవాకర్తలు నరసింహారెడ్డి, రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి అలంకరణ చేపట్టి విశేష పూజలు నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి నారాయణస్వామి, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: దివంగత కన్నడ నటుడు పునిత్ రాజ్ కుమార్ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ పునిత్ రాజ్‌కుమార్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎస్ఆర్ లేఔట్‌లోని అటల్ బీహారి వాజ్‌పాయ్ క్రీడా మైదానంలో శనివారం పునిత్ రాజ్ కుమార్ క్రికెట్ కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. హెచ్ఎస్ఆర్ లేఔట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు టి.వాసు దేవరెడ్డి హాజరై పునిత్ రాజ కుమర్ చిత్రపటానికి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. పునిత్ రాజ్ కుమార్ దేశం మొత్తం గర్వించదగిన సమాజ సేవకుడు అని కొనియాడారు.

రమణీయం గంగడికల్ శిఖరం



పచ్చదనం పరుచుకున్న గంగడికల్ శిఖరం



పర్వతంపై ట్రెక్కర్లు సెదతీరిన దృశ్యం

- దట్టమైన అడవులు, లోయలు
- మంచుతెరలతో ఆహ్లాదకరం
- వన్య జీవులు, వివిధ పక్షుల కనువిందు
- ట్రెక్కర్లకు స్వర్గధామం

బనశంకరి: పశ్చిమకనుమల్లో అత్యంత ఆహ్లాదభరితమైన కుద్రేముఖ్ పర్వతశ్రేణిలో ఒకటైన గంగడికల్ శిఖరం పర్యాటకులకు భూలోక స్వర్గంగా మారింది. చిక్కమగళూరు జిల్లాలోని గంగడికల్ శిఖరం సముద్ర మట్టానికి 4806 అడుగుల ఎత్తులో ఉంది. పర్వతశ్రేణికి ఇరువైపులా లోతైన లోయ ఉండటంతో ట్రెక్కింగ్ ఎంతో అద్భుతంగా ఉంటుందనడంలో సందేహంలేదు. ఈ శిఖరం వైవిధ్యమైన ఔషధమొక్కలు, వన్యజీవులకు నిలయం. గౌర్, జింకలు, పులులు, చిరుతలతో పాటు వివిధ రకాల పక్షులను చూడవచ్చు. గంగడికల్ శిఖరం షోలాగడ్డితో నయమనోహరంగా కనబడుతుంది. గౌర్ లేదా జింకలు గుంపులుగా దర్శనమిస్తాయి. గ్రేహార్న్‌బిల్, మలబార్‌ట్రోగన్, ఆరెంజ్‌హెడెడ్‌థ్రష్ లాంటి పక్షిజాతులు. శీల్డ్‌టేల్స్, మలబార్‌పిట్‌వైపర్ లాంటి విసర్పాలను చూడవచ్చు. గంగడికల్ అరణ్యచెక్‌పోస్ట్ వద్ద ట్రెక్కర్లు కార్లను పార్కింగ్ చేసి అటవీ అధికారులు అనుమతి తీసుకుని గంగడికల్ శిఖరం ట్రెక్కింగ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దట్టమైన అడవిలో 250 మీటర్ల ఎత్తుకు చేరుకోగానే ఏపుగా పెరిగిన షోలాగడ్డిలో వెళ్లాలి. అక్కడనుంచి ఎడమవైపు వెళితే గంగడికల్ పర్వతం స్పష్టంగా కనబడుతుంది. పర్వతం మధ్య చిన్నపాటి లోయలోకి దిగి మళ్లీ పైకి చేరుకోవాలి. 400 మీటర్ల ఎత్తుకు చేరుకోగానే కుడివైపు అజికుంజ, వాలికుంజ ఎడమవైపు కురింజల్ కనబడుతుంది. గంగడికల్ శిఖరం చేరుకోగానే కుద్రేముఖ్ కొత్తముఖాన్ని వీక్షించవచ్చు. గంగడికల్ ట్రెక్ అనంతరం కురింజల్‌ట్రెక్, బల్లారాయనదుర్గ, అనేగుడ్డ ట్రెక్, కార్కళ, హొరనాడు ఆలయాలను వీక్షించవచ్చు.

ట్రెక్కింగ్‌కు సెప్టెంబర్, జనవరి మధ్య అనుకూలం


గంగడికల్ పర్వతం ట్రెక్కింగ్‌కు సెప్టెంబరు చివరి నుంచి జనవరి వరకు సరైన సమయం. వర్షాకాలం అనంతరంతఈ ప్రదేశం ప్రకృతి రమణీయంగా ఉంటుంది. ఈ శిఖరంపై దట్టమైన మంచు, బలమైన గాలితో కూడుకుని ఉండటంతో ప్రత్యేక అనుభూతి కలిగిస్తుంది. ఏప్రిల్, మేనెలలో ఈ ప్రదేశంలో కార్చిచ్చు ప్రమాదం ఉంటుంది. ఆ సమయంలో ట్రెక్కింగ్‌కు అనుమతిలేదు. జూన్ నుంచి ఆగస్టు వరకు భారీ వర్షాల కారణంగా ట్రెక్కింగ్ కష్టసాధ్యం . దీంతో అటవీశాఖ ట్రెక్కింగ్‌ను నిషేధిస్తుంది.

గంగడికల్ ఎలా వెళ్లాలంటే....

మలెనాడులో ప్రముఖ పట్టణాల్లో ఒకటైన కళస నుంచి 33 కిలోమీటర్ల దూరంలో గంగడికల్ ఉంది. చిక్‌మగళూరు రోడ్డుమార్గంలో వెళ్లి కొట్టిగేహర చేరుకుని అక్కడ నుంచి కళస వెళ్లాలి. అనంతరం కుద్రేముఖ్ అరణ్య కార్యాలయంలో సంప్రదించి గంగడికల్ చేరుకోవచ్చు.



శిఖరం వద్ద రాతిపై ట్రెక్కర్



కురింజల్‌శిఖరంపై ట్రెక్కర్లు



కుద్రేముఖ్ పర్వతంలో ట్రెక్కింగ్

వైభవంగా కాశీవిశ్వనాథేశ్వర రథోత్సవం



రథోత్సవ దృశ్యం



జానపద కళాకారుల బృందాల ఊరేగింపు

బొమ్మనహళ్లి: ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలో వెలసిన కాశీ విశ్వనాథేశ్వర స్వామి, మహాగణపతి, సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మరథోత్సవం శనివారం వేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా జరిగింది. తొలుత ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌లకు అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం పచ్చటి తోరణాలతో అలంకరించిన రథంలో గిరిజా దేవి సమేత కాశీవిశ్వనాథేశ్వర ఉత్సవ మూర్తులను రథంలో కొలువు దీర్చారు. పూజల అనంతరం రథాన్ని ముందుకు లాగారు. మంగళ వాయిద్యాల మధ్య వేలాది మంది భక్తులు జయ జయధ్వానాలు చేస్తుండగా రథం ప్రధాన వీధుల్లో ముందుకు సాగింది. డొల్లుకుణిత, విరాగాసె, గారడిబొమ్మ కళాకారుల విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. దొమ్మసంద్ర, సర్జాపుర, అత్తిబెలె, చందపుర, ఆనేకల్, యమరె గ్రామాల నుంచి భక్తులు వచ్చి రథోత్సవాన్ని వీక్షించారు. భక్తులకు బెల్లం పానకం, మజ్జి, వడపప్పు పంపిణీ చేశారు. ఆలయంలో కాశీ యాత్ర, గిరిజా కళ్యాణం, నంది వాహనోత్సవం, డోలోత్సవం, ఊయలోత్సవం నిర్వహించారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా మేళా



దుస్తులను వీక్షిస్తున్న సందర్శకులు



సందర్శకుల సందడి

బనశంకరి: ఉగాది పండుగ సందర్భంగా దిగ్రాండ్ రాజస్థానీ ఎగ్జిబిషన్, చేనేత హస్తకళా మేళా నగర వాసులను కనువిందు చేస్తుంది. బాణసవాడి రింగ్ రోడ్డు వీవీ.కన్వెన్షన్ హాల్‌లో మారుతి ఎంటర్ ప్రైజస్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాజస్థాన్ కాటన్ డ్రెస్‌మెటీరియల్స్, మల్మల్‌కాటన్ చీరలు, బందని, లెప్రాన్‌శారీస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బీహర్ బాగల్పూర్ తాసర్ పట్టుచీరలు, జమ్మూకశ్మీర్ చినోన్‌సిల్క్, పశ్మీనా శాలువాలు, చీరలు, ఒడిశా ఇక్కత్ చీరలు, ఇక్కత్‌కుర్తాస్, ఫ్యాబ్రిక్, చత్తీస్‌ఘడ్ కోరా రేష్మచీరలు, తుస్సార్ స్కిల్‌శారీస్, మధ్యప్రదేశ్ మహేశ్వరి, చందేరి పట్టు చీరలు మహిళల మనస్సు దోచేస్తున్నాయి. కర్ణాటక చెన్నపట్టణ బొమ్మలు, తమిళనాడు సుంగుడి చీరలు, రాజస్థాన్ ఆహార ఉత్పత్తులు, కేరళ వంట సామగ్రి, మహిళలు ఎంతగానో ఇష్టపడే చేతి బ్యాగులు, గృహోపకరణ వస్తువులు ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శన 30వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకుడు కృష్ణన్ ఉన్ని తెలిపారు.

రన్యారావు కేసును సీఐడీకి అప్పగించాలి



కేంద్రమంత్రి జోషిని సత్కరిస్తున్న ఉడుపి మఠం సిబ్బంది

దొడ్డబళ్లాపురం: కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి శనివారం సతీసమేతంగా ఉడుపిలోని శ్రీకృష్ణ మఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కడెగోలు శ్రీకృష్ణుడి దర్శనం చేసుకున్నారు. సుగుణేంద్ర తీర్థ స్వామీజీని కలిసి కాసేపు మాట్లాడారు. అక్కడే అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో రన్యారావ్ గోల్డ్ స్మగ్లింగ్ కేసుకు సంబంధించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిందితురాలికి ఎస్కార్ట్ ఇస్తున్నట్లు ఉందన్నారు. ప్రోటోకాల్ ఇచ్చి కింగ్ చేయకుండా పంపించారన్నారు. కేసులో రాష్ట్ర మంత్రి పేరు వినబడుతోందన్నారు. ఈ కేసును సీఐడీకి అప్పగించాలన్నారు. రూపాయి చిహ్నాన్ని మార్చిన తమిళనాడు ప్రభుత్వం నిర్ణయం సమంజసం కాదన్నారు. రూపాయి సింబల్ మోదీ తయారు చేసింది కాదన్నారు. ఆ సింబల్ కాంగ్రెస్ హయాంలోనే గుర్తించారన్నారు. త్రిభాషా సూత్రం నెహ్రూ కాలం నుంచి ఉందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- మృతిపై అనుమానం ఉందంటున్న కుటుంబ సభ్యులు

మైసూరు: క్రికెట్ ఆడేందుకు వెళ్లి నడిరోడ్డులో పడిపోయి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన యువకుడి ఉదంతంలో అనుమానం ఉందని కుటుంబ సభ్యులు అంటున్నారు. జిల్లాలోని హెచ్‌డీకోటె తాలూకా బీచనహళ్లిలో ఫిబ్రవరి 24న బీచనహళ్లి నేరళె ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ఫైనల్ పోటీలో జేపీ వారియర్స్‌పై హెచ్‌డీకోటె తాలూకా వడ్డరగుడి గ్రామానికి చెందిన దివ్యాకుమార్ సిక్స్ కొట్టి గెలిపించాడు. మ్యాచ్ గెలిచిన తర్వాత దివ్యాకుమార్ టీం పార్టీ చేసింది. అనంతరం ఇంటికి బయల్దేరిన దివ్యాకుమార్ నడిరోడ్డులో పడిపోయాడు. అతనిని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మరణించాడు. బైక్ ప్రమాదం వల్ల ఇలా జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. అయితే బైక్‌కు ఎలాంటి డ్యామేజీ కాకపోవడంతో తమ కుమారుడు ప్రమాదంలో మృతి చెందలేదని, ఇతర కారణాలు ఉండవచ్చని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటన జరిగినప్పటినుంచి క్రికెట్ పోటీల నిర్వాహకులు తమకు అందుబాటులో లేరని కుటుంబ సభ్యులు ఆరోపించారు. పోలీసులు కూలంకషంగా దర్యాప్తు జరిపి తమ కుమారుడి మృతిపై నెలకొన్న అనుమానాలు తీర్చాలని కోరుతున్నారు.

బీబీఎంపీ విభజన బిల్లు ఉపసంహరించుకోవాలి

శివాజీనగర: బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ను గ్రేటర్ బెంగళూరు పేరుతో విభజించటాన్ని వ్యతిరేకిస్తూ జేడీఎస్ నగరంలో శనివారం ఫ్రీడం పార్కు వద్ద ధర్నా చేపట్టింది. బెంగళూరు మహానగర జేడీఎస్ అధ్యక్షుడు హెచ్.ఎం.రమేశ్‌గౌడ, విధానపరిషత్ సభ్యుడు టీ.ఎన్.జవరేగౌడ, విధానపరిషత్ మాజీ సభ్యుడు కే.ఏ.తిప్పేస్వామిలు ప్రభుత్వ వ్యతిరేక ప్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. నాడప్రభు కెంపేగౌడ నిర్మించిన బెంగళూరును చిన్నాభిన్నం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ధ్వజమెత్తారు. బెంగళూరును విభజించి రియల్ ఎస్టేట్ దందా చేసేందుకు విభజనను తెరపైకి తెచ్చారని ఆరోపించారు. బెంగళూరును 7 భాగాలుగా విభజించే గ్రేటర్ బెంగళూరు బిల్లుకు ఆమోదం తెలుపకుండా తిరస్కరించాలని గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తామని రమేశ్‌గౌడ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డీసీఎం పాల్గొనే కార్యక్రమాల్లో బ్లాక్ జెండాలను ప్రదర్శిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అధ్వానంగా ఉందని, నిత్యావసరాల ధరలు పెరిగాయని, నగరంలో నీటి సమస్య ఏర్పడిందని ఆరోపించారు.

హోసూరు వార్తలు..

పంటలపై గజదాడులు



వేపనపల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి జిల్లా వేపనపల్లి ప్రాంతంలో మకాం వేసిన జంట ఏనుగులను దట్టమైన అటవీ ప్రాంతానికి మళ్లించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వేపనపల్లి సమీపంలోని కొంకనపల్లి అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగు మంద నుంచి రెండు ఏనుగులు విడిపోయి సిగరమాకనపల్లి, కొత్తూరు, నేరలగిరి, సిగర్లపల్లి తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. ఏనుగులను దట్టమైన అటవీ ప్రాంతానికి మళ్లించాలని, పంట నష్టానికి పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

గదులకు భూమిపూజ

హోసూరు: పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి శనివారం ఉదయం హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ భూమిపూజ చేశారు. పారిశ్రామికవాడలోని బేగేపల్లి పంచాయతీ గోవింద అగ్రహారం పంచాయతీ సమితి ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు నిర్మించాలని స్థానిక ప్రజలు, పాఠశాల సిబ్బంది కోరారు. ఎమ్మెల్యే నాబార్డ్ పథకం ద్వారా రూ. 32.72 లక్షలను మంజూరు చేయించారు. ఈ నిధులతో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోపాల్, మంజు, వేణు, రాజా, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కబ్జా, జనం వెతలు



గోడు చెబుతున్న ప్రజలు

కెలమంగలం: నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లడంతో ఆ ప్రాంత ప్రజలు శనివారం ఆందోళన చేశారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని పారిశ్రామికవాడ జూజువాడి సెందిల్‌నగర్ ప్రాంతంలో వందలాది కుటుంబాలు నివాసముంటున్నారు. గత 30 ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ కాలువ ఉన్న ఓ వ్యక్తి తన పట్టాభూమి అని అడ్డుకున్నాడు. దీంతో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోందని, నివాస ప్రాంతాల్లో రోడ్డుపై ముక్కు మూసుకొని వెళ్లవలసిన దుస్థితి చోటు చేసుకొందని వాపోయారు. అధికార్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు వెంటనే చర్యలు చేపట్టి డ్రైనేజీని నిర్మించాని ధర్నా చేశారు.

హంతకునికి జీవితఖైదు

హోసూరు: రాయకోట సమీపంలో దాయాదిని హత్య చేసిన ఘటనలో హంతకునికి జీవితకాలం జైలు శిక్ష విధించారు. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా రాయకోటకు చెందిన వెంకటేష్ (31) శిక్ష పడినవాడు. ఇతని తల్లిదండ్రులు ఓ దత్త కూతురిని పెంచుకొంటూ వచ్చారు. గత తొమ్మిదేళ్ల క్రితం ఆస్తిని దత్తకూతురి పేరుమీద రాస్తామనడంతో వెంకటేష్ కక్ష పెంచుకున్నాడు. పినతండ్రి కొడుకు సుందరరాజ్‌తో మద్యం తాగుతూ ఈ విషయమై మాట్లాడుతూ ఉండగా గొడవ జరిగింది. వెంకటేష్ కత్తితో సుందరరాజ్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. రాయకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితున్ని అరెస్ట్ చేశారు. ఈ కేసు హోసూరు కోర్టులో జరుగుతూ వచ్చింది. శుక్రవారం జడ్జి సంతోష్.. నిందితుడు వెంకటేష్‌కు జీవిత జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

తొమ్మిది జీపీలకు గాంధీ గ్రామ పురస్కారాలు

మైసూరు: స్వచ్ఛత, పరిసరాల సంరక్షణకు కృషి చేసిన జిల్లాలోని తొమ్మిది గ్రామ పంచాయతీలు 2024–25వ సంవత్సరానికి గాంధీ గ్రామ పురస్కారాలకు ఎంపికయ్యాయి. మైసూరు తాలూకాలోని దొడ్డ మారగౌడనహళ్లి, నంజనగూడు తాలూకాలోని కెంపిసిద్దనహుండి, టీ.నరసీపుర తాలూకాలోని హొసకోటె, హుణసూరు తాలూకాలోని తట్టెకెరె, సాలిగ్రామ తాలూకాలోని హళియూరు, పిరియాపట్టణ తాలూకాలోని కణవాలు, హెచ్‌డీ కోటె తాలూకాలోని తుంబసోగె, సరగూరు తాలూకాలోని హెగ్గనూరు, కేఆర్‌నగర తాలూకాలోని అర్జునహళ్లి గ్రామ పంచాయతీలకు ఈ పురస్కారాలు దక్కాయి. పురస్కారం కింద ఎంపికైన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి తలా రూ.5 లక్షల చొప్పున బహుమతిని ప్రకటించింది.

చెత్తకు నిప్పు.. ఇల్లు దగ్ధం

దొడ్డబళ్లాపురం: ఆకతాయిలు చెత్తకు పెట్టిన నిప్పు వల్ల మంటలు వ్యాపించి ఇంటిలోని వస్తు సామగ్రి దగ్ధమైంది. ఈ ఘటన దొడ్డ తాలూకా హొసహళ్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామక్క అనే మహిళ పొలం పనులు చేస్తూ జీవిస్తోంది. ఆమె శనివారం పొలానికి వెళ్లిన సమయంలో స్కూల్ నుండి వచ్చిన 5మంది పిల్లలు ఇంట్లో ఆడుకుంటున్నారు. ఆ సమయంలో ఇంటి పక్కన చెత్తకు ఆకతాయిలు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి రామక్క ఇంటికి వ్యాపించాయి. మంటలను గమనించిన పిల్లలు బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. అగ్నిమాపకదళం సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే ఇంట్లోని తిండిగింజలు, వస్తువులు, ముఖ్యమైన డాక్యుమెంట్లు కాలిబూడిదయ్యాయి.

మహిళ ఆత్మహత్య

బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలోని ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు ఉత్తర కర్ణాటక ప్రాంతానికి చెందిన సితార (26) భర్త ప్రవీణ్ మోరె, పట్టణంలోని నార్పల క్రాసింగ్‌లో బేకరీ పెట్టుకుని జీవనం గడుపుతున్నారు. తరచూ భార్యాభర్తలు గొడవ పడుతూ ఉండేవారు. శుక్రవారం రాత్రి ఇద్దరూ రగడపడ్డారు. కొంతసేపటికి సితార ఫ్యాన్‌కు ఉరేసుకుని ప్రాణాలు తీసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. భర్త, పిల్లలు కన్నీరుమున్నీరుగా రోదించారు.

అనర్హత వేటుపడ్డ సభ్యుడికే అందలం

- బెళగావి మేయర్‌గా మంగేశ ఏకగ్రీవంగా ఎన్నిక



మంగేశ

దొడ్డబళ్లాపురం: అనర్హత వేటుపడ్డ సభ్యుడే బెళగావి మేయర్‌గా ఎన్నికయ్యాడు. పాలికె ఆధ్వర్యంలో నిర్మించిన వాణిజ్య మాళిగల్లో పాలికె సభ్యులు మంగేశ, జయంత్ జాదవ్ భార్యల పేరుతో మాళిగలు కలిగి ఉన్నాయని ఫిర్యాదులు అందడంతో పరిశీలించి వారిద్దరి సభ్యత్వం రద్దు చేశారు. సభ్యత్వ రద్దును ప్రశ్నిస్తూ నగరాభివృద్ధి శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా చుక్కెదురైంది. చివరి ప్రయత్నంగా హైకోర్టును ఆశ్రయించగా సభ్యత్వం రద్దుపై కోర్టు స్టే ఇచ్చింది. బెళగావి మేయర్ ఎన్నికకు రెండు రోజులకు ముందుగా ఈ స్టే రావడంతో అందరి అంచనాలు తారుమారయ్యాయి. శనివారం మేయర్ ఎన్నిక జరిగింది. ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. మంగేశ్ సభ్యత్వం రద్దు చేసిన అధికారే ఆయనకు మేయర్‌గా ప్రమాణపత్రాన్ని అందజేశారు.

గవిరాయస్వామి బెట్టలో కార్చిచ్చు

మైసూరు: చామరాజనగర జిల్లా కొళ్లేగాల సత్తెగాల హ్యాండ్ పోస్టు వద్ద ఉన్న గవిరాయస్వామి బెట్ట అటవీ ప్రాంతంలో కార్చిచ్చు చెలరేగింది. దీంతో 25కు పైగా ఎకరాల విస్తీర్ణంలోని చెట్లు మంటలకు ఆహుతయ్యాయి. పచ్చదనం హరించుకపోయింది. అటవీ శాఖ సిబ్బంది, అగ్నిమాపక శాఖ బృందం శ్రమించి మంటలను ఆర్పారు. అటవీ శాఖ ఏసీఎఫ్ శివరాం, ఆర్ఎఫ్ఓ భరత్, డీఎఫ్ఓ నందీశ్, ఈఓ గురుశాంతప్ప బెళ్లుండగి, సిబ్బంది చేరుకుని పరిశీలించారు.

కావేరి నదిలో తాతామనవళ్ల జల సమాధి

మైసూరు : ఇద్దరు మనవళ్లు నీటిలో కొట్టుకుపోతుండగా వారిని రక్షించేందుకు వెళ్లిన తాత కూడా జల సమాధి అయ్యాడు. ఈ విషాద ఘటన మైసూరు జిల్లా, టీ నరసీపుర తాలూకాలో శనివారం జరిగింది. టీ నరసీపుర పట్టణం తిరుమకోడలులో నివాసం ఉంటున్న చౌడయ్య(70) తన మనవళ్లు భరత్(13), ధనుష్(10)తో కలిసి కావేరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లాడు. మనవళ్లు నీటిలోకి దిగి ఈ కఒడుతూ మునిగిపోతుండటాన్ని గమనించి రక్షించేందుకు వెళ్లాడు. దీంతో ముగ్గురూ నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. టీ నరసీపుర పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి గాలింపు చేపట్టి మృతదేహాలను వెలికి తీయించి ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

హత్య కేసులో నలుగురు అరెస్టు

హోసూరు: బావి నీరు గురించి గొడవలో నివృత ఇంజినీర్‌ను హత్య చేసిన ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి తాలూకా బారూర్ సమీపంలోని పనందూరు గ్రామానికి చెందిన నివృత ఇంజనీర్ శక్తివేల్ (62). ఇతని భార్య లత(52), అదే ప్రాంతానికి చెందిన రామక్రిష్ణ(55)ల మధ్య స్థలంలో బావిలో నీరు తీసే విషయంపై పాతకక్షలుండేవి. గత 9వ తేదీన శక్తివేల్‌ను హత్య చేశారు. బారూర్ పోలీసులు కేసు విచారణ చేపట్టారు. బారూర్ ప్రాంతంలో దాగి ఉన్న నిందితులు రామక్రిష్ణ, అతని భార్య శాంతి (40), పళణివాసన్, తిరుమలలను అరెస్ట్ చేశారు.

మూత్రపిండాలను కాపాడుకోవాలి

హోసూరు: ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా శనివారం హోసూరులో ప్రైవేటు ఆస్పత్రి సిబ్బంది మూత్రపిండాల పరిరక్షణపై వీధినాటక ప్రదర్శన నిర్వహించారు. కిడ్నీ రోగులకు ఆరోగ్య రక్షణ గురించి వివరించారు. యూరాలజిస్ట్ డాక్టర్ సాయి సమీర మాట్లాడుతూ మూత్రపిండాల జబ్బుల వల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు, శరీరంలో వచ్చే మార్పులను బట్టి ఆ జబ్బులను ఎలా గుర్తించాలనేది ప్రజలకు వివరించారు. వైద్యులు అరవింద్, జోస్‌వర్గీస్‌జాయ్, బిందుకుమారి, శ్రీరామజయం తదితరులు పాల్గొన్నారు.

గోదాములో అగ్ని ప్రమాదం



చెలరేగుతున్న మంటలు

దొడ్డబళ్లాపురం: బెంగళూరు జ్ఞానభారతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉల్లాల మెయిన్ రోడ్డులో ఉన్న సెంట్రింగ్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెద్ద మొత్తంలో సెంట్రింగ్ కట్టెలు, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. లక్షల్లో నష్టం వాటిల్లినట్లు గోడౌన్ యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆకతాయిలు నిప్పు పెట్టి ఉండవచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. శుక్రవారం గోడౌన్ యజమాని ఇంటికి వెళ్లిపోయాక రాత్రి ఈ ప్రమాదం జరిగింది. జ్ఞానభారతి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

క్లుప్తంగా...

'కూటమి' పాలనలో కోకో కౌలు రైతులు కుదేలు

ఏపీ కౌలు రైతుల సంఘం

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి సర్కారు పాలనలో ఈ ఏడాది రాష్ట్రంలోని అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు లభించనట్లుగానే కోకో పంట ధరలు కూడా పడిపోయి ఆ రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య శనివారం ఆవేదన వ్యక్తంచేశారు. కోకో పంటను ఏలూరు, శ్రీకాకుళం, కాకినాడ, కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, అంబేద్కర్ కోనసీమ, పార్వతీపురం మన్యం తదితర జిల్లాల్లోని 75 వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారన్నారు. ఏటా 12 వేల టన్నులు దిగుబడి వస్తుందన్నారు. కానీ, మన అవసరాలకు మించి ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుని స్థానిక రైతులకు నష్టంచేసేలా కేంద్రం వ్యవహరిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు.

తిరుమలలో జ్యుడీషియల్ ఏకసభ్య కమిషన్ విచారణ

క్యూ లైన్లను పరిశీలించిన చైర్మన్



క్యూలను పరిశీలిస్తున్న చైర్మన్

తిరుమల: తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం వేచి ఉన్న భక్తుల తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి శనివారం తిరుమలలో పర్యటించారు. దర్శన క్యూలు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1,2 లను పరిశీలించారు. తొక్కిసలాట ఘటనకు ముందు తిరుమలలో ఏర్పాటు చేసిన క్యూలైన్ తరహాలో తిరుపతిలోని 8 ప్రాంతాల్లో క్యూలైన్ల ఏర్పాటు చేసినట్లు టీటీడీ అధికారులు జస్టిస్ సత్యనారాయణమూర్తికి చెప్పారు. తిరుమలలో క్యూల నిర్వహణ, భక్తులను అనుమతించే తీరును 2 రోజుల పాటు కమిషన్ చైర్మన్ అధ్యయనం చేయనున్నారు. ఆదివారం తిరుమలలోని పలు ప్రాంతాల్లో క్యూలను పరిశీలించి నివేదిక తయారు చేస్తారు. ఈ నెల 17న టీటీడీ, పోలీసు, రెవెన్యూ అధికారులతో పాటు తొక్కిసలాటలో గాయపడిన 16 మందిని విచారిస్తారు.

తెలంగాణ

వీడియోతో బాలికకు వేధింపులు

గచ్చిబౌలి: వీడియో చూపించి ఓ మైనర్ బాలికను ముగ్గురు మైనర్లు వేధింపులకు గురిచేశారు. బాలిక ఫిర్యాదుతో పోలీసులు వారిని అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని తన క్లాస్‌మేట్‌తో సన్నిహితంగా ఉండగా మరో విద్యార్థి వీడియో తీశాడు. వీడియో చిత్రీకరించిన మైనర్ తనతోనూ సన్నిహితంగా గడపాలని బాలికను వేధించాడు. ఈ క్రమంలో తరగతి గదిలో ఎవరూ లేని సమయంలో బాధితురాలు ఆ బాలుడి బ్యాగులోని సెల్‌ఫోన్ పగులగొట్టింది. ఈ వ్యవహారాన్ని మరో విద్యార్థి గమనించాడు. కొద్దిసేపటికి వచ్చిన మైనర్ బాలుడు తన సెల్‌ఫోన్ కోసం వెతుకుతుండగా.. ఫలానా విద్యార్థిని తీసిందని తన స్నేహితుడితో విషయం చెప్పాడు. ఈ క్రమంలో పగిలిన సెల్‌ఫోన్ నుంచి ఆ వీడియోను స్నేహితునికి కూడా షేర్ చేశాడు. దీంతో ఆ వీడియోను చూపిస్తూ తనతోనూ సన్నిహితంగా గడపాలని మరో మైనర్ బాలికను వేధించడం మొదలుపెట్టాడు. అలాగే తనకు కొత్త సెల్‌ఫోన్ కొనివ్వాలని బాలికను ఒత్తిడి చేయడంతో బాధితురాలి స్నేహితులు ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు వివరించారు. దీంతో తల్లిదండ్రులతో కలిసి బాధిత విద్యార్థిని మూడు రోజుల క్రితం గచ్చిబౌలి ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోక్సో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బాలికతో సన్నిహితంగా ఉన్న మైనర్‌ను, వేధింపులకు గురిచేసిన మరో ఇద్దరు బాలురను అరెస్ట్ చేశారు.

కాస్త పెరిగిన టమాటా ధరలు



చిత్తూరు జిల్లా పలమనేరు టమాటా మార్కెట్‌లో శనివారం టమాటా ధరలు కాస్త పెరిగాయి. 15కిలోల బాక్సు ధర రూ.110 నుంచి రూ.130 దాకా పలికింది. టమాటా ధరలు ఢమాల్ అనే శీర్షికన రెండ్రోజుల క్రితం సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ స్థానిక మార్కెట్‌ను శుక్రవారం సందర్శించి ఇక్కడి అధికారులతో మాట్లాడి ధరలు పెరిగేలా చూడాలని సూచించారు. దీంతో స్థానిక మార్కెట్ సెక్రటరీ సంజీవకుమార్ వ్యాపారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా శనివారం బాక్సు ధర వంద దాటింది. – పలమనేరు

తప్పతాగి.. స్పేర్ టైర్‌పై కూర్చొని..



మద్యం మత్తులో ఓ వ్యక్తి బస్సు కింద భాగాన ఉండే స్పేర్ టైర్‌పై దర్జాగా ప్రయాణించాడు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు శనివారం కొత్తచెరువు మీదుగా హిందూపురానికి బయలుదేరింది. మద్యం మత్తులో ఓ వ్యక్తి బస్సు కింద భాగాన ఉన్న స్పేర్ టైర్‌పై కాళ్లు కిందకు విడుచుకుని కూర్చొన్నాడు. 15 కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత కొండంపల్లి వద్ద బస్సుకు ఎదురుగా టూ వీలర్‌లో వస్తున్న వ్యక్తి గమనించి డ్రైవర్‌కు విషయం తెలిపాడు. దీంతో డ్రైవర్ బస్సు ఆపి అతన్ని కిందకు దించారు. అప్పటికీ అతను మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. –పుట్టపర్తి టౌన్

గణనాథుని సేవలో జస్టిస్ లక్ష్మణరావు



చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శనం కల్పించారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఎస్పీ రమాదేవి కూడా గణనాథుని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు వీరిని ఆశీర్వదించారు. వీరికి ఆలయ ఈవో పెంచల కిషోర్, ఏఈవో రవీంద్రబాబు స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. – కాణిపాకం

దాసాంజనేయస్వామి సేవలో జస్టిస్ గోపాలకృష్ణ



విజయవాడ మాచవరంలోని స్వయంభూ దాసాంజనేయస్వామి వారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణ శనివారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, అర్చకులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు జస్టిస్ గోపాలకృష్ణ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జస్టిస్ గోపాలకృష్ణ దంపతులకు స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలను అధికారులు అందజేశారు. – మధురానగర్(విజయవాడ సెంట్రల్)

మీ ఊరు కాదంటున్నారు!



ప్రకాశం జిల్లా నరజాముల తండాను వదిలి వెళ్లాలంటూ ఆదేశాలు

- హైవే నష్టపరిహారాన్ని తమ ఖాతాలో జమచేసుకున్న అటవీ శాఖ
- అడుగడుగునా ఆంక్షలతో బిక్కుబిక్కుమంటూ గిరిజనుల జీవనం
- ప్రాణం పోయినా సరే ఇక్కడినుంచి వెళ్లేది లేదంటున్న సుగాలీలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఆ ఊరికి 150 ఏళ్ల చరిత్ర ఉంది. నాలుగు తరాలుగా గిరిజనులు నివాసం ఉంటున్నారు. ఇళ్లు.. ప్రభుత్వ పాఠశాల.. చెరువు.. ఆయకట్టు కింద పొలాలూ ఉన్నాయి. అయినా, సరే ఇప్పుడిది మీ ఊరు కాదంటున్నారు అటవీ శాఖ అధికారులు. చెట్టు.. పుట్ట, ఇళ్లు, పొలాలన్నీ మీవి కావు. దీని మీద మీకు హక్కులు లేవు. ఇది అటవీ శాఖకు చెందిన సంపద అని అధికారులు ఆంక్షలు పెడుతున్నారు. జాతీయ రహదారి నిర్మాణంతో కోల్పోయిన భూములకు వచ్చిన నష్ట పరిహారాన్ని కూడా వారి ఖాతాలో వేసుకున్నారు. అడుగు తీసి అడుగేయాలన్నా అనుమతి తీసుకోవాలంటున్నారు. ఇలా ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం నరజాముల తండా వాసులపై కొంతకాలంగా జులుం ప్రదర్శిస్తున్నారు. నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెంకు 20 కిలోమీటర్ల దూరంలో.. జాతీయ రహదారి పక్కనే ఉండడం ఈ తండాకు తంటాలు తెచ్చిపెడుతోంది. మారుమూల అటవీ ప్రాంతంలోని నరజాముల తండాలో 290 కుటుంబాలకు పైగా జీవిస్తున్నాయి. అందరూ సుగాలీలే. పశువులను మేపుతూ, కట్టెలు కొడుతూ యర్రగొండపాలెంలో అమ్ముతూ పొట్ట పోసుకుంటుంటారు. కొందరు ఉద్యోగాలు కూడా సాధించారు. అయితే, ఆదివాసీలకు జరిగే అన్యాయాన్ని సరిచేసే పేరుతో తెచ్చిన అటవీ హక్కుల చట్టం–2006 ఇప్పుడు వీరి నెత్తిన కత్తిలా వేలాడుతోంది. వేసవిలో మంచినీటి బోర్లు వేసుకోవడానికి లేదు.. పొలాలకు వెళ్లనీయరు.. జీవాలను మేపుకొనేందుకు అడవిలోకి వెళ్తే కేసులు పెడుతున్నారు.. పాములు, క్రూర జంతువుల నుంచి ఆత్మరక్షణకు గొడ్డలి తీసుకెళ్తే లాక్కుంటున్నారు. ఆఖరికి పశువులనూ స్వాధీనం చేసుకుంటున్నారు. మరోవైపు గ్రామంలోని మౌలిక సమస్యలను ఉద్దేశపూర్వకంగానే అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

రెండెకరాల పరిహారం అటవీ శాఖ ఖాతాలోకి..



గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూమిలో రెండు ఎకరాలు హైవే నిర్మాణంలో పోయింది. పరిహారం కోరితే అటవీ శాఖ భూమి అని అంటున్నారు. మా భూమికి వారు డబ్బులు తీసుకోవడం ఏం న్యాయం?
– నరసింహనాయక్, నరజాములతండా

గిరిజనులపై ఆంక్షలు పెరిగిపోయాయి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లమల అడవుల్లో జీవించే గిరిజనులపై ఆంక్షలు, దాడులు పెరిగిపోయాయి. వారిపై అక్రమ కేసులు బనాయించడం, ఇళ్ల నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపివేయడం చేస్తున్నారు. కాయ కష్టంతో పండించిన పంటను అమ్ముకోనీయకుండా కూటమి ప్రభుత్వం పాశవిక చర్యలకు పాల్పడుతోంది. గిరిజనుల బాధలను గుర్తించిన వైఎస్ అటవీ హక్కుల చట్టం తెచ్చి ఆదుకున్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు తీసుకున్నాక ఆ చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తూ పక్కా ఇళ్లు మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం గిరిజనులపై అటవీ అధికారులను ఉసిగొల్పుతోంది. అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కు ఈ దారుణాలు కనిపించడం లేదు. మొద్దు నిద్ర వీడి గిరిజన ప్రాంతాలను సందర్శించి స్థానికుల బాధలు తెలుసుకుని పరిష్కరించాలి.
– తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, యర్రగొండపాలెం

హైవేతో పెరిగిన సమస్యలు

నాలుగేళ్ల క్రితం యర్రగొండపాలెం–హైదరాబాద్ రహదారి నేషనల్ హైవే 565 అయింది. మల్లాపాలెం దాటాక 5 కిలోమీటర్ల నుంచి దావపల్లి వరకు 20.09 కిలోమీటర్ల మేర దండకారణ్యం ఉంది. అటవీ ప్రాంతానికి అవతల వరకు హైవే నిర్మాణమైంది. అనుమతులు రావడంతో ఇటీవల అడవిలోనూ పనులు మొదలుపెట్టారు. నరజాముల తండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, పొలాలు హైవేలో పోయాయి. స్థానికులతో చర్చించకుండా, చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా తండాలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను కూడా అటవీ శాఖ కొట్టుకుని తీసుకుపోయింది. ఈ మేరకు నష్ట పరిహారం చెల్లించాలని గిరిజనులు కోరుతున్నా పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తున్నప్పుడు ఏమయ్యారు?

నరజాముల తండాలో 400 ఎకరాల రెవెన్యూ స్థలం ఉంది. సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్కొక్కరికి 47 సెంట్ల నుంచి 10 ఎకరాల వరకు పొలాలకు పట్టాలు ఇచ్చారు. పాస్ పుస్తకాల ద్వారా గిరిజనులు బ్యాంకు రుణాలు తీసుకున్నారు. 1972లో 250 ఎకరాలలో చెరువు నిర్మించగా ఆయకట్టు కింద 800 ఎకరాలు సాగవుతున్నాయి. 50 ఏళ్ల కిందటే ప్రభుత్వ పాఠశాల, అనుబంధంగా హాస్టల్ కూడా ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయం నిర్మించారు. ఇలా అన్ని సౌకర్యాలను కల్పించినపుడు అటవీ అధికారులు ఎక్కడకు పోయారని గిరిపుత్రులు నిలదీస్తున్నారు.

ఉద్యమానికి సిద్ధమవుతున్న గిరిజనులు

కన్నతల్లిలాంటి ఊరిని కాపాడుకునేందుకు సుగాలీలు సిద్ధమవుతున్నారు. గ్రామంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కన్నీరుమున్నీరవుతున్నారు. వదిలి వెళ్లేది లేదని తెగేసి చెబుతూ.. ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. తమ ఇళ్లు, పొలాలను రెవెన్యూ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒక్క ఫోన్ చేసినా.. ఇంత అనర్థం జరిగేది కాదు

- జరిగిన సంఘటనను జీర్ణించుకోలేకపోతున్నాం
- మా తమ్ముడు కష్టపడి జీవితంలో పైకొచ్చాడు
- ఇబ్బందులు, మానసిక ఒత్తిడి ఉన్నట్లు చెప్పలేదు
- కాకినాడలో పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్న చంద్రకిశోర్ సోదరుడి ఆవేదన



పిల్లలతో చంద్రకిశోర్ దంపతులు

కాకినాడ రూరల్: ''జరిగిన ఘటనను జీర్ణించుకోలేకపోతున్నాం. మా కుటుంబంలో అందరూ విద్యావంతులు. పెదనాన్న కొడుకు చంద్రకిశోర్ (37)ఎంబీఏ, ఎంకామ్ చదివాడు. చాలా కష్టపడి పైకి వచ్చాడు. 2014లో ఓఎన్జీసీలో ఉద్యోగంలో చేరాడు. ఒకటో తరగతి చదువుతున్న జోషిత్(7), యూకేజీ చదువుతున్న నిఖిల్(6)ను ఇటీవలే స్కూల్ మార్చాడు. ఇబ్బందులు, మానసిక ఒత్తిడి ఉన్నట్టు చెప్పలేదు. ఒక్క ఫోన్ కాల్ చేసి ఉంటే ఇంత అనర్థం జరిగి ఉండేది కాదు'' అని కాకినాడలో ఇద్దరు కుమారులను చంపి ఆత్మహత్య చేసుకున్న చంద్రకిశోర్ సోదరుడు, తాడేపల్లిగూడెంకు చెందిన వానపల్లి ఆదిశేషు వాపోయారు. తాడేపల్లిగూడెంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. చంద్రకు 2017లో రాజమహేంద్రవరానికి చెందిన తనూజతో వివాహమైందని, ఆమె ఎంబీఏ చదివారని తెలిపారు. కాగా, తమ సంస్థలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న చంద్రకిశోర్ చాలా మంచి వ్యక్తి అని, ఆత్మహత్యకు పాల్పడేంత పిరికివాడు కాదని, పిల్లలతో పాటు అతడూ చనిపోవడం బాధాకరమని ఓఎన్జీసీ, కాకినాడ హెచ్ఆర్ హెడ్ సునీల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

కలకలం రేపిన ఘటన..

ఇద్దరు కుమారులను కాళ్లు, చేతులు కట్టేసి, నోటికి వస్త్రం కట్టి నీటి బకెట్‌లో ముంచి ప్రాణం తీసి, ఆపై తానూ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చంద్రకిశోర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంచలనంగా మారింది. చంద్రకిశోర్ కాకినాడ రూరల్ వాకలపూడి ఓఎన్జీసీ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. భార్య తనూజ, ఇద్దరు పిల్లలతో కాకినాడ తోట సుబ్బారావు నగర్‌లో ఉంటున్నాడు. హోలీ పండగ కోసం ఓఎన్జీసీ కార్యాలయానికి భార్య, పిల్లలను తీసుకెళ్లిన అతడు.. భార్యను అక్కడే ఉంచి బట్టలు కుట్టించేందుకు అంటూ పిల్లలను బయటకు తీసుకొచ్చాడు. కాగా, కాకినాడలో పేరున్న పాఠశాలలో ఇద్దరు పిల్లలను ఏటా రూ.1.50 లక్షల ఫీజుతో చేర్పించాడు. బాగా చదవడం లేదని తిరిగి తక్కువ ఫీజున్న స్కూల్‌కు మార్పించాడు. పిల్లల చదువుపై అతడ బెంగ పెట్టుకున్నట్టు సూసైడ్ నోట్ ద్వారా తెలుస్తోంది.

నేటి తరం కోసం భక్త కన్నప్ప చరిత్ర

సినీ నటుడు మంచు విష్ణు



రాజంపేట రూరల్: మహా శివభక్తుడు భక్త కన్నప్ప చరిత్రను నేటి తరానికి తెలియజేయాలన్న సంకల్పంతో 'కన్నప్ప' సినిమాను నిర్మించినట్లు సినీ హీరో మంచు విష్ణు చెప్పారు. భక్త కన్నప్ప జన్మస్థలమైన అన్నమయ్య జిల్లా ఊటుకూరులోని మీనాక్షి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయాన్ని కన్నప్ప టీంతో కలిసి ఆయన శనివారం దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు విష్ణుతో నాగలింగేశ్వరస్వామి వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. భక్త కన్నప్పను దర్శించుకుని విష్ణు ప్రదక్షిణలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం



ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల/రణస్థలం/పాతపట్నం: శ్రీకాకుళం జిల్లాలోని లావేరు మండలం బుడుమూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల మేరకు...పాతపట్నం గ్రామం పెద్దలోడి గ్రామానికి చెందిన దువారి లక్ష్మీపతి(31) కుటుంబంతో కలిసి విశాఖలోని మధురవాడలో ఉంటున్నాడు. స్వగ్రామంలో స్నేహితుడి వివాహానికి హాజరై శనివారం తిరుగు ప్రయాణమయ్యాడు. ఆదివారం తన అన్న కుమారుడి జన్మదినం ఉండడంతో తల్లి మీనమ్మ (50), బావ భాస్కరరావు (45), మేన కోడలు కుసుమ, తండ్రి కాళిదాసుతో కలిసి కారులో విశాఖకు బయల్దేరారు. కారు విశాఖ వైపు వెళ్తుండగా..లావేరు మండలం బుడుమూరు సమీపంలో అదుపు తప్పింది. దీంతో రోడ్డు పక్క స్కూటీ నిలిపి ఉంచి ఫోన్‌లో మాట్లాడుతున్న తోలాపి శంకరరావు (41)ను ఢీకొట్టి బోల్తా పడింది. ఆ ధాటికి శంకరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనను ఢీకొట్టాక కారు రోడ్డు పక్కనున్న లేఅవుట్ వైపు దూసుకుపోయింది. దీంతో కారులో డ్రైవింగ్ చేస్తున్న లక్ష్మీపతి, మీనమ్మ, భాస్కరరావు మరణించారు. కాళిదాసు, కుసుమ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. కాగా, శంకరరావు తన కుమారుడు మృతి చెందడంతో ఇటీవలే ఓ ఆడబిడ్డను దత్తత తీసుకోవాలనుకున్నారు. ఆ ప్రయత్నంలో భాగంగా బర్త్ సర్టిఫికెట్ కోసం వెళ్లి వస్తుండగా ప్రమాదంలో మృతి చెందారు. మృతదేహాలను శ్రీకాకుళంలోని రిమ్స్ మార్చురీకి తరలించారు.

నీటి కుంటలో పడి ఇద్దరు బాలికల మృతి

కట్టెల కోసం వెళ్లి మృత్యువాత
అనంతపురం జిల్లా కల్లూరులో విషాదం



మృతి చెందిన లక్ష్మి, అరుణ

గార్లదిన్నె: దాహం కావడంతో నీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఇద్దరు బాలికలు మృత్యువాత పడిన ఘటన అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కల్లూరులో కొండకింద కొట్టాల సమీపంలో రాళ్ల గుట్టపై సంచార జాతులకు చెందిన కుటుంబాలు (ఆవులోళ్లు) 25 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాయి. వీరిలో గంగమ్మ, అర్జునప్ప దంపతుల కుమార్తె లక్ష్మి (15), రామక్క, గోపాల్ దంపతుల కుమార్తె అరుణ (9), మరికొంత మంది బాలికలు శనివారం ఉదయం పెన్నా నది సమీప ప్రాంతానికి కట్టెలు తీసుకురావడానికి వెళ్లారు. అక్కడ కట్టెలు మోపు కట్టుకుని వస్తుండగా.. దాహం వేయడంతో ఓ బాలిక నీటి కుంటలోకి దిగి నీరు తాగుతుండగా కాలు జారి పడిపోయింది. వెంటనే అప్రమత్తమైన మరొక బాలిక చెయ్యి పట్టుకుని బయటకు లాగేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఇద్దరూ నీటి కుంటలోకి పడిపోయారు. తమ వెనుక బయలుదేరిన ఆ ఇద్దరు బాలికలు ఎంతసేపటికీ రాకపోవడంతో మిగిలిన బాలికలు చుట్టుపక్కల గమనించారు. అరుణ, లక్ష్మి నీటికుంటలో మునిగిపోయినట్లు గుర్తించి గట్టిగా కేకలు వేశారు. సమీపంలోని గొర్రెల కాపరులు వారిని బయటకు తీశారు.అప్పటికే వారు మృతిచెందారు.

మద్యం మత్తులో తిరుమలలో యువకుడి వీరంగం

ఆలస్యంగా వెలుగులోకి ఘటన



యువకుడిని తీసుకెళుతున్న టీటీడీ భద్రతా సిబ్బంది

తిరుమల: తిరుమల ఆలయ మాడవీధిలో ఓ యువకుడు మద్యం మత్తులో వీరంగం సృష్టించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 13న కర్ణాటకకు చెందిన ఎస్.బాలాజీ అనే యువకుడు పూటుగా మద్యం సేవించి తిరుమల ఆలయ మాడవీధిలోకి ప్రవేశించాడు. అక్కడ ఓ మహిళతో గొడవ పడుతుండగా టీటీడీ భద్రతా సిబ్బంది అతడిని పట్టుకున్నారు. దీంతో ఆ యువకుడు 'నేను మద్యం తాగాను..తిరుమలలో ఎవరికి కావాలన్నా మద్యం సరఫరా చేస్తా' అంటూ భద్రతా సిబ్బందితో అన్నాడు. ఇంతలో మరికొందరు భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని తిరుమల వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అయితే అతడు మద్యం తాగి తిరుమలకు ఎలా వచ్చాడు? తిరుమలకు మద్యం తెచ్చుకున్నాడా? తిరుమలలో అమ్ముతున్నాడా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

- స్వామి వారిని దర్శించుకున్న గవర్నర్, ముఖ్యమంత్రి
- శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు దంపతులు



స్వామి వారి కల్యాణ వేడుకలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు

తాడికొండ/మంగళగిరి టౌన్ : గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెం టీటీడీ ఆలయంలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు శ్రీవేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో కల్యాణం జరిపించారు. టీటీడీ అన్నప్రసాద విభాగం ఆధ్వర్యంలో అమరావతి అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శించుకున్నారు. సీఎం చంద్రబాబు దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు 100 లోపే

- మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడి
- ఐజీ సమక్షంలో 64 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ చేయూత పథకం సత్ఫలితాలు ఇస్తోందని మల్టీజోన్ –1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం 64 మంది మావోయిస్టులు ఐజీ సమక్షంలో లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీల్లో మావోయిస్టులపై నమ్మకం, ఆదరణ సన్నగిల్లుతున్నాయని చెప్పారు. తెలంగాణ వెలుపల ప్రస్తుతం 100 మంది లోపే మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని పేర్కొన్నారు. వారి కుటుంబసభ్యులతో మాట్లాడి వారు కూడా జనజీవన స్రవంతిలో కలిసేలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. గత రెండున్నర నెలల్లో 122 మంది మావోయిస్టులు లొంగిపోయారని, జనజీవన స్రవంతిలో కలిసేందుకు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారని వివరించారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని, నేపథ్యంలో పలువురు నక్సలిజాన్ని వీడుతున్నారని అన్నారు. మావోయిస్టులు కాలం చెల్లిన సిద్ధాంతాలను నమ్ముకుని, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఐజీ విమర్శించారు. కాగా, శనివారం లొంగిపోయిన వారిలో 16 మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయినవారికి ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 16-3-2025

ఆటలంటే బలం. కుటుంబం అంటే అమోఘ బలం. ఫ్యామిలీకి ఆటలు తోడైతే... ఆ బలం చెప్పలేనంత! 63 సంవత్సరాల కందుకూరి లావణ్య, ఆమె భర్త 69 సంవత్సరాల నాగేశ్వరరావు అథ్లెటిక్స్‌లో రాణిస్తూ 'ఆహా' అనిపిస్తున్నారు. తల్లిదండ్రుల బాట లోకి వచ్చిన 35 సంవత్సరాల అపర్ణ ఆటల్లో విజ యకేతనం ఎగరేస్తోంది. 'ఆటలకు వయసు అడ్డు కాదు' అంటూ ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తున్న కందుకూరి కుటుంబం గురించి..



ఆటల కుటుంబం!

విశాఖ జిల్లా భీమిలికి చెందిన లావణ్య చిన్నప్పటి నుంచే పరుగు పందేలలో పాల్గొనేది. షటిల్, రింగ్‌టెన్నిస్ బాగా ఆడేది. నాగేశ్వరరావుకు కూడా ఆటలంటే ఇష్టం. కబడ్డీ నుంచి షటిల్ వరకు ఎన్నో ఆటల్లో ప్రావీణ్యం సంపాదించాడు. భార్యాభర్తలిద్దరికీ ఆటలంటే ప్రాణం కావడంతో ఇంటినిండా ఆటల కబుర్లే!

ఆటలకు సంబంధించి తమ చిన్ననాటి విశేషాలను ఒకరితో ఒకరు పంచుకునేవారు. 'ఆరోజులు మళ్లీ వస్తే బాగుణ్ను' అనుకునేవారు.

'చరిత్ర పునరావృతమవుతుంది' అంటారు కదా!

'ఆంజనేయా వెటరన్స్ అసోసియేషన్' పుణ్యమా అని అలాగే జరిగింది. భీమిలిలో కోనాడ జయరాముడు అనే వెటరన్ క్రీడాకారుడు ఏర్పాటు చేసిన 'ఆంజనేయా వెటరన్స్ అథ్లెట్ అసోసియేషన్'లో లావణ్య, నాగేశ్వరరావు సభ్యులుగా చేరారు. విశాఖలోని 'మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్'లో సభ్యత్వం తీసుకున్నారు. అలా... మళ్లీ ఆటల ప్రపంచంలోకి అడుగు పెట్టే అపూర్వ అవకాశం వచ్చింది. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం మొదలైంది.

విజయపరంపర

కరీంనగర్‌లో జరిగిన 800,1500 మీటర్ల పరుగు పందెంలో లావణ్య ప్రథమ స్థానంలో, నాగేశ్వరరావు ద్వితీయ స్థానంలో నిలిచారు. మహబూబ్‌నగర్, గుంటూరులో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచారు. చెన్నైలో జరిగిన జాతీయ పోటీల్లో 800, 1500 మీటర్ల పరుగులో ప్రథమ, 5 కిలోమీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచింది లావణ్య. బెంగళూరులో జరిగిన 800, 1500 మీటర్ల పరుగులో భార్యాభర్తలిద్దరూ ప్రథమ స్థానంలో నిలిచారు. 200 మీటర్ల హర్డిల్స్‌లో ద్వితీయస్థానంలో నిలిచారు. చండీగఢ్, భోపాల్, హరియాణా కురుక్షేత్రలో జరిగిన పోటీల్లోనూ విజయకేతనం ఎగరేశారు.

అంతర్జాతీయ స్థాయిలో...

లావణ్య మరో అడుగు ముందుకు వేసి అంతర్జాతీయ పోటీల్లోనూ సత్తా చాటుతోంది. చైనాలో జరిగిన



అనంతపురంలో మెడల్స్, ప్రశంస పత్రాలతో లావణ్య, కూతురు అపర్ణ

పోటీలతో అంతర్జాతీయ పోటీల్లోకి అడుగుపెట్టింది. 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచింది. శ్రీలంకలో 400, 800, 1500 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఫిలిప్పీన్స్‌లో పది వేల మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచింది, సింగపూర్, థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీల్లోనూ పాల్గొంది.

వారి సాయం మరువలేనిది



నా భార్యకు అన్ని విధాలుగా సహకరించి, తోడుగా ఉండాలని నేను కూడా తనతోపాటు పోటీల్లో పాల్గొంటున్నాను. ఆటల వల్ల చాలా ఉత్సాహంగా ఉంది. ఎన్నో ప్రాంతాలకు వెళుతున్నాం. కొత్తగా జీవితం మొదలు పెట్టినట్లుగా ఉంది. పోటీలకు వెళ్లడానికి పలువురు దాతలు అందిస్తున్న సాయం మరువలేనిది.

– కందుకూరి నాగేశ్వరరావు

కూతురు కూడా...

లావణ్య కుమార్తె అపర్ణకు చిన్నప్పటి నుంచి ఆటలంటే ఇష్టం. రన్నింగ్‌తో పాటు వాలీబాల్‌లో ప్రతిభ చూపేది. పెళ్లి తరువాత ఆటలకు దూరమైంది. అయితే తల్లిదండ్రుల స్ఫూర్తితో 35 సంవత్సరాల అపర్ణ 'విశాఖ అథ్లెటిక్స్ అసోసియేషన్'లో సభ్యత్వం తీసుకుంది. తల్లి,కూతుళ్లు కలిసి తొలిసారిగా గత నెలలో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో పాల్గొన్నారు. లావణ్య 100, 800మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అయిదు కిలోమీటర్ల పరుగు పందెంలో అపర్ణ ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇకపై తల్లితండ్రులతో కలిసి పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించుకుంది అపర్ణ.

– సింగారెడ్డి రమణ ప్రసాద్,
సాక్షి, భీమిలి

అమ్మతో పాటు...



అమ్మానాన్నలు ఒకరికొకరు స్ఫూర్తి. వారి నుంచి నేను స్ఫూర్తి పొంది 35 సంవత్సరాల వయసులో ఆటల ప్రపంచంలోకి అడుగు పెట్టాను. అమ్మతో పాటు పోటీల్లో పాల్గొనడం, విజయం సాధించడం సంతోషంగా ఉంది. ఉత్సాహం ఉండాలేగానీ ఆటలకు వయసు ఎప్పుడూ అడ్డు కాదు.

– అపర్ణ

కొత్త ప్రపంచంలోకి...



ఆటల వల్ల కొత్త ప్రపంచాన్ని చూడగలుగుతున్నాను. దేశంలోని ఎన్నో ప్రాంతాలతోపాటు విదేశాలకు వెళ్లగలిగాను. 'ఈ వయసులో ఆటలు ఎందుకు?' అని నా భర్త నాగేశ్వరరావు అని ఉంటే నేను ఇంటికే పరిమితమయ్యేదాన్ని. ఆయన నన్ను ఎంతో ప్రోత్సహించారు. తాను కూడా మళ్లీ ఆటల్లోకి వచ్చారు. మా ఇద్దరి స్ఫూర్తితో మా అమ్మాయి కూడా ఆటల్లోకి రావడం చాలా సంతోషంగా ఉంది.

– కందుకూరి లావణ్య

బ్యూటిప్స్ / హెయిర్ కేర్

- మందార ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ బాగా సాయమవుతుంది. ఒక కప్పు నీటిలో ఒక పూవు చొప్పున వేసి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.



- కలబంద గుజ్జు అదేనండీ... అలోవెరా జెల్... ఒక సహజసిద్ధమైన కండీషనర్. మాయిశ్చరైజర్ కూడా. ఈ గుజ్జును చర్మం మీద, మాడు మీద రుద్దితే, చుండ్రు సమస్యలు, చర్మ వ్యాధులు చాలా వరకు తగ్గుతాయి. ఈ గుజ్జుతో కాలిన గాయాలు కూడా త్వరగా మానిపోతాయి.



- గోరింటాకు, జుత్తుకు సహజసిద్ధమైన రంగుగానే కాకుండా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ నివారణలోనూ బాగా తోడ్పడుతుంది. వెంట్రుక కుదుర్లను పటిష్ఠం చేయడం ద్వారా ఇది చుండ్రును, జుత్తు రాలడాన్ని నివారిస్తుంది.

• ఫ్యూచర్ టెన్స్

విజన్ 2030



మధురా దాస్ గుప్తా

పాతిక సంవత్సరాలు బ్యాంకర్‌గా పనిచేసిన ముంబైకి చెందిన మధురా దాస్ గుప్తా సిన్హా ఉద్యోగమే జీవితం అనుకోలేదు. ఇతర మహిళల జీవితాల గురించి ఆలోచించింది. ప్రసవం తరువాత దాస్ గుప్తా స్నేహితురాలు ఉద్యోగ విరామం తీసుకుంది. ఆమె ఉన్నత విద్యావంతురాలు. కొన్ని కారణాల వల్ల ఆ ఉద్యోగ విరామం అలాగే ఉండిపోయింది.

'పెళ్లయిన తరువాత ఉద్యోగం ఎందుకు?' అనే భావనతో ఒక యువతి తన ఉద్యోగానికి రాజీనామా చేసింది... ఇలాంటి సంఘటనలు మధురా దాస్ గుప్తాను లోతుగా ఆలోచించేలా చేశాయి.


'యాస్పైర్ ఫర్ హర్' అనే సంస్థను ప్రారంభించేలా చేశాయి.

భారతదేశ శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం తగ్గడాన్ని దృష్టిలో పెట్టుకొని 'యాస్పైర్ ఫర్ హర్'కు శ్రీకారం చుట్టింది మధురా దాస్ గుప్తా. మెంటార్‌షిప్, స్కిలింగ్, రోల్‌మోడల్స్, నెట్‌వర్కింగ్ ద్వారా మహిళలు శ్రామిక శక్తిలోకి వచ్చేలా ప్రేరేపించడానికి ఉద్దేశించిన కమ్యూనిటీ ఆధారిత వేదిక ఇది. 2030 నాటికి పది మిలియన్‌ల మంది మహిళలను శ్రామిక శక్తిలో చేర్చే లక్ష్యంతో 'యాస్పైర్ ఫర్ ఉమెన్' పనిచేస్తుంది.

• వికాసం

మార్పు... మంచిదే కదా!





'తన క్యారెక్టరే తనకు శాపం అయింది'

'పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతోగానీ పోవు'... ఇలాంటి మాటలు వింటూ ఉంటాం. వ్యక్తిత్వం(క్యారెక్టర్) అనేది మార్పుకు వీలులేనంత జటిలమైనదా?

ఒకే సంవత్సరంలో మన వ్యక్తిత్వాన్ని మార్చుకోవడం సాధ్యమేనా?

'సాధ్యమే' అంటుంది 'మీ, బట్, బెటర్: ది సైన్స్ అండ్ ప్రామిస్ ఆఫ్ పర్సనాలిటీ చేంజ్' పుస్తకం.

అవార్డు విన్నింగ్ అమెరికన్ జర్నలిస్ట్ ఓల్గా ఖాజాన్ రాసిన ఈ పుస్తకం శాశ్వత మార్పు వెనుక ఉన్న శాస్త్రాన్ని వెల్లడిస్తుంది. వాటీజ్ పర్సనాలిటీ, వాటీజ్ పర్సనాలిటీ చేంజ్, ఓపెన్‌నెస్ టు ఎక్స్‌పీరియన్స్... మొదలైన చాప్టర్‌లు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ పుస్తకం కోసం ఎంతోమందిని ఇంటర్వ్యూ చేసింది రచయిత్రి.

ఎంతోమందికి నచ్చిన 'మీ, బట్, బెటర్' పుస్తకం రాసిన ఖాజాన్‌కు ఇష్టమైన పుస్తకం... జాక్ హార్ట్ రాసిన స్టోరీ క్రాఫ్ట్.

హెల్త్

• పెద్దలకు ఇద్దాం!

ఇమ్యూనిటీకాలు



నేడు
నేషనల్
ఇమ్యునైజేషన్ డే



మామూలుగా వ్యాక్సిన్లు అంటే పిల్లలకే అని చాలామంది అనుకుంటుంటారు. అవి పెద్దవాళ్లకూ అవసరమవుతాయి. కోవిడ్ టైమ్‌లో వ్యాక్సిన్‌కు విశేష ప్రాచుర్యం వచ్చింది. పెద్దవాళ్లకు ఇచ్చే వ్యాక్సిన్ అంటే అది కోవిడ్ కోసమే కాదు... ఇంకా చాలా రకాల వ్యాధులను నివారించగలిగే వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని పెద్దవాళ్లకు ఇవ్వాల్సిన కారణం ఏమిటంటే... వయసు పెరుగుతున్న కొద్దీ వ్యాధి నిరోధక వ్యవస్థ మునపటి అంత బలంగా ఉండకపోవచ్చు. దాంతో ఇమ్యూనిటీకి బలం పెంచడం కోసం ఇలా తీసుకోవచ్చు. అలాగే చిన్నప్పుడు తీసుకున్న వ్యాక్సిన్లు క్రమంగా ప్రభావం కోల్పోతూ ఉండవచ్చు. అందుకే వాటిని మరింత బలోపేతం చేసేందుకు 50 ఏళ్ల వయసు దాటిన దగ్గర్నుంచి కొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి ఉంటుంది. వాటి వివరాలివి...

సాధారణంగా 19 ఏళ్ల నుంచి 65 ఏళ్ల మధ్య వయసులో కొన్ని రకాల జబ్బులు ఉండి, వాళ్లలో వ్యాధి నిరోధక వ్యవస్థ కాస్త బలహీనంగా (ఇమ్యూనో కాంప్రమైజ్ కండిషన్) ఉన్నప్పుడు 65 ఏళ్ల వయసు తర్వాత కొన్ని జబ్బులు వచ్చే ముప్పు ఉంది. పెద్దవాళ్లకు ఇవ్వాల్సిన టీకాలు ఇవ్వడం ద్వారా ఆ ముప్పును దాదాపుగా నివారించవచ్చు. అందుకే ఈ వ్యాక్సిన్లు.

పెద్ద వయసు వారు తీసుకోవాల్సిన రకరకాల వ్యాక్సిన్లు

ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్

ఇది ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వల్ల కలిగే ఫ్లూ వ్యాధికి నివారణగా ఇచ్చే వ్యాక్సిన్. జలుబు చేసినప్పుడు కనిపించే లక్షణాలే ఇన్‌ఫ్లుయెంజా వైరస్ సోకినప్పుడూ కనిపిస్తాయి. అయితే ఇన్‌ఫ్లుయెంజా నేరుగా హాని చేయకపోవచ్చు. జలుబు తగ్గినట్లే అదీ తగ్గిపోతుంది. కానీ ఒక్కోసారి ఇన్‌ఫ్లుయెంజా వైరస్ కారణంగా వచ్చే రెండో దశ దుష్పరిణామాలైన శ్వాసకోశ సమస్యల వంటివి తీవ్రంగా బాధిస్తాయి. పైగా ఇన్‌ఫ్లుయెంజా వైరస్ ఎప్పటికప్పుడు తన జన్యుస్వరూపాన్ని మార్చుకుంటుంది. అందుకే జలుబు వైరస్‌కు ఒకే వ్యాక్సిన్ రూపొందించడం కష్టసాధ్యం. అందుకే అరవై ఐదేళ్లు పైబడిన వారు, ఇమ్యూనోకాంప్రమైజ్ స్టేటస్‌లో ఉన్న వాళ్లు (వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు) ఈ ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌ను ప్రతి ఏడాదీ తీసుకోవాలి. దీన్ని ప్రతి ఏడాదీ సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో తీసుకోవడం మంచిది.
సూచన : గుడ్డుతో అలర్జీ ఉన్నవారు దీని బదులు రీకాంబినెంట్ వ్యాక్సిన్ కూడా తీసుకోవాలి.

హెపటైటిస్-బి వ్యాక్సిన్

హెపటైటిస్-బి వైరస్ కూడా కాలేయాన్నే ప్రభావితం చేసే మరింత ప్రమాదకరమైన వ్యాధి. హెచ్ఐవీ వ్యాప్తి చెందే మార్గాల్లోనే దీని వ్యాప్తి జరుగుతుంది. కాలేయాన్ని పూర్తిగా దెబ్బతీసి ప్రాణాంతకంగా మార్చే ముప్పు ఉంటుంది. ఇంత ప్రమాదకరమైన వైరస్‌కు అదృష్టవశాత్తూ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. దీన్ని మూడు డోసుల్లో ఇవ్వాలి. మొదటిది ఇచ్చిన నెల తర్వాత రెండో డోసూ, అలాగే మొదటిది ఇచ్చిన ఆర్నెల్లకి మూడో డోసు ఇవ్వాలి. యుక్తవయస్కులూ దీన్ని తీసుకోవడం మేలు.

హెపటైటిస్ ఏ వ్యాక్సిన్

కాలేయాన్ని ప్రభావితం చేసేదే ఈ హెపటైటిస్-ఏ వైరస్. కలుషితాహారం, కలుషితమైన నీటి ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. పెద్ద వయసు వారిలో వ్యాధి నిరోధకత తక్కువగా ఉన్నప్పుడు ఈ వ్యాక్సిన్ తీసుకోవడం అవసరం. దీని నివారణకు ఒక డోసు వ్యాక్సిన్ తీసుకున్న తర్వాత, ఆర్నెల్లకు మరో విడత కూడా తీసుకోవాలి.

వ్యారిసెల్లా వ్యాక్సిన్


వ్యారిసెల్లా జోస్టర్ వైరస్ (వీజడ్‌వీ) అనే ఈ వైరస్ 'చికెన్‌పాక్స్'ను కలిగిస్తుంది. వ్యారెసెల్లా వ్యాక్సిన్ వృద్ధుల్లో ఈ చికెన్ పాక్స్ నుంచి రక్షణ కల్పిస్తుంది. అప్పటికే ఏవైనా వ్యాధులతో బాధపడుతున్నవాళ్లకూ, గతంలో ఈ వ్యాక్సిన్ ఇచ్చినప్పుడు తీవ్రమైన అలర్జీ వచ్చిన వాళ్లకూ, హెచ్ఐవీ వ్యాధి ఉండి, సీడీ4 సెల్స్ కౌంట్స్ 200 లోపు ఉన్నవారికీ, వ్యాధి నిరోధక శక్తి బాగా తగ్గిపోయి, ఇమ్యూనో కాంప్రమైజ్‌డ్ స్టేటస్‌లో ఉన్నవారికి, స్టెరాయిడ్స్ మీద ఉన్న వారికి డాక్టర్లు ఈ వ్యాక్సిన్‌ను సిఫార్సు చేయరు. అలాగే క్యాన్సర్ కోసం కీమోథెరపీ తీసుకుంటున్నవారు, గత ఐదు నెలల వ్యవధిలో రక్తమార్పిడి / రక్తంలోని ఏదైనా అంశాన్ని తీసుకున్నవారు కూడా ఈ వ్యాక్సిన్‌ను తీసుకోకూడదు. గర్భవతులకూ దీన్ని ఇవ్వకూడదు.

డిఫ్తీరియా అండ్ టెటనస్ వ్యాక్సిన్ : ప్రతి చిన్నారికీ తమ చిన్నతనంలో డీటీపీ వ్యాక్సిన్ ఇస్తారు. కానీ 40 ఏళ్ల వయసు వచ్చేనాటికి వాళ్లలో ఆ టెటనస్ వ్యాక్సిన్ ప్రభావం సగానికి తగ్గుతుంది. అదే 60 ఏళ్ల వయసుకు రాగానే టెటనస్ వ్యాక్సిన్ ప్రభావం కేవలం 10 శాతం మాత్రమే ఉంటుంది. కాబట్టి ఈ టెటనస్ డోస్‌ను 60 దాటిన వారికి మరోసారి ఇవ్వాలి. అది బూస్టర్ డోస్‌లా పనిచేసి టెటనస్ (ధనుర్వాతం) నుంచి రక్షణ కల్పిస్తుంది. అలాగే డిఫ్తీరియా వ్యాక్సిన్ కూడా తీసుకోవాలి. చిన్నప్పుడు ఇచ్చే డీపీటీలలో పెర్టుసిస్ (కోరింత దగ్గు) అనే సమస్య పెద్ద వయసులో రాదు కాబట్టి ఈ పెర్టుసిస్ వ్యాక్సిన్ పెద్దలకు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. నిజానికి 'టీ-డ్యాప్' అనే వ్యాక్సిన్ ప్రతి పదేళ్లకు ఒకసారి తీసుకోవడం మంచిది.

హెర్పిస్ జోస్టర్ వ్యాధి

హెర్పిస్ జోస్టర్ అనే వైరస్‌తో మొదట చికెన్‌పాక్స్ వచ్చి, అటు పిమ్మట అది హెర్పిస్ జోస్టర్ వ్యాధికి దారితీస్తుంది. దాన్నే షింగిల్స్ అంటారు. జోస్టర్ వైరస్ సోకిన వారిలో పోస్ట్ హెర్పెటిక్ న్యూరాల్జియా అనే నరాలకు సంబంధించిన కాంప్లికేషన్ ఎక్కువగా కనిపిస్తుంది. హెర్పిస్ జోస్టర్ వైరస్ సోకిన వాళ్లలో 60 ఏళ్లు దాటాక ఈ పోస్ట్ హెర్పిటిక్ న్యూరాల్జియా వచ్చే అవకాశాలు ఎక్కువ. జోస్టర్ వ్యాక్సిన్ అన్నది ఈ హెర్పిస్ జోస్టర్ వ్యాధి నుంచి నివారణ ఇస్తుంది. అయితే ఈ వ్యాక్సిన్ వల్ల 100 శాతం వ్యాధి రాకుండా ఉంటుందనే గ్యారంటీ లేదు గానీ... వ్యాక్సిన్‌తో బాధితుల జీవన ప్రమాణం మెరుగవుతుందని చెప్పవచ్చు.







డాక్టర్ టీఎన్‌జే రాజేశ్
సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్

టైఫాయిడ్ వ్యాక్సిన్ : అందరూ తీసుకోవాల్సిన మరో ముఖ్యమైన వ్యాక్సిన్ ఇది. మరీ ముఖ్యంగా ఆహార పరిశ్రమలో పనిచేసేవారూ, వంటలు చేసేవారు తప్పనిసరిగా తీసుకోవాల్సిన వ్యాక్సిన్. ఆహార తయారీ రంగంలో ఉండేవారికి టైఫాయిడ్ ఉంటే... ఓ క్యారియర్‌గా వారు అనేక మందికి ఈ వ్యాధిని సంక్రమింపజేసే అవకాశం ఉన్నందున వాళ్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నది డాక్టర్ల సిఫార్సు.

హ్యూమన్ పాపిలోమా వ్యాక్సిన్ (హెచ్‌పీవీ వ్యాక్సిన్)

ఇది మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్‌నుంచి నివారణ కల్పిస్తుంది. మహిళలకు 26 ఏళ్ల వయసు వచ్చే వరకు ఈ వ్యాక్సిన్ ఇవ్వవచ్చు. 15 ఏళ్లు పైబడ్డ అమ్మాయిలు మొదలుకొని మూడు విడతలుగా ఈ వ్యాక్సిన్ ఇస్తారు. మొదటి డోసు ఇచ్చిన నెల తర్వాత రెండో డోసు, ఆర్నెల్ల తర్వాత మూడో డోసు ఇస్తారు. ఇందులో రెండు రకాలు అందుబాటులో ఉన్నాయి. ఒకటి రెండు రకాల స్ట్రెయిన్స్ నుంచి, మరొకటి నాలుగు రకాల స్ట్రెయిన్స్ నుంచి రక్షణ ఇస్తుంది. డాక్టర్ సలహా మేరకే అవసరమైన వాటిని వాడాల్సి ఉంటుంది.

మరికొన్ని వ్యాక్సిన్లు

ఇప్పుడు డెంగ్యూ వ్యాధికి వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిందిగానీ దాన్ని కొన్ని పరిమితులకు లోబడి మాత్రమే ఇస్తారు. ఇవేగాక జపనీస్ ఎన్‌కెఫలైటిస్, రేబీస్, పోలియో, ఎల్లో ఫీవర్ వంటి వ్యాధుల నివారణకూ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి ఎల్లో ఫీవర్ వ్యాధి మన దేశంలో లేదు కాబట్టి అది ఉన్నచోటికి వెళ్లే ప్రయాణికులు అక్కడికి వెళ్లే 15 రోజుల ముందుగా ఈ వ్యాక్సిన్ తీసుకోవాలి. అలాగే పశ్చిమాసియా దేశాలకు వెళ్లే వాళ్లు మెనింగోకోకల్ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిది.

నిమోకోకల్ వ్యాక్సిన్ : వయసు పైబడిన వారిలో స్ట్రెప్టోకాకల్ నిమోనియా అనే బ్యాక్టీరియాతో నిమోనియా, మెనింజైటిస్, బ్యాక్టీరిమియా అనే సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి.

నిమోకాకల్ కాంజుగేట్ వ్యాక్సిన్ (పీసీవీ 13): 65 ఏళ్ల వయసు పైబడిన ప్రతివారూ ఈ వ్యాక్సిన్ ఒక డోస్ తీసుకోవాలి. ఇది తీసుకున్న ఏడాది తర్వాత నిమోకాకల్ పాలీసాకరైడ్ వ్యాక్సిన్ (పీపీఎస్‌వీ 23) తీసుకోవాలి.

నిమోకాకల్ పాలీసాకరైడ్ వ్యాక్సిన్ (పీపీఎస్‌వీ 23): ప్రస్తుతం వేర్వేరు నిమోకాకల్ బ్యాక్టీరియా స్ట్రెయిన్స్ కారణంగా వచ్చే అనేక రకాల వ్యాధులకు 'నిమోకాకల్ పాలీసాకరైడ్ వ్యాక్సిన్' తో ప్రయోజనం చేకూరుతుంది. ఇది కేవలం ఒక్క నిమోనియాకు మాత్రమే కాకుండా మెనింజైటిస్, బ్యాక్టీరిమియా (బ్లడ్ ఇన్ఫెక్షన్) లకు నివారణ ఔషధంగా కూడా పనిచేస్తుంది. అయితే దీనివల్ల నూరు శాతం నివారణ జరగకపోవచ్చు. కాకపోతే చాలా వరకు రక్షణ లభించడంతో పాటు ఒకవేళ టీకా తీసుకుని ఉంటే పైన పేర్కొన్న వ్యాధులు చాలా వరకు తగ్గి, కాంప్లికేషన్లు కూడా చాలా వరకు నివారితమవుతాయి. అయితే నిమోకాకల్ పాలీసాకరైడ్ వ్యాక్సిన్ తీసుకున్న ఐదేళ్ల తర్వాత మళ్లీ మరో డోస్ తీసుకోవాలి. అలా ప్రతి ఐదేళ్లకోమారు ఈ వ్యాక్సిన్ తీసుకుంటూ ఉండాలి.



ఐపీఎల్‌కు నితీశ్ కుమార్ రెడ్డి సిద్ధం

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఐపీఎల్ కొత్త సీజన్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. గత కొంత కాలంగా పక్కటెముల గాయంతో బాధపడుతున్న అతను పూర్తిగా కోలుకున్నాడు. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టి20 సిరీస్ సమయంలో అతనికి ఈ గాయమైంది. చికిత్సతో పాటు జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఇప్పటి వరకు అతను రీహాబిలిటేషన్‌లో ఉన్నాడు. వైద్యులు ఫిట్‌గా తేల్చిన తర్వాత నితీశ్ యోయో టెస్టుకు కూడా హాజరయ్యాడు. ఇందులో కనీస స్కోరు 16.5 సాధించాల్సి ఉండగా నితీశ్ 18 స్కోరుతో ఈ పరీక్షను విజయవంతంగా పూర్తి చేశాడు. ఆదివారం అతను రైజర్స్ జట్టుతో చేరతాడు. మార్చి 23న హైదరాబాద్ సీజన్‌లో తమ తొలి మ్యాచ్ ఉప్పల్ స్టేడియంలోనే ఆడనుంది. 2024 ఐపీఎల్‌లో 142.92 స్ట్రయిక్ రేట్‌తో నితీశ్ రెడ్డి 303 పరుగులు సాధించి జట్టు ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం భారత టి20 జట్టులోకి ఆ తర్వాత టెస్టు జట్టులోకి ఎంపికైన అతను ఆసీస్ గడ్డపై సత్తా చాటి అందరి దృష్టిని ఆకర్షించాడు. మెల్‌బోర్న్ మైదానంలో నితీశ్ చేసిన సెంచరీ హైలైట్‌గా నిలిచింది.



జై ముంబై

డబ్ల్యూపీఎల్ విజేత ముంబై ఇండియన్స్

- రెండో సారి టైటిల్ సాధించిన హర్మన్ బృందం
- వరుసగా మూడో ఫైనల్లో క్యాపిటల్స్ పరాజయం
- 8 పరుగులతో ఓడిన ఢిల్లీ

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్ మరో సారి జయకేతనం ఎగురవేసింది. రెండేళ్ల క్రితం టోర్నీ తొలి విజేతగా నిలిచిన జట్టు ఇప్పుడు మళ్లీ టైటిల్‌ను తమ ఖాతాలో వేసుకుంది. ఢిల్లీతో తుది పోరులో తక్కువ స్కోరుకే పరిమితమైనా... పట్టుదల, సమష్టితత్వంతో ఆడిన జట్టు లక్ష్యాన్ని కాపాడుకోగలిగింది. ఆల్‌రౌండర్ నాట్ సివర్ బ్రంట్, కెప్టెన్ హర్మన్ ఆఖరి పోరులో కీలక పాత్ర పోషించారు. మరో వైపు ఢిల్లీ క్యాపిటల్స్ బృందం విషాదంలో మునిగిపోయింది. వరుసగా మూడు సీజన్ల పాటు గ్రూప్‌లో టాపర్... వరుసగా మూడు ఫైనల్ మ్యాచ్‌లు... మూడింటిలోనూ పరాజయాలు. ఛేదనలో 17 పరుగులకే ఇద్దరు టాప్ బ్యాటర్లను కోల్పోయిన తర్వాత జట్టు కోలుకోలేకపోయింది. ఆ తర్వాత కొంత పోరాడినా లాభం లేకపోయింది.

ముంబై: డబ్ల్యూపీఎల్ సీజన్-3లో ముంబై ఇండియన్స్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో ముంబై 8 పరుగుల స్వల్ప తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్మన్‌ప్రీత్ కౌర్ (44 బంతుల్లో 66; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... నాట్ సివర్ బ్రంట్ (28 బంతుల్లో 30; 4 ఫోర్లు) రాణించింది. 14 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన దశలో వీరిద్దరు మూడో వికెట్‌కు 62 బంతుల్లోనే 89 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. అనంతరం ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్లకు 141 పరుగులే చేయగలిగింది. మరిజాన్ కాప్ (26 బంతుల్లో 40; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), జెమీమా రోడ్రిగ్స్ (21 బంతుల్లో 30; 4 ఫోర్లు) రాణించగా, నికీ ప్రసాద్ (23 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించింది. నాట్ సివర్ బ్రంట్ 3 కీలక వికెట్లతో ఢిల్లీని దెబ్బ తీసింది. 523 పరుగులు చేసి 12 వికెట్లు తీసిన నాట్ సివర్ బ్రంట్ 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచింది.

మరిజాన్ కాప్ తన వరుస ఓవర్లలో హేలీ మాథ్యూస్ (3), యస్తిక భాటియా (3)లను వెనక్కి పంపడంతో ముంబై ఒత్తిడిలో పడింది. అయితే సివర్, హర్మన్ కలిసి దూకుడుగా ఆడారు. సదర్లాండ్ ఓవర్లో సిక్స్, ఫోర్ కొట్టిన హర్మన్...జొనాసెన్ వేసిన తర్వాతి ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదింది. 33 బంతుల్లోనే ఆమె హాఫ్ సెంచరీ పూర్తయింది. వీరిద్దరి భాగస్వామ్యం తర్వాత ముంబై తడబడింది. 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోవడంతో భారీ స్కోరు సాధ్యం కాలేదు. ఛేదనలో ఢిల్లీ అవకాశాలన్నీ ఓపెనింగ్ భాగస్వామ్యంపైనే ఉన్నాయి. అయితే ఫామ్‌లో ఉన్న లానింగ్ (13), షఫాలీ (4) రెండు పరుగుల తేడాతో వెనుదిరగడంతో జట్టు స్కోరు వేగం బాగా తగ్గిపోయింది. మధ్యలో జెమీమా కొంత జోరుగా ఆడే ప్రయత్నం చేసినా చేయాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోయి చేయిదాటిపోయింది. మరిజాన్ కాప్ ప్రయత్నం కూడా వృథా అయింది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక (సి) జెమీమా (బి) కాప్ 8; హేలీ (బి) కాప్ 3; నాట్‌సివర్ (సి) మణి (బి) చరణి 30; హర్మన్‌ప్రీత్ (సి) కాప్ (బి) సదర్లాండ్ 66; కెర్ (సి) షఫాలీ (బి) జొనాసెన్ 2; సజన (ఎల్బీ) (బి) జొనాసెన్ 0; కమలిని (స్టంప్డ్) బ్రైస్ (బి) చరణి 10; అమన్‌జోత్ (నాటౌట్) 14; సంస్కృతి (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 149.** **వికెట్ల పతనం:** 1-5, 2-14, 3-103, 4-112, 5-112, 6-118, 7-132. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 4-0-11-2, శిఖా పాండే 4-0-29-0, అనాబెల్ సదర్లాండ్ 4-0-29-1, జొనాసెన్ 3-0-26-2, శ్రీ చరణి 4-0-43-2, మిన్ను మణి 1-0-10-0.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (బి) సివర్ 13; షఫాలీ (ఎల్బీ) (బి) షబ్నిమ్ 4; జెస్ జొన్సెన్ (సి) యస్తిక (బి) కెర్ 13; జెమీమా (సి అండ్ బి) కెర్ 30; అనాబెల్ (స్టంప్డ్) యస్తిక (బి) సైకా 2; మరిజాన్ కాప్ (సి) హేలీ (బి) సివర్ 40; సారా (రనౌట్) 5; నికీ (నాటౌట్)25; శిఖ (బి) సివర్ 0; మిన్ను మణి (సి) సజన (బి) హేలీ 4; శ్రీ చరణి (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 141.** **వికెట్ల పతనం:** 1-15, 2-17, 3-37, 4-44, 5-66, 6-83, 7-123, 8-123, 9-128. **బౌలింగ్:** షబ్నిమ్ ఇస్మాయిల్ 4-0-15-1; నాట్‌సివర్ బ్రంట్ 4-0-30-3; హేలీ మాథ్యూస్ 4-0-37-1; అమేలియా కెర్ 4-0-25-2; సైకా 4-0-33-1.

హ్యాట్సాఫ్ హర్మన్



డబ్ల్యూపీఎల్‌లో 2023 టైటిల్ నెగ్గిన ముంబై ఇండియన్స్ గత ఏడాది డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగింది. అయితే అనూహ్యంగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో బెంగళూరు చేతిలో 5 పరుగుల తేడాతో ఓడి నిష్క్రమించింది. హర్మన్‌ప్రీత్ క్రీజ్‌లో ఉన్నంత వరకు జట్టు గెలుపు దిశగానే వెళ్లినా...ఆమె వెనుదిరిగాక ఇతర బ్యాటర్లు 12 బంతుల్లో 16 పరుగులు కూడా చేయలేకపోయారు. ఇది హర్మన్‌ను తీవ్రంగా బాధించింది. 2025 సీజన్‌కు ముందు జట్టు కోచ్ దేవిక పల్షికర్‌తో కలిసి హర్మన్ ఇదే విషయంపై ప్రత్యేకంగా చర్చించింది. చివర్లో ధాటిగా ఆడే ప్రయత్నంలో ఒత్తిడి పెంచుకోవడంకంటే తొలి బంతినుంచే హర్మన్ తనదైన శైలిలో ధాటిగా ఆడాలనేది ప్రణాళిక. ఇందులో తొందరగా అవుటయ్యే ప్రమాదం ఉన్నా... ఇది సరైందిగా వారు భావించారు. ఈసారి టీమ్ విజయంలో బ్యాటర్‌గా హర్మన్ కీలక పాత్ర పోషించింది. ఏకంగా 154.87 స్ట్రైక్‌రేట్‌తో 302 పరుగులు సాధించి తన విలువను చాటింది. టోర్నీలో 11 సిక్స్‌లు బాదిన తీరు ఆమె ఆధిక్యాన్ని చూపించింది. ఈ టోర్నీలో ప్రతీ మ్యాచ్‌లో ఆమె దాదాపు చివరి వరకు నిలిచి పని పూర్తయ్యేలా చూసింది. 10 ఇన్నింగ్స్‌లలో 5 అర్ధసెంచరీలతో 523 పరుగులు చేసిన నాట్ సివర్ ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచింది. పరుగుల పట్టికలో మూడో స్థానంలో ఉన్న హేలీ మాథ్యూస్ (307) జట్టుకు అదనపు బలంగా మారింది. బౌలింగ్‌లో అమేలియా కెర్ (18 వికెట్లు), హేలీ మాథ్యూస్ (18), నాట్ సివర్ (12) ప్రత్యర్థులను పడగొట్టడంలో సఫలమయ్యారు. మరో ప్రధాన పేసర్ షబ్నిమ్ ఇస్మాయిల్ అంచనాలకు తగినట్లుగా రాణించకపోయినా... ఆ ప్రభావం జట్టుపై పడకుండా ఈ ముగ్గురు బాధ్యత తీసుకున్నారు. ఫైనల్లో మాత్రం షబ్నిమ్ తన స్థాయి ప్రదర్శనను చూపించింది.

తొలి మ్యాచ్‌లో ఢిల్లీ చేతిలో పరాజయంతో ముంబై టోర్నీ మొదలైంది. అయితే ఆ తర్వాత వరుసగా మూడు విజయాలతో జట్టు కోలుకుంది. తర్వాతి మ్యాచ్‌లో మళ్లీ ఢిల్లీ చేతిలోనే పరాజయం. ఈ సారి హర్మన్, సివర్ ఇద్దరూ విఫలమయ్యారు. ఆ తర్వాత మరో రెండు మ్యాచ్‌లు గెలిచి ప్లే ఆఫ్స్ ఖాయమైనా... టాప్ స్థానం కోసం జట్టు గట్టిగానే పోరాడింది. అయితే బెంగళూరు చేతిలో ఓటమి తప్పలేదు. దాంతో ఎలిమినేటర్ మ్యాచ్‌లో ప్రదర్శనపై సందేహాలు వచ్చాయి. అయితే సంపూర్ణ ఆధిక్యంతో విజయం సాధించిన ముంబై అలవోకగా ఫైనల్ చేరింది. గత రెండు లీగ్ మ్యాచ్ తరహాలో ఈ సారి కూడా ఢిల్లీపై ఆరంభంలో తడబాటు కనిపించింది. కానీ మళ్లీ హర్మన్, సివర్ భాగస్వామ్యమే జట్టును నడిపించింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ వీరిద్దరు పట్టుదలగా ఆడటంతో జట్టు ప్రత్యర్థికి సవాల్ విసిరేంత స్కోరును సాధించగలిగింది. ఫైనల్ సహా ఇదే వేదికపై వరుసగా నాలుగో మ్యాచ్ ఆడటం కూడా జట్టుకు కలిసొచ్చింది. టోర్నీలో ఢిల్లీ ఫామ్ చూస్తే 150 పరుగుల ఛేదన పెద్ద కష్టం కాదనిపించినా... ముంబై బౌలర్లంతా సమష్టిగా చెలరేగి మూడేళ్ల వ్యవధిలో రెండో టైటిల్‌ను అందించడం విశేషం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



● సమంత

థ్రిల్‌కి గురి చేసే శుభం

హీరోయిన్ సమంత నిర్మాతగా మారిన సంగతి తెలిసిందే. 'త్రలాలా మూవింగ్ పిక్చర్స్' అనే బ్యానర్ ఆరంభించి, ఆమె నిర్మిస్తున్న తొలి చిత్రం 'శుభం'. ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు శనివారం మేకర్స్ ప్రకటించారు. సి. మల్గిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలినీ కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి ముఖ్య పాత్రలు పోషించారు. 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ''ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా 'శుభం' ఉంటుంది. వసంత్ మరిగంటి రాసిన ఈ కథని ప్రవీణ్ కండ్రేగుల చక్కగా తెరకెక్కించారు. ఈ సినిమా చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. త్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై మొదటి ప్రాజెక్ట్‌గా 'శుభం'ని ఎందుకు ఎంచుకున్నాం అనేది త్వరలోనే తెలుస్తుంది. మా మూవీని త్వరలో విడుదల చేయనున్నాం'' అని సమంత పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమేరా: మృదుల్ సుజిత్ సేన్.



● విక్రమ్, దుషారా విజయన్

వెళ్లిపో... అదే నీకు మంచిది

'ఏవండీ... కొట్లో ఎవరండీ... ఏవండీ...' అంటూ నటి దుషారా విజయన్ చెప్పే డైలాగ్‌తో 'వీర ధీర శూర: పార్ట్ 2' మూవీ ట్రైలర్ ఆరంభమైంది. విక్రమ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'వీర ధీర శూర: పార్ట్ 2'. ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో దుషారా విజయన్ హీరోయిన్‌గా నటించగా, ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరాముడు ముఖ్య పాత్రలు పోషించారు. రియా శిబు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. తెలుగులో ఎన్వీఆర్ సినిమాస్ సంస్థ విడుదల హక్కులు సొంతం చేసుకోగా, నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనున్నారు. తెలుగు ట్రైలర్‌ని శనివారం రిలీజ్ చేశారు. 'ఈ కేసు మిగతా కేసుల్లాంటిది కాదు... ఈరోజు మిస్ అయితే లైఫ్ టైమ్ మిస్సే', 'అయిపోయావురా ఈ రోజు... రా లేపేస్తా' అంటూ ఎస్‌జే సూర్య చెప్పే డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. 'వద్దురా... మూస్కొని వెళ్లిపో... అదే నీకు మంచిది' అంటూ విక్రమ్ చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ ముగుస్తుంది. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'వీర ధీర శూర: పార్ట్ 2'' అని చిత్రబృందం పేర్కొంది.



'అనగనగా ఒక కథ' అంటూ పీరియాడికల్ ఫిల్మ్స్ చేస్తున్న హీరోలపై ఆర్టికల్, విష్ణు మంచు 'కన్నప్ప', కార్తీ 'ఖైదీ 2' చిత్రాల విశేషాల కోసం 'సాక్షి' ప్లస్ ఈ పేజీని చదవండి.

రాబిన్‌హుడ్‌కి అతిథి



● డేవిడ్ వార్నర్

'భీష్మ' (2020) వంటి హిట్ మూవీ తర్వాత హీరో నితిన్, డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ చిత్రంలో ఆస్ట్రేలియన్ డైనమిక్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ప్రత్యేక అతిథి పాత్రలో నటించారు. ఆయన ఫస్ట్ లుక్‌ని శనివారం రిలీజ్ చేశారు. షార్ట్ హెయిర్ కట్, ట్రెండీ దుస్తులు, చిరునవ్వు, కూల్ ఎక్స్‌ప్రెషన్‌తో ఉన్న వార్నర్ లుక్ అదుర్స్ అంటున్నారు ఆయన ఫ్యాన్స్. ''రాబిన్‌హుడ్‌లో డేవిడ్ వార్నర్‌ది అతిథి పాత్ర అయినప్పటికీ ఆయనకు ఉన్న ప్రపంచ ప్రజాదరణ, మ్యాసీవ్ సోషల్ మీడియా ఫాలోయింగ్ సినిమాపై స్పెషల్ ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సీఈఓ: చెర్రీ, కెమేరా: సాయి శ్రీరామ్, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ బళ్లపల్లి.

మంచి మార్కులు వేసుకున్నాను
- సప్తగిరి

''పెళ్లి కాని ప్రసాద్ సినిమా చాలా బాగా వచ్చింది. నేను చేసిన మురళి గౌడ్ పాత్రలో ఒక నిజాయతీ కనిపిస్తుంది. ఈ చిత్రం కోసం మాకు మేము ఒక ఎగ్జామ్ రాసుకున్నాం. నా మనస్సాక్షిగా 100 శాతం మంచి మార్కులు వేసుకున్నాను. ప్రేక్షకుల నుంచి కూడా మంచి మార్కులు పడతాయని ఆశిస్తున్నాను. ఈ సినిమాలోని వినోదం ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది'' అని సప్తగిరి చెప్పారు. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో సప్తగిరి, ప్రియాంకా శర్మ జోడీగా నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పణలో కేవై బాబు, భానుప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మించారు. నిర్మాత 'దిల్' రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఈ నెల 21న ఈ చిత్రాన్ని విడుదల చేస్తోంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సప్తగిరి మాట్లాడుతూ– ''అభిలాష్ రెడ్డిగారు ప్రేక్షకులందరూ గొప్పగా మాట్లాడే సినిమా తీశారు. నిర్మాతలు గ్రాండ్‌గా నిర్మించారు'' అని తెలిపారు. ''థియేటర్స్‌కి వచ్చి మా సినిమాని చూడాలి'' అన్నారు అభిలాష్ రెడ్డి. ''మా చిత్రకథ, వినోదం చాలా బాగుంటాయి. ప్రేక్షకులు ఆదరించాలి'' అని కేవై బాబు కోరారు. ''ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ సినిమా ఇది'' అన్నారు అన్నపూర్ణమ్మ.



● సప్తగిరి, అన్నపూర్ణమ్మ, ప్రియాంకా శర్మ

అనగనగా ఆస్ట్రేలియాలో...

నూతన తారలతో ఆస్ట్రేలియాలో చిత్రీకరణ జరుపుకున్న చిత్రం 'అనగనగా ఆస్ట్రేలియాలో'. తారక రామ కథ అందించి, దర్శకత్వం వహించారు. బి.టి.ఆర్ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21 ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తారక రామ మాట్లాడుతూ– ''తెలుగువాణ్ణి అయిన నేను ఐటీ జాబ్ చేస్తూ ఆస్ట్రేలియాలో స్థిరపడ్డాను. సినిమాలపై ఇష్టంతో ఫిల్మ్ కోర్స్‌లో మాస్టర్స్ చేసి, తొలి చిత్రంగా 'అనగనగా ఆస్ట్రేలియాలో' తీశాను. వాస్తవ ఘటనల ఆధారంగా థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన మూవీ ఇది. షూటింగ్ మొత్తం ఆస్ట్రేలియాలోనే చిత్రీకరించినా.. నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రం తెలుగు వారే. ప్రస్తుతం తెలుగులోనే రిలీజ్ చేస్తున్నాం.. ప్రేక్షకులు ఆశీర్వదించాలి'' అన్నారు.



● తారక రామ

థ్రిల్లింగ్ స్టోరీ

లోహిత్ కల్యాణ్, రాజేశ్ కుంచాడా, జోషిత్ రాజ్ కుమార్, కైలాశ్ వేలాయుధన్, పూజా విశ్వేశ్వర్, టీవీ రామన్, ఆర్కే నాయుడు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాజుగారి దొంగలు'. లోకేశ్ రనాల్ హిటాసో దర్శకత్వం వహించారు. నడిమింటి లిఖిత సమర్పణలో హిటాసో ఫిలిం కంపెనీ బ్యానర్‌పై నడిమింటి బంగారు నాయుడు నిర్మించిన ఈ సినిమాని ఈ నెల 21న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది యూనిట్. ఈ సందర్భంగా లోకేశ్ రనాల్ మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథతో సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందించిన చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. మా యూనిట్‌ని ఆడియన్స్ సపోర్ట్ చేయాలి'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సందీప్ బదుల, ప్రకాశ్ రెడ్డి, సంగీతం: నాఫల్ రాజా ఏఐఎస్.




● లోహిత్ కల్యాణ్, రాజేశ్, జోషిత్, కైలాశ్

ఓటీటీ ఇది చూడొచ్చు

100 ప్రాబ్లమ్స్... 0 సొల్యూషన్స్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం 'కుడుంబస్తన్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

ఆకాశంలో చందమామ ఎక్కడ ఉంది అని అడిగితే ఓ కుటుంబంలోని నలుగురు నాలుగు దిక్కులు చూపిస్తే ఆ కుటుంబంలోని ఫ్యామిలీ మేన్ పరిస్థితి ఏంటి? అదే 'కుడుంబస్తన్' సినిమా. ఇదో తమిళ మూవీ. సూపర్ ఫ్యామిలీ ఓరియంటెడ్ కామెడీ మూవీ. దీనికి దర్శకుడు రాజేశ్వర్. ప్రముఖ తమిళ నటులు మణికందన్, మేఘన హీరో హీరోయిన్లుగా ఈ సినిమాలో నటించారు. ఓ ప్రధాన పాత్రలో నాటి ప్రముఖ నటుడు ఆర్. సుందర్ రాజన్ కూడా నటించారు. ఈ సినిమా చూస్తున్నంత సేపు మనం మన పొరిగింటి వాళ్ల కథ చూసినట్టుంటుంది కానీ సినిమా అని ఎక్కడా అనిపించదు. దర్శకుడు అంతలా చక్కటి స్క్రీన్‌ప్లేను, పాత్రలను ఎన్నుకున్నాడు. మరి... 'కుడుంబస్తన్' కథేంటి అంటే... ఇదో సింపుల్ కథ. నవీన్, వెన్నెల పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకుంటారు. అయినా నవీన్ తల్లిదండ్రుల దగ్గరే కాపురముంటారు. వెన్నెల సివిల్స్‌కి ప్రిపేర్ అవుతుంటుంది. నవీన్ అడ్వర్టైజ్‌మెంట్స్ కంపెనీలో డిజైనర్. నవీన్ ఒక్కడే ఆ కుటుంబంలో సంపాదించేవాడు. తండ్రి రియల్ ఎస్టేట్ అని తిరుగుతాడు తప్ప ఏమీ సంపాదించడు. ఇక తల్లి వెన్నెలను విసుక్కుంటూ తీర్థయాత్రలకని కొడుకుని కాకా పడుతుంటుంది. నవీన్‌ది బొటాబొటీ ఉద్యోగం. సంపాదించే ప్రతి రూపాయిని చాలా జాగ్రత్తగా చూసుకుని ఖర్చు పెడుతుంటాడు. నవీన్‌కి ఓ చెల్లెలు ఉంటుంది. ఆమె పెళ్లి చేసుకుని వేరుగా ఉంటుంది. నవీన్ బావమరిది పెద్ద ఉద్యోగం చేస్తుంటాడు. అందుకే నవీన్‌ని కాస్త హేళనగా చూస్తుంటాడు. ఈ దశలో నవీన్‌కి అనుకోకుండా ఉద్యోగం ఊడిపోతుంది. ఈ విషయాన్ని ఇంట్లో వాళ్ల దగ్గర దాస్తాడు. అంతలో వెన్నెల గర్భవతి అవుతుంది. ఓ పక్క తండ్రి తాము ఉంటున్న ఇంటిని బాగు చేయమని గోల, తల్లి తన తీర్థయాత్రలకు ఏర్పాట్లు చేయమని ఏడుపు, అలాగే వెన్నెల మెడికల్ ఖర్చులు... మరో పక్క లేని ఉద్యోగం ఆ పై బావమరిది హేళన... వీటన్నిటినీ నవీన్ ఎలా అధిగమించాడన్నది జీ 5 ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'కుడుంబస్తన్'లో చూడాల్సిందే. సినిమా మొత్తం మంచి కామెడీతో ఆఖరున ఓ చక్కని మెసేజ్‌తో మంచి సినిమా చూశామన్న ఫీలింగ్ కలుగుతుంది. వర్తబుల్ వాచ్ ఫర్ ది వీకెండ్.



– ఇంటూరు హరికృష్ణ

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

నిర్భయ ఫండ్

దేశంలో మహిళలు, బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం నిర్భయ ఫండ్ కింద అనేక కార్యక్రమాలు చేపడుతోంది. నిర్భయ ఫండ్ కోసం 2024-25 వరకు కేటాయించిన మొత్తం రూ.7,712.85 కోట్లు కాగా, ఇందులో ఖర్చు చేసింది రూ.5,846 కోట్లు.

827
మానవ అక్రమ రవాణాను నిరోధించడానికి, బాధితులకు సాయం చేయడానికి ఏర్పాటుచేసిన యూనిట్లు

14,658
మహిళల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కులు

13,743
మొత్తం హెల్ప్ డెస్కుల్లో మహిళలే ఇంఛార్జిలుగా ఉన్న డెస్కులు

2.10 కోట్లు
మహిళా హెల్ప్ డెస్కులకు వచ్చిన ఫోన్ కాల్స్

84.43
మహిళా హెల్ప్ డెస్కుల ద్వారా సాయం పొందినవారు



ఆధారం: కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ

నిప్పు లాంటి నిజం... తప్పుదోవ కూటమి నైజం

ఆర్డీవో కార్యాలయ ఘటన కేసు కక్ష సాధింపే

- గత డిసెంబర్ 2న గౌతంతేజ్ పాలీగ్రాఫ్ నివేదిక స్పష్టీకరణ
- నేరం నిరూపించలేని పరిస్థితి
- ఈ నివేదికను పక్కన పెట్టిన సీఐడీ అధికారులు
- 27 రోజుల తర్వాత నిందితుడు నేరం అంగీకరించి వాంగ్మూలం ఇచ్చాడని అరెస్ట్ చేసిన సీఐడీ
- దర్యాప్తు తీరంతా వేధింపుల కోసమేనని నిర్ధారణ అవుతున్న వైనం

బి.కొత్తకోట (అన్నమయ్యజిల్లా): మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో గతేడాది జూలై 21న జరిగిన అగ్ని ప్రమాద ఘటన కేసు దర్యాప్తు చంద్రబాబు సర్కార్ నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తోంది. నిజాలను కప్పిపెట్టి అక్రమ కేసులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని, వైఎస్సార్‌సీపీ నేతలను వేధించే ప్రయత్నమే అని తేటతెల్లమవుతోంది. ప్రభుత్వ పరిధిలోని ఓ శాఖ నేరం నిరూపణ కాలేదని ఇచ్చిన నివేదికను పక్కన పెట్టిన సీఐడీ అధికారులు, దాదాపు నాలుగు వారాల తర్వాత నిందితుడు నేరం అంగీకరించాడని అరెస్ట్ చేయడం ఇప్పుడు దర్యాప్తు తీరునే ప్రశ్నించేలా ఉంది.

పాలీగ్రాఫ్ నివేదిక 'క్లియర్'

కార్యాలయ ప్రమాద కేసులో కీలకమైన సీనియర్ అసిస్టెంట్ గౌతంతేజ్‌కు సీఐడీ అధికారులు పాలీగ్రాఫ్ పరీక్షలను చేయించారు.



మదనపల్లె ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సిసోడియా (ఫైల్)

నవంబర్ 26, 27 తేదీల్లో పాలీగ్రాఫ్ పరీక్షలు పూర్తి చేసి సంబంధిత పరీక్ష ఫలితాల నివేదికను డిసెంబర్ 2న ఏపీఎస్ఎఫ్ఎల్‌కు చెందిన రెండు విభాగాల జాయింట్ డైరెక్టర్లు మంగళగిరి సీఐడీ ఎస్పీకి పంపారు. ఈ నివేదికలో గౌతంతేజ్‌ను అడిగిన నాలుగు ప్రశ్నలకు 'కాదు' అని సమాధానం ఇచ్చాడని, అతనిపై నేర నిరూపణ కాలేదని స్పష్టంగా పేర్కొన్నారు.

27 రోజుల తర్వాత నేరం అంగీకరించాడట

అయితే నివేదిక పంపిన 27 రోజుల తర్వాత– గౌతంతేజ్‌ను గత డిసెంబర్ 30న పలమనేరులో అదుపులోకి తీసుకుని కోర్టుకు రిమాండ్‌కు పంపారు. ఆర్డీవో కార్యాలయ ఘటనకు సంబంధించి నిప్పు పెట్టినట్టు, ఇందులో కొందరితో కలిసి కుట్ర పన్నినట్టుగా గౌతంతేజ్ తనంతట తానే నేరాన్ని అంగీకరించాడని పేర్కొన్నారు. పాలీగ్రాఫ్ పరీక్షల నివేదిక నేర నిరూపణ కాలేదని స్పష్టం చేస్తుంటే, పోలీసుల వద్ద నేరం ఎలా అంగీకరించాడన్నది ప్రశ్నార్థకం.

ఆ రాత్రి అక్కడ ఉన్నది వీఆర్ఏ..

ప్రమాద సమయంలో రాత్రి 11.26 గంటలకు కాపలాదారు వీఆర్ఏ రమణయ్య మంటలను ఆర్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. దీనిపై డెప్యూటీ తహసీల్దార్ తపస్వినికి సమాచారం ఇచ్చినట్టు నిర్ధారించారు. అయితే ప్రధాన ముద్దాయి గౌతంతేజ్ అదేరోజు రాత్రి 10.40 గంటలకే కార్యాలయం నుంచి బయటకు వచ్చినట్టు సీసీ కెమెరా ఫుటేజీల్లో స్పష్టమవుతోంది. కేసును పరిశీలించాక నిందితుని వాగ్మూలం తప్ప ఇతర ఆధారాలు లేవు. ఆధారాలుంటే కేసు విచారణలో పరిగణనలోకి తీసుకోవచ్చు అని న్యాయస్థానం బెయిల్ తీర్పులో పేర్కొంది.

ఐదునెలలు కక్షసాధింపే..

గత జూలై 21న జరిగిన మదనపల్లె ఆర్డీవో కార్యాలయ ఘటన మరుసటి రోజు నుంచే ప్రభుత్వం కక్ష సాధింపు మొదలు పెట్టింది. ప్రభుత్వ వ్యవస్థలను మదనపల్లెలో మకాం పెట్టించి దర్యాప్తు చేయించింది. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి ఘటన జరగలేదని చెప్పుకుంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని వేధించేందుకు వీలుగా ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తూ, విఫలమవుతూనే ఉంది.

వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీల తిరుగుబాటు

- సర్వసభ్య సమావేశం వాయిదా
- కోట్లాది రూపాయల పనులకు ఏకపక్ష అనుమతులపై కన్నెర్ర
- చైర్‌పర్సన్ నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా ఏకతాటిపైకి వచ్చిన సభ్యులు
- కోరంలేక వాయిదా పడిన సమావేశం, స్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై వైఎస్సార్‌సీపీకి చెందిన జెడ్పీటీసీలు కన్నెర్ర చేశారు. నియంతృత్వ ధోరణితో ఏకపక్షంగా సాగుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వ పాలనలో భాగస్వాములు కాలేక.. అవినీతి, అక్రమాలను వ్యతిరేకిస్తూ ఏకతాటిపైకి వచ్చారు. దీంతో జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. 56 మంది జెడ్పీటీసీల్లో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో సహా 12 మంది హాజరయ్యారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలుపుకుని మొత్తం 84 మంది సభ్యులుండగా, వారిలో కేవలం 12 మందే హాజరయ్యారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మినహా అధికార పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవ్వరూ హాజరుకాలేదు. సమావేశాన్ని నిర్వహించేందుకు మూడోవంతు అంటే 28 మంది హాజరు కావాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం మ.2.30కు ప్రారంభం కావాల్సిన సమావేశానికి సభ్యులు హాజరుకాకపోవడానికి తోడు కోరంలేక గంటపాటు వాయిదా వేశారు. అయినప్పటికీ పరిస్థితి అలాగే ఉండడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. ఇక తమ ప్రమేయంలేకుండా కోట్లాది రూపాయల పనులకు ఇష్టారాజ్యంగా అనుమతులు మంజూరు చేస్తున్న విషయమై గతంలో పలుమార్లు చైర్‌పర్సన్‌తో పాటు అధికార యంత్రాంగాన్ని వైఎస్సార్‌సీపీ సభ్యులు నిలదీశారు. అయినప్పటికీ పరిస్థితుల్లో మార్పు రాలేదు. పైగా.. జెడ్పీ ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించుకునేందుకు సమావేశాన్ని ఏర్పాటుచేయడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులు దానిని అడ్డుకుని.. అవినీతి, అక్రమాలపై నిరసన గళం విప్పారు. అదే విధంగా ఉదయం ఏర్పాటుచేసిన జెడ్పీ ఏడు స్థాయీ సంఘ సమావేశాలకు సైతం సభ్యులు గైర్హాజరుకావడంతో వాయిదా వేశారు.

చైర్‌పర్సన్ తీరుపై ఫైర్..

ఇక జెడ్పీ సమావేశాన్ని బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. తమకు సముచిత గౌరవంలేకుండా కొనసాగుతున్న వ్యవహారాలు, ఏకపక్షంగా జరుగుతున్న పనులు, కేటాయింపులు, నిధుల మంజూరును వ్యతిరేకిస్తూ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తీరును మీడియా సమక్షంలో ఎండగట్టారు. చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టిన తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై రాజకీయ స్వార్థంతో చేస్తున్న చౌకబారు ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. పనుల కేటాయింపులో సాగుతున్న కమీషన్ల బాగోతం.. వాటాలు దండుకుంటున్న వ్యవహారాన్ని ఇక సహించబోమని హెచ్చరించారు. ఇలా వీరి వ్యూహాత్మక తిరుగుబాటుతో చైర్‌పర్సన్‌తో పాటు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన జెడ్పీటీసీలు ఖంగుతిన్నారు.

లారీని ఢీకొన్న ఆటో

సుల్తానాబాద్ రూరల్ (పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల వద్ద ఆగిఉన్న లారీని ఆటో ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. పెద్దపల్లికి చెందిన అప్పల అభిరాం, ఆదిత్య, సాయిచరణ్, విశాల్, కిశోర్‌తోపాటు మరో ముగ్గురు విద్యార్థులు సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. శనివారం స్థానిక బస్టాండ్ వద్దకు వచ్చిన విద్యార్థులు ఆటోలో ఎక్కారు. ఆటో చిన్నకల్వల సమీపంలోకి రాగానే.. ఛత్తీస్‌గఢ్ వైపు వెళ్లే లారీని ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌తో పాటు విద్యార్థి ఆదిత్య కాలు విరిగింది. అభిరాం, సాయిచరణ్, విశాల్, కిశోర్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు, పోలీసులు వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'28న విద్యుత్ కార్యాలయాల ముందు సీపీఎం ధర్నా'

సాక్షి, అమరావతి: ప్రజలపై ప్రభుత్వం వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 28న విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. 'విద్యుత్ షాకులు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కదిరిలో కీచక ప్రిన్సిపాల్

- అమృతవల్లి మహిళా డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ వికృత చేష్టలు
- హోలీ రోజు విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన
- కేసు నమోదు చేసిన పోలీసులు

కదిరి: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడు. హోలీ వేడుకను అడ్డం పెట్టుకొని వికృత చేష్టలకు పాల్పడ్డాడు. ఆ వీడియోలు శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరలవడంతో పోలీసులు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటపతిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని అమృతవల్లి మహిళా డిగ్రీ కళాశాలలో హోలీ నాడు (శుక్రవారం) చోటు చేసుకుంది. కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని అమృతవల్లి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటపతి కళాశాల విద్యార్థినులతో వ్యవహరించే తీరు విద్యార్థినుల తల్లిదండ్రులతో పాటు కళాశాల పరిసరాల్లో నివాసముంటున్న వారికి కూడా నచ్చలేదు. హోలీ సందర్భంగా శుక్రవారం వెంకటపతి కళాశాల ప్రాంగణంలోనే అమ్మాయిలపైకి రంగులు చల్లడంతో పాటు వారిని గట్టిగా పట్టుకోవడం, ఎక్కడపడితే అక్కడ తాకటం వంటి వికృత చేష్టలకు పాల్పడ్డారు. ఈ దృశ్యాలను కళాశాల పరిసరాల్లోని కొందరు మహిళలు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. తర్వాత వాటిని సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ చేశారు. ఆ విషయం పట్టణ పోలీసుల దృష్టికి రావడంతో ఈ కేసును సుమోటాగా స్వీకరించారు. మహిళా కానిస్టేబుల్ గౌసియా ద్వారా ఫిర్యాదు తీసుకొని బీఎన్ఎస్ సెక్షన్ 75 కింద కేసు నమోదు చేశారు.

పవన్ బీజేపీ స్క్రిప్ట్ చదివినట్లుగా ఉంది

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, అమరావతి : జనసేన ఆవిర్భావ సభలో పవన్‌కళ్యాణ్ బీజేపీ స్క్రిప్ట్ చదివినట్లు ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో త్రిభాషా విధానం అమలుచేయడాన్ని ఎవరూ వ్యతిరేకించడంలేదని, హిందీని బలవంతంగా రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. అది గమనించకుండా పవన్ బీజేపీ నేతలా మాట్లాడ్డం విడ్డూరంగా ఉందన్నారు. హిందీ రాష్ట్రాల్లో దక్షిణాది రాష్ట్రాల భాషను మూడో భాషగా అమలుచేస్తారా? అని రామకృష్ణ ప్రశ్నించారు. మన భాషా చిత్రాలను హిందీలోకి ఎందుకు అనువదిస్తున్నారని ప్రశ్నించిన పవన్ మరి ఉత్తరాది చిత్రాలను మన భాషలోకి ఎందుకు అనువదిస్తున్నారో చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. అలాగే, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్న ఆయన.. బాల్య వివాహాలు, సతీసహగమనం, శూద్రులు చదువుకోకూడదనే దారుణమైన ఆచారాలను మళ్లీ ప్రోత్సహించదల్చుకున్నారా? దీనిపైనా సమాధానం చెప్పాలన్నారు. గతంలో సెక్యూలర్ వాదినని చెప్పుకున్న పవన్ ఇప్పుడు సనాతన ధర్మం అంటూ వేషభాషలు మార్చారని రామకృష్ణ ఎద్దేవా చేశారు.

క్లుప్తంగా...

సెంట్రల్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న యోజిత

బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ యోజిత సాహో (27) ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయ్‌పూర్‌కు చెందిన యోజిత సాహో వర్సిటీలో ఎంఏ (ఇంగ్లిష్) అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలో అద్దెకు ఉంటూ రోజూ వర్సిటీకి వెళ్లి వచ్చేవారు. శుక్రవారం రాత్రి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. శనివారం ఉదయం ఇంటి తలుపులకు గడియ పెట్టుకుని.. ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ కరుణాకర్ చేరుకుని మృతురాలి ఐ ఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. తల్లిదండ్రులు రాగానే ఆత్మహత్యకు గల కారణాలు తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

చైతన్య టెక్నో స్కూల్‌లో దారుణం

9వ తరగతి విద్యార్థినిని సెకండ్ ఫ్లోర్ నుంచి నెట్టేసిన తోటి విద్యార్థి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్నేహ

తిరుపతి క్రైమ్: తిరుపతిలోని చైతన్య టెక్నో స్కూల్లో శనివారం దారుణ ఘటన చోటు చేసుకుంది. తిరుపతి బైరాగి పట్టెడలో ఉన్న చైతన్య టెక్నో స్కూల్లో ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ.. ఓ విద్యార్థిని ప్రాణాల మీదకు తెచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని స్నేహ, మరో విద్యార్థికి కొంతకాలం నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థినిపై విద్యార్థి ఈర్ష్య పెంచుకుని.. శనివారం మధ్యాహ్నం రెండో అంతస్తు నుంచి స్నేహను కిందకు తోసేశాడు. దీంతో విద్యార్థిని తీవ్ర గాయాలపాలైంది. స్కూల్ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా ఆ విద్యార్థినికి ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స అందిస్తోంది. తిరుపతి అర్బన్ తహసీల్దార్ ఆస్పత్రికి చేరుకుని ప్రమాద ఘటనపై విచారణ చేస్తున్నారు.

డీఎస్సీపై ఎందుకు ఆలస్యం?: డీవైఎఫ్‌ఐ

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌పై 10 నెలలుగా నిరుద్యోగులను ఊరిస్తూ మోసం చేస్తోందని, ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటనలు చేయడం మానేసి సీఎం మొదటి సంతకం చేసిన హామీని నెరవేర్చాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో డీఎస్సీ అభ్యర్థుల పరిస్థితి దయనీయంగా ఉందని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న శనివారం పేర్కొన్నారు. ప్రభుత్వ హామీని నమ్మి నోటిఫికేషన్లు వస్తాయని ఏడాదిగా కోచింగ్ తీసుకుంటూ అభ్యర్థులు సమయాన్ని, డబ్బును పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లస్టర్ హెచ్ఎంల హోదా పెంచండి: ఆప్టా
ప్రభుత్వం కొత్తగా క్లస్టర్ వ్యవస్థతో పాటు మోడల్ స్కూళ్ల విధానం అమలు చేస్తోన్న నేపథ్యంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులకు అధికారాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ప్రభుత్వాన్ని కోరింది. గతంలో కాంప్లెక్స్ హెచ్ఎంలకు పర్యవేక్షణ అధికారాలు అప్పగిస్తూ ఉత్తర్వులున్నాయని, దీని ప్రకారం హెచ్ఎంలు తమ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని స్కూళ్లను పర్యవేక్షించేవారని ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు శనివారం పేర్కొన్నారు. ఇప్పుడు క్లస్టర్ పరిధిలోని స్కూళ్ల పరిశీలనకు వెళితే హెచ్ఎంలకు గౌరవం కూడా దక్కడం లేదన్నారు. ప్రస్తుత క్లస్టర్ విధానంలో సదరు క్లస్టర్ హెచ్ఎం స్థాయిని గ్రేడ్-1కు పెంచాలని కోరారు.

షార్ చేరుకున్న ఘన ఇంధన తయారీ వర్టికల్ మిక్సర్

ప్రపంచంలోనే అతి పెద్దది


వర్టికల్ ఘన ఇంధనం మిక్సర్

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 150 టన్నుల బరువు గల ఘన ఇంధన తయారీ వర్టికల్ మిక్సర్ బెంగళూరు నుంచి గురువారం అర్ధరాత్రి సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌కు చేరుకుంది. ఆత్మ నిర్భర్‌లో భాగంగా భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో బెంగళూరులోని ప్రముఖ పరిశోధన, అభివృద్ధి సంస్థ 'సెంట్రల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్' (సీఎంటీఐ) దీనిని రూపొందించింది. పది టన్నుల ఘన ఇంధనం తయారు చేసుకునే ఈ వర్టికల్ మిక్సర్ పరికరం.. ప్రపంచంలోనే అతిపెద్దదని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 8.7 మీటర్ల ఎత్తు, 5.4 మీటర్ల పొడవు, 3.3 మీటర్ల వెడల్పు కలిగి ఉండే.. ఈ వ్యవస్థ అంతా హైడ్రోస్టాటిక్ ఆధారితంగా పనిచేస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 13న బెంగళూరులో సీఎంటీఐ కార్యదర్శి ఈ వర్టికల్ మిక్సర్‌ను నమూనా రూపంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ వీ నారాయణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌కు అందజేశారు.

ఈనాడు ఆస్తుల జప్తు

విజయవాడ సమీపంలోని గూడవల్లి వద్ద ఆస్తులపై కోర్టు ఆదేశం

ఆ ఆస్తులను ఎవరికీ బదలాయించరాదు

తాకట్టు పెట్టడం, విక్రయించడం, బహుమతిగా ఇవ్వడం కుదరదు

> (1) directing the first defendant to vacate the plaint schedule property and deliver possession of the same to the plaintiff within THREE MONTHS from to-day, failing which the plaintiff is entitled to get the possession through the process of law;
>
> (2) directing the first defendant to pay Rs.5,20,60,652/- to the plaintiff towards damages/mesne profits for the period from 1.10.2012 to 30.9.2015 together with interest at 6% per annum from the date of the suit till the date of realization on the said amount and the claim for remaining amount as damages/mesne profits is rejected; and

అప్పారావుకు రూ.5.2 కోట్ల పరిహారం 6 శాతం వడ్డీతో చెల్లించాలంటూ కోర్టు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: అందరికీ నిత్యం ఉదయాన్నే నీతులు చెప్పే ఈనాడు (ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్) దౌర్జన్యం కొనసాగుతోంది. తమ పత్రిక ద్వారా జనాలకు నీతులు మాత్రమే చెబుతామని, వాటిని తాము మాత్రం ఆచరించమని ఈనాడు మరోమారు నిరూపించింది. గతంలో విశాఖపట్నం ఈనాడు కార్యాలయం స్థలం విషయంలో దాని యజమాని ఆదిత్య వర్మను ముప్పుతిప్పలు పెట్టిన ఈనాడు యాజమాన్యం, ఇప్పుడు విజయవాడలో ఉన్న కార్యాలయ స్థలం విషయంలో కూడా దాని యజమాని ముసునూరు అప్పారావును సైతం అలాగే ముప్పుతిప్పలు పెడుతోంది. ఈనాడు పత్రిక కోసం తీసుకున్న స్థలం లీజు గడువు ముగిసినా.. దాన్ని అప్పారావుకు అప్పగించకుండా చుక్కలు చూపిస్తోంది. చివరకు అప్పారావు కోర్టుకెళ్లి న్యాయపోరాటం చేయాల్సిన పరిస్థితి తెచ్చింది. అక్కడ కూడా అప్పారావుకు అడుగడుగునా ఇబ్బందులు సృష్టించే ప్రయత్నం చేసింది. కోర్టుకెళ్లి అప్పారావు విజయం సాధించినా.. న్యాయస్థానం ఆదేశాలను సైతం ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో కోర్టు ఈనాడు తీరును తీవ్రంగా ఆక్షేపించింది. స్థల యజమానిని వేధించడానికే ఆ స్థలాన్ని ఖాళీ చేయడం లేదని కూడా ఘాటుగా వ్యాఖ్యానించింది. కాగా.. బాధితుడు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6 శాతం వార్షిక వడ్డీతో పరిహారం చెల్లించాలంటూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సైతం ఈనాడు యాజమాన్యం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈనాడు ఆస్తుల జప్తునకు న్యాయస్థానం తాజాగా ఆదేశాలు ఇచ్చింది. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు ఆస్తులను బదలాయించడం, తాకట్టు పెట్టడం, అమ్మడం, బహుమతిగా ఇవ్వడం చేయరాదని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ ఆస్తులను ఎవరూ కొనడం, బహుమతిగా తీసుకోవడం చేయరాదంది. తదుపరి ఆదేశాలు ఇచ్చేంతవరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఈనాడు ఎండీ కిరణ్‌ను ఆదేశించింది.

> 23. Keeping in mind the principles enunciated in the above decisions, I hold that the plaintiff's suit will serve no useful purpose; and the same is bound to fail. It cannot be allowed to be used as a device to harass the defendants. I am of the considered opinion that this suit is abuse of process of law. When there is no chance of succeeding in the plaint and the same is without merit, the suit cannot be continued. and the Court can dismiss such suit

అప్పారావును వేధించడానికి అనుమతించబోమన్న కోర్టు

అసలు కథ ఏమిటంటే..

ఈనాడు యజమాని రామోజీరావు 1975లో విజయవాడ పటమటలంకలో ముసునూరి అప్పారావుకు చెందిన 92 సెంట్ల స్థలాన్ని 33 ఏళ్లపాటు లీజుకు తీసుకున్నారు. నెలకు రూ.725 అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ పక్కనే అప్పారావు సమీప బంధువైన వల్లూరు వెంకటేశ్వరరావుకు చెందిన ఎకరా 47 సెంట్ల భూమిని కూడా రామోజీరావు లీజుకు తీసుకున్నారు. లీజు గడువు 30.04.2008న ముగిసింది. దీంతో మరో 33 ఏళ్ల పాటు లీజు పొడిగించాలని స్థల యజమాని అప్పారావును రామోజీరావు కోరారు. రామోజీ సంగతి బాగా తెలిసిన అప్పారావు లీజు పొడిగింపునకు నిరాకరించారు. 6 నెలల్లో స్థలాన్ని ఖాళీ చేసి ఇవ్వాలని రామోజీరావుకు తేల్చిచెప్పారు. 6 నెలల గడువు 2008 అక్టోబర్‌తో ముగిసింది. అయినా రామోజీరావు ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. ఇదే సమయంలో మరో 33 ఏళ్లపాటు లీజు పొడిగించేలా అప్పారావును ఆదేశించాలంటూ విజయవాడ జిల్లా కోర్టులో రామోజీరావు సూట్ దాఖలు చేశారు. దానిని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 2013లో కొట్టేసింది. అప్పారావుకు చెందిన స్థలంపై ఈనాడుకు ఎలాంటి హక్కు లేదని తేల్చింది. అంతేకాక ఈనాడు ఆ స్థలంలో ఉండటం అక్రమమేనని స్పష్టం చేసింది. దీనిపై ఈనాడు అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌ను సైతం కోర్టు కొట్టేసింది. సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనని స్పష్టం చేసింది. అప్పారావును వేధించడానికి ఈ అప్పీల్‌ను ఆయుధంగా ఉపయోగించుకోవడానికి అనుమతించబోమని జిల్లా కోర్టు 2017లో తీర్పునిచ్చింది.

పరిహారంగా రూ.5.20 కోట్లు చెల్లించాలని కోర్టు ఆదేశించినా..

ఈ నేపథ్యంలోనే 2015లో ముసునూరి అప్పారావు తన స్థలం నుంచి ఈనాడును ఖాళీ చేయించాలని కోరుతూ విజయవాడ కోర్టులో సూట్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు అప్పారావుకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దాదాపు 60 పేజీల తీర్పు వెలువరించింది. 2012–15 వరకు అప్పారావుకు రూ.5.20 కోట్లను 6శాతం వార్షిక వడ్డీతో పరిహారంగా చెల్లించాలని ఈనాడు యాజమాన్యాన్ని ఆదేశించింది. మిగిలిన కాలానికి పరిహారం కోసం పిటిషన్ దాఖలు చేసుకునే వెసులుబాటును అప్పారావుకు ఇస్తూ 2024 అక్టోబర్ 3న తీర్పునిచ్చింది. అయితే.. ఈ తీర్పును ఈనాడు బేఖాతరు చేసింది. దీంతో తీర్పు అమలుకు అప్పారావు కింది కోర్టులో ఈపీ దాఖలు చేశారు. విజయవాడ గ్రామీణ మండలం గూడవల్లిలో ఉన్న ఈనాడు కార్యాలయాన్ని జప్తు చేయాలని అందులో కోరారు. దానిపై విచారణ జరిపిన కోర్టు తాము ఇచ్చిన ఆదేశాల మేరకు రూ.5.20 కోట్ల పరిహారం చెల్లించడంలో ఈనాడు విఫలమైందని తేల్చింది. ఇందుకు గాను ఈనాడు ఆస్తుల జప్తునకు ఆదేశిస్తున్నట్టు ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేసింది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ కిరణ్ వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిస్తూ విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది.

గతంలో ఆదిత్య వర్మను వేధించిన ఈనాడు

రామోజీరావు ఈనాడు పత్రిక కోసం విశాఖపట్నం సీతమ్మధారలో మంతెన ఆదిత్య వర్మకు చెందిన 2.7 ఎకరాల భూమిని 1974లో 33 ఏళ్ల గడువుతో లీజుకు తీసుకున్నారు. నెలకు రూ.2,500 అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే వర్మ నుంచి లీజుకు తీసుకున్న భూమిని రామోజీరావు సొంత భూమిగా చూపుకుని ప్రభుత్వం నుంచి పరిహారం పొందారు. రామోజీరావు లీజుకు తీసుకున్న 2.7 ఎకరాల భూమిలో ప్రభుత్వం రోడ్డు వెడల్పు నిమిత్తం 618 గజాల భూమిని తీసుకుంది. ఇందుకు గాను సీతమ్మధారలో 872 గజాల స్థలాన్ని ప్రభుత్వం ఇచ్చింది. వాస్తవానికి ఈ స్థలం ఆదిత్య వర్మకు చెందాలి. కానీ.. రామోజీ రావు మోసపూరితంగా ఆ భూమిని తన కుమారుడి పేరిట రిజిస్టర్ చేయించారు. ఇందుకు ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించారు. ఈ మోసాన్ని ఆలస్యంగా తెలుసుకున్న ఆదిత్య వర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, రామోజీ పలుకుబడి ముందు పోలీసులు ఏం చేయలేకపోయారు. దీంతో వర్మ న్యాయ పోరాటం చేపట్టారు. కోర్టు ఆదేశాలతో పోలీసులు చర్యలకు దిగగా.. ఆ భూమికి సంబంధించి 2007లో 33 ఏళ్ల లీజు ముగిసింది. అయినా రామోజీ ఆ స్థలాన్ని ఖాళీ చేయలేదు. లీజును మరో 33 ఏళ్ల పాటు పొడిగించాలని కోరారు. రామోజీ దుర్బుద్ధి తెలిసిన వర్మ అందుకు అంగీకరించలేదు. దీంతో తనది కాని స్థలం విషయంలో రామోజీరావు కోర్టును ఆశ్రయించారు. వర్మ కూడా రామోజీరావును దీటుగా ఎదుర్కొన్నారు. చివరకు వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఎక్కడా పప్పులు ఉడకకపోవడంతో రామోజీరావు చివరకు వర్మ స్థలాన్ని ఖాళీ చేశారు. వర్మకు చెల్లించాల్సిన పరిహారాన్ని కూడా పూర్తిగా చెల్లించకుండా కొంత చెల్లించి రామోజీ రాజీ చేసుకున్నారు.

వచ్చేనెల 20న క్లినికల్ సైకాలజీ ప్రవేశ పరీక్ష



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నూతనంగా ప్రవేశపెట్టిన క్లినికల్ సైకాలజీ ఎంఫిల్, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వచ్చేనెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనుంది. విజయవాడలో ఉ.10 నుంచి 11.30 వరకూ ఈ పరీక్ష ఉంటుంది. ఫలితాలు మే 24న వెలువడే అవకాశం ఉంది. 90 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో మల్టిపుల్ ఛాయిస్ రూపంలో ఓఎంఆర్ షీట్‌పై సమాధానాలు భర్తీచేయాల్సి ఉంటుంది. పరీక్ష రాయడానికి ఈనెల 17 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకూ ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ.5,900, ఓసీ, బీసీ, అభ్యర్థులు రూ.7,080 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుంది.



ప్రధాన నగరాలు, పట్టణాల్లో శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	42.6	25.8
కర్నూలు	40.8	24.3
నంద్యాల	40.2	22.4
కడప	39.5	20.6
మార్కాపురం	39.0	27.0
ఏలూరు	39.0	22.0
విజయవాడ	38.0	23.0
రాజంపేట	38.0	22.0
గుంటూరు	37.0	25.0
ఒంగోలు	37.0	25.0
విజయనగరం	36.0	28.0
తాడేపల్లిగూడెం	36.0	23.0
తిరుపతి	36.0	22.0
నెల్లూరు	35.7	24.6
చిత్తూరు	35.0	22.0
మచిలీపట్నం	34.0	24.0
భీమవరం	33.0	23.0
విశాఖపట్నం	32.1	25.7

ఇంటర్ పరీక్షా కేంద్రంలో మాస్‌కాపీయింగ్!

సోషల్ మీడియాలో వీడియో వైరల్



పరీక్షా కేంద్రం నిర్వహిస్తున్న శ్రీ వాసవి జూనియర్ కళాశాల భవనం


చాగలమర్రి: నంద్యాల జిల్లా చాగలమర్రిలోని ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రంలో విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చాగలమర్రిలోని శ్రీ వాసవి జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఐదు కాలేజీలకు చెందిన విద్యార్థులు గత 15 రోజులుగా పరీక్షలు రాస్తున్నారు. ఇటీవల ఒక కాలేజీకి చెందిన విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా, శ్రీ వాసవి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీడియో తీసినట్లు తెలిసింది. ఆ వీడియోను తమ కాలేజీ కరస్పాండెంట్‌కు ఆయన పంపినట్లు సమాచారం. దీంతో వాసవి కాలేజీ కరస్పాండెంట్ ఆ వీడియోను మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థుల కాలేజీ కరస్పాండెంట్‌కు పంపించి.. 'మీ పిల్లలు ఎలా మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్నారో.. చూడండి..' అని చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆ వీడియా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు, కరస్పాండెంట్ల వాట్సాప్, ఇతర సోషల్ మీడియా గ్రూపుల్లోకి చేరినట్లు సమాచారం. ఈ వీడియోను ఒక కాలేజీ కరస్పాండెంట్ కొద్దిరోజుల కిందట ఆర్ఐవోకు పంపినట్లు తెలిసింది. వెంటనే ఆర్ఐవో సునీత స్పందించి ముగ్గురు అధికారులను తనిఖీల కోసం పంపించగా, వారికి ముడుపులు ముట్టచెప్పి అసలు వ్యవహారాన్ని గోప్యంగా ఉంచినట్లు సమాచారం. అయినా, ఆర్ఐవో ఆదేశాల మేరకు గత ఐదారు రోజుల నుంచి ఈ పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం.

మాస్‌కాపీయింగ్ జరగలేదు: ప్రిన్సిపాల్ ఓబులేసు
తమ కాలేజీ గుర్తింపు రెన్యూవల్‌కు గడువు పూర్తికావడంతో అఫిలియేషన్ కొనసాగించేందుకు పరిశీలించడానికి ఆర్ఐవో సునీతతోపాటు త్రిసభ్య కమిటీ సభ్యులు వచ్చారని శ్రీ వాసవి కాలేజీ ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. తమ కళాశాల పరీక్ష కేంద్రంలో ఎలాంటి మాస్‌కాపీయింగ్ జరగలేదని ఆయన చెప్పారు.

సీనియర్ ఇంటర్ కెమిస్ట్రీ పేపర్‌లో తప్పిదం

పరీక్ష ప్రారంభమైన గంటన్నర తర్వాత సవరణ


ప్రశ్నాపత్రంలో ఇచ్చిన ప్రశ్నలో ఉన్న 'డబ్ల్యూ/వీ' పదం


కార్పొరేట్ కాలేజీ మెటీరియల్‌లో ఉన్న విధంగా 'డబ్ల్యూ/డబ్ల్యూ'గా మార్చిన పదం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన సీనియర్ ఇంటర్ కెమిస్ట్రీ పరీక్షలో ఒక ప్రశ్న తప్పుగా వచ్చింది. ప్రశ్నాపత్రంలోని సెక్షన్–బీలో నాలుగు మార్కులకు ఇచ్చిన 14వ ప్రశ్నలో 'ఏ సొల్యూషన్ ఆఫ్ గ్లూకోజ్ ఇన్ వాటర్ ఈజ్ లేబుల్డ్ యాజ్ 100 పర్సంట్ (డబ్ల్యూ/వీ)'గా వచ్చింది. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కాగా, 10.30 గంటలకు ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి అందిన సమాచారంతో ఈ ప్రశ్నలో ఉన్న 'డబ్ల్యూ/వీ'కి బదులుగా డబ్ల్యూ/డబ్ల్యూగా మార్చుకుని జవాబులు రాయాలని విద్యార్థులకు ఇన్విజిలేటర్లు సూచించారు. ముద్రణ లోపం కారణంగా తప్పిదం జరిగిందని, అందుకే ప్రశ్నను మార్పు చేసుకుని జవాబు రాయాలని పేర్కొన్నారు. అయితే, అప్పటికే గంటన్నర సమయం గడిచిపోవడంతోపాటు ప్రశ్నాపత్రంలో ఇచ్చిన ప్రశ్నకు యథావిధిగా చాలామంది విద్యార్థులు జవాబు రాశారు. దానిని మళ్లీ మార్పుచేసి జవాబు రాయాల్సి రావడంతో సమయం సరిపోక ఇబ్బందిపడినట్లు విద్యార్థులు తెలిపారు. కాగా, ప్రశ్నాపత్రంలో ఇచ్చిన 'డబ్ల్యూ/వీ' అనే పదం సరైనదేనని, అనవసరంగా దీనిని మార్పు చేసి విద్యార్థులను అయోమయానికి గురిచేశారని కెమిస్ట్రీ సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. కొన్ని కార్పొరేట్ కళాశాలలు తమ విద్యార్థులకు ఇచ్చిన స్టడీ మెటీరియల్‌లో డబ్ల్యూ/డబ్ల్యూ అని ఉందని, వారికి లబ్ధి చేకూర్చేందుకు ప్రశ్నను సవరించారని ఆరోపిస్తున్నారు.

వడివడిగా బురద తొలగింపు

- వ్యాక్యూమ్ ట్యాంకర్ ద్వారా తొలగింపునకు యత్నాలు
- సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు
- చివరి 40 మీటర్ల స్థలంలో తవ్వేందుకు రోబోల వినియోగం


వ్యాక్యూమ్ ట్యాంక్‌ను సొరంగంలోనికి తీసుకెళ్లేందుకు సిద్ధం చేస్తున్న అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మిగతా ఏడుగురు కార్మికుల జాడ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాద స్థలంలో చివరి 40 మీటర్లలో తవ్వకాలు జరిపేందుకు రెస్క్యూ బృందాలకు సైతం ప్రమాదం పొంచి ఉండగా, ఇందుకోసం రోబోలతో ఆపరేషన్ చేపడుతున్నారు. ఇప్పటికే సొరంగంలోకి ఆటోమేటివ్ స్లడ్జ్ రిమూవల్ రోబో మిషినరీని తీసుకెళ్లారు. శనివారం దానికి అనుసంధానంగా పనిచేసే వ్యాక్యూమ్ ట్యాంక్‌ను సొరంగంలోకి తరలించారు. దీని ద్వారా వేగంగా బురద, మట్టిని కన్వేయర్ బెల్టు మీదుగా బయటకు తరలించవచ్చని భావిస్తున్నారు. ఈ పనులు పూర్తిస్థాయిలో ఆదివారం ప్రారంభమవుతాయని చెబుతున్నారు.

డీ1 వద్ద తవ్వకాలు పూర్తయితేనే..

ఇప్పటికే కడావర్ డాగ్స్ గుర్తించిన డీ2 ప్రాంతంలో పూర్తిస్థాయిలో తవ్వకాలు చేపట్టారు. అక్కడ గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభించగా, మిగతా వారి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మరో పాయింట్ డీ1 వద్ద సింగరేణి, ర్యాట్‌హోల్ మైనర్స్ ఆధ్వర్యంలో తవ్వకాలు ముమ్మరం చేశారు. డీ1 వద్ద 9 మీటర్ల ఎత్తులో పేరుకుపోయిన మట్టి, శిథిలాలను తొలగిస్తేనే మిగతా కార్మికుల జాడ తెలిసే అవకాశం ఉంది. డీ1 వద్ద టీబీఎంలో సెగ్మెంట్ ఎరెక్టర్ ఉండే చోట కార్మికులు ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరో రెండ్రోజుల్లో తవ్వకాలు పూర్తికావచ్చని, అప్పుడే కార్మికుల జాడ తెలిసే వీలుందని తెలుస్తోంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

వెయ్యి కక్ష్యలను పూర్తి చేసిన పీఓఈఎం-04


పీఎస్ఎల్వీ సీ60 రాకెట్‌లోని పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పర్‌మెంట్ మాడ్యూల్ (పీఓఈఎం-04)

సూళ్లూరుపేట: గతేడాది డిసెంబర్ 30న స్పెడెక్స్ ఉపగ్రహాలను ప్రయోగించిన పీఎస్ఎల్వీ సీ60 రాకెట్‌లో నాలుగోదశ అయిన పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పర్‌మెంట్ మాడ్యూల్ (పీఓఈఎం-04) 1,000 కక్ష్యలను పూర్తి చేసిందని ఇస్రో తెలిపింది. పీఓఈఎం-04 అంటే నాలుగో దశలో కొన్ని పేలోడ్‌లను వివిధ రకాల కక్ష్యల్లో ప్రవేశపెట్టి.. కొత్త కక్ష్యలను అన్వేషిస్తుంటారు. ఈ తరహాలో ఇప్పటివరకు నాలుగు పీఓఈఎంలను ప్రయోగించగా.. పీఎస్ఎల్వీ సీ60 పీఓఈఎం మాత్రమే 1,000 కక్ష్యలను పూర్తి చేసిందని ఇస్రో వెల్లడించింది. పీఎస్ఎల్వీ సీ60 రాకెట్ స్పేడెక్స్ ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత.. పీఓఈఎం తన కార్యకలాపాలను ప్రారంభించింది. ఈ దశలో మొత్తం 24 పేలోడ్లను కచ్చితత్వంతో కూడిన కక్ష్యల్లో ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించింది. కాగా, తమిళనాడులోని మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రపొల్షన్ రీసెర్చ్ కాంప్లెక్స్(ఐపీఆర్సీ)లో ఎల్‌వీఎం3-ఎం6 రాకెట్ మిషన్ కోసం క్రయోజనిక్ ఇంజన్‌కు ఫ్లైట్ యాక్సెప్టెన్స్ హై-ఆల్టిట్యూడ్ టెస్ట్‌ను శనివారం విజయవంతంగా నిర్వహించినట్టు ఇస్రో వెల్లడించింది. ఎల్‌వీఎం3 రాకెట్‌కు వినియోగించే ప్రతి క్రయోజనిక్ ఇంజన్‌కు ముందుగా ప్రయోగాత్మక పరీక్షలు నిర్వహిస్తారు. ఎల్‌వీఎం3 రాకెట్ మూడో దశకు సంబంధించిన క్రయోజనిక్(సీఈ-20) హై-ఆల్టిట్యూడ్ టెస్ట్‌లు ఐపీఆర్సీలో నిర్వహించి పనితీరును నిర్ధారించుకున్నారు.



'విఖ్యాత' దర్పమిది

మాజీ మంత్రి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తమ్ముడు, టీడీపీ నేత భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి జిల్లా అధికారుల సమావేశంలో పాల్గొని హల్‌చల్ చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు శనివారం నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యేల పక్కన కుర్చీలో కూర్చొని ఆర్భాటాన్ని ప్రదర్శించారు. అంతటితో ఆగకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవంటూ కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేల ముందే అధికారులను హెచ్చరించడంతో అక్కడి వారు ముక్కున వేలేసుకున్నారు. – నంద్యాల

ఏపీలో 15 తీర గ్రామాలకు కేంద్ర నిధులు

కేంద్ర పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద 15 తీర ప్రాంతాల గ్రామాలను గుర్తించినట్లు కేంద్ర మత్స్య, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 90 గ్రామాలను గుర్తించి ఒక్కో గ్రామానికి రూ.2 కోట్లు చొప్పున కేటాయించినట్లు ఇటీవల రాజ్యసభలో ఆ శాఖ సహాయ మంత్రి కురియన్ తెలిపారు. ఏపీలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో 15 గ్రామాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో మత్స్య, ఆక్వా కల్చర్ అభివృద్ధి, మత్స్య మౌలిక సదుపాయాలు, హేచరీ, ఉప్పునీరు, రిజర్వాయర్‌ల్లో బోనులు, ఐస్ బాక్స్‌లతో మోటర్ సైకిళ్ల సరఫరా, చేపల విలువను పెంచే సంస్థలను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు.

Published and printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

ఏప్రిల్ 6 వరకు సాగు నీరు



మాట్లాడుతున్న మంత్రి తిమ్మాపుర

రాయచూరు రూరల్: నారాయణపుర కుడి కాలువ ఆయకట్టు చివరి భూములకు ఏప్రిల్ 6 వరకు సాగు నీరందించాలని అప్పర్ కృష్ణా ప్రాజెక్టు నీటిపారుదల సలహా సమితి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఏపీఎంసీ శాఖ మంత్రి ఆర్.బి.తిమ్మాపుర ప్రకటించారు. బెంగళూరులోని వికాససౌధలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23 తర్వాత నీటి విడుదల నిలిపివేతను రద్దు చేసి మరో రెండు వారాల పాటు నీటి విడుదలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. కర్ణాటక రైతు సంఘం జిల్లాధ్యక్షుడు శివపుత్ర పాటిల్ ఆందోళన చేపట్టిన నేపథ్యంలో కాలువకు నీటి విడుదలను పొడిగించినట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు దుర్మరణం

రాయచూరు రూరల్: జిల్లాలో వేర్వేరు చోట్ల హోలీ ఆడి స్నానం కోసం వెళ్లిన ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలైన ఘటనలు రాయచూరు జిల్లాలో జరిగాయి. శనివారం రాయచూరు తాలూకా గిల్లేసూగూరు వద్ద ఆర్డీఎస్ కాలువలో స్నానం చేయడానికి యరగేరకు చెందిన వ్యాపారి మహదేవ్(30) వచ్చాడు. కాలువలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో కాలు జారి పడిపోయాడు. ఈత రాకపోవడంతో కొట్టుకుపోయి మరణించాడు. అగ్నిమాపకదళం, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గాలించి మృతదేహాన్ని వెలికితీసి శవ పరీక్ష కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

సుల్తాన్‌పురలో..

హోలీ సందర్భంగా రంగులు చల్లుకుని స్నానం చేసేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీటి కుంటలోకి జారి పడి దుర్మరణం పాలైన ఘటన శుక్రవారం రాయచూరు తాలూకా సుల్తాన్‌పురలో జరిగింది. మృతుడిని గ్రామంలోని నీటి కుంట వద్ద స్నానం చేయడానికి వెళ్లిన జాగీర్ వెంకటాపూర్‌కు చెందిన సోమనగౌడ(45)గా పోలీసులు గుర్తించారు. అగ్నిమాపక దళం, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.


శ్రీశైలం భక్తులకు అన్నదానం



భక్తులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: శ్రీశైల మల్లికార్జునుని దర్శనం కోసం పాదయాత్ర ద్వారా వెళ్లే ఉత్తర కర్ణాటక భక్తులకు ప్రవాసాంధ్రుడు బి.వెంకటరెడ్డి (బీవీఆర్) ట్రస్టుచే అన్నదానం, ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. బాగల్‌కోటె సంగం క్రాస్ వద్ద ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పారిశ్రామికవేత్త గత రెండు దశాబ్దాలుగా ఈ సేవలు చేస్తున్నారు. మానవత్వంతో భక్తులకు భోజనం, టిఫిన్, టీ, తలపాగా పంపిణీ, పండ్లు, శాలువా, మజ్జిగ, బిస్కట్లు, మసాల వడ, మిరప బజ్జీలు, లడ్డూ, కారా, బోండాలను పంపిణీ చేశారు. మరో వైపు వైద్య సేవలను, పురుషులు, స్త్రీలకు విశ్రాంతి, స్నానపు గదులు ఏర్పాటు చేశారు.


రేణుకాచార్య జయంతి



నందీశ్వరుడి పాత్రలో రేణుకాస్వామి

రాయచూరు రూరల్ : బాళెహొన్నూరు రంభాపురి పీఠంలో రేణుకాచార్య జయంతి, యుగమానోత్సవాలు నిర్వహించారు. మఠం నుంచి హోలీ పండుగ సందర్భంగా వివిధ రకాల వేష భూషణలతో ఊరేగింపు జరిపారు. వసంతోత్సవం, వీరభద్రేశ్వర రథోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా శాంతమల్ల శివాచార్యులున్నారు. రేణుకా స్వామి నందీశ్వరుడి పాత్రలో భక్తులను ఆకట్టుకున్నారు.

మహిళా కార్మికుల ధర్నా




ఆందోళనలో పాల్గొన్న మహిళలు

రాయచూరు రూరల్: మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వాలు స్పందించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అధ్యక్షుడు శరణ బసవ మాట్లాడారు. సర్కార్ తీసుకుంటున్న నిర్ణయం వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో విధులు నిర్వహించే వారికి సమాన వేతనాలు, పీఎఫ్, జీపీఎఫ్, గ్రాట్యూటీ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఎత్తు పెంపునకు మహారాష్ట్ర మోకాలడ్డు?

- ఉత్తర కర్ణాటకలో ఆల్మట్టి ఆయకట్టు రైతులకు మరొక షాక్
- మూడు రాష్ట్రాల నుంచి కర్ణాటకకు ఎదురు దెబ్బ
- నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం హుళక్కేనా?
- కొలిక్కి రాని మూడు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల సమావేశం



ఆల్మట్టి డ్యాం(ఫైల్)

రాయచూరు రూరల్: తుంగభద్ర డ్యాంలో పూడిక అధికంగా పేరుకు పోవడంతో నవలి వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటు, మహదాయి పథకం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇలా ఉండగా ఉత్తర కర్ణాటక రైతులకు మరొక షాక్ తగలనుంది. కృష్ణా నది ఆయకట్టులోని రైతులకు పెద్ద ఎదురు దెబ్బ తగలనుంది. ఆల్మట్టి డ్యాం నిర్మాణం విషయంలో రైతులకు పరిహారం అందించడంలో ముఖ్యమంత్రి నిధులు కేటాయించలేక పోయారు. మూడో విడత పనులు చేపట్టడానికి నిధుల కొరత ఏర్పడనుంది. విజయపుర జిల్లా బసవన బాగేవాడి వద్ద ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచాలని ప్రభుత్వానికి నివేదిక అందింది. బాగల్‌కోటె, విజయపుర జిల్లాల్లో ముంపునకు గురవుతున్న 20 గ్రామాల ప్రజల పునర్వసతికి లక్ష ఎకరాల భూమి కావాల్సి ఉంది. భూస్వాధీనం ఇతర పనులకు రూ.87,818 కోట్ల మేర ఖర్చు కానున్నట్లు కృష్ణా భాగ్య జల నిగమ మండలి సర్కార్‌కు ప్రతిపాదనలు సమర్పించింది.

15 ఏళ్లుగా కాలయాపన

2010 డిసెంబర్‌లో కృష్ణా ట్రిబ్యునల్–2 తీర్పు ఆధారంగా 524.256 మీటర్లకు ఎత్తును పెంచి నీటిని వాడుకోవడానికి అవకాశం కల్పించింది. 15 ఏళ్లు కావస్తున్నా నీటి వినియోగంలో కర్ణాటక ఇంకా వెనుకంజలో ఉంది. ఈ విషయంలో ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడానికి కర్ణాటక పావులు కదుపుతున్నట్లు గమనించిన మహారాష్ట్ర సర్కార్ అనవసరంగా వ్యతిరేకతను తెలుపుతోంది. ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచితే కర్ణాటకలోని అథణి తాలూకాలో పలు గ్రామాలు ముంపునకు గురవుతాయి తప్ప మహారాష్ట్రకు ఎలాంటి నష్టం లేకపోయినా కావాలనే నీటి పోరు పెట్టుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచితే మహారాష్ట్రలోని సాంగ్లీ, కోల్హాపూర్ జిల్లాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయని వాదిస్తోంది.


ప్రారంభం కాని చర్చల ప్రక్రియ

ఈ విషయంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ నుంచి నివేదికలను కోరింది. నవలి వద్ద సమాంతర జలాశయం నిర్మాణ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మూడు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో చర్చల ప్రక్రియ నేటికీ ప్రారంభం కావడం లేదు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.15,000 కోట్లు, భూస్వాధీనం కోసం రూ.9 వేల కోట్ల నిధులు కేటాయించారు. ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడానికి మహారాష్ట్ర అడ్డు తగులుతున్నట్లు సమాచారం. నవలి వద్ద సమాంతర జలాశయం నిర్మాణ విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి సమన్వయం కదురడం లేదు. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కర్ణాటక రైతులకు లాభం కంటే నష్టాలే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లా బీజేపీ అధ్యక్షుల నియామకం



వీరనగౌడ పాటిల్



శాంతనగౌడ పాటిల్

రాయచూరు రూరల్: జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా వీరనగౌడ పాటిల్‌ను నియమించారు. ఈమేరకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర శుక్రవారం ఒక ప్రకటన వెలువరించారు. రాయచూరు ఎమ్మెల్యేగా ఉన్న శివరాజ్ పాటిల్‌ను అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించి వీరనగౌడ పాటిల్‌కు పీఠాన్ని కట్టబెట్టారు. ఇక యాదగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా అమీన్ రెడ్డి, బీదర్ జిల్లా అధ్యక్షుడిగా సోమనాథ పాటిల్, కలబుర్గి జిల్లా అధ్యక్షుడిగా చంద్రకాంత్ పాటిల్, కొప్పళ జిల్లా అధ్యక్షుడిగా నవీన్ గుళగణ్ణనవర్, బాగల్‌కోట జిల్లా అధ్యక్షుడిగా శాంతనగౌడ పాటిల్, విజయపుర జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఆర్.ఎస్.పాటిల్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. త్వరలో జరగనున్న జెడ్పీ, టీపీ, నగరసభ ఎన్నికల్లో పార్టీని మరింత బలోపేతం చేసి కార్యకర్తలను సమాయత్తం చేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు.

తల్లి వెంటే జైలుకు పసిబిడ్డ

బళ్లారిఅర్బన్: ప్రసవించిన 14 రోజులకే అనివార్య కారణాలతో రూ.60 వేలకు విక్రయమైన ఏడాది వయస్సు ఉన్న పసిబిడ్డ ప్రస్తుతం తల్లితో పాటు జైలు చేరిన విషాద ఘటన నగరంలో వెలుగు చూసింది. గౌతం నగర్ నివాసి యల్లమ్మ (27) గత ఏడాది ఫిబ్రవరిలో బీఎంసీఆర్‌సీలో పసిబిడ్డకు జన్మనిచ్చింది. ఈమె భర్త చనిపోయాడు. తనకు ఆ బిడ్డ వద్దని రూపనగుడి రోడ్డు నివాసి నవీన్‌కుమార్ (49)కు రూ.60 వేలకు పసిబిడ్డను విక్రయించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న బాలల రక్షణ శాఖ సహాయవాణికి గత ఆగస్టు 5న సమాచారం రావడంతో వారు బళ్లారి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపి పసిబిడ్డను ఆంధ్రప్రదేశ్‌లోని ఆలూరు నుంచి తీసుకొచ్చారు. బిడ్డను కొనుగోలు చేసిన నవీన్‌కుమార్, విక్రయించిన బిడ్డ తల్లి యల్లమ్మను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ బిడ్డను బళ్లారి జైల్లో ఉన్న సొంత తల్లి వద్దకే చేర్చారు. ఈ కేసులో విక్రయించిన, కొనుగోలు చేసిన వారికి 10 ఏళ్ల శిక్ష ఉంటుంది. కోర్టులో నేరం రుజువైతే తల్లితో పాటు బిడ్డ కూడా శిక్ష అనుభవించాలా? లేక బాలల రక్షణ శాఖలోని అమ్మ ఒడి ఆశ్రమంలో ఉంటుందా? అనే సందేహం తలెత్తుతోంది. కాగా తల్లి వద్దు అనుకున్న బిడ్డను సంతానం లేని దంపతులు గత ఏడాది నుంచి పెంచి పోషించి తల్లి ప్రేమకు నోచుకొనేలా చేసిన ఆ తల్లిదండ్రులకే దత్తత ఇస్తే బాగుంటుందని సమాజ శ్రేయోభిలాషులు అభిప్రాయపడ్డారు.

అక్రమ మట్టి తవ్వకాలపై తనిఖీ



అక్రమ మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న ఉప లోకాయుక్త వీరప్ప



ఘన వ్యర్థాల డంప్‌యార్డ్‌ను పరిశీలిస్తున్న ఉప లోకాయుక్త వీరప్ప

- వ్యవసాయ భూమిలోని మట్టి రవాణా పట్టని అధికారులు
- అలసత్వ అధికారులపై ఉపలోకాయుక్త వీరప్ప మండిపాటు

హొసపేటె: తాలూకాలోని కల్లహళ్లి రాజాపుర వ్యవసాయ భూమిలో అక్రమంగా మట్టి రవాణా జరుగుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోని రెవెన్యూ, గనులు, భూగర్భ శాస్త్ర శాఖ అధికారులకు ఉప లోకాయుక్త బీ.వీరప్ప తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. శనివారం ఆయన సంక్లాపూర్ సమీపంలోని మున్సిపల్ ఘన వ్యర్థాల డంప్ యార్డును సందర్శించి, కల్లహళ్లి రాజాపూర్‌లోని పట్టా ల్యాండ్ సర్వే నెంబర్–144లోని వాలినాయక్‌కు చెందిన 4.81 సెంట్ల భూమిలో పది అడుగులకు పైగా లోతున మట్టిని తవ్వి తరలించారని, దీని వల్ల భవిష్యత్తులో సాగు చేయడం అసాధ్యంగా మారిందని ఏకరువు పెట్టారు. అక్రమంగా మట్టిని తొలగిస్తున్నారని తెలుసుకున్న తర్వాత, గనులు, భూగర్భ శాస్త్ర శాఖ డిప్యూటీ డైరెక్టర్ కీర్తికుమార్, భూవిజ్ఞాన శాస్త్ర కిరణ్ రెండు రోజులుగా ఆ స్థలంలో ఉన్న జేసీబీతో సహా ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోలేదని తేలింది. గత 6 నెలలుగా మట్టి తవ్వకం గురించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్‌కు నివేదించామని గ్రామ నిర్వాహకుడు ప్రతాప్ సమాధానమివ్వగా, ఆ స్థలంలో ఉన్న తహసీల్దార్‌కు ఆ విషయం తెలియకపోవడంపై ఉపలోకాయుక్త ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

సబ్ జైలు ఆకస్మిక సందర్శన

హొసపేటెలోని సబ్ జైలును శనివారం ఉప లోకాయుక్త బీ.వీరప్ప ఆకస్మికంగా సందర్శించారు. సబ్ జైలు కమిషనర్ను జైలులో విచారణలో ఉన్న ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, వారి తరపున వాదించడానికి నియమితులైన న్యాయవాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరు విచారణలో ఉన్న ఖైదీలు తాము న్యాయవాదులను నియమించుకోలేదని చెప్పగా, ప్రభుత్వ న్యాయవాదులను నియమించాలని జైలు అధికారులను ఆదేశించారు.

ఘన వ్యర్థాల డంప్‌యార్డ్ పరిశీలన

నగరంలో సంక్లాపుర సమీపంలో 55 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మున్సిపల్ ఘన వ్యర్థాల డంప్ యార్డును శనివారం ఉప లోకాయుక్త సందర్శించారు. హొసపేటె నగరం నుంచి ప్రతి రోజూ ఉత్పత్తయ్యే 130 టన్నుల ఘన వ్యర్థాలను ఈ యూనిట్‌లో సేకరించి, ఆకుపచ్చ వ్యర్థాలు, పొడి చెత్తగా వేరు చేసి, కంపోస్ట్‌గా ఎలా ప్రాసెస్ చేస్తారో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మనోహర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార వాణిజ్యోద్యమ అభివృద్ధికి ఒప్పందం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

బళ్లారిఅర్బన్: వాణిజ్య పరిశ్రమల అభివృద్ధి సాధనకు పరస్పరం సహకారం అందించుకోవడానికి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ మైసూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థతో సంయుక్త ఒప్పందాన్ని చేసుకున్నారు. బళ్లారి జిల్లాలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మైసూరు జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కేవీ.లింగరాజ మైసూరులో జరిగిన సంయుక్త సమవేశంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కేవలం వ్యాపారాలు, వాణిజ్యానికే పరిమితం కాకుండా యువశక్తికి చక్కటి భవిత రూపొందించడానికి స్కిల్స్ డెవలప్‌మెంట్, అన్నదాతలకు ఉచితంగా భోజనం, క్లినిక్, విశ్రాంతిధామం వంటి ప్రజాకర్షక సేవా పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలకు సమాజంలోని అన్ని వర్గాల నుంచి విశేషమైన ఆదరణతో పాటు అభినందనలు లభించాయన్నారు. ఉభయ జిల్లాలు కలిసి కట్టుగా పని చేయడం ద్వారా సేవా రంగంలో కొత్త అవకాశాలకు దారి ఏర్పడిందన్నారు. మైసూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ కేవీ.లింగరాజ మాట్లాడుతూ ఈ ఒప్పందాల వల్ల ఉభయ జిల్లాల పారిశ్రామిక రంగంలో కొత్తదనానికి చోటు లభించిందన్నారు. బళ్లారిలో రైతన్నల భోజన పథకంతో స్ఫూర్తి పొంది రూ.10లకే మైసూరులో కూడా ఏపీఎంసీకి వచ్చే రైతులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించామన్నారు. బళ్లారి సంస్థ అనేక విషయాల్లో రాష్ట్రానికే ఆదర్శప్రాయం అయిందన్నారు. మైసూరు హోటల్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆ జిల్లా డైరెక్టర్ నారాయణ గౌడ మాట్లాడుతూ రైతన్నల కోసం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. వేలాది మందికి ఉపాధి లభించిందని, ఇది మైసూరు పర్యాటక కేంద్రానికి దక్కిన అవకాశం అన్నారు. ప్రముఖులు డాక్టర్ మర్చేడ్ మల్లికార్జున గౌడ, అశోక్, శివాజీ రావు, ఆనంద్, అవ్వారు మంజునాథ, దొడ్డనగౌడ, సొంతా గిరిధర్, సురేష్‌బాబు, రామచంద్ర, సుధాకర్ శెట్టితో పాటు ఉభయ జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పదాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



మాట్లాడుతున్న డీహెచ్‌ఓ యల్లా రమేష్ బాబు

బళ్లారిటౌన్: ప్రతినిత్యం ఒత్తిడితో పని చేసే మీడియా ప్రతినిధులతో పాటు ప్రతి ఒక్కరికీ ఆరోగ్యమే మహా భాగ్యమని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ యల్లా రమేష్ బాబు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య అభియానలో భాగంగా డీహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం మీడియా ప్రతినిధులకు ఏర్పాటు చేసిన పరిచయ జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. త్వరలో మీడియా ప్రతినిధులకే ప్రత్యేక ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఆరోగ్య శాఖ, మీడియా సమాజంతో సంధానానికి వంతెనలని, ఆరోగ్య వ్యవస్థ ఉన్నతీకరణకు మీడియా చేతులు కలపాలన్నారు. బళ్లారి జిల్లా ఆరోగ్య వ్యవస్థ విషయంలో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయన్నారు. అయితే గత నవంబర్ నెలలో జరిగిన బాలింత మృతి వల్ల కొంత దుష్పరిణామం ఎదురైనందున జిల్లా ఆస్పత్రికి రోగులు రావడం తగ్గుముఖం పట్టిందన్నారు. మీడియా, ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించి మంచి కథనాలు రాసినందున మళ్లీ పుంజుకుందన్నారు. జిల్లా సర్జన్ ఎస్.బసరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా ఆస్పత్రి ఒక కార్పొరేట్ ఆస్పత్రిని తలపిస్తోందన్నారు. ఆస్పత్రిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆరోగ్య సేవలు అందుతున్నాయన్నారు. సిటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌ను కూడా త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో విమ్స్ ఆస్పత్రిలో మహిళల కాన్పులు జరిగేవన్నారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో మెరుగైన సేవలతో కాన్పులు చేపట్టేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి హనుమంతప్ప సర్వేక్షణ అధికారి మరియం బీ, డాక్టర్ పూర్ణిమ కట్టిమని, డాక్టర్ వీరేంద్ర కుమార్, డాక్టర్ ఆర్.అబ్దుల్లా, రోహన్ వనకుంది, ఈశ్వర్ దానప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యపై అవగాహనకు బైక్ ర్యాలీ

- ఆడ పిల్లలను బాగా చదివించాలి
- స్త్రీ శిశు సంక్షేమ శాఖ డీడీ విజయ్‌కుమార్



బైక్‌ను ర్యాలీని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

బళ్లారి అర్బన్: ఆడ పిల్లలను బాగా చదివించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేహెచ్ విజయ్‌కుమార్ సూచించారు. భేటీ బచావో, భేటీ పడావో పథకం 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో, అంతర్జాతీయ మహిళా దినోత్సవం, మహిళలు, బాలల రక్షణ, భద్రత, సాధికారతపై జాగృతి కల్పించడానికి వివిధ శాఖల ఆధ్వర్యంలో కొత్త జిల్లాధికారి కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ఆడపిల్లల పాత్ర చాలా కీలకం అన్నారు. ప్రతి ఆడ పిల్లను బాగా చదివించాలని సూచించారు. ఆడపిల్లలపై పక్షపాత ధోరణి ఇకపై విడిచి పెట్టాలన్నారు. ఈ విషయంలో ప్రజలు సానుకూలంగా తమ మనసత్వాలను మార్చుకోవాలన్నారు. ముఖ్యంగా సమాజంలో ఎక్కువగా జరుగుతున్న బాల్య వివాహాలను నివారించి ఆడపిల్లలను రక్షించడం ఈ కార్యక్రమ ఉద్దేశం అన్నారు. మహిళా, శిశు భ్రూణ హత్యలు చట్ట వ్యతిరేకం అన్నారు. స్త్రీ సమాజం కన్ను ఆడపిల్లలను చదివించేలా ప్రోత్సాహం అందించడానికి వివిధ పథకాలను వినియోగించుకోవాలన్నారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎటువంటి పక్షపాతం లేకుండా వారు నిర్భయంగా బతికే, చదివే హక్కు ఉందన్నారు. ఏ ఆడపిల్ల పాఠశాలకు దూరంగా ఉండరాదన్నారు. ముఖ్యంగా క్షీణిస్తున్న ఆడపిల్లల లింగనిష్పత్తి మెరుగుదలకు ప్రజల్లో జాగృతి కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆ శాఖల అధికారులు జలాలప్ప ఏకే, రామకృష్ణ, ఏలే నాగప్ప, టీపీ ఈఓతో పాటు సహాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా సదరు బైక్ ర్యాలీ నగరంలోని ప్రముఖ వీధుల గుండా సాగి జెడ్పీ కార్యాలయం వరకు కొనసాగి ముగిసింది.

పట్టపగలే యువకుడి హత్య



బబుల్ (ఫైల్)

రాయచూరు రూరల్: నగరంలోని బంగికుంటలో పట్టపగలే ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. మృతుడిని బబుల్(35) గా పోలీసులు గుర్తించారు. నగరంలోని ఏ1 ట్రేడర్స్‌లో విధులు నిర్వహిస్తున్న బబుల్ తెలంగాణలోని గద్వాల తాలూకా గట్టు మాచర్లలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడని భావించిన ప్రత్యర్థులు చాకుతో పొడిచి హత్య చేసి పారిపోయినట్లు డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించారు. సదర్ బజార్ పోలీస్ స్టేషన్ సీఐ ఉమేష్ నారాయణ కాంబ్లే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

క్యాన్సర్ రెఫరల్ విభాగం మంజూరు



జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రులు




ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

రాయచూరు రూరల్: రాయచూరుకు రూ.52 కోట్లతో కిద్వాయ్ క్యాన్సర్ రెఫరల్ విభాగాన్ని మంజూరు చేశామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావ్ పేర్కొన్నారు. శనివారం మాన్వి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మేళాను ప్రారంభించి ఆయన మాట్లాడారు. జిల్లాధికార యంత్రాంగం, జిల్లా పంచాయతీ, జిల్లా ఆరోగ్య శాఖ, రిమ్స్, ఇతర సంఘ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన మేళాకు శ్రీకారం చుట్టి ప్రసంగించారు. కళ్యాణ కర్ణాటక ప్రాంతంలో అధిక శాతం గర్భకోశ క్యాన్సర్ కనపడుతోందన్నారు. స్తన క్యాన్సర్ మాదిరిగా గర్భ కోశ క్యాన్సర్‌ను గుర్తించడం కష్టమన్నారు. గర్భ కోశ క్యాన్సర్ వ్యాధి నివారణకు 16 ఏళ్ల లోపు బాలికలకు టీకాలు వేయడానికి కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. ఆస్పత్రుల అభివృద్ధికి రూ.400 కోట్ల నిధులు కేటాయించామన్నారు. రాయచూరుకు ఎయిమ్స్ మంజూరు విషయంలో పార్లమెంట్ సభ్యులు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. కాగా శిబిరంలో మానసిక, కిడ్నీ, ఎముకలు, నేత్ర, గుండెపోటు, చర్మవ్యాధి, శ్వాసకోశ, క్యాన్సర్ వంటి వ్యాధులకు ఉచితంగా వైద్య సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో మంత్రి బోసురాజు, శాసన సభ్యుడు హంపయ్య నాయక్, లోక్‌సభ సభ్యుడు కుమార నాయక్, జిల్లాధికారి నితీష్, జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, అసిస్టెంట్ కమిషనర్ గజానన, జిల్లా ఆరోగ్య వైద్యాధికారులు సురేంద్ర బాబు, నందిత, శరణ బసవ, 200 మంది సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

వైభవంగా అమరేశ్వర జాతర



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



జాతరలో పాల్గొన్న నాయకుల

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకా గురుగుంట అమరేశ్వర జాతర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఆలయం వద్ద దేవస్థాన సమితి అధ్యక్షుడు రాజా సోమనాథ్ నాయక్ పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. వందలాది మంది భక్తుల సమక్షంలో రథాన్ని లాగారు. మాజీ లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్, మాజీ ఎమ్మెల్యేలు హూలగేరి, అమరేగౌడ బయ్యపూర్ తదితరులతో పాటు రాయచూరు, లింగసూగూరు, సింధనూరు, మాన్వి, కలబుర్గి, యాదగిరి, సురపుర, శహాపుర, కొప్పళ, గంగావతి తదితర చోట్ల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే



కార్యక్రమం ప్రారంభిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందే అని కర్ణాటక రైతు సంఘం అధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. శనివారం ఏపీఎంసీ సభా భవనంలో నవ కర్ణాటక నిర్మాణ ఆందోళన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘాలు పోరాటంలో ఏకతాటిపై ముందుకు సాగాలన్నారు. బసవాది శరణులు చూపిన బాటలో మనం పయనించాలన్నారు. రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం ప్రజలను గ్యారెంటీల పేరుతో మోసం చేస్తున్నాయన్నారు. ఆర్పీఐ అధ్యక్షుడు మోహన్ రాజ్, పుట్టరాజ్, హనుమంతప్ప, బసవరాజ్, నరసప్ప, ఈరణ్ణ, రాజు పట్టి, అయ్యప్ప, లక్ష్మీ, దేవకి, శ్రీకాంత్‌లున్నారు.

మా కుటుంబానికి న్యాయం చేయండి

- వయోవృద్ధుని వేడుకోలు



మాట్లాడుతున్న వృద్ధుడు ఈరణ్ణ, చిత్రంలో కుమారుడు, కుమార్తెలు ఉన్నారు

బళ్లారిఅర్బన్: తమపై కుటుంబ సభ్యులతో పాటు ఇతరులు అన్యాయంగా నడుచుకుంటూ, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ మానసికంగా వేధిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని వయోవృద్ధుడు వీ.ఈరణ్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పత్రికా భవనంలో మీడియా సమావేశంలో తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కట్టడ నిర్మాణ కార్మికుడిగా సొంత సంపాదనతో దేవినగర్‌లో 5 ఇళ్లు నిర్మించుకున్నానన్నారు. చాగనూరులో 4 ఎకరాల పొలం తీసుకున్నానన్నారు. తనకు ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలున్నారన్నారు. అయితే ఆస్తుల పంపకం విషయంలో పిల్లల నిర్లక్ష్యం వల్ల తాను ప్రస్తుతం కోట ప్రాంతంలో కార్పొరేషన్ నిర్వహిస్తున్న నిరాశ్రితుల కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నానన్నారు. ముందుగా అందరూ ఒకే కుటుంబ సభ్యులుగా ఉన్నప్పుడు చిన్నగా ప్రారంభమైన కుటుంబ కలహాలు అనంతరం కుమారులు పురుషోత్తం, వాసులకు పెళ్లి అయిన తర్వాత ఆస్తుల కోసం పరస్పర దాడులతో పాటు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించేలా చేసిందన్నారు. గత మూడేళ్ల నుంచి అన్నదమ్ములు, సోదరీమణులు రెండు వర్గాలుగా ఏర్పడి పరస్పరం కొట్లాడుకుంటూ తనకు తీరని ఆవేదన కల్గించి వీధి పాలు చేశారని ఆయన వాపోయారు. అందరూ ఒక్కటై ఆస్తి కోసం ఇంటి నుంచి బయటకు వేశారన్నారు. తాను కష్టపడి నిర్మించుకున్న ఇంట్లో ఉండటానికి తక్షణమే పోలీస్ ఉన్నతాధికారులు సహాయం చేసి తనకు న్యాయం జరిగేలా చూడాలని ఈరణ్ణ జిల్లా ఎస్పీ శోభారాణికి విజ్ఞప్తి చేశారు.